# సిలువ విలువ - ధ్యాన కలువ

అయితే మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువయందు తప్ప
మరిదేనియందును అతిశయించుట నాకు దూరమవునుగాక.
దానివలన నాకు లోకమును, లోకమునకు నేను
సిలువవేయబడియున్నాము. గలతీ. 6:14.


గ్రంథకర్త :

## యం. దేవదాసు అయ్యగారు



గుంటూరు - 2015 వెల : 40.00



Bible Mission HQ Guntur

# విషయ సూచిక


| లెంటులోని దినముల వరుస | ప్రసంగ అంశము | | పేజి నం |
|---|---|---|---|
| 1. | 1వ. లె. దినము – భస్మ బుధవారము | – | 1 |
| 2. | 2వ. లె. దినము – శ్రమకాల గుడారము | – | 5 |
| 3. | 3వ. లె. దినము – హృదయ పశ్చాత్తాపము | – | 10 |
| 4. | 4వ. లె. దినము – సిలువ నీడ | – | 13 |
| | I. ఆదివారము – వధ్య స్తంభము | – | 16 |
| 5. | 5వ. లె. దినము – సిలువయందలి విశ్వాసము – విశ్రాంతి | – | 18 |
| 6. | 6వ. లె. దినము – సిలువయొక్క బహిరంగ చరిత్ర | – | 21 |
| 7. | 7వ. లె. దినము – సిలువలోని నీతిసూర్యుడు–సంఘ పుష్పము | – | 25 |
| 8. | 8వ. లె. దినము – సిలువలోని అప్పగింతలు | – | 28 |
| 9. | 9వ. లె. దినము – పందెపు రంగము–సహింపు యుద్ధము | – | 32 |
| 10. | 10వ లె. దినము – సిలువధ్యాన దీవెనలు | – | 36 |
| | II. ఆదివారము – సిలువలోని నాలుగు పటములు | – | 39 |
| 11. | 11వ. లె. దినము – క్రీస్తు మానవ అవతార సిలువ | – | 43 |
| 12 | 12వ. లె. దినము – అంతరంగ సిలువ | – | 47 |
| 13. | 13వ. లె. దినము – అంతరంగ శోధన | – | 51 |
| 14. | 14వ. లె. దినము – సిలువమీది మేఘము | – | 54 |
| 15. | 15వ. లె. దినము – సిలువ శ్రమల గుంపు | – | 57 |
| 16. | 16వ. లె. దినము – సిలువ మన కొరకే | – | 60 |
| | III. ఆదివారము – మూడు సిలువలు | – | 64 |
| 17. | 17వ. లె. దినము – సిలువలోని ప్రతినిధి | – | 68 |
| 18. | 18వ. లె. దినము – బదిలీయైన ప్రభువు | – | 73 |
| 19. | 19వ. లె. దినము – ప్రభువు పొందిన తీర్పులు | – | 76 |
| 20. | 20వ. లె. దినము – సిలువలోని విజ్ఞాపన ప్రార్థనలు | – | 79 |

| | | | |
|---|---|---|---|
| 21. | 21వ. లె. దినము - **సిలువధ్యాన మనోనిదానము** | - | 82 |
| 22. | 22వ. లె. దినము - **సిలువధ్యాన ఉపవాసము-సైతానుపై జయము** | - | 86 |
| | IV. ఆదివారము - **మారుమనసు పొందిన దొంగ** | - | 89 |
| 23. | 23వ. లె. దినము - **పశ్చాత్తాపము పొందనివారి దుస్థితి** | - | 93 |
| 24. | 24వ. లె. దినము - **సిలువలోని నీతి చరిత్ర** | - | 98 |
| 25. | 25వ. లె. దినము - **సిలువద్వారా కలిగేమార్పు-మారలేని యూదా** | - | 103 |
| 26. | 26వ. లె. దినము- **ప్రభువు చేసిన సత్కార్యములు-సిలువ కారణము** | - | 109 |
| 27. | 27వ. లె. దినము - **అంధకారపు లోయ** | - | 115 |
| 28. | 28వ. లె. దినము - **ఆదరణ లోయ** | - | 119 |
| | V. ఆదివారము - **సిలువయందలి ఆనందము** | - | 122 |
| 29. | 29వ. లె. దినము - **శ్రమ చరిత్రలో మారనివారు** | - | 126 |
| 30. | 30వ. లె. దినము - **సిలువలోని సిలువలు** | - | 131 |
| 31. | 31వ. లె. దినము - **దేవుని ప్రేమ - సిలువ వేత** | - | 136 |
| 32. | 32వ. లె. దినము - **మహా ప్రార్థన దినము** | - | 143 |
| 33. | 33వ. లె. దినము - **ఏడుమాటల ధ్యానము-మొదటిమాట వివరము** | - | 146 |
| 34. | 34వ. లె. దినము - **రెండవ మాట వివరము** | - | 153 |
| | VI. ఆదివారము - **మట్టలాదివారము** | - | 164 |
| 35. | 35వ. లె. దినము - **మూడు, నాలుగు మాటల వివరము** | - | 168 |
| 36. | 36వ. లె. దినము - **5వమాట వివరము; సిలువ ద్వారము** | - | 174 |
| 37. | 37వ. లె. దినము - **ఆరు, ఏడు మాటల వివరము** | - | 177 |
| 38. | 38వ. లె. దినము - **పాదశుద్ధీకరణ పరిచర్య** | - | 181 |
| 39. | 39వ. లె. దినము - **మహాశుక్రవారము, మూడు సిలువలు** | - | 186 |
| 40. | 40వ. లె. దినము - **మౌన దినము** | - | 194 |
| | VII. ఆదివారము - **సిలువలోని పునరుత్థానము** | - | 199 |

..........................................................................................

***లె = లెంటు; దిన = దినము.***

# ముందుమాట

*'సిలువ విలువ–ధ్యాన కలువ'* అను ఈ పుస్తకము దేవదాసు అయ్యగారి వ్రాతలనుండి సంకలనము చేయబడినది. క్రీస్తుప్రభువు సిలువ శ్రమలను ధ్యానించుటకు సంఘము 40 దినములను ఏర్పర్చుకొనినది. క్రీస్తు రూపమునకు తయారుకావలెనని ఆశించెడి సంఘమునకు క్రీస్తు శ్రమల ధ్యానమునకు మించిన సాధనము మరొకటి లేదు. సంఘము పాపముపై పరిపూర్ణ జయము పొందుటకు, పాప ఫలితమైన శాప దుస్థితిని తొలగించుకొనుటకు క్రీస్తు సిలువను తప్పక ఆశ్రయించి తీరవలెను. రాకడలో వెళ్ళవలెనని ఆయత్తపడుచున్న సంఘము, ఈ లోకములో తనకు ఎదురయ్యే శ్రమలను ఓపికతో సహించి, భరించి, జయించవలెననినా, క్రీస్తు రూపమునకు సరిసమాన రూపమును ధరించుకొనవలెననినా; పెండ్లికుమారుడైన క్రీస్తు ప్రభువుయొక్క శ్రమలను తరచి, ఆయన శ్రమానుభవము లోనికి వెళ్ళి, ఆయన శ్రమల వెనుకనున్న అంతరంగ ఉద్దేశమును తప్పక గ్రహించవలెను. అప్పుడు తానునూ పెండ్లికుమార్తె సంఘకన్యకయై, పెండ్లికుమారునికి తగిన వధువుగా స్థిరపడును.

క్రీస్తు ప్రభువు తాను పొందిన శ్రమలనుబట్టి పెండ్లికుమారుడైనట్టు, సంఘమును తన నిమిత్తమై శ్రమపడిన ప్రభువు శ్రమలను ధ్యానించుటనుబట్టియు, అట్టి శ్రమానుభవ రూపమును ధరించుకొనుటనుబట్టియు పెండ్లికుమార్తె యగును. ఇదే క్రీస్తు ప్రభువు సిలువలోని రహస్యము. ఈ సిలువ మర్మమును గ్రహించిన మన జనకులు, 40 దినముల సిలువ ధ్యానమును సంఘమునకు ఒక వరముగా ఇచ్చి, ఆ సిలువలోని అనేక విలువైన సంగతులను ఎత్తి సంఘమునకు ఉపదేశించిరి. ఈ ఉపదేశ క్రమములో వారు విభిన్నమైన కోణములలో క్రీస్తు సిలువను పరిశీలించి, ధ్యానించి, సిలువలోని లోతైన సంగతులను వెల్లడిలోనికి తెచ్చిరి. ఈలాగున క్రీస్తు సిలువను తరచుట మరేభక్తునికైనను అసాధ్యమని భావించవచ్చును. ఎందుకనినా, వారివలె క్రీస్తు సిలువను తన అనుభవములోనికి తెచ్చుకొనినవారు మరొకరు మనకు కనబడరు. వారు సిలువను గూర్చి బోధించిన సంగతులు అనేకమైనను, వాటిలో కొన్నిటిని సమకూర్చి, 40 దినముల ధ్యానమునకు తగినట్టుగా సిద్ధపర్చి మీకు అందించుచున్నాము. ఈ ప్రసంగ సంపుటిని మీరు జాగ్రత్తగాను, క్రమముగాను అందుకొన్న యెడల దైవజనుని సిలువధ్యాన వాలు మీకు తప్పక అభ్యాసము కాగలదు.

ఆలాగున సిలువ ధ్యాన సంపూర్ణులై, పెండ్లికుమారునికి తగిన పెండ్లికుమార్తెగా మీరు సిద్ధపడి, మహిమ మేఘమునకు ఆయత్తపడుదురు గాక! క్రీస్తు సిలువను లోకమునకు ఎత్తి చూపుదురు గాక! క్రీస్తు సిలువను మీ అంతరంగ అభ్యాసముగా చేసికొందురు గాక! ఆమేన్.

ఇట్లు

త్వరగా వచ్చుచున్న ప్రభువునందలి,

**రెవ. డా।। యన్. సత్యానందం**

ప్రసిడెంట్, బైబిలుమిషను.

# కృతజ్ఞతలు

**'సిలువ విలువ – ధ్యాన కలువ'** అను ఈ పుస్తకమును ఈలాగు సకాలమునకు సిద్ధముచేసి, అచ్చువేయించి, సంఘ ప్రయోజనము నిమిత్తమై మనకాలములో వెల్లడిలోనికి తెచ్చిన త్రియేక దేవునికి మా కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.

మరుగునపడిన దైవజనుని వ్రాతలను సేకరించి, వాటిలోని సిలువ ప్రసంగములను సమకూర్చి, అందులోనుండి శ్రేష్టమైన నలుబది ఏడు ప్రసంగములను బయటకు తెచ్చి, ఆ ప్రసంగములను సిలువధ్యాన క్రమమునకు అనుగుణముగా అమర్చుటద్వారా ఈ మహాకార్యము ముగింపైనది. దైవజనుని బోధలను స్వయముగా వ్రాసికొని, వాటిని భద్రపరచిన బైబిలుమిషను మాజీ అధ్యక్షులైన రెవ. బి. ఎలీషా, రెవ. జి. సమూయేలు, రెవ. యస్. సమూయేలు B.A గార్లకును, బైబిలుమిషను ప్రచురణలు పుస్తకరూపము లోనికి వచ్చుటకు కృషిసల్పి అనేక గ్రంథములను ప్రచురించిన రెవ. డా॥ జె. జాన్ సెల్వరాజ్ గారికిని మా కృతజ్ఞతలు తెల్పుచున్నాము. ఈ పనిలో ప్రార్థనా సహకారమును, ప్రోత్సాహమును అందించిన బైబిలుమిషను అధ్యక్షులైన రెవ. డా॥ ఎ. జాన్, ఉపాధ్యక్షులైన రెవ. యన్. సత్యానందం, సహకార్యదర్శియైన రెవ. పి. సజీవరావుగార్లకును మా కృతజ్ఞతలు తెలుపుచున్నాము.

దైవజనునివద్ద వారు వ్రాసికొనిన వ్రాతలు సేకరించి మాకందించిన రెవ. మద్దా సమూయేలు, రెవ. టి. సంగీతరావు, మురముండ, రెవ. పి. యం. శాంతిరాజు, రెవ. పి. డి. ఒనేసిము, రెవ. వి. సంగీతరావు, పాస్టర్ గంటా డేవిడ్‌రాజు, పాస్టర్ కోట్ల ప్రశాంత్ కుమార్‌గార్లకు మా నిండు వందనములు. వీరేకాక ఇంకను అనేకమంది అనగా, రెవ. బి. జీవరత్నం, రెవ. వై. వి. రత్నం, రెవ. యోసేపు, ర్యాలి, పాస్టర్. బి. సజీవరావు, పాస్టర్. ఇ. యేసుజీవం, పాస్టర్. ఇ.వై. విజయరత్నం, రెవ. కె. సభాపతిగారి తనయులైన శ్రీ రాకడరావు, శ్రీ సత్యసింగ్, శ్రీ విల్సన్, కొవ్వూరు, శ్రీ అజరయ్యగార్లకు, శ్రీమతి ప్రిస్కిల్ల, శ్రీమతి ఎస్తేరమ్మగార్లకు, వీరికందరికినీ మా నిండు వందనములు తెలుపుచున్నాము. ఇంకనూ ఈ సాహిత్యసేవలో తమవంతు కృషి సల్పుచున్న ఇతర సహకారులకును మా నిండు వందనములు. వీరిని, మిమ్ములను దేవుడు దీవించునుగాక! ఆమేన్.

ఇట్లు,
ప్రభుని సిలువ దాసుడు,
**రెవ. డా॥ జె. శామ్యేల్ కిరణ్**
వైస్ ప్రెసిడెంట్, బైబిలుమిషను.

# క్రీస్తు శ్రమ - ప్రవచనముల పొందిక

## క్రీస్తు శ్రమల ప్రవచనములు - వాటి నెరవేర్పులు

| | ప్రవచనము | నెరవేర్పు |
|---|---|---|
| 1. | యూదులు మరియు అన్యులు ఆయనను నిరాకరించుట కీర్తన 21:1; 22:12; 41:5; 56:5; 69:8; 118:22,23; యెషయా 6:9,10; 8:14; 29:13; 49:7; 53:3; 65:2. | యోహాను 1:10-11 అన్న, కయప యూదులు;హేరోదు, పిలాతు-అన్యులు ఆయనను నిరాకరించిరి. |
| 2. | ప్రభువును బాధించువారు కీర్తన 22:6; 35:7,12; 56:5; 74:10; 109:2 | మత్తయి 26:3; మార్కు 14:1; లూకా 22:1 |
| 3. | యెరూషలేములో ప్రవేశించుట కీర్తన8:2; 118:26; జెకర్యా 9:9 లూకా19:29-44;యోహాను12:12-29 | మత్తయి 21:1-11;మార్కు 11:1-11 |
| 4. | గెత్సేమనే, కీర్తన 22:14-15 | మత్తయి 26:36-39; మార్కు 14:3-36;లూకా 22:42-44 |
| 5. | స్నేహితుని వలన అప్పగింపబడుట కీర్తన 41:9; 55:12-14 | మత్తయి 26:49; మార్కు 14:45; లూకా 22:42-44 |
| 6. | శిష్యులచే విడిచిపెట్టబడుట జెకర్యా 13:7 | మత్తయి 26:31,56; |
| 7. | ముప్పది నాణెముల విలువ జెకర్యా 11:12 | మత్తయి 26:15; మార్కు 14:10,11; లూకా 22:5 |
| 8. | కుమ్మరివాని పొలము కొనుట జెకర్యా 11:13 | మత్తయి 27:7 |
| 9. | యూదా ఇస్కరియోతు మరణము కీర్తన 55:15,23; 109:17 | మత్తయి 27:3-10; కార్య 1:18,19 |
| 10. | మనకు బదులు ఆయనకు శ్రమ యెషయా 53:4-6,12; దానియేలు 9:26 | మత్తయి 20:28 |
| 11. | అబద్ధ సాక్ష్యములు చెప్పుట కీర్తన 27:12; 35:11; 109:2 | మత్తయి 26:59-60; మార్కు 14:55-60; లూకా 23:1-2 |

Bible Mission HQ Guntur

| | |
|---|---|
| 12. ఆయన నోరు తెరువకుండుట<br>కీర్తన 38:13; యెషయా 53:7 | మత్తయి 26:62; 27:12-14;<br>మార్కు 14:60; 15:4,5 |
| 13. ఆయనను కఱ్ఱతో కొట్టుట<br>మీకా 5:1 | మత్తయి 27:30; మార్కు 15:19;<br>యోహాను 19:1-3 |
| 14. అవమానించుట, గుద్దుట, కొట్టుట<br>ఉమ్మివేయుట కీర్తన 35:15-21;<br>యెషయా 50:6 | మత్తయి 26:67; 27:26,30,31;<br>మార్కు 14:65; లూకా 22:62-65;<br>యోహాను 19:1-3 |
| 15. అపహసించుట<br>కీర్తన 22:7,8,16; 109:25 | మత్తయి 27:39-44;<br>మార్కు 15:29-32; లూకా23:35-38 |
| 16. ఆయనను పొడుచుట, గాయములు<br>కీర్తన 22:16; జకర్యా 13:6 | లూకా 23:33; యోహాను 19:18,34<br>(సిలువ) |
| 17. సిలువమీది 1వ మాట శత్రువుల<br>కొరకు ప్రార్థన, విజ్ఞాపన.<br>కీర్తన 109:4; యెషయా 53:12 | లూకా 23:34 |
| 18. 4వ మాట నా దేవా! నా దేవా!<br>కీర్తన 22:1 | మత్తయి 27:46; మార్కు 15:34 |
| 19. 7వ మాట, ఆత్మను అప్పగించుట<br>కీర్తన 31:5 | లూకా 23:46 |
| 20. చేదు చిరకనిచ్చుట. కీర్తన 69:21 | మత్తయి 27:34; మార్కు 15:23<br>లూకా 23:6; యోహాను 19:29 |
| 21. నేరస్థులలో ఒకడుగా ఎంచబడుట<br>యెషయా 53:12 | మత్తయి 27:38; మార్కు 15:27<br>లూకా 23:33; యోహాను 19:18 |
| 22. వస్త్రముల కొరకు చీట్లు<br>కీర్తన 22:18 | మత్తయి 27:35; మార్కు 15:24 |
| 23. యౌవనములో మరణము<br>కీర్తన 89:45; 102:24 | 33 1/2 సం॥లప్పుడు చనిపోయెను<br>మార్కు 15:37. |
| 24. ఇష్టపూర్వకమైన మరణము<br>కీర్తన 40:8 | మత్తయి 26:47-56<br>యోహాను 18:1-11 |
| 25. ఎముకలు విరువబడవు<br>నిర్గమ 12:46; కీర్తన 34:20 | యోహాను 19:33-36 |
| 26. ధనికులతో పాతిపెట్టబడుట<br>యెషయా 53:9 | మత్తయి 27:57-60;<br>మార్కు 15:42-46;<br>లూకా 23:50-53;<br>యోహాను 19:38-41 |

# లెంటులోని మొదటి దినము - శ్రమలధ్యాన ప్రారంభము

## భస్మ బుధవారము

ఆది: 18:25; లూకా 18:9; కొలస్స 2:18-23;

సలహా:- తిండి బలమునుబట్టి శరీర బలము. శరీర బలమునుబట్టి పని బలము. పని బలమునుబట్టి ఫలితముండును. అట్లే శ్రమకాల ధ్యాన బలమునుబట్టి ఆత్మీయ ఫలితమును ఉండును.



ప్రార్థన:- దయగల తండ్రీ! నీ శ్రమలను ధ్యానించుటకై సంఘము నేర్పరచుకొన్నావు. ఈ శ్రమల ప్రారంభదినమున మమ్ములను చేర్చినందులకు వందనములు. మా జీవితకాలమంతయు నీ జీవితకాల శ్రమలను ధ్యానించుట వలన మాకు ఉపయోగకరమగును. అయినప్పటికిని సంఘము ప్రత్యేక సమయము నేర్పరచుకొన్నది. రాబోవు వారములలో ఆదివారము, శుక్రవారపు దినములలోనే గాక ప్రతిదినమును నీ సిలువను ధ్యానించిన యెడల మాకెంతో మేలు. మేమెట్లు ఈ దినమునుండి నీ సిలువను ధ్యానింపవలెనో మాకు నేర్పించుటకు, నీ యాత్మ శక్తి ననుగ్రహింపుము. నేడు మేము నీ శ్రమ చరిత్ర యొక్క ముఖ ద్వారమున నిలువబడియున్నాము. మాకు గడిచిన కాలములో, రాబోవు కాలములో వ్రాయబడిన వ్రాతలమూలమున నీ శ్రమ చరిత్ర కనబడుచున్నది. నీ సంగతులను మా ఆలోచనలతో నింపుకొనునట్లు నీ కృప ననుగ్రహింపుము. ఏదో యొక వర్తమానము నీ దినమున మాకనుగ్రహింపుము. భూలోకములో యెక్కడెక్కడ ఈ పండుగ నాచరించుచున్నారో వారికిని నీ వర్తమానము నందించుము. సంఘము బలపడు నిమిత్తము ఆసక్తితో కూడిన శ్రమలయొక్క ధ్యానశక్తిని మాకనుగ్రహింపుము.

దీవెన : శ్రమకాల ధ్యానపరులైన విశ్వాసులారా! మీకు శుభము కలుగునుగాక! భస్మ బుధవార పండుగకు చేరుకొన్న వారలారా! మీకు ధ్యానశక్తి కలుగునుగాక!

క్రిస్మసు పండుగ ఒక్క రోజుకే అయిపోవును. క్రొత్త సంవత్సర పండుగ ఒక్క రోజుకే అయిపోవును. ఈస్టరు, పునరుత్థానము, అడ్వెంటు, మట్టలాదివారము మొదలైన పండుగలన్నీ ఒక్క రోజుకే అయిపోవును. ఈ శ్రమకాల పండుగ ఒక్క రోజు పండుగకాదు. ఇది 40 దినముల పండుగ. ఇది పండుగలన్నిటికంటే ఎక్కువ దినములు పట్టును. ప్రభువు స్వయముగా కొన్ని సంగతులు ఆజ్ఞాపించినారు. ఇవి చేయండని ఆజ్ఞాపించినారు. అవి మనము చేయవలెను. అయితే ఈ శ్రమకాల ధ్యానము 40 దినములు మీరు చేయండని ప్రభువు ఆజ్ఞాపించలేదు, చెప్పను లేదు. ఇది సంఘమునకు విడిచిపెట్టిరి. ఇన్ని రోజులని, అన్ని రోజులని ఆయన చెప్పలేదు. అందుచేత సంఘము

Bible Mission HQ Guntur

ఏమి చేసినది? మొదటిలో కొన్ని రోజులు చేయాలని సంఘము ఏర్పర్చుకొన్నది. రెండవసారి అది సంఘమునకు చాలక, మరికొన్ని రోజులు కలుపుకొన్నది. చివరకు 40 దినములు కలుపుకొన్నది. ఆ 40 దినములు ఖాయము చేసికొన్నది.

బైబిలులో అయితే 40 దినములు కొన్ని ఉన్నవి. బైబిలులో ఉన్న 40 దినములు, సంఘమేర్పర్చుకొన్న 40 దినములు సరిపోయినవి. గనుక ప్రభువు బైబిలులోని ఆ 40 దినములు, సంఘము ఏర్పర్చుకొన్న ఈ 40 దినములు చూచి ఊరుకున్నారు. సంఘము ఆజ్ఞలు నెరవేర్చుట చూచి ఏలాగు సంతోషిస్తున్నాడో, ఆలాగే సంఘము ఈ 40 దినములను ధ్యానమునకు ఏర్పర్చుకొనుట చూచికూడ ప్రభువు సంతోషించుచున్నాడు. అందుచేత ప్రభువు సంఘము చేయునది చూచి మౌనముగా నిశ్శబ్ధముగా ఊరుకొన్నారు. ఈ దినమునకు భస్మబుధవారమని పేరు. ఈ రోజునుండి లెక్కబెట్టుకొంటూ వెళ్లితే సిలువయొద్దకు వెళ్లే సరికి 40 దినములు పూర్తి అగును.

## బైబిలులోని 40 దినములు

1) ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి బైలుదేరి పాలెస్తీనాకు ప్రయాణించినది, 40సం॥లు.
2) మోషే సీనాయి పర్వతముపై దేవునిచూస్తూ, దేవుని మాట వింటూ గడిపిన దినములు 40.
3) మోషే సీనాయి పర్వతముపై ప్రజల పాపపరిహార మధ్యవర్తిగా ఉన్న దినములు 40.
4) ఏలీయా అరణ్యములో ఉపవాసముతో నడచిన దినములు 40.
5) యేసుప్రభువు అరణ్యములో మృగముల మధ్య చేసిన ఉపవాసము 40 దినములు.
6) పునరుత్థానమునుండి ఆరోహణము వరకు ధ్యానము చేయు దినములు (ఉపవాసము కాదు) 40 దినములు.

ఈ ఆరు 40 దినములును ఒక విషయములో సమకూడినవి. అయితే ఈ శ్రమకాల 40 దినములు ధ్యానముకొరకు వాడుదురు.

1. క్రిస్మస్ సంతోషదినము. అది దుఃఖదినముకాదు.
2. సంవత్సరాది సంతోషదినము. అది దుఃఖదినముకాదు.
3. పునరుత్థానము సంతోషదినము. అదిదుఃఖదినముకాదు.
4. ఆరోహణము సంతోషదినము. అది దుఃఖదినముకాదు.

} ఆలాగే ఈ 40 దినములును సంతోష దినములే కాని దుఃఖ దినములు కానేకావు.

అయితే భస్మ బుధవారము అట్టిదికాదు. భస్మబుధవారము మొదలు సిలువ దినము వరకు రెండు సంగతులున్నవి. ఈ 40 దినములును ఆ రెండున్నవి. ఆ రెండును గుర్తించండి. అవేవనగా, దుఃఖమున్నూ, సంతోషమున్నూ. ఈ రెండును కలసి ఉన్నట్లు గుర్తించాలి.

**దుఃఖము: 1వ మనిషి:-** **దుఃఖము అనగా మారుమనస్సు పొందుట : ఒక మనిషి ఉన్నాడు. అతడు దేవుని 10 ఆజ్ఞలకు విరోధముగా పాపము చేసినాడు. నేను పాపము చేసినానని మారుమనస్సు పొందినపుడు దుఃఖించును. ఇదే దుఃఖము. అయితే అతడు పాపము చేయునప్పుడు దుఃఖపడడు, సంతోషిస్తాడు గాని తరువాత మారుమనస్సు పొందినపుడే దుఃఖము. ఇది ఒక మనిషి కథ.**

**2వ మనిషి:-** అయ్యో! దేవుని ఆజ్ఞకు విరోధముగా పాపము చేసితినే, ఫలాని ఇంటిని చెరిపితినే, పాపము చేసినందువల్ల ఫలాని కుటుంబమును కూల్చితినే అను దుఃఖము. ఇది రెండవ మనిషి కథ.

**3వ మనిషి:-** నేను పాపము చేసినాను. నా ప్రభువుకు దుఃఖము కలిగించితిని అని దుఃఖించును.

**4వ మనిషి:-** సిలువమీద ఉన్న ప్రభుని చూచి దుఃఖించుచున్నాడు. అయ్యో ప్రభువా! ఎంత బాధ నీకు! ఎన్ని శ్రమలు? ఎంత భారము?

**5వ మనిషి:-** ప్రభువా! నామీద నున్న పాప భారము, వ్యాధి భారము, శిక్ష భారము నీ మీద వేసికొన్నావు. అందుచేత నాకు సుఖము వచ్చింది. నా అవస్థలు, చిక్కులు నీకెట్లున్నదోగాని నాకు మాత్రము హాయిగా ఉన్నది అని సంతోషిస్తున్నాడు. ప్రతి ఒక్క మనిషివద్ద రెండున్నవి. అవి ఏమిటనగా దుఃఖము, సంతోషము.

1. 1) పాపములు ఒప్పుకొన్నప్పుడు దుఃఖము వచ్చింది గనుక దుఃఖపడ్డాడు.
   2) అయితే, తరువాత నేను మారుమనస్సు పొందితినను సంతోషముండును.
2. 1) పాపముచేసి పొరుగువానికి దుఃఖము కలుగజేసితిని అని దుఃఖపడును.
   2) అట్టివారియొద్దకు వెళ్లి క్షమాపణ కోరిన తరువాత ఒప్పుకొన్నాననే సంతోషం ఉండును.
3. 1) నా పాపమువల్ల ప్రభువును దుఃఖపరచితినని దుఃఖపడును.
   2) ప్రభువు వచ్చి ఆదరించగా సంతోషము కలుగును.
4. 1) ప్రభువా! నా పాపములు, వ్యాధులు, బాధలు, శిక్షలు నీవు మోసికొంటివి అను దుఃఖము కలిగియుండును. నా మీదకు రావల్సినవి, ఆయనమీదికి వెళ్లెనని దుఃఖపడును.
   2) నామీద లేవు ఆయనమీదికి పోయినవను సంతోషముండును.
5. 1) నేను అయోగ్యుడను ఎన్నికలేని మనిషిని. నా కొరకు నీవు ఇన్ని శ్రమలు పొందినావనే దుఃఖముండును.
   2) అయితే, ప్రభువుయెడల అపారమైన కృతజ్ఞత కలిగి యున్నందువలన సంతోషముండును. అందునుబట్టి దుఃఖము, కన్నీరు కలుగును.

ఉదా: సిలువమోయుచూ వెళ్లుచున్న ప్రభువుయొక్క శ్రమలు చూచుచూ, ఆయనను వెంబడించిన స్త్రీలను చూచి ఆయన ఏమన్నారు? యెరూషలేము కుమార్తెలారా! నా కొరకు ఏడ్వకుడి. మీ నిమిత్తము, మీ పిల్లల నిమిత్తము ఏడ్వుడి అనెను. అనగా వారిని (ఏడ్చుచున్నవారిని) ఓదార్చెను, ఆదరించెను.

6. 1) మనము సిలువమీద ఉన్న ప్రభువును చూచి దుఃఖిస్తే ,

2) ప్రభువు మనలను ఓదార్చును, ఆదరించును.

(A) **యేసుప్రభువు:-** 1) తలమీద ముండ్లకిరీటము పెట్టి దిగగొట్టినప్పుడు ఆయనఏడ్చినారా? బైబిలులో ఏడ్చినట్లులేదు. (ఆయన కన్నీరు కార్చినట్లు తెలియును). అయితే సిలువపై ఆయన కన్నీరు కార్చినట్లు వ్రాయబడలేదు. 2) ఆయన కాళ్లలోను, చేతులలోను మేకులు కొట్టినప్పుడు, ప్రభువు కన్నీరు కార్చినారా? ఆలాగు వ్రాయబడలేదు. మనకు తెలియదు. ఆయన కన్నీరు కార్చలేదు. 3) ఆయనను కొట్టినప్పుడుగాని, 4) సిలువ మోసినప్పుడు గాని, మోయలేక ఏడ్చెనా? ఏడ్వలేదు. 5) ప్రక్కలో బల్లెముతో పొడిచినప్పుడు ఏడ్వలేదు.

(B) **యేసు మనిషి :** 1) ప్రభువుయొక్క శరీరమునకైతే బాధ ఉన్నది (అనగా శరీరమేమో బాధపడ్డది). 2) అయినను **'నా బిడ్డల నిమిత్తము ఇది చేస్తున్నాను'** అను సంతోషము ప్రభువునకున్నది. నేను లోకము నిమిత్తము, నా బిడ్డల నిమిత్తము, శ్రమలుపడి నా బిడ్డలందరి పాపములు, అవస్థలు, బాధలు, వ్యాధులు, మరణము, నరకము తీసివేసితిని అను సంతోష బాష్పములు కార్చెను. 'లోకమంతటికి రావలసిన శిక్ష భారమంతటిని తొలగించితిని' అను ఆనంద భాష్పములు ప్రభువుకు వచ్చెను.

6వ మనిషి : ఆరవ మనిషి కూడా ఏడ్చెను గాని ఆనంద భాష్పములే వచ్చెను. అంతకుముందు ప్రభువుకు వేదన, బాధ కలిగించితిననే వేదన, దుఃఖము మనిషికి వచ్చెను. ఇది కృతజ్ఞతతో ఏడ్చుట. హృదయములోని కృతజ్ఞతనుబట్టి సంతోషముతో కూడిన కన్నీరు వచ్చుట. ఇది వేరు గాని పాపమున్నప్పుడువచ్చు దుఃఖము, అది వేరు.


ఫలితము:- ఎందరిని గూర్చి చెప్పితినో, ఆ అందరిలోను ఈ రెండు కనబడును. 1) దుఃఖము, 2) సంతోషము ఉండును. ***ఈ 6 చరిత్రలనుబట్టి ఈ 40 దినములు ధ్యానముచేస్తే మనము భస్మ బుధవారమును, మండల కాలమును నెరవేర్చిన వారమగుదుము.*** ఆ రీతిగా ఈ 40 దినములు ఉపవాస ధ్యానము నెరవేర్చు ధన్యత పెండ్లికుమారుడైన సిలువ నాధుడు మనకు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన :*** "యేసుక్రీస్తుని సిలువ - ఎపుడు ధ్యానము చేయు - మాశతోను సోదరా =
మన దోసంబు నెడబాపు-ఈ సంతాప మరణ - వ్యాసంబు చే సోదరా" ॥యేసు॥

# లెంటులోని రెండవ దినము - గురువారము

## శ్రమకాల గుడారము.

లూకా 18:31-34;



ప్రార్థన:- దయగలప్రభువా! నీ కుమారునిద్వారా చరిత్ర జరిగించి, యది మాకు వ్రాసిపెట్టినందులకు వందనములు. తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును నిత్యస్తోత్రమని చెప్పు విశ్వాసులకు కలుగు శ్రమలు, ఆనందకరముగ జేయుమని శ్రమల గుడారములో ప్రవేశించిన యేసు ప్రభువు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

ప్రియులారా! మనము శ్రమలయొక్క గుడారములో ప్రవేశించినాము. ఈ నలుబది దినములలో ప్రభువు యొక్క కుడిప్రక్కను యెడమప్రక్కను ఎక్కడైనను శ్రమయే కనబడును. మనము క్రీస్తుయొక్క శ్రమలను ధ్యానించునపుడు మన శ్రమలు జ్ఞాపకమునకు వచ్చును గాని ఆయన శ్రమల యెదుటనవి యావగింజంత మాత్రమే కనబడుచున్నవి. క్రీస్తు ప్రభువునకు జయముతో శ్రమలు ముగిసినవి. భక్తులైనవారు పూర్వకాలమందు ప్రభువు యొక్క చరిత్ర పరీక్షించినారు. అందు క్రిస్మస్ చరిత్ర, ఆయన బోధ, ఆయన యద్భుతములు, ఆయన శ్రమలు ఉన్నవని గ్రహించినారు. అందు క్రీస్తు యొక్క పునరుత్థానమున్నదనియు, రాకడున్నదనియు గ్రహించినారు. గాని క్రిస్మస్ కంటే, బోధ కంటే, అద్భుతముల కంటే, ఆరోహణము కంటే, క్రీస్తు యొక్క శ్రమలే మహా ముఖ్యమైనవని, పెద్దలు యీ నలుబది దినములు ధ్యానముగా నేర్పరచినారు. ఈ నలుబది దినములు శ్రమలను గూర్చి ధ్యానించవలెను. క్రిస్మస్ పండుగను ధ్యానించుటకు ఒక్కరోజు మాత్రమే, ఈస్టరు పండుగను ధ్యానించుటకు ఒక్కరోజు మాత్రమే, ఆలాగుననే ఆరోహణ పండుగను ధ్యానించుటకు కూడ ఒక్కరోజు మాత్రమే గాని క్రీస్తు శ్రమలను గూర్చి ధ్యానించుటకు యెక్కువ సమయము కావలయునని పెద్దలనుకొని, నలుబది దినము లేర్పరచుకొన్నారు. మార్చి నెలయంతయు, ఇంకా ఏప్రిల్ నెలలో కూడా ధ్యానింతురు. ఇన్నిదినములెందుకని కొందరనుకొనవచ్చును. అయితే ఇవి మనము ధ్యానింపదగినవే. రేపు బుధవారము కదా! ఈ నలుబది దినములు ధ్యానించుటకు, బైబిలులో ననేకమైన వాక్యములు గలవు. అవన్నియు యిక్కడుపయోగింపక వాటి అన్వయ వాక్యములు మన ధ్యానముకొఱకు చెప్పెదను. మీరు చదువుకొంటే 1పేతురు 1:19-21 వరకని చెప్పుదును. అప్పుడు మీరు అధ్యాయమంతయు చదువుకొనెదరు. నిజమైన విశ్వాసి ఈ బుధవారమున క్రీస్తుయొక్క సన్నిధానమునకు

Bible Mission HQ Guntur

వెళ్ళి, మహావినయముతో "ప్రభువా! నేను బూడిదనై యున్నాను, ధూళినైయున్నానని చెప్పగలుగును. అందరును చెప్పలేరు. గుడిలోను, మీటింగులలోను, యిండ్లలో మాత్రము కాదు, హృదయములో అబ్రాహామువలె చెప్పగలవారుగా ఉండవలెను. అబ్రాహాము విశ్వాసులకు జనకుడు, ఆయనే 'ధూళి'నంటే, మనమే మనగలము. నేను ధూళికంటే ధూళిని, బూడిదకంటే బూడిదనని చెప్పవలెను. అలాగు యెవరందురో వారే శ్రమకాలపు గుడారములోనికి చేరగలరు." (ఆది 18:27)

యోబు కూడ అలాగు చెప్పెను. (యోబు 30:19) విశ్వాసి (1) నేను పాపిని, (2) నేను అయోగ్యుడను, (3) నేనశక్తుడనై యున్నాను అని చెప్పవలెను. మీరు యింటికి వెళ్ళి, యీ మూడు ఒప్పుకొనవలెను. అప్పుడు శ్రమకాల ధ్యానములో ప్రవేశింతురు. మీరు ఇంటివద్ద, గుడిలోకంటె ఎక్కువగా ధ్యానించగలరు, చదువగలరు.

**1. నేను పాపినైయున్నాను :-** 'నేను అక్రమకారుడనని' మనయపరాధములు మంచి శుక్రవారమువరకు ఈ విధముగా నొప్పుకొనవలెను. శ్రమకాల చరిత్ర రెండువైపుల కనబడుచుండగా, తండ్రీ! నేను పాపినైయున్నాను, అయినప్పటికిని నాకొరకు నీవు పాపికంటె యెక్కువ శిక్షననుభవించినావని యనండి.

**2. అయోగ్యుడను:-** ఒకవేళ, పూర్తిగా క్షమింపబడినవారు, పూర్తిగా పాపములు విడిచి పెట్టినవారును ఉండవచ్చును. అయితే అయోగ్యుడను అంటే 'నేను పాపిని కాదు, నీ శ్రమల ద్వారా పొందవలసిన భాగ్యమునకు నేను తగనని' యర్థము. నీవు నాకు, నీ శ్రమల ద్వారా అందించే దీవెన నేను అందుకొనలేనని యర్థము. ఆహా! నా అయోగ్యత యెంత చెడ్డది. ప్రభువా! అయినప్పటికిని నీ శ్రమల ధ్యానము ద్వారా నన్ను యోగ్యునిగా చేయుము.

**3. అశక్తుడను :-** అనగా శ్రమ చరిత్ర వల్ల నీవు యెన్ని దీవెనలిచ్చెదవో, వాటినన్నింటిని అందుకొనే శక్తి నాకు లేదు. నీవైతే యెన్నైనను యిచ్చెదవు, నీవు పడిన శ్రమలు చూడగ యొకటి కాదు, ననేకమైనవి అనుభవించితివి. గనుక అనేకమైన దీవెన లియ్యగలవు. ఐదువేల మంది కాహారమియ్యగా, 12 గంపల రొట్టెముక్కలు మిగులునని తెలిసినను, మిగిలి పోయేట్లు అద్భుత కార్యక్రమము చేసినావు కాదా! అట్లే నీ శ్రమలన్నిటి ద్వారా వచ్చు దీవెనలన్నీ మేము అందుకొనలేమని తెలిసినప్పటికిని, నీవు శ్రమల ననుభవించినావు గనుక నీకు వందనములు.

ఇప్పుడు నేను శ్రమ చరిత్ర వినిపించెదను. ఇంతవరకు మన చరిత్ర వివరించినాను. అనగా పాపియొక్క చరిత్ర, అయోగ్య చరిత్ర, అశక్త చరిత్ర. పాపి తన చరిత్ర తెలిసికొని దేవునికి వందనములు చెల్లించిన యెడల అదియెంత మంచిది! ప్రభువా నేను అయోగ్యుడను, అశక్తుడను, నా మీద నీకింత ప్రేమా! యని అనిన యెడల అదియెంత మేలు. అట్టి చరిత్ర ధ్యానించుటకు ప్రభువు ఆత్మ మీకు తోడై యుండును గాక.

*1. శ్రమ చరిత్ర మొదటి భాగము, ప్రవచనముల చరిత్ర భాగము*

*2. శ్రమ చరిత్ర రెండవ భాగము, నాలుగు సువార్తలలో గల చరిత్ర భాగము*

*3. శ్రమ చరిత్ర మూడవ భాగము, పత్రికలలోని జ్ఞాపకము తెచ్చుకొనే భాగము*

*4. శ్రమ చరిత్ర నాల్గవ భాగము, ప్రకటనలోని రాబోయే రాకడ కాల భాగము*

పై నాలుగు భాగము లెక్క డెక్కడున్నవో మీరు వ్రాసికొని, యీ నలుబది దినములు ధ్యానించండి. ప్రతిరోజూ భస్మ బుధవారము, మంచి శుక్రవారము, పరిశుద్ధవారమని యనుకొంటూ ధ్యానించువారే పరిశుద్ధులు. ఎందుకంటే పాపములను, అయోగ్యతను, అశక్తిని శుభ్రము చేసికొని యున్నారు గనుక వారే ధ్యానపరులు. వారే దుఃఖించుచున్న రక్షకుని నవ్వించే ప్రియబిడ్డలు.

**(1) ప్రవచన భాగము:–** దీనిలో (ఆది 3:15) యున్నది. ఇందులో, యేసుప్రభువు లోకమునకు వచ్చి సాతాను వలన శ్రమపడునని యున్నది. (2) అబ్రాహాము దేవునితో అనిన మాట 'నేను ధూళిని బూడిదను' (ఆది 18:27); కొందరు మారుమనస్సు పొందినయెడల రక్షింపవా! యని అబ్రహాము యడిగెను. (3) యోబు (30:19) నేను ధూళినై యున్నానని అబ్రాహామువలె యోబు కూడ తగ్గించుకొనెను. 4. (దా.కీ. 22) ఈ అధ్యాయమంతయు సిలువ మరణమును గూర్చి యున్నది. నా దేవా! నా దేవా! నన్నెందుకు చెయ్యి విడిచినావని మొదటే యున్నది. ఆ మాట ప్రభువు సిలువమీద పలికినాడు. ఎంత శ్రమలేకపోతే – నా తండ్రీ! నా తండ్రీ! అనలేదు గాని నా దేవా! నా దేవా! అన్నారు. ఎందుకు చెయ్యి విడిచినావని మనిషి అంటాడు గాని యింకొక రనరు గదా! వారు నా బట్టలు తీసుకొని చీట్లు వేసికొన్నారని యీ కీర్తనలో యున్నది. ప్రభువు మరణ సమయములో రాణువవారు ఆయన యంగీని చీట్లు వేసికొనిరి. నా పాదములు, నా చేతులు, వారు పొడిచినారని యున్నది. నేను జ్ఞాపకము చేయుచున్నాను గనుక ఇంటికి వెళ్ళి చదవండి. 5. (యెష 53 అధ్యా.) ఈ అధ్యాయములో మీరెరిగిన

మూడు అంశములున్నవి. (ఎ) మన శ్రమలు తనమీద వేసికొనినాడు. (బి) మన వ్యాధులు తనమీద వేసికొనినాడు. (సి) మన శిక్షలు ఆయన మీద వేసికొనినాడు. నిజముగా కొయ్యకఱ్ఱ తన భుజములమీద వేసికొనినాడు. మనమీదకు వచ్చే శాపములు అన్నియు తనమీద వేసికొనినాడు. పెంతెకోస్తు కాలమందు ఆత్మ కుమ్మరింపబడకముందే, మన శాపములను సిలువమీద వేసికొన్నాడు. **ఇది అంతయు కంఠత చేస్తే మంచిది.**

6. విలాప వాక్యములు : యిర్మీయా వ్రాసిన ఈ గ్రంథములో ఒక భక్తుడు ఉన్నాడని, ఆయనకు శ్రమలని, ఆయన యెంత ప్రార్థన చేసిన వినలేదని, ఈటె తీసుకొని ఆయనను పొడిచినారని వ్రాయబడి యున్నది. ఈ ఐదు అధ్యాయములు బాగుగా చదువుకొనండి. యేసుప్రభువు గెత్సేమనే తోటలో ఏమన్నారు! ఈ శ్రమల గిన్నె నా యొద్దనుండి తొలగించమన్నారు అయితే తండ్రి విన్నారా? యింత శ్రమ భరించుట యెలాగు? పరిశుద్ధ పట్టణమునకు శ్రమ, నాకు శ్రమ, సీయోనుకు శ్రమయని విలాప వాక్యములలో శ్రమ చరిత్ర యంతయున్నది. ఇప్పుడు సువార్తలలో చూద్దాము.

**2) సువార్త భాగము:** మత్తయి 16-17 అధ్యాయములలో మరణ చరిత్రకు సంబంధించిన ప్రవచనములున్నవి. ఈ ప్రవచనములలో ప్రభువు తన చరిత్ర తానే చెప్పుకొన్నాడు. "ఇదిగో యెరూషలేముకు వెళ్ళుచున్నాము. మనుష్య కుమారుడు పాపుల చేతి కప్పగింపబడి, శ్రమలపాలై, మరణము పొందుననని" మూడు ప్రవచనములున్నవి శిష్యులందరు ప్రవచనములన్ని విని దుఃఖించినారు. దీని యర్థము మాకు తెలియుట లేదు, ఈయనే దేవుడని యనుకొనుచున్నామని వారు భావించి, చివరకు పేతురు ప్రభువా! శ్రమలు నీకు దూరమగును గాక అని చేతులు పట్టుకొని బ్రతిమలాడినాడు. ప్రభువందుకు పేతురును సాతానా! నా వెనుకకు పొమ్మని గద్దించినాడు. తరువాత శ్రమచరిత్ర వచ్చును. ఇది యసలు జరిగిన చరిత్రయైనను నేను చెప్పునదేమనగా,- రాబోయే ప్రభువుయొక్క శ్రమచరిత్ర అంతయు నాలుగు సువార్తల యొక్క చివర యధ్యాయములలో కలదు.

**(3) పత్రికల భాగము:** ఆరోహణమై వెళ్ళిన తరువాత భక్తులు జరిగిన చరిత్రను తలంచుకొని ధ్యానించినారు. మనమాలాగే జరిగిన చరిత్రను భస్మ బుధవారము మొదలుకొని మంచి శుక్రవారము వరకు ధ్యానించెదము. I.పేతురు 1,2 అధ్యాయములలో జ్ఞాపకము తెచ్చుకొనిన చరిత్ర ఉన్నది. పౌలు ఏమి వ్రాసినాడంటే ఆయన సిలువమీద పొందినది శ్రమ కాదు, ఆయన బ్రతుకు అంతయు శ్రమ చరిత్రే.

రోదనముతో, కన్నీళ్ళతో ఆయన కాలము గడిపెనని వ్రాసెను. (హెబ్రీ 5:7)లో ప్రభువు ఎప్పుడును యేడ్చుచునే యున్నారు అని పౌలు అన్నాడు. సంఘ చరిత్రలో భక్తులు యేసుప్రభువును గూర్చి యేమన్నారంటే యెప్పుడును దుఃఖముతో నుండేవాడనియు, కష్టములలో యున్నవారిని చూచి జాలిపడేవాడనియు వ్రాసిరి. ఎవరైతే ప్రభువును పొడిచినారో వారాయనను చూచి యేడ్చెదరు, ప్రథమ కుమారుడు చనిపోయిన యెడల తల్లిదండ్రులు ఎట్లేడ్చెదరో (జెకర్యా 12 అధ్యాయము) యట్లే ఏడ్చెదరు.

**(4) ప్రకటనలోని భాగము:** ప్రకటన 5వ అధ్యాయములో నొకాయన సింహాసనము మీద కూర్చున్నారు. ఆయన యెదుట వధింపబడిన గొఱ్ఱెపిల్ల నిలువబడి ఉన్నదని వ్రాయబడి యున్నది. ఇది యింకను జరుగలేదు. మనము యెత్తబడినపుడది చూస్తాము. ఇవన్నియు ఈ నలుబది దినములు తలంచుకొని, చదువుకొని, వీలైతే వ్రాసికొంటే, ప్రభువు మిమ్మును చూచి చిరునవ్వు నవ్వును. ఆలాగు మనము ప్రభువును ఆదరించెదము. ప్రభువు మనలను ఆదరించును. పాపము చేసిన తరువాత పేతురు సంతాపపడి యేడ్చినట్లు కాదు గాని ప్రభువా! యీ గొప్ప పాపినైన నా మీద నీకెందు కింత ప్రేమ!యని మీరు జ్ఞాపకము చేసుకొని యీ కీర్తన పాడుకొనండి.

అట్టి కృతజ్ఞతానంద దీవెనలతో వరుడు మిమ్ములను ఈ గుడారములోనికి నడిపించుకొనును గాక! ఆమేన్.

***కీర్తన :*** *"ఎందుచేత యీ పాపిపై - యింత ప్రేమ యుండగలదో! = దెందము గ్రహింపలేదు - వందన మిమ్మాను యేలా!"* *॥నీకు॥*



# లెంటులోని మూడవ దినము - శుక్రవారము

## హృదయ పశ్చాత్తాపము

లూకా. 23:39-49.



**ప్రార్థన:- మా ప్రియమైన యేసూ! నీవు మా నిమిత్తము పొందు శ్రమలను ధ్యానించుటకై వచ్చినాము. మాకు ధ్యానము కుదురునట్లు చేయుము. సిలువనుండి వచ్చు భాగ్యములన్నీ మాకు దయచేయుము. ఆమేన్.**

గెత్సేమనే తోటలో ప్రభువు సాష్టాంగపడి, నేలమీద ప్రార్థించినారు. ఆయన మోకాళ్ళక్రింద దిండులేదు. ఆనుకొనుటకు కుర్చీలేదు. వట్టి నేలమీద నుండి ఆయన ప్రార్థించినారు.

యూదా పశ్చాత్తాపడెను. అయ్యో! నేను ప్రభువుని అప్పగించితినని విచారించెను గాని అతనిది నిజమైన భారమైతే అతడు ప్రభువు దగ్గరకు వెళ్ళి, పశ్చాత్తాప పడును గనుక అతని విచారము ఫలితములేని విచారము అయినది. గనుక లాభములేదు. అది ప్రభువు దగ్గర తప్పు ఒప్పుకొనని విచారము, ప్రభువు దగ్గరకు వెళ్ళని విచారమునై యున్నది. ***కుట్రదారులయొద్దకు వెళ్ళినాడు గాని ప్రభువు దగ్గరకు వెళ్ళలేదు. కనుక మీరు ఈలాగు ఉన్నారేమో పరీక్షించుకొనండి.*** యూదావలె యుండకూడదు గానీ ప్రభువు దగ్గరకు వెళ్ళవలెను. యూదా ఇస్కరియోతు ప్రభువు ప్రేమను మూడున్నర సం॥ల నుండి గ్రహించలేదు. గ్రహించినట్లైతే తప్పు ఒప్పుకొనును. అత్తరుపోసిన స్త్రీ పాపములు, ప్రభువు క్షమించుట చూచినాడు గాని గ్రహించగల్గిన మనస్సు లేనందున అతడు ప్రభువుయొద్దకు రావలెనని, ప్రభువు నా పాపము క్షమించునని అనుకొనలేక పోయినాడు. ఆలాగు అనుకొనలేకపోవుట కూడా పాపమే. నా బ్రతుకువల్ల ఏమి ప్రయోజనము లేదని అనుకొనుట పాపము. గనుక మనము, ప్రభువు క్షమించునని నమ్మి, ప్రార్థించి, క్షమాపణకోరి పొందినయెడల ధన్యులమగుదుము. గనుక మనము కూడా ఏడ్చి దుఃఖించి క్షమాపణ పొందవలెను. నేను విషము త్రాగి చనిపోతే మంచిది అని విసికిన యెడల అదికూడా యూదా లైనే (వరుసే). గనుక యూదా మార్గములోబడి వెళ్ళవద్దు. 'నాకు ఈ కష్టము పోవును, ఏదో ఒక కృప వచ్చునని స్తుతించుట' అనేది మనమును కలిగియుండవలెను. అలాగుననే ఎన్ని కష్టములు వచ్చినను, అవన్నీ మేలుకొరకై వచ్చుచున్నవి అని స్తుతించడమే కృప. నిరాశ అనేది మనిషికి రాకూడదు దానివల్ల నష్టమే కాని క్షేమము లేదు. యూదా పాపము ఏదనగా, నిరాశ పాపము.

Bible Mission HQ Guntur

యూదా స్వభావము పిరికితనము. యూదా జ్ఞానము యేసుప్రభువు యొక్క ప్రేమలోతును తెలిసికొనకపోవుటయే.

మనిషి గర్వము అణగగొట్టబడవలెనంటే యేసు ప్రభువుయొక్క సిలువను ధ్యానించవలెను. ప్రభువుయొక్క ప్రేమను గ్రహించకపోవడము యూదా రెండవ తప్పు. 'తాను చనిపోయి కీడు తప్పించుకొనవలెను' అని అనుకొని ఉరిపెట్టుకొని గొప్ప కీడు తెచ్చుకొనెను. ఆలాగే మనకు కష్టములు, కీడులు వచ్చినప్పుడు ఇతరులను చావమనడము, చావవలెనని విసుగుకొనటము మొదలగునవన్నీ పిశాచి పుట్టించు తలంపులే. అవి యూదా మార్గములోనికి వెళ్ళుటే. **విశ్వాసులైతే ప్రతి కష్టము నా మేలుకొరకే వచ్చెనని, కష్టము అనుభవిస్తే గొప్ప మహిమను పొందగలను అని సంతోషించుదురు.** యూదా పాపము నిరాశ అనే పాపము, పిరికియూదా యేసు ప్రేమయొక్క లోతును గ్రహించకపోయెను.

శ్రమలుపడు కష్టముకంటెను, నాకు కృతజ్ఞత లేకపోవుటే ఆయనకు మరీ కష్టము. ఆయన కష్టములలో యుండగా స్తుతిస్తే, ఆయనకు ఆదరణ కలిగి చిరునవ్వు నవ్వును. యేసుప్రభువా! నీ శ్రమ, నీ దయ, నీ ప్రేమ, నీ జయము నిజముగా మేము గ్రహించవలెను. నిన్ను స్తుతించుటకు, సిలువమీద నీవు చేసిన బోధనుబట్టి నిన్ను చూచిన యూదులు స్తుతిస్తే ఎంత బాగుండును! నిన్ను గ్రహించుటకు మాకు నేర్పించినందుకు వందనములు, నమస్కారములు, ముద్దులు. బల్లెముతో పొడుచుట ఆయనకు శ్రమకాదు గాని మన పాపములు గ్రహించక పోవడమే ఆయనకు గొప్ప శ్రమ. సిలువ దగ్గర మేము స్తుతిస్తే సైతాను సిగ్గుపడును. నీవు చాలా సంతోషిస్తావు. ఈ స్తుతులు అంగీకరించుము. ఆయన సిలువమ్రానుమీద మన కొరకు చేసిన పని, మనము గ్రహించడమే ఆయనకు కావలసిన ఆరాధన. *అందనిపండ్లు అందుకొనుటకు నిచ్చెన ఎక్కుట సహజమైయున్నది. దూరముగా నున్నవారిని చూచుటకు గుట్టెక్కుట సహజమైన సంగతి. నిచ్చెన ఎక్కుట మరియు గుట్టు ఎక్కుటలో భేధమున్నది.*

ప్రభువు సిలువ ఎక్కుట ఎందుకు? ఫలము అనే జయము కొరకు. తన శ్రమలద్వారా ప్రభువునకు జయము వచ్చినది. ఇది తలంచుచు స్తుతించుకొనవలెను. రెండవది: ప్రభువు జన్మించి 2004 సం॥లైనందున నీవు సంతోషమొందవలెను. ఈ కాలములో లోకాంతమువరకు ఎందరు జన్మించిరో వారందరి పాపముల కొరకు ఆయన సిలువ ఎక్కెను. ఆయన కాలములో పుట్టినవారు మాత్రమేగాక ఆదాము మొదలు లోకాంతము వరకు పుట్టిన వారి పాపములు తెలుసుకొనుటకు ఆయన తెలివితో సిలువ ఎక్కెను.

అనేకమందిలోనుండి సిలువ స్తోత్రములు వచ్చునట్లు చేసినందుకు స్తోత్రములు. లోకములో ఎందరు స్తుతులు చెల్లించుచున్నారో, ఆ స్తుతులతో మా స్తుతులు కలుపవలెనని కోరుచున్నాము. వధ్యస్తంభము అనగా యేసుక్రీస్తువారు వధించబడిన స్తంభము, సిలువ స్తంభము, ఆ స్తంభమును చూచుటకు ఎవరు విశ్వాసమును గట్టి పరచుకొందురో వారే ధన్యులు. నేను గొప్ప, నన్నే అందరు మెచ్చుకొనవలెను అను అహంభావమును, బడాయి, గర్వము, ఇతరులను లెక్కచేయని తనము ఇవన్నీ కలిగినవారు సిలువవైపుకు చూస్తే ఇవన్నీ పోవును, విశ్వాసము గట్టిపడును. అట్టి గర్వము అప్పుడప్పుడు వస్తూయుంటుంది గనుక కనిపెట్టి చూచుకొనవలెను.

1) 'తెలివిగలదానను, తెలివిగలవాడను' నేనే అనే స్వభావముండకూడదు, నా తండ్రి ధనికుడు, నాకంటె అధిక సౌందర్యవంతుడు, తెలివిగలవాడు గనుక నాకంటే గొప్పవాడు మరియొకడుండునని తలంచవలెను. ఎవడైనను గర్వించితే ఇద్దరు ముగ్గురు క్రిందపడవేసి కొట్టి, వాని గర్వము అణచుదురు. 2) గర్విష్టుని మాటలచేత నోరెత్తకుండా అణగగొట్టుదురు. 3) గర్విష్టుని, దేవుడే నీ గర్వము నణగ దొక్కునని అందురు. అట్టి వానికి ఏ వర్తకములోనో నష్టము వచ్చును. ***సిలువ మ్రానుమీద మన గర్వమంతా అణగద్రొక్కబడెను.*** ఆయన మన పాపముకొరకు పాపమాయెను (II కొరింథీ. 5:21). ఆయనను నేలమీద పడుకోబెట్టి, సిలువకు అంటకొట్టి, అప్పుడు సిలువను నిలువబెట్టిరి, మన గర్వమును, బడాయిని, అణగగొట్టుటకు ఆయన సిలువమీద అంటగొట్టబడెను. మన నిమిత్తమే ఆయన కొట్టబడెను. ఓ ప్రభువా! మా గర్వము, అతిశయించుట అనే పాపము, అవిశ్వాసము ఇవన్నియు నిన్ను సిలువకు అంటగొట్టెను. ఇవన్నీ మా పాపములే వాటన్నిటినీ మా నిమిత్తమై నీవు సహించుకొన్నందుకు నీకు వందనములు.

జాన్ బన్యన్ అనే పరమ భక్తుడు ఉండెడివాడు. ఆయన వ్రాసిన పుస్తకము 'యాత్రికుని ప్రయాణము' బైబిలు తరువాత గొప్పగా నెంచబడిన పుస్తకములలో అది ఒకటి. యాత్రికుడు ప్రయాణమై పోవుచు, తన వీపుమీద బరువుమూటతో, నాశన పురమునుండి సీయోను పురములోని సిలువ దగ్గరకు రాగా, వీపుమీది పాపపుమూట పడిపోయెను. మనము సిలువ దగ్గరకు రావడము మన పాపములు పోగొట్టుకొనుటకే. అట్టి ధన్యత సిలువనాథుడైన క్రీస్తు ప్రభువు నేడు మీకు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన :*** *"నా నేరములు యేసు-పైన వేసికొన్న- నీ నెనరునకు స్తోత్రము = నీకు - నేను చూపు ప్రేమ-నీ ప్రాణార్పణ ప్రేమ-నిధి ఎదుట ఏ మాత్రము!"* ॥మూడు॥

# లెంటులోని నాలుగవ దినము - శనివారము

## సిలువ నీడ

మత్తయి 16:1-28;



**ప్రార్థన:- ఓ దయగల తండ్రీ! మా హృదయ ధ్యానమును అంగీకరించి, మా బలహీనతలు అన్నియు నీకు బట్టబయలే గనుక వాటినన్నింటిని శుద్ధిచేసి, మమ్మును క్షమించుము. మా బలహీనతలు, పుండ్లు, నీరసము అన్నీ నీ పాద సన్నిధానములో, నీ అమూల్య రక్తముతో శుద్ధి చేయుము. నిన్ను స్తుతించుటకును, సిలువ ధ్యానము చేయుటకును మా హృదయములను శుద్ధిచేసి, నీ సిలువవైపుకు త్రిప్పుము. ఓ ప్రభువైన యేసూ! నా నిమిత్తము నీవు సిలువ ఎక్కినందుకు అనేక వందనములు, అనేక నమస్కారములు, ముద్దులు. నా నిమిత్తము నీవు సిలువ ఎక్కుట, నాకు ఎంత ధన్యత! ఎంత భాగ్యము! నీది ఎంత గొప్ప ప్రేమ! నేను చూచునట్లు నా ఆత్మ కన్నులను విప్పి, నాకును చూపుము. నీకు అనేక స్తోత్రములు. నీ రక్తము నా మీద ప్రవహింపజేయుచున్న రక్షకా! నీకు స్తోత్రము. భక్తితో నీ కథ గైకొనుభాగ్యము దయచేయుము ఆమేన్.**

*షరా:*- ఆలాగు గైకొనకుండిన పాపమే అగును. నీ ప్రేమ, నీ దయ, నీ జాలి, నీ మనస్సు, నీ ముఖ బింబమున గలదు. నీ ప్రభావంబెల్ల - నీ ప్రయాసములోనే - నెగడుచు గన్పడగలదు ॥ఏ పాప మెరుగనీ॥

సిలువధ్యానపరులారా! ఆయన సిలువ చరిత్రలోని కాంతి మీ మీద ప్రసరించును గాక. ఈ రోజు వాక్యమును నాలుగు మాటలలో చెప్పుదును. ఇందులో సిలువ చరిత్ర అంతయు ఇమిడి యున్నది. 1) సిలువ నీడ, 2) సిలువ సమీపము, 3) సిలువ మీద ఉండుట, 4) సిలువ మీది జయము. శ్రమలు బహుదూరములో, ఉన్నప్పుడే ఆయన తన శ్రమలయొక్క నీడను గుర్తించెను.

**వివరము:-** 1) సిలువయొక్క నీడ అనగానేమి? ఫిలిప్పుదైన కైసరయలో ప్రభువు ఉన్నారు. ఇది యెరూషలేమునకు ఉత్తరమున ఉండెను. అక్కడున్నప్పుడు ప్రభువు తాను పొందబోయే శ్రమలను ప్రవచించెను. తిరుగు ప్రయాణములో శిష్యులకు తన శ్రమలను గూర్చి తెలియజేసెను. వాటిని గూర్చి వారిని అడిగెను. తరువాత పాఠములో వాటి వివరమును ఆయన వారికి చెప్పనైయున్నాడు. 2) *సిలువ సమీపము:* బేతనియ అనే గ్రామములో బసచేసి, ఆఖరు వారములోని ప్రతి దినము యెరూషలేములో ఉండి,

Bible Mission HQ Guntur

సాయంకాలము బేతనియకు వస్తూ గడిపిన కాలము. దినములు గడిచినకొలది ఇక్కడ ప్రభువునకు సిలువ సమీపిస్తున్నది. 3) *సిలువమీద ఉండుట:* ప్రభువు సిలువమీద ఉండి, ఇదివరకు కైసరయలోను, బేతనియలోను పడిన శ్రమలను జ్ఞాపకము చేసికొని అనుభవించెను. అనుభవించుటకు ఏమీ వెనుకదీయలేదు. 4) సిలువమీద జయము అనగా సిలువ శ్రమలక్రింద ఆయన పడిపోలేదు గాని, వాటిని లేచి జయించినాడు. అందుచేత ఆయనకు మహిమ వచ్చినది. ***ఇది పునరుత్థాన మహిమ. దీనిని బట్టియే ఎత్తబడే మహిమ వచ్చినది.***

**పూర్తి వివరము:- *1. సిలువనీడ:*** అనగా మనకేదైనా కష్టము రాబోయేటప్పుడు ముందుగానే తెలియడము. కొందరికి ఇతరులు చెప్పటము వల్ల తెలియును. కొందరికి కలలోనో, దర్శనములోనో తెలియును. ***అప్పుడు అవిశ్వాసి అనగా అవిశ్వాసము గల విశ్వాసి అయితే హడిలిపోవును.*** ప్రభువు హడిలిపోలేదు. ప్రభువైతే యెరూషలేమునకు వెళ్ళుచున్నానని, ధైర్యముతోనే చెప్పెను. అవిశ్వాసి అయితే, నాకు ముందుకు ఒక దర్శనము రానైయున్నదని విచారముతో, భయముతో చెప్పవచ్చును. ఆలాగైతే మహిమ ఏలాగు పొందగలరు.

***2. సిలువ సమీపము:*** అనగా మనకు కలలో కనబడిన కష్టము, దగ్గరబడుట. అప్పుడు మరింత హడలిపోవుదుము. ప్రభువు అట్లు భయపడలేదు. పగలు త్వరత్వరగా బోధపని ముగించెను. ప్రతిరోజు బేతనియలో విశ్రాంతి పొందెను. *'మీకు ఒక శ్రమ రాబోవుచున్నది, కాచుకో!' అని ఎవరైనా అంటే విశ్వాస హృదయము ఎట్లుండునో! అది సమీపించింది అని అంటే ఇంకెట్లుండునో?*

***3.సిలువమీద ఉండుట:*** ఇది భయంకరమైనది. ఇది *శ్రమలను తలంచుకొనే* కాలము కాదు. అనుభవించేకాలము. సంతోషముతో క్రీస్తు వాటన్నిటిని అనుభవించెను. మనముకూడా అట్లే అనుభవించాలి.

***4. సిలువమీద జయము:*** సిలువ నీడను, సిలువ సమీపమును, కేవలము సిలువను అనగా సిలువ వేయబడుటను ప్రభువు అనుభవించినందున, పునరుత్థాన మహిమను పొందెను, ఎత్తబడెను. ***అట్లే సంఘముకూడా సంతోషముతో తన సిలువను భరించిన యెడల మహిమను పొందును, ఎత్తబడును.*** ఎత్తబడే వారందరు సిలువయొక్క నీడను, సిలువయొక్క సమీపమును, కేవలము సిలువను అనుభవించుటకు వెనుక తీయకూడదు. క్రీస్తు మహిమలో పాలు కోరితే, శ్రమలోకూడా పాలుకోరవలెను గదా!

**స్తుతి:** 1. గత కాలమందు మనకు కలిగిన శ్రమలను, ఆ శ్రమలలో కలిగిన అనుభవమును, శ్రమ తరువాత కలిగిన జయమును తలంచుకొని స్తుతించవలెను. 2. రాబోయే శ్రమలను తలంచుకొని స్తుతించవలెను. **అట్టి శ్రమలలో నూతన విశ్వాసము, నూతన ధైర్యము, నూతన జ్ఞానము, నూతన సహవాస భాగ్యము కలుగునని మరియవలెను.** 3. 'నిజముగా జయము కలిగిన తరువాత అప్పుడు తండ్రిని మరెక్కువగా స్తుతించెదను' అనుకొని, ముందుగనే స్తుతించవలెను. కళ్ళ అద్దములు పెట్టుకొనకుండా చదువబోతే, అక్షరాలు మసకగా కనబడును. పెట్టుకొని చదివితే మసకగా కనబడవు. గాని అక్షరములు తేటగా కనబడును. అట్లే మన సిలువను ప్రభువుయొక్క సిలువలో నుండి చూస్తే, బాగా ఉండును గాని కష్టముగా నుండదు. అద్దములో నుంచి చూస్తే బాగానే ఉండును. అద్దము లేకుండా చూస్తే కళ్ళు లాక్కొని పోవును.

షరా:- **ప్రతి కష్టమును మనము ప్రభువుయొక్క సిలువలో నుంచి చూడడము. అలవాటు చేసికొనవలెను.** అప్పుడు నిరాశ కలుగదు. జయము కలుగును. మరియు ప్రభువునకు శ్రమలు కలిగినట్లు, సంఘమునకును శ్రమలు కలుగును. అప్పుడు ప్రభువునకు కలిగినట్లు, ఆరోహణ మహిమ మనకును కలుగును.

అట్టి స్థితిలో ప్రభువు మిమ్ములను ఈ వాక్యము ద్వారా స్థిరపర్చునుగాక! ఆమేన్.

***కీర్తన :*** *" సిలువ దరి కాకర్షించుము - ఖలుడను ఘోరపాపిని = కలుషములు విడ శక్తినీయుము - సిలువ ధ్యానమున"* *॥కల్వరి॥*



# లెంటులోని మొదటి ఆదివారము

## వధ్య స్తంభము

***"ఇదిగో మనము యెరూషలేమునకు వెళ్ళుచున్నాము" మార్కు 10:32-34.***



**ప్రార్థన:- తండ్రీ, మా నిమిత్తమై వధింపబడిన తండ్రీ, నీకు నమస్కారములు. మా కొరకు వ్రేలాడిన నీ రూపమును చూచి మా పాపపు బ్రతుకు చాలించుకొను కృప దయచేయుము. నేటి దిన సిలువధ్యానమును మా అంతరంగములకు మార్పు కలిగించునట్లుగా చేయుమని యేసునామమున అడుగుచున్నాము. ఆమేన్.**

యేసుప్రభువు పలుమారులు యెరూషలేమునకు వెళ్ళుచున్నారు. వెళ్లినప్పుడెల్ల ఏదో ఒక గొప్ప కార్యము చేయుచుండెను. యెరూషలేము గొప్ప రాజులు ఏలిన పట్టణము. మన ప్రభువు తెచ్చిన గొప్ప రక్షణ కార్యము అక్కడనే జరిగినది. నజరేతులో నుండి ఏ మంచి రాదన్నారు గాని మన ప్రభువు పుణ్య పురుషుడు గనుక ఆయన అచ్చటనే పెరిగినాడు. యొర్దాను నదిలో మన ప్రభువు బాప్తిస్మము పొందినారు. యెరూషలేములో మన ప్రభువు అనేక పుణ్యకార్యములు చేసినారు. మొదటిసారి యెరూషలేమునకు యేసును తీసికొని వెళ్ళినప్పుడు, సుమెయోను మరియమ్మతో చెప్పినది: నీ కడుపులోనుండి ఖడ్గము దూసికొనిపోవును. సుమెయోను యేసుప్రభువుని చూచిన తరువాత తన బ్రతుకు చాలించుకున్నాడు. మనము మన ప్రభువుని మొదటి సారి చూచి, మన పాపపు బ్రతుకు చాలించుకున్నామా? యేసుప్రభువు ఎక్కడుండవలెనో అనగా ఎచ్చట అవసరమో అచ్చటనున్నారు. దేవుని కుమారుడు దేవుని ఆలయములోనే ఉంటాడు. యేసుప్రభువు కొరడాతో దేవాలయములోని వర్తకమంతటిని పారదోలెను. మనము మన బిడ్డలందరిని ఎంత ప్రేమించినను, వారిలో తప్పు కనబడగా వారిపైని బెత్తము వాడుదుము. ఈ సిలువ ధ్యాన కాలములో మన పై **రూపముకాదు, హృదయమును మార్చుకోవలెను.** ప్రభువునందు మనము విశ్వాసముంచుకొన్నట్లైతే, మనము మన చిక్కులలోనుండి, శ్రమలలోనుండి తిరిగిలేతుము, మహిమను పొందుదుము. ఆయన మహిమ ఎదుట ***'ఈ లోకపు బ్రతుకు ఒక నిమిషముకూడా సరిపోదు' అని భక్తులైన వారు అనిరి.*** ఈ లోకపు బ్రతుకు నీడవలె గతించిపోవును. గొంగళి పురుగు సీతాకొక చిలుకగా మారుట; గొంగళి పురుగు, మనలోని చెత్త చెదారము అనగా పాత జీవితమునకు అనగా ఇహలోక జీవితముతో సమానము. సీతాకోక చిలుక పరలోక జీవితమునకు అనగా మహిమ జీవితమునకు సాదృశ్యముగా ఉన్నది.

Bible Mission HQ Guntur

సిలువ వేయబడుట ద్వారా మనకు రక్షణ వచ్చియున్నది. సిలువ అనగా కొరత లేక వధ్య స్థంభము. 1) క్రిస్మసు (క్రీస్తు జన్మదినము), 2) మంచి శుక్రవారము (క్రీస్తు చనిపోయి రక్షణ ఇచ్చిన దినము, మంచి దినము, మహాదినము), 3) ఈస్టరు (క్రీస్తు మరణము నుండి లేచిన దినము), 4) పెంతెకొస్తు (సంఘస్థాపన దినము– పరిశుద్ధాత్మ కుమ్మరించబడిన దినము. సిలువ నిమిత్తము అనేకులు సిగ్గుపడుచున్నారు. అయితే సిలువవల్లనే రక్షణ వచ్చినది. గాన సిలువను గూర్చి సిగ్గుపడకూడదు. సిలువ అనగా కొయ్య. అవిశ్వాసులకు ఇది వెర్రితనముగా కనబడును గాని విశ్వాసులకు ఇది తాళము చెవి. మోక్షములో చేరుటకు ఇది తాళము చెవి అని చెప్పవచ్చును. 1) దినమును గూర్చిన చేదస్థము విడచిపెట్టవలెను. 2) బైబిలులో లేదనే చేదస్థము విడచిపెట్టవలెను.

యేసుప్రభువును అంగీకరించినవారు ఆయనను దేవుడన్నారు. యూదులను కుట్రచేసిన సంఘమన వచ్చును. ఈ దినములలో అనేకులు కుట్రదారులు బైలుదేరిరి. వారి విషయమై క్షమించి, ప్రార్ధనలు చేయవలెను. స్వంత శిష్యుడే ఆయనను అప్పగించినాడు. స్వామి ద్రోహియైనాడు.

ఈనాడు అనేకులు పేరుకు క్రైస్తవులు, చేతిలో బైబిలు గాని క్రియలు సాతాను క్రియలు– వీరే స్వామి ద్రోహులు. 1) దేవుడు మనలను జ్ఞానవంతులనుచేస్తే, మనము అజ్ఞానముగా చేస్తున్నాము. 2) దేవుడు మనలను పరిశుద్ధులనుగా చేసినాడు, మనము అపరిశుద్ధత చేస్తున్నాము. 3) **దేవుడు శక్తిమంతులను చేస్తే, మనము నిస్సత్తువ కలిగించుచున్నాము.** 4) దేవుడు మనలను స్వతంత్రులనుగా చేసినాడు, మనము బానిసలవుతున్నాము. 5) దేవుడు మనకు క్రీస్తు సిలువమీద చనిపోవుట ద్వారా రక్షణ ఇచ్చియున్నాడు. ఈ మంచి శుక్రవారము మన బ్రతుకులో చాలా సంతోషించు–చుండవలెను. ***'నాకు విమోచనము దొరికింది'*** అని ఆనందించవలెను. క్రొవ్విన దూడలు గంతులువేసినట్లు స్తోత్రములు చేయవలెను.

అట్లే సిలువలోని విమోచన అందుకొని ఆయనను స్తుతించు ధన్యత ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

***కీర్తన :*** *"నా ఋణము తీర్చిన – నా దేవా! నా ప్రభువా! – నీ ఋణము తీర్చ గలనా =*
*నీవు – నా ఋషివై బోధించి – నా బదులు చనిపోయి–నావని మరువ గలనా"*

*//మూడు//*

# లెంటులోని ఐదవ దినము - సోమవారము

## సిలువ యందలి విశ్వాసము - విశ్రాంతి

గలతీ. 2:17-21.



**ప్రార్థన:- నా నిమిత్తమై సిలువ శ్రమను అనుభవించిన తండ్రీ! నీకు స్తోత్రములు. నీ శ్రమను నమ్ముటద్వారా మాకు విశ్రాంతి కలుగును, విమోచన దొరుకును. అట్టి విశ్రాంతిని, విమోచనను కల్గించుటకు నీ వర్తమానమిమ్ము. వందనములు. ఆమేన్.**

ఈ వాక్యములో ఏమున్నదనగా, 'క్రీస్తుతోకూడా నేను సిలువ వేయబడినాను'. ఇంకను ప్రభువైన యేసు తనకు తానే సిలువ మరణమునకు అప్పగించుకొనడము ఉన్నది. 1. ఈ దినము ప్రభువునకు శ్రమ దినము. మనకు సంతోష దినము. 2. మనము కృతజ్ఞత చూపించే దినము. సంతోషముతో వందనములు ఆచరించే దినము.

ఈ దినము సంతోష దినముగాని దుఃఖ దినముకాదు. ఇది ప్రభువుకు బాధకరమై యుండెను గాని మనకు బాధ తీసివేసే దినమైయుండెను. ఈ దినము యేసుప్రభువు చూపిన ప్రేమ నిమిత్తమై స్తుతి చేసే దినము. పరిశుద్ధ లోకములో పాపము ప్రవేశించినది. పాపమువల్ల వ్యాధి వచ్చినది. వ్యాధివలన బాధ వచ్చినది. బాధవల్ల మరణము వచ్చినది. తరువాత నరకము వచ్చినది. దీనికే రెండవ మరణమని, నిత్య నరకమని పేరు. పాపమువల్ల సిగ్గు వచ్చినది. భయము వచ్చినది. సిగ్గువల్ల దాగుకొనుట, భయము వల్ల దాగొనుట, దేవునికి దూరమై పోయినాము అనే చింత కల్గుట. దేవునికి దూరమై పోవుటకూడా మరణమే. ఇది గొప్ప మరణము. ఇదే ఆత్మీయ మరణము. పాపమువల్ల నేరము మోపుట వచ్చినది. సిగ్గు, భయము, వ్యాధి మొదలైన పాప ఫలితములు వచ్చినవి. పాపమువల్ల భూమి శపింపబడినది. ముండ్ల పొదలు గుచ్చుకొంటున్నవి. శాపమువల్ల పంట పండకపోవుటనుబట్టి, కరువు కలుగును. తెలియక అడుగేస్తే ముల్లు గుచ్చుకొనును. ఇది అజ్ఞానము. ఒక్కొక్కసారి తెలిసికూడ అజాగ్రత్తగానుందుము. ఇదికూడ పాపఫలితమే.

ప్రేమకు బదులు కోపము. శక్తికి బదులు బలహీనత, పరిశుద్ధతకు బదులు పాపము, శుభ్రతకు బదులు అనాగరికత, జ్ఞానమునకు బదులు అజ్ఞానము (అజాగ్రత్త), జీవమునకు బదులు మరణము, స్వతంత్రతకు బదులు విచ్చలవిడిగా తిరిగి మతి

Bible Mission HQ Guntur

చెడిపోవుట మరియు అవిధేయత; **_పైవన్ని పాపము వలన వచ్చినవి. గాని చివరకు ఇవే పాపములైపోయినవి._** జ్ఞానముయొక్క కళ తగ్గినందువల్లనే మనము బైబిలు చదువుచున్నాము గాని సరిగా గ్రహించలేక పోవుచున్నాము. మన శక్తికి కళ తగ్గినందున పెద్దపులి వస్తే పారిపోతున్నాము. మన పరిశుద్ధతలో కళ తగ్గినందున పాపములో పడుతూ, లేస్తూ, ఒప్పుకొంటూన్నాము. నిలకడైన పరిశుద్ధత లేదు. మన జీవములో కళ తగ్గినందున, మన కాలములో ఎక్కువ సంవత్సరములు జీవించలేక పోవుచున్నాము. **_మన స్వతంత్రతకు కళ తగ్గినందున విచ్చలవిడిగా నుండి చెడిపోవుచున్నాము._** షరా: పాపము దేవుని ఆజ్ఞను అతిక్రమించుటవలన వచ్చెను. ఒక పాపమువల్ల ఇంకొక పాపము ఏలాగు పుట్టునో, ఆలాగే ఒక నష్టమువల్ల ఇంకొక నష్టము పుట్టును. పాపమువలన నష్టము రావడము మాత్రమే కాదు, రావలసిన మేలు రాదు. ఇవన్ని ఆయన సిలువ మ్రానుమీద వేసికొనెను. ఇవన్నియు ప్రభువు సిలువమ్రానుమీద మోసినాడు. ఇవన్నియు ప్రభువు సిలువమ్రాను మీద మోసినాడని పూర్తిగా నమ్మలేము గనుక ఇదే అపనమ్మిక. ఇది పాపమువలన వచ్చినది. ఒక చిన్నవాడు బూడిదలోనున్నాడు. కడుగబడిన తరువాత మరలా బూడిదలోనికి వెళ్ళాడు. ఆలాగే మానవుడు పాపము మానివేసి, మరల పాపములోనికి వెళ్తాడు. పాపమువల్ల నరకము వస్తుంది లేదా పెండ్లికుమార్తె వరుస తప్పిపోతుంది అని భయపడి, పాపము మానివేస్తామనే పిరికి వారికి హానిలేని రక్షణ ఉన్నది. **_రక్షణ కొరకు ఆశించి పాపము మాని వేస్తే మంచిదేగాని అందునుబట్టి వారికి రక్షణ ఉండదు. ప్రభువు మీద ఆనుకొంటే రక్షణగాని ఒక మంచి కార్యము మీద ఆనుకొంటే రక్షణరాదు._**

1. సిలువను నమ్మాలి. నా మీదనున్న దంతా ఆయన సిలువమీద వేసికొన్నాడు. నా బాధలన్ని తీసివేసినాడు. 2. తన పునరుత్థానమువల్ల మేళ్లన్నీ ఇచ్చినాడు, మరణము యొక్క ముల్లు తీసివేసినాడు. ఆత్మకు హానిరాకుండా దుష్ట ఫలితములన్నిటి ముల్లు తీసివేసినాడు. జబ్బుపైకి ఉన్ననూ, అది ఆయన ప్రేమే. విశ్వాసులకు కష్టములువస్తే అవి ప్రభువు ఉంచివేయును గాని వాటిముల్లు తీసివేయును. అనగా ఆపదలవల్ల ఆత్మకు నష్టము కలుగకుండా కాపాడును. దేవుని లక్షణములు ప్రేమ, న్యాయము. ఆయన ప్రేమక్రింద నిలబడితే, అంతములేని నరకమును తీసివేయును. ఆయన గుణములు అంతము లేనివి. మంచి శుక్రవారమునకు ఇతరపేర్లు. 1) మహాయజ్ఞ దినము, 2) ప్రాయశ్చిత్త దినము. శుక్రవారమునకు 'మంచి శుక్రవారమని' సంఘము

పేరుపెట్టినది గాని, బైబిలులోని పేరు ఏదనగా **"కడు ప్రాయశ్చిత్త దినము".** అనగా 1) మనము పొందవలసిన శిక్షను ప్రభువు పొందిన దినము. 2) బలిదినమున యూదులు గొర్రెపిల్లను సిలువవేసినారు. దేవుడు తన కుమారుని బలివేసినాడు. 3) సిలువ అనే పేరు బైబిలులో లేదు. అది అరవ దేశముండి వచ్చిన మాటగా తెలుగు బైబిలులో ఉన్నది. తెలుగు భాషలో 'కొరత వేయుట' అనే మరియొక పేరున్నది. అనగా సిలువకు వధ్య స్థంభము లేదా కొరతవేయుట అని పేరు. యూదులు ఈ రోజున పండుగ చేస్తారు. గొర్రెపిల్లను బలివేస్తారు. తమ పాపములన్నియూ ఆ గొర్రెపిల్ల మీద వేసినాము గదా! అని ప్రాయశ్చిత్త పండుగ, బలిపండుగ జరిపిస్తారు. ఈ ఒక్కరోజే సంవత్సరము అంతటిలో దేవునికి విశ్రాంతి రోజు. ఎందుకంటే **ఈ దినము పిశాచి మనమీద చాడీలు చెప్పదు.** ఈ దినము మన మంచిశుక్రవారముతో సమానమైయున్నది. వారు ఒక మాట అనుచున్నారు. ఈ వేళ దేవునికి విశ్రాంతి. దేవుడెవరినిగూర్చి చాడీలు వినడు. సిలువమీద వేయబడిన వారెవరో, అందరు ఆ సిలువమీద కొరత వేయబడిన వానినే ఆశ్రయించవలెను. సిలువమీద ఆయన రక్తము ఎవరికొరకు ధారపోయబడెను? అందరి నిమిత్తమే గాని విశ్వాసులు మాత్రమే దానిని నమ్ముచున్నారు. ఆ సిలువ మీది రక్తము తన చేత కార్చబడెనని అపవాది తన సైన్యములోని వారిని ప్రేరేపించును. అవి మనిషి దగ్గరకు వచ్చి మనిషిలో ఉన్న దుష్ట నైజమును ప్రేరేపించును. గనుక దుష్ట నైజముగలవారు ఆయన సిలువను ఒప్పుకొనరు. గనుక ఈ సిలువ ధ్యానకాలములో మన దుష్టనైజమును సిలువ వేసికొనవలెను.

అట్టి ధన్యత నేడు సిలువ నాథుడైన క్రీస్తు ప్రభువు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన :*** *"సిలువను దరచి – తరచితి –విలువ కందగ రాని నీ కృప = కలుష మెల్లను బాపగ జాలును రా"* *॥ నీ సిలువే॥*





# లెంటులోని ఆరవ దినము - మంగళ వారము

**సిలువయొక్క బహిరంగ చరిత్ర**

యోహాను 19:1-30.



**ప్రార్థన:- మా నిమిత్తమై రక్తము కార్చిన తండ్రీ! నీవు పొందిన శ్రమను ఎవరూ ఎన్నడూ అనుభవించలేదు. నీ సిలువ చరిత్రలోని ప్రతి అంశమూ మా మేలుకొరకై యున్నది గనుక అట్టి ధ్యానమును నేడు మాకు దయచేయుము. ఆమేన్.**

ప్రభువు మనకొరకు అనుభవించిన శ్రమలే ఈ సిలువ చరిత్ర. యేసుప్రభువు పొందిన శ్రమలకంటే ఎక్కువైన శ్రమలెవరైనా పొందినారా? లేదు. ఈ లోకమంతటి కొరకు ఆయన శ్రమ పొందెను. గనుక ఆయనకు ఎక్కువ శ్రమ. క్రీస్తు పొందిన శ్రమ ఎప్పుడును ఎవరును పొందలేదు, పొందలేరు. **పుట్టిన, పుట్టబోవు వారి పాపముల కొరకైన శ్రమలను కూడ ఆయన అక్కడ అప్పుడే అనుభవించినాడు.**

***కొండమీద ఉన్న నాలుగు గుంపులు:***

1. గవర్నమెంటు గుంపు, 2. శత్రువుల గుంపు, 3. విశ్వాసుల గుంపు, 4. నేరస్థుల గుంపు. సిలువయొద్ద మన కథ అంతా తీర్మానం మీదే ఆధారపడి యున్నది. ఇదే రక్షణ దినము గనుక సిలువ చరిత్ర గొప్పది. మనలోనున్న పాపములన్నీ, సిలువమీద నున్న ఆయన తీసివేసినాడు గనుక కలువరి సిలువయొద్దకు వచ్చినప్పుడు విశ్వాసికి ఆనందము, శాంతి, మోక్షము కలుగును.

నీలకంఠగోరే అనే పండితుడు 4 సువార్తలు చదివినప్పటికిని, క్రీస్తు దేవుడుకాదు భక్తుడు అని బోధించినాడు. ఒకసారి మనస్సు పుట్టి మరలా 4 సువార్తలు చదివి, సిలువ చరిత్ర యొద్దకు వెళ్ళే సరికి, చదువుట మాని "ఇప్పుడు నేను తెలుసుకున్నాను, తెలిసిపోయింది. ఈయన దేవుడు. దేవుడు కాకపోతే ఇంత శ్రమ అనుభవించలేడు. దేవుడు గనుకనే ఇంత శాంతముగా అనుభవించినారు. గనుకనే అందరి పాపములు క్షమించినాడు. గనుక అందరికి యేసు ప్రభువే దేవుడని" నమ్మి, బాప్తిస్మము పొంది నెహెమ్యా నీలకంఠగోరేగా పేరు మార్చుకొని, హిందూ మతములో నుండి క్రీస్తు మతములోనికి వచ్చెను. క్రీస్తు ప్రభువును సిలువ వేయుటేలాగు అనగా- సిలువను పరుండబెట్టి, ఆయనను దానిపై పరుండబెట్టి, మేకులతో కొట్టి, తరువాత సిలువను ముందుగా తీసిన గోతిలో పాతిపెట్టిరి.

Bible Mission HQ Guntur

యేసుప్రభువును సిలువపై పరుండబెట్టి కుడిచేతిలోను, ఎడమ చేతిలోను, మేకులుపెట్టి సుత్తెతో కొట్టినారు. అలాగే రెండు కాళ్ళు అనగా రెండు పాదములు ఒక దానిపైని మరియొకటి పెట్టి ఒక మేకును ఉంచి, సుత్తెతో కొట్టినారు. అప్పుడు చిమ్మెట గొట్టమునుండి నీరు ప్రవహించినట్లుగా ఆయన రక్తము చిందినది. అందుకే భక్తులు ఆయన రక్తము చిందించినాడు అని వ్రాసినారు. ఇది నేలమీద పరుండియున్నప్పుడు జరిగిన సంగతి. పిదప ముందుగా తీసిన గోతిలో ఆ సిలువను వేసి పాతిపెట్టిరి. తరువాత వారు నిచ్చెన వేసి, ముండ్ల కిరీటము తెచ్చి, ఆయన శిరస్సుపైన వేసి అదిమిరి. అప్పుడు రక్తము కాళ్ళవరకు కారినది. ముండ్ల కిరీటము అనగా మేకుల కిరీటము.

**చేతులలో రక్తము:–** ఆయన చేతులలో మేకులతో కొట్టినప్పుడు మరింత బాధ. మేకులతో చేసిన కిరీటము ఆయన శిరస్సుమీద అదమగా మరింత బాధ కలిగెను. అదంతయు మన పాపమును బట్టి కలిగినా, మనమీదనున్న ప్రేమనుబట్టి ఆయన అంతయు ఓర్చుకొనెను.

**పాదములలో రక్తము:** పాదములలో మేకులను కొట్టినప్పుడు దుర్జనులకు ఏలాగు మనస్సు కరగలేదో, అలాగే నేటి కాలములో సిలువనుగూర్చి విని, మారని వారుకూడా క్రీస్తును బాధించుచున్నవారే. ఆనాటి దుర్జనుల హృదయము కరగలేదు. పాదములనుండి రక్తము, శిరస్సునుండి రక్తము కారుట చేత, ఆయన రక్తమయమై పోయినప్పటికిని, వారి మనస్సు కరుగక ఒక రాణువవాడు బల్లెముతో ప్రభువు ప్రక్కలో పొడిచెను గాన రక్తము ప్రవహించెను.

తల్లి ప్రక్కను పరుండియున్న బిడ్డను జ్ఞాపకము తెచ్చుకొనండి: మనుష్యులు దేవుని ప్రక్కను, క్రీస్తు ప్రక్కను చేరియుంటే క్రీస్తుకు ఎంతో ఇష్టము గాని మానవుడు దేవునిని విడిచి సైతాను ప్రక్కకు చేరి యున్నందున ఆయన తన ప్రక్కలో బల్లెపు పోటు పొడిపించుకొనెను. రక్తము మాత్రమే కాదు గాని అందులోనుండి నీళ్ళుకూడా ప్రవహించెను. బల్లెముపోటు పొడిచినప్పుడు నీరు కారెను.

**నీరు ఎందుకు కారెను:** ఆయన మనస్సులో ఎక్కువ దుఃఖము ఉన్నది. తన జీవితము పొడుగున ఆయనకు దుఃఖమే యున్నది, 33 1/2 సం॥లనుండి యున్నది. సిలువ మ్రానుమీద నున్నప్పుడు మరి ఎక్కువగా యున్నది. తన మరణమును గూర్చికాదు గాని మనస్సులో మరొక దుఃఖము కలదు. ఏమిటంటే వీరిని ఇంతగా

ప్రేమించితే ఎందుకు ఇలా ద్వేషిస్తున్నారు! వీరే కాదు, లోకమంతా ఇంతగా చెడిపోయిందనే దుఃఖము. ఆయన మనసులో గలదు.

గెత్సేమనే తోటలో ఆయన పొందిన విచారము సాధారణ విచారము కాదుగాని ఆయనకు ఆ శ్రమలో రక్తపు చెమట కారినది. బల్లెపు పోటు పొడిచినప్పుడు రక్తమే రావలెను గాని నీరు రాకూడదు. **అక్కడ రక్తపు చెమట పట్టకూడదు. సిలువపై నీరు రాకూడదు.** ఎక్కువ దుఃఖమువల్ల ఆయన రక్తము కరిగిపోయినది. అనగా క్రీస్తు గుండె నీరైపోయింది. *ప్రజలందరికొరకు దుఃఖ పడుచుండగా రక్తము కరిగి నీరుగా ప్రవహించినది.* గనుక సిలువపైన వ్రేలాడు యేసుప్రభువునకు నమస్కరించవలెను. **చేతులతోకాదు, హృదయముతో, ఆనందముతో నమస్కరించవలెను.** యేసుప్రభువు ఈలోకములో ఉన్నప్పుడు ఎవరినిగూర్చి ఆలోచించుచుండెననగా 'మానవులందరి కొరకును' కేవలము మనిషి తలంపులే అనగా మనిషిని రక్షింపవలెననే తలంపే ఆయనకున్నది.

1) ఆయన మనుష్యులకు ఏమి కీడు తలంచినాడని మేకుల కిరీటం అదిమినారు? ఆయన ఏమైన కీడు చేసినాడా? మనలను గూర్చి ప్రార్థనలు, మంచి ఆలోచనలు, మంచి ఉద్దేశములు కలిగియున్నాడు. మనమైతే, శిరస్సులో చెడ్డగా ఆలోచించుదుము. అందుచేత మనకు బదులుగా ఆయన తన శిరస్సులో మేకుల కిరీటము పొంది శ్రమ పొందెను.

2) ఆయన తన రెండు చేతులతో చిన్న పిల్లలను ఆశీర్వదించెను. ఆ చేతులకు మేకులు కొట్టినారు. 5000 మందిని ఏ రెండు చేతులతో దీవించినారో, ఆ రెండు చేతులకు గాయములు చేసినారు.

3) ఆయన పాదములతో వారి దేవాలయమునకు వెళ్ళి బోధించినారు. వారి సంత వీధులకు వెళ్ళి బోధించినాడు. వారి పండుగలకు నడిచి వెళ్ళి బోధించినాడు. పాపుల ఇంటికి వెళ్ళి బోధించినాడు. భక్తుల ఇండ్లకు నడిచివెళ్ళి బోధించినాడు గానీ మనము పాదములతో చేసిన మన పాపములకు ఆయన గాయములు పొందెను.

4) ఆయన ప్రక్కలో బల్లెము పోటు ఎందుకు పొందెను? (1) 'నా యొద్దకు వచ్చే వానిని నేనెంత మాత్రమును త్రోసివేయను'. ఇది ప్రభువు యొక్క ఆహ్వానము. (2) ప్రయాసపడి పాపభారములు మోసికొనుచున్నవారలారా! నాయొద్దకు రండి, ఇది రెండవ ఆహ్వానము. ఆయనను న్యాయము చొప్పున బల్లెపు పోటు పొడవకూడదు. కానీ మనమాయన దరిని చేరుటకు ఆ గాయము పొందెను. ఆయన కేవలము ఉపకారము

చేసినప్పటికిని, ఆయన అవయములతో అపకారము చేయక పోయినప్పటికిని, దుర్జనులు ఆయనకు కేవలము **అపకారమే చేసినారు.** పరలోకమునుండి భూలోకమునకు, నిన్ను స్వస్థపర్చుటకు వైద్యుడుగా దిగివచ్చిన, ఆయన నన్ను బాగుచేసి యున్నాడని నమ్ముము.

**ఉదా:-** గ్రుడ్డివాడు డాక్టరు దగ్గరకు మందు కొరకు వెళ్ళితే, ఈ మందు వేసికొంటే బాగుపడుదువని డాక్టర్ గారు చెప్పితే "ముందే బాగుచేయండి, అప్పుడు మందు వేసికొంటానని" చెప్పడుగదా! గనుక విశ్వాసము అనగా ఏదిలేదో, అది యున్నదని నమ్మండి! ఏది చూడలేదో అది చూచియున్నామని నమ్మండి! ***బాగుపడకపోయినను బాగుపడినట్లుగా నమ్ముటే విశ్వాసము.*** యేసుప్రభువు మిమ్మును బాగుచేసియున్నాడని నమ్ముచున్నారా? అలాగైతే దేవునికి స్తోత్రము చేయండి. కీర్తన. 'దేవా తండ్రీ నీకు... స్తోత్రములు. అందరు ఆయనను స్తుతించండి.

ప్రభువైన యేసురక్తము మిమ్మును స్వస్థపర్చునుగాక! ప్రభువుయొక్క మితిలేని ప్రేమద్వారా మీ శరీరమునకు ఆరోగ్యమును, స్వస్థతయును, మీ ఆత్మకు శాంతియు, ఆనందమును కలుగును గాక! ఆమేన్.

***కీర్తన :*** *1) "రక్తంబు నాపైకి - ప్రవహించుచున్నది - రక్షకా నీకు స్తోత్రం = భక్తితో ఈ కథ - భాగ్యంబు గైకొను-భాగ్యమిమ్ము స్తోత్రము"*

*2) "నీ ప్రేమ నీ దయ - నీ జాలి నీ మనసు - నీ ముఖ బింబమున గలదు = నీ ప్రభావంబెల్ల - నీ ప్రయాసములోనే - నెగడుచు గన్పడ గలదు"*

# లెంటులోని ఏడవ దినము - బుధవారము

## సిలువలోని నీతిసూర్యుడు - సంఘుపుష్పము

తండ్రి: ఆది. 18:28; కుమార: మత్తయి 24:32; పరిశుద్ధాత్మ: రోమా 8:1.



**ప్రార్ధన:- యేసుప్రభువా! నీవు చేసిన ఉచిత అంశమును ధ్యానించునట్లు సహాయము చేయుము. నీ శ్రమ చరిత్ర ఆరంభ దినములో ఉన్నాము. ఇంత వరకు నీ సేవా చరిత్ర విన్నాము. ఇప్పుడు నీ శ్రమచరిత్ర ద్వారా మా విశ్వాసమును వృద్ధి చేయుమని అడుగుచున్నాము. ఆమెన్.**

ప్రభువు చరిత్రలో వాగ్ధానములు, ప్రసంగములు, చరిత్రకూడ ఉన్నది. ఆయన యూదాజన మతాచారముల ప్రకారము నడుచుట ఉన్నది. 1) వాగ్ధానము, 2) ప్రసంగము, 3) చరిత్ర, 4) ఆచారములు. ప్రభువు సంఘానికి పైవాటిని, స్వతంత్రతను బట్టి వాడుకొనుటకు ఇచ్చెను. పై నాల్గింటిని మాత్రమేకాక, స్వతంత్రతనుబట్టి కూడ సత్యమును ఆచరింపజేసెను. ***'సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయును'*** అనెను. ***అనగా సంగతి తెలిసికున్న తరువాత స్వతంత్రముగా ఆ సత్యములో నడుచుకొనవచ్చునని అర్ధము.***

ఏదేనులో చెట్లువేసి తినండి, తినవద్దని చెప్పుట దేవునిపనియై యున్నది. అట్లు చేయుట నరుని స్వతంత్రత. తినుటలో నరుని ఇష్టమును, స్వతంత్రతనుబట్టి ఎన్నైనను తినవచ్చును గనుక స్వతంత్రత ఆదిలోనే ఉన్నది. స్వతంత్రతనుబట్టి పై నాల్గింటిని సంఘుమేర్పర్చుకొనెను. ఎందుకిట్లు ఏర్పర్చుకొన్నారని ప్రభువు అనరు గాని వాటినిబట్టి సంతోషించుట సంఘుము యొక్క పని. ఆచార ప్రకారము ఆత్మీయ క్రమమును ఏర్పర్చుకొని చేసికొనినప్పుడు, దేవుడు ఆటంకము చేయడు. పై నాల్గును దేవుడిచ్చినవి అని చేయునప్పుడు, అవి బైబిలుకు వ్యతిరేకముగా ఉండకూడదు. భూలోక సంఘుములో నీతి సూర్యుడు ప్రకాశించు చున్నాడు, ***ఆకాశములోని సూర్యునిబట్టి కాలములు అనేవి జరుగుచున్నట్లు, క్రీస్తును బట్టి సంఘుములో ఆచారములు, పండుగల కార్యక్రమములు జరుగుచున్నవి.*** పొద్దు తిరుగుడుపువ్వు మూడు పూటలు సూర్యుని అనుసరించి తిరుగుచున్నది. భూలోక సూర్యునిబట్టి, ఆ పువ్వు సూర్యుడు ప్రకాశించు వైపునకే చూచినట్లు, సంఘుము తన ముఖమును నీతి సూర్యుని తట్టే ఉంచి చూచును. క్రిస్మసు రోజున నీతి సూర్యుడు తొట్టెలో ఉన్నాడు. గాన సంఘుము తొట్టివైపు చూచి, క్రిస్మస్ సూర్యుని ధ్యానించుచున్నది. లోకము, సంఘుముకూడ తొట్టివైపే చూచెను. ఈస్టరురోజు,

Bible Mission HQ Guntur

అనగా ఆదివారమున ఆయన పొందిన జయమువైపు చూచెను. జ్ఞానులు, ఇంటిలో ఉన్న ప్రభువు తట్టును; సుమెయోను ఎనిమిదవ రోజు గుడిలో ఉన్న పరిశుద్ధ శిశువు తట్టును చూచెను. ***గనుక భూలోకములో సంఘమనేది ప్రొద్దు తిరుగుడు పువ్వు వంటిదే.*** ఆయన కనబడు తట్టే చూడాలి. ఆయన శ్రమ చరిత్ర చాలా ఉన్నది గనుక ఈ ప్రారంభదినమున మొదటి దిన చరిత్ర, తట్టు చూడాలి. యేసుప్రభువు సర్కీటులో ఉన్నప్పుడు 'ఇదిగో యెరూషలేము వెళ్లుచున్నాము' అని శిష్యులతో చెప్పెను. శ్రమ ఆయన కన్నులకు కనబడుచున్నది. శ్రమల ఆరంభ దినమిదే. సంఘము తన ఇష్ట ప్రకారము భస్మ బుధవారము ఏర్పర్చెను. ఇక ఈ నలుబది దినములు యేసుప్రభువు సిలువవైపు తిరిగి మంచి శుక్రవారం చరిత్ర ధ్యానించనై యున్నాము. దానికి చాలా చరిత్ర ముందున్నది గనుక వివరముగా ధ్యానించుదము. 'ప్రభువా! నా నిమిత్తమై ఈ శ్రమలు పొందుటకు నీవు బాధ పడినావు. కాబట్టి నీకు వందనములు' అని చెప్పుటకు ఈ దినము ధ్యానించాలి. ఆయన శ్రమలను జ్ఞాపకము చేసికోవాలి. ఇది తప్పుగాదు. ***మనమే మంచి పనిచేసినా అది ప్రభువుకు ఇష్టమే.*** అబ్రాహాము దేవునితో మాట్లాడినప్పుడు 1) నేను ధూళిని, 2) బూడిదను అని మాట్లాడెను. తన స్థితి తలంచినందున ఆలాగు మాట్లాడెను. గనుక దీనికి బూడిద బుధవారమని పేరు పెట్టిరి. ***'అయ్యో! ప్రభువా! నీవు నా నిమిత్తము శ్రమపడి, సిలువపొంది చనిపోవుటకు నేను తగను'*** అని చెప్పుకొని స్తుతించాలి. మన పాపపు జాబితా ఎత్తికొనికాదు గాని దాని వలన కలిగిన అయోగ్యత ఒప్పుకొనవలెను. 'నా నిమిత్తము శ్రమలు పొందినావు. నేను తగను. అందుకని నేను అయోగ్యుడను'. నీ శ్రమ నీవే పొందు అని నన్ను అనక ఆయన తానే పొందెను.

ఒక కుండకు రంధ్రము చేసి భూమిలో చింత గింజవేసి మొలచిన మొక్కపై కుండ బోర్లించి, రెండు మూడు రోజులైన తరువాత ఉదయమునే కుండతీసి చూస్తే మొక్క తూర్పుకు తిరిగి ఉండును. *కుండలో సూర్యుడు లేడు గాని రంధ్రములో నుండి సూర్యుడు కనిపించుచున్నాడు. సాయంత్రమున చూస్తే పడమటి తట్టు ఉండును. ఆలాగు తిరుగుట మొక్క నైజము. అలాగే* తన ముఖము ప్రభువు తట్టు త్రిప్పుట సంఘము యొక్క నైజము. "ఇంకొక ప్రక్క నీ ముఖము త్రిప్పుకో తల్లి తట్టెందుకు?" అని పిల్లతో అంటే, నీ నైజమును త్రిప్పుకో! అని అన్నట్లే! పిల్ల తల్లి తట్టు ముఖము తిప్పితే తప్పా! ఆలాగే సంఘము ఈ దినము తన ముఖమును ప్రభువు తట్టుకు

త్రిప్పుకొన్నది. గనుక అబ్రాహాము వలె **"నేను బూడిదను, ధూళిని", ఇట్టి నా కొరకు నీవు పొందిన శ్రమలు చూస్తూ; నావైపు, నా పాపమువైపు చూచుచు; నాకు బదులుగా ఇట్టి శ్రమపొందిన నీవైపు చూస్తున్నాను. అని అనుచున్నది. ఇదే భస్మ బుధవారము.** ఓ సంఘమా! ఓ ప్రొద్దు తిరుగుడు పువ్వా! ఆయన వాగ్ధానాలు, ఆయన గుణాలు, ఆయన చరిత్ర, ఆయన శ్రమ, మరణాలవైపే చూడు. ఎందుకంటే ఇక ముందుకే శ్రమలు, మరణము, తీర్పు, వేదన ఉండవు. ఎందుకంటే ఆయనను గుడిలో, ఇంటిలో తలంచి, స్తుతించి ఆయన చిత్త ప్రకారము చేసిన యెడల, ఆయన శ్రమల రూపములో పాలిభాగస్థురాలివై, ఆయన మహిమ రాకడలోని జయమునకు ఆయత్తపడగలవు.

ఈ శ్రమకాల ధ్యానముద్వారా అట్టి స్థితి చదువరులకు సిలువనాథుడైన క్రీస్తు ప్రభువు దయచేయునుగాక! ఆమేన్.

***కీర్తన :*** *" సిలువను జూచు కొలది – శిల సమాన మైన మనసు = నలిగి*
*కరిగి నీరగుచున్నదిరా" ॥ నీ సిలువే॥*



# లెంటులోని ఎనిమిదవ దినము - గురువారము

## సిలువలోని అప్పగింతలు

### లూకా 18:32



**ప్రార్థన:- యేసుప్రభువా! నీ మరణ చరిత్ర, నీ జన్మ చరిత్ర, నీ ఉద్యోగ చరిత్ర మా కన్నుల ఎదుట ప్రదర్శించినావు. ఈ మూడు చరిత్రలలో నీ మరణ చరిత్ర, నీ పునరుత్థాన చరిత్ర ఆలోచించుటకై మాకు సహాయము దయచేయుము. ఈ రోజులలో నీ మరణచరిత్ర ధ్యానించు-చుండగా, వాటివలన మాకు కావలసిన సహాయము ఇమ్ము. ఆమేన్.**

భస్మబుధవారమునాడు ఒక వాక్యము, ఇదివరలో గడిచిన సంవత్సరాలు బోధించినాను. అదేదనగా యేసుప్రభువు సువార్త ప్రచారముమీద తన శిష్యులకు చెప్పినమాట: 'ఇదిగో మనము యెరూషలేము వెళ్లుచున్నాము'. అక్కడ నాకు శ్రమలు, మరణము ఉన్నదని ప్రభువు వారితో అన్నారు. ఈ వాక్యము లూకా 18:31లో ఉన్నది. అది నేను గడిచిన సంవత్సరాలలో వివరించినాను. మీరు వ్రాసుకున్నారు. అప్పుడు లోకములోనున్న 'యెరూషలేము వెళ్ళుచున్నాము' అని ప్రభువు చెప్పిన మాట వివరించి, ఆ తరువాత పరలోకములో నున్న 'యెరూషలేము వెళ్లుచున్నాము' అని యేసుప్రభువు ఈ కాలములోనున్న పెండ్లి కుమార్తె సంఘముతో చెప్పుచున్నమాటను వివరించితిని. కాబట్టి ఆ రెండును ఈ వేళ వివరించను. పాఠము అదేగాని, వివరము మాత్రము ఆ దినము వంటిదికాదు. లూకా 18:31లో 'వెళ్లుచున్నాము' అను మాట ముఖ్యమైనది. ఆలాగే 'అప్పగింపబడుట' అనేమాట కూడ ప్రాముఖ్యమైనది. అప్పగింపబడుట, వెళ్లుచూ శ్రమపడుట, పునరుత్థానము ముఖ్యమే గాని నేనావేళ చెప్పినవి చెప్పను. ఒకే మాట ఈ రోజు వివరించెదను: 'అప్పగించుట' *1) అప్పగించుట 2) అప్పజెప్పుట, 3) అప్పగించుకొనుట 4) అప్పగించబడుట.*

యేసుప్రభువు శ్రమల వృత్తాంతము పై నాలుగు మాటలలో ఇమిడి ఉన్నది.

**1. అప్పగించుట:-** అనగా ఆదాము మొదలు మోషే వరకు, దేవుడు తన కుమారుడు రానైయున్న సంగతి చెప్పాడు. అది ఆయన మాటను బట్టి. దేవుడు వారికి ఆ మాటనే రానైయున్న ప్రభువుని గూర్చి అప్పగించినాడు. అందుచేత ఆదాము, హవ్వలు, షేము, యాపేతు, 12 మంది గోత్రీకులు ఆ మాటను అందుకొన్నారు. తమ హృదయములో భద్రము చేసికున్నారు. **ఉదా:-** మనము పొరుగూరు వెళ్లేటప్పుడు

Bible Mission HQ Guntur

ఏదైనా ఒకరికి అప్పగించి జాగ్రత్తగా దాచి, మనకప్పగించమన్నట్లు, దేవుడు తన కుమారుని గూర్చిన వాగ్దానమును వారికిచ్చారు. అలాగే వారు ప్రభువుని గూర్చి దేవుడుతమకిచ్చిన మాట నమ్మి, ఆ మాటను తమ హృదయములో దాచుకొని, ఆయన కొరకు కనిపెట్టారు. మోషే వచ్చేవరకు వారు ఆలాగు కనిపెట్టారు. అయితే దేవుడు **ఇప్పుడు మోషేను కొండకు పిలిచి, 'నేను చెప్పుతాను వ్రాసికో' అన్నారు.** తరువాత భక్తులు, ప్రవక్తలు, అదే ప్రకారము వ్రాసారు. ముందుగా దేవుడు, తన మాటను ప్రజలకు అప్పగించారు. అలాగే తర్వాత వ్రాత పూర్వకముగా కూడ అప్పగించిరి. వారు, వీరుకూడ మాటను, వ్రాతను దాచుకున్నారు. తొట్టివద్ద గొల్లలు చెప్పిన మాటలు మరియమ్మ తన హృదయములో భద్రము చేసికొనెనని వ్రాయబడినది. ***అలాగే ప్రజలు దేవుడప్పగించినది దాచుకున్నారు, పోగొట్టుకోలేదు.*** వీరికి (మోషేకంటే ముందటివారు) వ్రాత తెలియదు. గనుక మాటమాత్రము ఏ ప్రక్క ఉంచుకొంటారు! అని దేవుడు, మోషే వచ్చిన తరువాత అంతకు ముందు చెప్పినవన్నియు వ్రాతలోపెట్టినారు. ఈలాగు ప్రజలు యేసుప్రభువు వచ్చే వరకు వ్రాతయు, మాటయు నమ్మి భద్రము చేసికొనిరి. ఈలాగు మనమును దేవుడిచ్చినవన్నియు, ధ్యానించి నమ్ముట, భద్రము చేసికొనుట మహా గొప్ప విషయము.

**2. అప్పజెప్పుట:** తుదకు యేసుప్రభువు బెత్లేహేములో పుట్టిరి. మాటయు, వ్రాతయు అప్పగించినట్లు, మన రక్షకుని లోకములోనున్న మనుష్యులందరికి దేవుడు అప్పగించాడు. యూదులకే కాదు, అన్యులకును అప్పజెప్పాడు. ***ఉదా:*** ఒక తల్లి తన బిడ్డను మరొకరికి పెంపకమునకు ఇచ్చినట్లు దేవుడు తన కుమారుని అప్పజెప్పినట్లున్నది. ప్రభువు అప్పటివాడా? కాదు, అనాదిలోనే ఉన్నవాడు. అయితే, దేవుడాయనను లోకమునకు అప్పజెప్పెను.

**3. అప్పగించుకొనుట:** అప్పుడు యేసుప్రభువు శిశువు చిన్నవాడు, ఇప్పుడు యుక్తవయస్సు వచ్చింది. బాప్తిస్మము పరిశుద్ధముగా పొందినారు, శోధనలు జయించినారు. ఇప్పుడు ఆయన లోకమంతా తిరిగి అందరికి కనబడవలెను. గలిలయ, సమరయ, యూదయ, దెకపోలి మొదలగు ప్రాంతములన్నిటిలో అంతా కనబడవలెను. "ఇదిగో ఆయన వస్తాడని మాటలో విన్నారు, వ్రాతలో చూచినారు. నా జన్మ చరిత్రలను విన్నారు. ఇప్పుడు 30 ఏండ్లయినది" అని దేవుడు మాట అప్పగించినట్లు, వ్రాత అప్పగించినట్లు; యేసుప్రభువు ప్రజలకు తన్నుతాను అప్పగించుకున్నారు. చేయవలసిన పనులన్నీ చేసి, బోధించవలసినవన్నీ బోధించి, రోగులందరిని బాగుచేసి, పాపులను

క్షమించాడు, మృతులను లేపాడు, దయ్యములను వెళ్లగొట్టాడు, ఆకలిబాధ తీర్చాడు, ఆపద తీర్చాడు, శత్రువులను ప్రేమించాడు, క్షమించాడు. మరణము వచ్చినప్పుడు సహించారు. ఈ విషయములు చేయుటవల్ల ఆయన ప్రజలకు అప్పగించుకున్నాడు. ఏలాగు? బోధ వినేవారికి, జబ్బులు బాగుచేసికొనే వారికి, ఆపదలోనున్న వారికి; ***ఈ 10 క్రియలు ఎవరెవరికి ఆయన చేసినారో, వారందరికి ఈ 10 అంశములు ద్వారా అప్పగించుకున్నారు***. ఈ క్రియలవల్ల నన్ను తెలిసికొనండి అని అన్నట్టు ప్రజలకు అప్పగించుకున్నారు.

***ఉదా:*** సుఖారు బావివద్ద స్త్రీ అన్నది: 'రక్షకుడు వస్తాడు, ఆయన వచ్చినప్పుడు మాకంతయూ తెలిసిపోతుంది' ఆ ప్రకారముగా ఆయన మాటవల్ల, ఆమెకు తనను తాను అప్పగించుకున్నాడు. ఆలాగే ఈ 10 క్రియలద్వారా అప్పగించుకున్నారు. ఆ బావివద్ద స్త్రీ నమ్మింది. నీళ్లివ్వడం మరచిపోయింది. కుండ మర్చి పోయింది. తాడు కొరకు రావడం మరచిపోయింది. *'మెస్సీయా వచ్చాడు, రండి'* అని అందరికి చెప్పింది. ఈలాగు పైన చెప్పిన 10 విషయములద్వారా ప్రభువు తన్ను తాను అప్పగించుకొన్నారు.

**4. అప్పగించబడుట:–** దీనిని బలపరచుటకు, ***"వ్రాత, మాట, కుమార జన్మము, ఆయన ఉద్యోగము చెప్పాను. అసలు పాటము ఇది.*** 'ఆయన అప్పగించబడును'. యూదులాయనను పట్టుకుని, కాళ్లమీద పడి నమస్కారముచేసి, ఓ దేవా! ప్రభువా! ఇన్నాళ్లకొచ్చావా! అని గౌరవమియ్యవలసినది. గాని వారు ఆలాగు చేయలేదు యేసుప్రభువు తనను అప్పగించుకొన్నప్పటికిని, వారు ఆయనను మరియమ్మవలె భద్రము చేసికోలేదు. అయితే, వారాయనను భద్రము చేసికొనుటకు బదులు తీసికొని వెళ్లి, అన్యులకు అప్పగించినారు. ***దేవుడు ప్రభువును వారి చేతులకప్పగించుట అందుకేనా!*** *ప్రభువు తనను వారికప్పగించుకొనుట అందుకేనా?* గాని వారందరు ఆయనను అన్యుల కప్పగించి చంపించివేసినారు. అంతకు ముందు యేసుప్రభువు నోటితో నీతి బోధ చేసినారు, చేతితో వడ్డించారు, చేతులతో పని చేశారు, కాళ్లతోను పనిచేసారు, కష్టములో ఉన్నవారిని జాలితో చూచారు. ***ఇప్పుడు పనిచేసిన ఆయన చేతులను వారు కట్టేసారు. నడిపాదములు ఇక నడవడములేదు.*** శత్రువులు వచ్చారు. కాళ్లకు సంకెళ్లు వేశారు. వారు ఆయనను అన్యుల కప్పగించినందువల్ల ఆయన అప్పగించ బడినాడని వ్రాయబడినది. వారాయనను ఏమి చేసిరి? వారు గౌరవించలేదు సరికదా! చివరకు అన్యులకప్పగించి చంపించారు. ఆ తరువాత ఏమి జరిగినది?' ఆయన లేచారు. 5. ఆయన లేచిన తరువాత తన శిష్యులకు ఒకటి అప్పగించారు.

"మీరు భూదిగంతముల వరకు వెళ్లండి. నా బోధ వినిపించండి, నమ్మినవారికి బాప్తిస్మము ఇవ్వండి" అనే ఈ పని అప్పగించినాడు. యూదులకు, పరిశుద్ధులకు ఒకసారే, అప్పగించబడెను. ప్రభువు పరలోకమునకు వెళ్తూ తాను చెప్పిన పని అంతా అప్పగించాడు. తన విషయములన్నీ శిష్యులకు మాత్రమే కాక, సంఘమునకును అప్పగించెను.

పాత నిబంధనలో మాట అప్పగించినట్లు, వ్రాతనుకూడ అప్పగించెను. అక్కడ మాట అప్పగించినట్లు, క్రొత్త నిబంధనలో ఆయన చేసిన పనిని అప్పగించెను. అన్నియు కలిపి శిష్యులకు అప్పగించెను. అందుచేత ఈ వాక్యములో ఒక మాట ఉన్నది. 'ప్రవక్తలు చెప్పిన మాట' అని ఉన్నది. దావీదు, సొలోమోను, యెషయా మొదలైన ప్రవక్తలు వ్రాసినది ధర్మశాస్త్రము లేక ప్రవక్తల ప్రవచనములు. "నన్నుగూర్చి చెప్పినది, వ్రాయబడినది నెరవేర్చినాను. ఆ నెరవేర్చింది మీకప్పగించినాను" అని ప్రభువు అనెను. *అప్పుడు శిష్యులు (హింసనుబట్టి) స్వంత దేశములో ఉండుటకు ఇష్టపడక, చెదరిపోయి* అందరికి ఆ సువార్త అప్పగించిరి. ఇప్పుడు 6 సంగతులు చెప్పాను. అందులో చివరి మాట 'అప్పగించుట' అనే మాట. కొందరు ఈ మాటను లెక్కచేయలేదు. దేవునిమాట మనకిప్పుడున్నది. 'మనమెంత వరకు ఆయన మనకప్పగించిన మాట, వ్రాత చదువుచున్నాము'? అంతా (బైబిలులో ఉన్నదంతా) చదువుచున్నామా! అంతా చదివితే, దానిలోనున్న దాని ప్రకారము నడిస్తే, మనకప్పగించినదంతా చేసినట్లే. ఉదా: బైబిలు చదివినావా? అని ఒకరిని అడిగితే లేదు. అన్నారు. కొందరు కీర్తనల గ్రంథము, మరికొందరు బైబిలులో అక్కడక్కడ చదువుతారు. ***కొందరు మాత్రము 'బైబిలు అనగా దేవుడప్పగించిన మాట' అని అంతా చదువుతారు. దేవుడు పంపిన ఈ బైబిలనే ఉత్తరమంతా చదవాలి.*** యేసుప్రభువు చేసినవన్నీ మనకే అని నమస్కరింపవలెను. ఆయన చేసినవన్నియు మనకు సమృద్ధి, సుఖము, సంతోషము కలిగించుటకే. ఆయన మాటను, ఆయనను, ఆయన క్రియను హృదయమందు భద్రపర్చుకొని, ఆ క్రియలన్నీ మాకే అని ఆయనకు కృతజ్ఞతగలవారమై, ఆయన మన కప్పగించిన ఆయన మాటలు, క్రియలు అన్నియు భద్రపర్చుకొనవలెను.

అట్టి ధన్యత చదువరులకు, సిలువ నాధుడైన క్రీస్తు ప్రభువు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన :*** *"అప్పగింత తండ్రి నీకు - నాత్మనంచును = గొప్ప యార్భాటంబు చేసి - కూలిపోతివా!"* ||ఆహా మహా||



# లెంటులోని తొమ్మిదవ దినము - శుక్రవారము

## పందెపు రంగము - సహింపు యుద్ధము

యెషయా 53వ అధ్యా॥. లూకా. 23:40. 1పేతురు 2:20-24.



**ప్రార్థన:- యేసుప్రభువా! మాకు బదులుగా చేయవలసిన పని అంతా, సమాప్తము చేయుటకై, ఆ సమస్తమును నెరవేర్చుటకై, మా కొరకు చేసిన పనులన్నిటికై నీకు వందనములు. నీవు చేసినది యావత్తు మా కొరకు, మా ఉపయోగము నిమిత్తము చేసినావు, మా మేలు కొరకు బోధించినావు. మా ఉపకారము కొరకు చేసినావు. మా కొరకు శ్రమపడినావు. మా కొరకు కోర్టుకు వెళ్లినావు. మా కొరకు సిలువ మోసినావు. మా కొరకు గాయపర్చబడినావు గనుక నీకు వందనములు. ఆమేన్.**

ప్రసంగ వాక్యము:- మార్కు. 14:53-57. యోహాను 2:19.

నేటి ప్రసంగ వాక్యము: 'నా శరీరమనే దేవాలయమును పడగొట్టుడి'. ఈ మాటలో యేసుప్రభువు యూదులతో పందెము వేసినట్టు కనబడుచున్నది. ఏది! పడగొట్టి చూడండి. అప్పుడే మీకు తెలుస్తుంది, నాకు గెలుపో లేక మీకు గెలుపో! పడగొట్టే మీకు గెలుపు వస్తుందో, పడగొట్టబడిన నాకు గెలుపు వస్తుందో మీరే తెలుసుకుంటారు! ఇది పందెపు రంగమందు తెలుసుకుంటారు. ***ఇది పందెపు రంగమందు పందెమువేసే యోధుని కూటమువలె ఉన్నది.*** యేసుప్రభువు యూదులతో పందెము వేసినట్టు ఈ వచనములో మొదటి భాగమందు కనబడుచున్నది. గాని ఒక్క యూదులమీదనే పందెము వేయలేదు గాని ఇంకా కొంతమంది మీద, ఇంకా కొన్నిటిమీద పందెము వేసెను. వేటిమీద వేసెను? సైతాను మీద అనగా అసలు పాపము తెచ్చిపెట్టిన సైతానుమీదనే పందెము వేసెను. సైతానా! నీ ఇష్టము వచ్చినట్లు నన్ను చేయవచ్చు. సైతానా! ఎవరు గెలుస్తారో? చూద్దాము. లూకా 4:2. 1 పేతురు. 5:9,10.

**2వది:-** సమస్త పాపములమీద ఆయన పందెము వేసెను. తలంపు పాపములు, మాటలోని పాపములు, క్రియలోని పాపములు; అన్ని పాపములమీద పందెము వేసెను. ఓ పాపములారా! నన్ను శోధించుటకు మీ ఇష్టము వచ్చినట్లు చేయండి అన్నట్లు కనబడెను. ***'ఆయన మనవలె శోధింపబడెను'*** అని వ్రాయబడినది. మనకు బదులుగా శోధింపబడెను గాని పాపములో పడలేదు.

Bible Mission HQ Guntur

**3వది:–** పాపములవలన వచ్చిన ఫలితములమీద ఆయన పందెము వేసినాడు. జబ్బులు, ఇబ్బందులు, చిక్కులు, ఆపదలు, అపవిత్రత ఇవన్నియు ప్రభువును ఏమీ చేయలేకపోయెను. ఆలాగే ఆపదలు, ఆకలి, ఇవన్నీ ఏమీ చేయలేకపోయెను. పాపమువలన వచ్చిన దుష్ట ఫలితములు ఆయనను ఏమీ చేయలేకపోయెను. చివరకు యేసుప్రభువే గెలిచెను.

**4వది:–** దయ్యములు ఎదురుగావచ్చినవి. అవి ఆయనమీద పడలేకపోయినవి. మనుష్యులమీద పడినట్లు ఆయనమీద పడలేకపోయినవి. ప్రభువు దయ్యములను గెలిచెను.

**5వది:–** ఆయనను పట్టుకొనుటకై శత్రువులు వచ్చిరి. ఆయన పట్టబడినాడు గాని పట్టబడినట్లుండలేదు. ఇస్కరియోతు యూదాతో ఏమి చెప్పెను, "చెలికాడా! నీవు చేయవలసినది చేయి" అనెను. అప్పుడు యూదా అప్పగించినాడు. అయినప్పటికిని తప్పించుకొని పారిపోలేదు.

**6వది:–** కయప, సన్హెద్రిము పంచాయతీ కోర్టులోకి వెళ్లెను. అక్కడ వారిని గెలిచెను. ఎందుకంటే వారు ఏమియు చేయలేకపోయిరి. ***వారు చేయవలసినదంతా చేసినను వారాయనను నాశనము చేయలేకపోయిరి. ఆయనే గెలిచెను,*** గాయములు పొందెను, రక్తము కార్చెను. అయినను తప్పించుకొని పారిపోలేదు. తుదకు భూస్థాపనపుడుకూడ నేను సమాధిలోనికి వెళ్లను అనలేదు. అక్కడకూడా ప్రభువే గెలిచెను.

ఉదా:– రెండు గొఱ్ఱె పొట్టేళ్ళు పోట్లాడుకొన్నప్పుడు ఒకటి పారిపోయినట్లు ఆయన పారిపోలేదు. పంచాయతీ సభలో పారిపోలేదు. కోర్టులో పారిపోలేదు. మరణము వచ్చినప్పుడు పారిపోలేదు. రాతి సమాధిలో పెట్టినప్పుడు పారిపోలేదు గనుకనే పందెములో గెలిచెను. రెండు సంగతులు ముఖ్యము. పేతురు పత్రికలో ఉన్నట్లు 'సహించెనని' వ్రాయబడినది. పందెపు రంగమందు రెండవ పొట్టేలు వలన మొదట పొట్టేలునకు ఎన్ని దెబ్బలు తగిలిననూ పారిపోలేదు. సుళువైన పద్ధతి లేక మాయ పద్ధతి శత్రువులాయనకు చూపిరి. అనగా 'సిలువ మీదనుండి దిగు' అని అనుటలో ఆ మాయ మార్గము చూపారు. గాని ఆలాగు ఆయన చేయలేదు.

***1) సహించుట, 2) తప్పించుకొనకపోవుట.*** తప్పించుకొనకపోవుట చరిత్రలో యున్నది. సహించినాడనే మాట పేతురు పత్రికలో యున్నది. ఈ రెండును పందెపు రంగమందున్న పెద్ద పొట్టేలుయొక్క పెద్ద కొమ్ములను విరుగగొట్టే పెద్ద కొమ్ములవలె యున్నవి. మన నిమిత్తమై ఆయన ఈ పందెపు రంగములో ప్రవేశించెను. కాబట్టి

శ్రమలయొక్క కొమ్ములకు తాళలేక పారిపోలేదు. నిలువబడిపోయారు. అందుచేత ఆయనకు సైతానువల్ల, దయ్యములవల్ల, పాపములవల్ల శ్రమలు వచ్చినా, వ్యాధులు వచ్చినను, అవమానములు వచ్చినను, మరణావస్థ కలిగినను, యేసుప్రభువు సహించినట్లు మనమును సహించితే మనకే గెలుపు. **మన సహింపు యేసుప్రభువుమీద ఆధారపడితే జయముగాని, స్వశక్తిమీదనైన యెడల అపజయము.** ఆయన శ్రమచూచి మన శ్రమ సహించవలెను. ఆయన మరణము చూచి, మన మరణము సహించవలెను. *ఈ ప్రకారము ఆయన శ్రమలన్నిటిని, మరణ చరిత్రను, భూస్థాపన చరిత్రను చూచి మనము అన్నిటిని గెలువగలము.* ఆయన గెలుపువల్ల మనకు గెలుపు. ఆయన కీర్తి వల్ల మనకు కీర్తి. ఆయన గెలిచినట్లు మనముకూడా పందెము వేసి గెలువవలెను. మనకు శ్రమ కలిగినప్పుడు చింతించుటవల్ల ఏమి లాభము? ఆఖరికాలము గనుక శ్రమలింకా వచ్చును. *33 1/2 సం॥లవరకు ప్రభువుకు శ్రమ వెనుక శ్రమ. అయితే మంచి శుక్రవారము అవి అన్ని కలిపిన దానికంటే ఎక్కువ శ్రమ. ఎందుకంటే అవి ఆయనను చంపలేదు. గాని ఆఖరు శ్రమ ఆయనను చంపెను.* ఆలాగే సంఘమునకు శ్రమలుకూడా ఎక్కువే. భక్తులమీదికి వచ్చినవి కూడా ఎక్కువే. భక్తులలో ఒక్కొక్కరికి వచ్చే శ్రమలకంటే, సంఘముమీదికి వచ్చే శ్రమలు ఎక్కువే. సంఘము, భక్తులు వీరికి మాత్రమేగాక క్రీస్తు పేరు ధరించుకొన్నవారందరికి శ్రమలే. వారు భక్తులు-గాకున్నను శ్రమలే. వారికే కాదు, వారి అభిమానులకు కూడ ఎక్కువ శ్రమలే. క్రైస్తవులు లేక భక్తులు పక్షముగా నున్నందువల్ల, అలాగే ప్రభువు పక్షముగానున్నందువల్ల శ్రమలే. ఎక్కువైన శ్రమలని భయపడవద్దు.

***యేసుప్రభువు తొట్టిలోనుంచి శ్రమలకు ఎదురెక్కెను.*** ఐగుప్తులోనుండి పాలస్తీనా దేశమునకును, అక్కడనుండి సిలువపైకి ఎక్కి, వెళ్లిపోవలెను. గనుక మనము భయపడకూడదు! జంకుట మనపనికాదు. గాని యుద్ధరంగమునందు మనము స్థిరముగా నిలువబడవలెను. ఒక్క ప్రక్కకు ఒరిగితే మనకు జయము రాదు. శ్రమ అయినా సరే! మరణమైనా సరే, యుద్ధరంగమునందుఉంటే ఏ భయము లేదు. *2000 సం॥ల క్రిందట పందెపు రంగమందు గెలిచిన మన ప్రభువు మన ప్రక్క ఉన్నాడు. గనుక అపజయమురాదు.* మన తెలివి తక్కువవల్లనో, లేక భీతివల్లనో తప్పించుకో-గోరితిమా! ఆయన ఉన్నా మనకు అపజయమే. భయపడినా దిగులుపడినా మనకే అపజయము. జయశాలియైన ప్రభువు నా ప్రక్కనున్నాడు గదా! అంటే ఏమీ భయములేదు. యోబునుగూర్చి సైతాను దేవునితో వాదించాడు. దేవుడు సెలవు

ఇయ్యగా యోబును శోధించెను. గాని యోబు- 'దేవుడిచ్చెను, దేవుడే తీసికొనెను' అని అన్నాడు. అందువల్ల అపవాది సిగ్గుపడి పారిపోయెను. ఆలాగే మనకును కలుగును. **ఎన్ని కష్టాలు వచ్చినా మనము సైతానుకు లొంగకపోతే వాడు పారిపోవును.** ఇక ఎన్నడును మన యొద్దకు రాడు. కాబట్టి మంచి శుక్రవారమునందుగల పందెపు రంగమందు మనము ఎక్కువగా సహించవలెను. అప్పుడు గెలుపు కలుగును.

యేసుప్రభువు సిలువమీద ఎక్కువ బాధ సహించినప్పుడు ఎవరిని తలంచినాడని మీరనుకొంటున్నారు. తల్లిని, శిష్యుని తలంచుకున్నాడనుకున్నారా? నిజమేగాని ఆయన వర్తమానము వినుచున్న నిన్ను ఆయన 2000 సం॥ల క్రిందటనే తలంచుకున్నాడు. **ఎన్నో కోట్ల సూర్య కిరణములు నేలమీదకు వచ్చి నేలను చూస్తున్నట్లుగా, ఆ నీతి సూర్యునియొక్క కనుదృష్టిలోని కిరణములు 2004 యేండ్ల క్రితమే రాబోవుచున్న నిన్నును, నీ శ్రమను, నీ సహింపును చూస్తునే యున్నవి.** అది మీరు నమ్మరు. శిష్యుడినే,, నేరస్తుడినే ఆయన జ్ఞాపకము తెచ్చుకొనెను అని అనుకుంటున్నారా? సంఘమనే దేవాలయమును పడగొట్టండి! చూస్తాను అంటున్నారాయన. నా భక్తుడు ఒక అడవిలో ఉన్నాడు. ఆయనను పడగొట్టు అంటున్నారు. సంఘము పడిపోయినట్లు కనబడవచ్చుగాని పడిపోదు. ఆలాగే భక్తులు పడిపోయినట్లు కనబడ వచ్చుగాని పడిపోరు. *కాబట్టి సంఘమా! సంఘములోనున్న శ్రమానుభవ శరీర శ్రమను పొందుము, సహించుము గాని పడవద్దు, అదే మంచి శుక్రవారముయొక్క మంచివార్త. 'పడవద్దు',* ఈ మంచివార్త విని ఏడ్వవద్దుగాని సంతోషించండి.

అట్టి దీవెన ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

**కీర్తన :** *"యేసుక్రీస్తు ప్రభువొందిన జయమే-ఎల్లవారికౌను - కోరిన ఎల్లవారి కౌను- వేడిన ఎల్లవారికౌను - నమ్మిన ఎల్లవారికౌను = యేసు పేరే మీ చిక్కుల పైన వేసికొన్న జయము - జయమని వ్రాసికొన్న జయము సద్విలాస్"*

*॥జయము॥*

# లెంటులోని పదవ దినము - శనివారము

**సిలువధ్యాన దీవెనలు**

లూకా. 9:51-55; 1తిమోతి. 1:13.



**ప్రార్థన:- యేసూ ప్రభువా! నీ శ్రమల ధ్యానము ద్వారా అనేకమైన ఆశీర్వాదములను మా కొరకు దాచి ఉంచినావు. గనుక నీకు స్తోత్రములు. నీ శ్రమలను సంపూర్ణముగా ధ్యానించి, సంపూర్ణమైన ఆశీర్వాదము పొందునట్లుగా మమ్మును నడిపించుము. ఆమేన్.**

క్రీస్తుయొక్క శ్రమకాలము మన ఆనందకాలము. ఎందుకంటే ఆయన శ్రమలవల్ల మన శ్రమలు గతించిపోయినవి. అయినప్పటికిని ఇప్పుడు మనకు వేదన, దుఃఖము, బాధ రాకపోదు, రాక మానదు. కష్టకాలమందు తప్పక దుఃఖము వచ్చును. అలాగే రావలసిన ఆశీర్వాదము రానప్పుడును దుఃఖము వచ్చును.

**1)** ఇస్సాకు కుమారుడైన ఏశావు చాలా ఏడ్చినాడు. ఎందుచేత? రావలసిన దీవెన రాలేదు. వచ్చునని నిరీక్షించిన దీవెన పోయినది. అది ఒక విధమైన దుఃఖము. అయితే ఆ ఆశీర్వాదము తనది కాదు తన తమ్మునిది. మనము ప్రార్థన చేసినప్పుడు రావలసిన దీవెన రాకపోతే దుఃఖము కలుగును. కాబట్టి ఇక్కడున్న వారిలో ఎవరియొక్క కోరిక నెరవేరలేదో వారు దుఃఖించుట న్యాయమే అయినప్పటికిని దుఃఖించకూడదు. అది తనకు రావలసినదికాదు. తన తమ్మునికి రావలసిన దీవెనయే. ప్రభువుయొక్క సిలువ ధ్యానము వల్ల మనకు ఒక దీవెన రావలెను. క్రిస్మసు రోజున ఒక దీవెన. పునరుత్థాన- మప్పుడు ఒక దీవెన. ఆరోహణమప్పుడు ఒక దీవెన. ప్రతి ఆదివారము, ప్రతి బుధవారము, ప్రతి పండుగ రోజున ఏదో ఒక క్రొత్త దీవెన ఉండును. మనము అందుకొంటేనే. అందుకొనకపోతే ఆ దీవెనరాదు. గనుక అందుకొననప్పుడు మనకు మనోవిచారము.

**2)** బైబిలులో మరియొకచోట మరొక కథ గలదు. అదేమంటే హాగరు కథ. ఈమె ఇష్మాయేలుయొక్క తల్లి. అరణ్యములో కొడుకునకు నీళ్లు దొరకనందున దూరముగాపోయి ఘొల్లున ఏడ్చుచున్నది. అప్పుడు దేవదూత వచ్చి నీళ్లున్న చోటు చూపించినది. అయితే దేవదూత- 'నిన్ను చూచి, నీ ఏడ్పు విని, రాలేదు గాని నేను ఆ చిన్నవాని మొఱ్ఱ విన్నాను, చూచినాను' అన్నారు. అపుడు హాగరుకు ఆదరణ కలిగింది. ఏశావుయొక్క ఏడ్పు వల్ల ఆశీర్వాదములు కోరిననూ ఆశీర్వాదములు దొరకలేదు గాని కొన్నాళ్లకు నీ సహోదరుని కాడిని నీ మెడమీద నుండి తొలగించుకొంటావు అనే దీవెన కలిగినది. అది రాజుల కాలములో జరిగింది. ఏడ్చినందుకు కొంచెము దీవెనైన దొరికింది. అది

తనకు దొరకలేదు. తన సంతానమునకు దొరికింది. తనకుకాక తన సంతానమునకు దీవెన అందినది. అట్లే మనకుకూడా జరుగును. అసలు దీవెన మనకు రాకపోయినా, మన తరువాతి వారికైనా వస్తుంది. నోవహు కుమారులలో హాము శపింపబడవలసింది. అయితే అక్కడ ఆలాగు లేదుగాని కనాను శపించబడెను. హాము యొక్క సంతానమునకు కూడా శాపము అప్పుడు రాకపోయినను, ఆ సంతానములో ఏవరికో ఒకరికి తరువాత రాకమానదు. *గనుక మీలో ఎవ్వరైనా ఒక చెడు కార్యము చేస్తే దాని ఫలితము మీకు రాకపోయినను, మీ తరువాత వచ్చేవారికైనా వచ్చితీరును. అట్లే దీవెన కూడా వెంటనే రాకపోయినను మీ తరువాత వచ్చే వారికైనా లభించును. ఆలాగే మీరు సిలువ ధ్యానము చేస్తే, దీవెన మీకు రాకపోయినను మీ తరువాతి వారికైన వచ్చి తీరును.*

**3)** హిజ్కియాకు మరణము దగ్గరబడినది అని వినబడినప్పుడు అతడు వెంటనే గోడ తట్టు తిరిగి కన్నీరు కార్చెను. ఆ తరువాత దీవెన వచ్చింది. ఆ దీవెన ఏమనగా తన ఆయుష్కాలము పొడిగించబడింది. ఆ దీవెన తన కాలములోనే వచ్చింది. ఆలాగే ***మీరు సిలువ ధ్యానము చేస్తే వెంటనే దీవెన రావచ్చును అని తెలిసికొనవలెను.*** ఈ ప్రకారముగా ఇది బైబిలు చరిత్రలో ఉన్నది. లోక చరిత్రలోకూడా అదే ఉన్నది. ఉదా: ఒక మనిషి పాపము చేసినప్పుడు విలపిస్తాడు.ఆ తరువాత క్షమాపణ పొందును. ఆ తరువాత అతనికి ఆశీర్వాదము వెంటనే వస్తుంది. బైబిలులో ఇంకొక కథ గలదు.

**4)** ఒక స్త్రీ ప్రభువు కాళ్ళు కడిగి ఏడ్చింది. ప్రభువు వెంటనే పాప క్షమాపణ చెప్పినాడు. అది ఆమెకు దీవెన. అలాగే సిలువ ధ్యానము చేసేటప్పుడు ***దేవా! నా పాపము నిమిత్తమై నీవు శ్రమ పడ్డావు అని దుఃఖించిన యెడల అప్పుడు ఆశీర్వాదము, ఆదరణ కలుగక మానదు.*** ఒక పాపి తన పాపము నిమిత్తమై దుఃఖిస్తే తప్పకుండా ఆ దుఃఖము ప్రభువు అంగీకరించును. అది ముఖ్యము, అపుడు అతనికి క్షమాపణ కలుగును. గాని కొంతమందికి క్షమాపణ వచ్చినట్లు తెలియదు. అది వారు కనిపెట్టనందు వల్ల తెలియదు. ఏ ప్రార్థనకైనా ప్రభువు జవాబు ఇవ్వకపోవచ్చును గాని పశ్చాత్తాప ప్రార్థనకు జవాబు ఇవ్వని యెడల పాపి నిరాశలోపడి, దేవుని దూషించి మరింత గొప్ప పాపముచేసి నశించును. అందుచేత వెంటనే జవాబు ఇస్తాడు. అటువంటి పాప క్షమాపణ వాక్యములు బైబిలులో చదువుకొంటే ప్రభువు ఆదరణ కలిగిస్తాడు.

*మరొక సంగతి :* మనిషి పాపము చేసిన తరువాత పాప ఫలితముగా శిక్ష వచ్చును. మనిషి ఆ శిక్షను చూచి ఏడ్చునేగాని పాపమును గూర్చి ఏడ్వడు. అట్టివారు కొందరున్నారు గనుక ఆలాగు శిక్షనుచూచి ఏడ్వరాదు. ***ఉదా:*** యేసుప్రభువు సిలువ

ప్రానుమీద మనకు బదులుగా శిక్ష అనుభవించెను గాని ఆయన ఏడ్వలేదు. ఆయన ఆ శిక్ష అనుభవించుచున్నప్పుడు నేను లోకము నిమిత్తమై శిక్ష అనుభవించుచున్నాను' అని ఆనందించును. అట్లే మనము పాపముచేసినందువల్ల శిక్ష వచ్చినప్పుడు శిక్ష అనుభవించుచున్నాను అని ఆనందించవలెను. సిలువ ధ్యానము వలన అదే మనము నేర్చుకొనవలెను.

సిలువ ధ్యానకాలమందు కొందరు స్త్రీలు ఆయన బాధలు చూచి ఏడ్చినారు. ప్రభువు అది ఒప్పుకొనలేదు. ఎందుకంటే వారియొక్కయు, వారి పిల్లల యొక్కయు పాపములను గురించి వారు ఏడ్వలేదు. వారి పాపములు, వారి పిల్లల పాపములు ఎవరు సిలువమీద మోయుచున్నారో ఆయనను గురించి ఏడ్చిరి. అందువల్ల వారు ఏడ్చిన ఏడ్పు నిష్ఫలము. వారు వెంబడించుట నిష్ఫలము. ఎందుకంటే వారి పాపఫలితము ఆయన మీద పడినది. అందువల్ల వారు సంతోషించవలెను గాని సంతోషించలేదు. అందుచేత వారు ఏడ్చుటతో, వారి పాపములు ఆయన మోయుట నిష్ఫలమైనది. ప్రభువు- నేనింత ఇష్టపడి వారి పాపములు మోస్తుంటే, భరిస్తుంటే మీరానందించవలెనా? దుఃఖించవలెనా? అని తలంచినట్లున్నది.

ఉదా: ఒకడు అడవిలోనుండి కట్టె మోపులు నెత్తిమీద మోసికొని వస్తుండగా, మెడ లాగుట, నెత్తి లాగుట కలిగినది. అప్పుడు ఇంటివద్ద నుండి వచ్చిన ఒకరు, ఆ మోపు తనమీద వేసికొంటే అతడు ఏడ్చునా? సంతోషించునా? వందనము అంటాడు. అట్లే సిలువమీద మన ప్రభువు మన పాపములు, వ్యాధులు, శిక్షలు తనమీద వేసికొని భరిస్తే, భరిస్తుంటే కృతజ్ఞతా వందనములు చెప్పవలెనా? లేక ఏడ్వవలెనా? కృతజ్ఞతతో వందనములు చెప్పవలెను. మనము ఈ 40 దినములు రెండు పనులు చేయవలెను. 1) మన పాపముల నిమిత్తము దుఃఖపడవలెను. 2) మరొక దరినుండి ప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలెను. ఈ రెండు పనులు మంచి శుక్రవారము వరకు జరిగించవలెను. సిలువ ధ్యానములో సిలువ *ఉండకూడదు గాని సిలువవలన వచ్చిన జయము ఉండవలెను, అది తలంచాలి.*

*అట్టి జయ దీవెనలతో ప్రభువు మిమ్మును అలంకరించును గాక. ఆమేన్.*

***కీర్తన :*** *"పాప భారమెల్ల మోసి - బరువు దించి వేసినావు ॥రక్షకా॥*
*వ్యాధి భారమెల్ల మోసి - వ్యాధి దించి వేసినావు ॥రక్షకా॥*
*శిక్ష భారమెల్ల మోసి - శిక్ష దించి వేసినావు" ॥రక్షకా॥*

# లెంటులోని రెండవ ఆదివారము

## సిలువలోని నాలుగు పటములు

మత్తయి 4:1-11



**ప్రార్థన:- తండ్రీ! నీ శ్రమను ఎన్నిమార్లు తరచినను, అందులోని నూతనత్వము తరగదు. నీ శ్రమానుభవములోనుండి సంఘమునకు కావలసిన నూతన అనుభవములను ఎప్పటికప్పుడు అందించు-చున్నందుకు వందనములు. నేడునూ నూతన వర్తమానము దయచేయుమని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

శుక్రవారము మనము ఏర్పర్చుకొనిన ప్రభువుయొక్క శ్రమ చరిత్ర, ఆయన సిలువ దినమైయున్నది. ఆ వేళ జరిగేటటువంటి కథ యావత్తు చదివిన యెడల, అనేక విషయములు మనకు బైలుపడును. ప్రతిసారి, ప్రతి ఏట ఈ కథ చదువుచున్నాము. ఇది మనకు క్రొత్తకాదు. ఈ సంగతులు మనము ఎరుగుదుము గనుక అది మార్చి చూపిస్తున్నాను. ఈ వేళ మన పాఠమును 4 పటములుగా విభాగించెదము.

1వ భాగములో సైతానుయొక్క దూతలైన దయ్యాలు, సాతాను ఉన్నాడు.

2వ వరుసలో సైతానువల్ల ప్రేరేపింపబడి ఉద్రేకము కలిగి, ప్రభువును సిలువవేసిన సైతాను ఏజెంట్లైన శత్రువులున్నారు. శాస్త్రులు, పరిసయ్యులు మొదలగువారు.

3వ వరుసలో ప్రభువుయొక్క సిలువ, దానిమీద ఆయన పడ్డ పాట్లు.

4వ వరుసలో సిలువ వెనుక అనగా ఆ తరువాత ఉన్న కథ. అనగా సిలువ, సమాధి, పునరుత్థానము మొదలుకొని పెండ్లికుమార్తె ఎత్తబడేవరకున్న చరిత్ర. (ఎత్తబడి యున్న చరిత్ర).

5వ భాగముకూడా ఉన్నది. అది ఈ వేళ చెప్పను. చెప్పినది జ్ఞాపకముంచుకొని వచ్చినది ఇతరులకు చెప్పండి.

1. మొదటిది- సైతాను దాని దూతల పటము.

2. రెండవది- సాతానుచే ప్రేరేపించబడిన మనుష్యుల పటము.

3. మూడవది- ప్రభువుయొక్క ఎత్తబడిన సిలువ పటము. ఆ సిలువమీద ఆయనకు కలిగిన హింస.

4. నాల్గవది- యేసుప్రభువు సమాధిలోనుండి లేచిన తారీఖు మొదలుకొని, పెండ్లి కుమార్తె పరలోకమునకు ఎత్తబడిన రేప్చర్ గడియ వరకు నాలుగవ పటము.

Bible Mission HQ Guntur

ఈ పటము కాగితముమీద వేయగలిగితే ఒకదానికంటే ఒకటి ఎత్తైనదిగా వేసి అగుపడునట్లు చేయగలను. వీటిని గాలిలో ఉన్నట్లు తలంచుకొనండి. మొదటి పటముయొక్క చరిత్ర ఏమి? ఇది అంతా జరుగవలెను. సాతాను కథ నేను చెప్పను. ఈ వేళ మానవులకు బదులుగా వచ్చిన యేసుప్రభువు యొక్క చరిత్రలో, ఆయనకు కలిగిన శ్రమ మాత్రమే చెప్పెదను. ఈ అపవాది యేసుప్రభువును హింసించుటకు పూనుకొన్నాడు. సైతానుకు బైబిలు తెలుసు. మత్తయి 4:6లో సైతాను ప్రభువుతో మాటలాడేటప్పుడు, బైబిలు వాక్యము ఎత్తి చెప్పితే ప్రభువు మరియొక వాక్యము ఎత్తెను. ***యేసుప్రభువు మాటలాడి ఓడించితే, ఓడిపోవుదునని సైతాను అనుకొనెను గాని దాని మోటుతనము చొప్పున మరల శోధించెను.***

త్రాగుబోతు తప్పత్రాగినపుడు, తానుపడిపోదునని తనకు తెలుసుగాని త్రాగకమానడు. ఎందుకంటే మోటువాడు గనుక మూర్ఖత్వమువల్ల మానడు. ఆలాగుననే యేసుప్రభువును శోధించినను, ఆయనే గెలుస్తారు అని సైతానుకు తెలిసినను వాడు శోధించుట మానలేదు. దయ్యములకు కూడా ఈ సంగతి తెలియును.

***1. మొదటి పటము :*** కపెర్నహూములో ప్రభువు దయ్యములను వెళ్లగొట్టినపుడు వాటికి తెలిసి ఏమనెను? ఇంతలోనే మమ్మును నాశనము చేయుదువా? చేయవచ్చితివా? అనెను. వాటి నాశన కాలమెప్పుడన్నది? ఇదివరకు మీకు తెలిసినకాలమే. యేసుప్రభువు సిలువమీద చనిపోయి సమాధై, పునరుత్థానమొంది, ఆరోహణమై, సంఘమును స్థాపించి సంఘమెత్తబడిన పిమ్మట 7 సంఘాల శ్రమకాలముదాటి, హర్మెగెద్దోను యుద్ధాంతమందు అంతెక్రీస్తు, దయ్యములు నిత్యాగ్ని పాలగుదురు. అపుడు సైతానుకు చెర. అది వాటి నాశనకాలము (అది ఇంకారాలేదు, అనుభవములో ఉన్నది) ప్రభువు పరలోకమునకు వెళ్లి చాలాకాలమైనది. వాటికి, వారికి నాశనమున్నదని తెలియును. అప్పుడు రావలసినది గాని ఇప్పుడే మమ్మును ఎందుకు వెళ్లగొట్టుచున్నావు అని దయ్యము, ఆయనను అడిగినది గాని సైతాను ఏమియు అడుగలేదు. అతని గుండె కొట్టుకొను– చున్నది. బైబిలు Iయోహాను 3:8లో సైతాను కార్యములు లయము చేయుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెనని గలదని సాతానుకు, దయ్యములకు తెలియును. అందుచేత దిగులున్నది. అయినను వాడు మూర్ఖత్వముతో నిండియున్నాడు. సాతానును మన పాదముల క్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును (రోమా 16:20) అని సంఘము గుర్తించినది, సంఘముకూడా సైతాను క్రియలను నాశనము చేయునని సైతానుకు తెలిస్తే మాత్రము మానునా? మానక ఇంకా కఠినత్వము కలిగించుకొనుచున్నది. (అట్లే మూర్ఖుడు తన మనస్సు మార్చుకొనక ఇంకను ఎక్కువ కఠినత్వము కలిగించు కొనును).

అప్పుడే అనగా యేసుప్రభువు వచ్చినప్పుడు (పుట్టినపుడు) “మాకెందుకాశ్రమ, మమ్ము నాశనము చేయదు’ అని అనుకొని దయ్యములు తమ దుష్కార్యములు మానివేస్తే, చిక్కులు లేకపోవును. **మనుష్యులు మారుచున్నారా? దయ్యములు మారుటకు,** ఒకటి పూర్తిగా చెడిపోయిన దయ్యము మారుటకు పూర్తిగా చెడిపోక సగము చెడిన మనిషే మారుటలేదు. పూర్తిగా చెడిపోయిన దయ్యమెట్లు మారును? ఇది ఒక పటము.

**2. రెండవ పటము:-** ఇది దయ్యములవల్ల ప్రేరేపింపబడినవారి పటము. యూదులును, రాణువవారును ఎక్కువ తక్కువగా దయ్యము వంటివారే. ఆయన చనిపోయి సమాధి చేయబడి తిరిగి బ్రతికివచ్చునని వారికి తెలుసునా? సైతానుకు తెలిసినంత బాగా వారికి తెలియదు. యోహాను ప్రకటన గ్రంధము వ్రాసిన తరువాత చదువుకొన్న వారికి తెలియును. అద్దైనా కల (అనుకొనుచున్నారు) అని తలంచుచున్నారు. అందుకే వీరేమి చేయుచున్నారో వీరెరుగరు అని ప్రభువు అనెను. ఎరుగుదురు గాని ఎరుగరు. అందుకే మోటుతనముతో ఆయనను సిలువవేసిరి. అంతకుముందు కొంత కథ నడిచినది. 31 1/2 సం॥ల నుండి కుట్రాలోచన జరుగుచున్నది. ఏమని? యూదులమతమును, మోషేధర్మశాస్త్రమును ఈయన మాటలు పడగొట్టేట్టున్నవి. గనుక ఏమి చేయవలెను? అని మాట్లాడుకొన్నారు. అప్పుడు వారి మనస్సులో ఏమి తీర్మానించుకొన్నారు? చంపడము తప్ప వేరే మార్గము ఏదీలేదు. చంపడమే ముఖ్యము అన్నారు. ఇప్పుడు ఈ వరుసలో దుర్మార్గులైన శత్రువులున్నారు (కీర్తన 22). దావీదు- వారికి బాషాను ఎద్దులు, కుక్కలు అని పేరుపెట్టి, అవి నన్ను చుట్టుకున్నవని అనుకొన్నాడు. దావీదు వారికి ఆ పేరు పెట్టెను. వారు సిలువ వేస్తే అంతా అయిపోవును అని అనుకొన్నారు. ఎందుకనగా వారు ఒకటి విన్నారు: ‘అబ్బాయి, నీవు త్రాగుచున్నావు. రోడ్డుమీద పడతావు. వాంతి అగును. ఇదంతా ఎందుకు? త్రాగుట మానుము’ అని అనినను వాడు వినక త్రాగును. అలాగే ప్రధాన యాజకుడు చెప్పెను. మరియు కావలికాయువారుకూడా చెప్పిరి.

‘మూడవ దినమున లేస్తానన్నాడు ఎందుకు లేవలేదు. అని వారు అన్నారు. రోగులను బాగుచేసినవాడు, చనిపోయిన వారిని లేపిన ఆయన, దయ్యమును వెళ్లగొట్టిన ఆయన; లేవలేడా? అని వారు గ్రహించుకొనవలెను, కాని గ్రహించలేదు గనుక వారు త్రాగుబోతువారే. ఎందుకంటే, ప్రభువుకు కీడుచేయవలెనని వారికి ఉన్నది. ఆయన లేచిన తరువాతనైన క్షమించుమని అడుగవలసినది. అప్పుడు తీరిపోవును. గాని వారు

అట్లు అనలేదు. అవతల సైతాను పటాలమున్నది. వారు కలువనివ్వరు (చెవిలో ఊదుదురు). ఇది ఘోరమైన పటాలము.

**3వ పటము:-** ఇది సిలువ పటము. ఇది లోకమంతట కల్వరిమీద కనబడే సిలువైనది. ఆయనకు, తలమీద, కాళ్లలో, చేతులలో బాధలు, ప్రక్కలో పొడిచిన బాధ ఉన్నది. ఇది సిలువ చరిత్ర. ఈ ప్రకారము జరిగినపుడు యూదులు దగ్గరున్నారు. వారితోపాటు సైతాను, దయ్యములున్నవి. వారికి, వీరికి జాలిలేదు. ప్రభువు ఒంటరిగా సిలువవేయబడెను. ***ఈ మూడును జ్ఞాపకముంచుకొని మర్చిపోకుండా ఉండేటట్లు ఇతరులకు చెప్పండి.***

**4వ పటము:-** ఆయన సిలువమీద ముండ్ల కిరీటము వేసికొన్నాడు. జయించిన తర్వాత నిత్యజీవ, విజయకిరీటము వేసికొనెను. గనుక వీరు సిగ్గుపడవలెను. ఇంత కష్టపడి ముండ్ల కిరీటము వేస్తే ఆయన మహిమ కిరీటము వేసికొనెనని సిగ్గుపడవలెను. ముండ్ల కిరీటమును వేసినను, అది ఎల్లప్పుడు ఆయన తలమీద ఉన్నదా? రక్తధారగా ఉన్నదా? పునరుత్థానమైనప్పుడు ఏమియులేదు. ఈ (ముండ్ల) కిరీటము శ్రమతో ఓపికతో సహించినది, ఎందుకంటే అది పోనైయున్నదని ఆయనకు తెలుసును. చేతులయందు మేకులు కొట్టుటచేత రక్తము. ఆయన పునరుత్థానమైన తరువాత ఆ రెండు చేతులతో శిష్యులను దీవించెను. తరువాత పరలోకమునకు వెళ్లెను. ఇక రక్తము కారుటలేదు. ఆ చేతులు (ఈ చేతులు). ఆ కిరీటము, ఆ విజయ కిరీటము (మంచి శుక్రవారమునాడు) మేకులున్నవి. గనుక దీవింప వీలులేదు. అయిననూ ఆయన దీవించెను. ఆయన తాను చేయవల్సినవన్నీ పూర్తిగా చేసెను. ఈ మూడు పటములలో ఆయన సంపూర్ణ జయ రూపము కనబడుచున్నది.


అట్టి జయరూపము ఈ నాలుగు పటముల పాటము ద్వారా ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

***కీర్తన:*** *"జీవమును- నా జీవంబునకై - సిల్వపై నర్పించిన యేసూ=*
*దేవా నేను నీ ఋణంబు - తీర్చ గలనా! ఎన్నటికైన" ॥నీకు ఏమి॥*

# లెంటులోని పదకొండవ దినము - సోమవారము

## క్రీస్తు మానవ అవతార సిలువ

1 తిమోతి 2:5-6; హెబ్రీ. 2:14-18; 5:7-10.



**ప్రార్థన:- పరిశుద్ధాత్మవైన తండ్రీ! మమ్మును నడిపించుము. ఆమేన్.**

**దీవెన:** సిలువధ్యానము కొరకు ఆశించుచున్న వారలారా! సిలువ ధ్యానము విలువ ధ్యానమై యున్నది. అట్టి సిలువ ధ్యానము మనలో నిలువ ఉండే ధ్యానమై ఉండునుగాక!

దేవుడు దేవుడుగానే ఉంటే, కనబడకుండ ఉంటే; కేవలము ఆయనవల్ల కలిగే మేళ్ళ వల్లనే మనము సంతుష్టిపడము. కాబట్టి ఆయన మనకు కనబడవలెను. ఆలాగు కనబడుటకు నిరాకారుడైన దేవుడు ఏలాగు కనబడగలడు? మనిషి చాలా చిక్కులలో ఉన్నాడు. గనుక మనకొరకై కనబడుటకై ఆయన మనిషైనాడు.

**ఉదా :** ఒక కుటుంబములో కుమారుడు అమెరికా వెళ్లి ఐదు సంవత్సరముల వరకు ఉత్తరములు వ్రాస్తూ, వస్తానని చెప్పుచూ కాలము గడిపితే తల్లిదండ్రులకు సంతుష్టి ఉండునా? ఉండదు. కొడుకు రావలెను. ఆలాగే దేవుడు పరలోకములోఉండి, మనకు కనబడకుండా ఎన్ని మేళ్లు చేస్తేమట్టుకు మనకు సంతుష్టి కలుగునా? దేవుడు మనిషిగా వస్తే, అప్పుడు మనకు సంతుష్టి కలుగును. దేవుడు వస్తే మంచిదే గాని ఆయన మనకు కనబడకపోతే వచ్చిన ప్రయోజనమేమి? ఏమి ప్రయోజనము లేదు. దర్శనములో కనబడితే, అప్పుడైనా అది ఆయన ఆకారముతో కాదు. ఆయన మన స్వరూపముతో కనబడుటే కావాలిగాని ఆయన ఆకారము కాదు. మనలను సంతుష్టి పరచవలెనంటే మన ఆకారములో, మన శరీరముతో, మనవలె, కేవలము మనవలె వచ్చి కనబడితే అప్పుడు సంతుష్టి. అయితే నాటకములో పురుషులు స్త్రీ వేషము ధరించుకొని వస్తారు. ఎంత స్త్రీవేషము వేసికొన్నను, చూచేవారు స్త్రీ అనుకొనరు. ఎందుకంటే అది వేషము, నిజ స్వరూపము కాదు.

*ఒక బ్రాహ్మణుడు- 'బ్రహ్మ,విష్ణు, మహేశ్వరులు ఆ ముగ్గురిలో విష్ణువు జగన్మోహిని వేషము వేసికొన్నాడు. నాటకములో వేసికొనే వేషము వంటిదికాదు. ఆయన (విష్ణువు) కేవలము స్త్రీ అయిపోయినాడు' అని అన్నాడు. అదే మన సిద్ధాంతముకూడా.*

దేవుడు దేవుడుగా భూలోకమునకు రాలేదు కేవలము మనిషిగా వచ్చినాడు. తాను ఎంత మనిషిగా వచ్చినప్పటికినీ తాను దేవుడనే జ్ఞప్తి ఉన్నది. బైబిలులో ఒక

కథ ఉన్నది. బబులోనుదేశపు రాజు మృగమైపోయాడు. శాపమువల్ల మృగమై అడవి జంతువులలో ఉన్నాడు. ***గాని తాను రాజు అనియు, మనిషి అనియు మరచిపోలేదు.*** అది జ్ఞాపకమున్నది. అయ్యో! నేను మనిషిని, జంతువునైపోతినే! అనే చింత ఉన్నది. దేవుడు ఆ జంతు రూపము తీసివేసి మనిషి రూపము ఇస్తే ఎంత సంతోషము! ఇది దానియేలు గ్రంథములో 4:32-33 గలదు.

మనిషి మృగమగుట భయంకరము. అలాగే దేవుడు మనిషి అగుట ఎంతో భయంకరము. ఎంతో కష్టము! దేవుడు మన నిమిత్తము యేసుక్రీస్తు అనే మనిషి అయినాడు. మనలో ఈ వరండామీద ఉన్నవారిలో ఎవరైనా ఒకరు అడవి మృగము అయిపోయి నక్కలాగమారి, మరలా మనిషిగా వస్తే, ఇక్కడకు వస్తే (ఆ వచ్చిన మనిషి నక్కకు లేక నక్క మనిషికి ఎంత సంతోషము!) గనుక అనాది దేవుడు, ఆకారములేని దేవుడు, 'పుట్టుక మరణమున్న మనిషిగా' మారిపోవుట ఎంత కష్టము! మనిషి నక్కగా మారుట ఎంత కష్టమో ఆలాగే దేవుడు మనిషి అగుట అంత కష్టము. నెబుకద్నెజరు అడవిలో గడ్డిమేసేటప్పుడు అతనికెంత కష్టమో ఊహించలేము. ***ఇది మన స్వంత అభిప్రాయమునకు పనికిరాక పోవచ్చును అనగా అందక పోవచ్చును.***

యేసుప్రభువు సిలువమీద కష్టాలు అనుభవించుట కంటే, ఆయన అసలు మనిషి అగుటయే గొప్ప సిలువ (శ్రమ). తాను దేవుడై ఉండక, తాను కలుగజేసిన స్త్రీ గర్భములో మనిషై ఉండడము అంతకంటే చావు ఇంకొకటి ఉన్నదా? అంతకంటే సిలువ ఇంకొకటి ఉన్నదా? గ్రహించుకొనండి. మన నిమిత్తమై మన మనిషైనాడు. ఒక ప్రయాణస్థుడు యెరూషలేమునుండి బేతనియ వెళ్లుచున్నప్పుడు, 'అయ్యో! నేను ఒంటరిగా అయిపోయాను, చీకటిపడ్డది' అని అనుకొనేటప్పుడు, భయపడేటప్పుడు, ఎదుట బేతనియకు వెళ్లుచున్న యేసు ప్రభువు కనబడితే, 'ఎవరో మనిషి వెళ్లుచున్నాడు!' అని ధైర్యము తెచ్చుకొంటాడు. అయితే దేవుడు వెళ్లుచున్నాడని తెలిస్తే భయపడిపోతాడు. అక్కడే ఆగిపోతాడు, దాగుకొంటాడు. అయితే మనిషి గనుక ఆయన లోపల ఎంత దేవుడైనను, మనిషిగానే ఉన్నాడు గనుక నిర్భయముగా దగ్గరకు వెళ్లగలడు. మరియొక బాటసారి దగ్గరకు వస్తున్న ఆ బాటసారితో ఆయన దేవుడు సుమీ! అన్నప్పటికిని ఇతనికి భయములేదు. ఎందుకంటే ***యేసుక్రీస్తు మనిషిగా కనబడుచున్నాడు గనుక భయములేదు.***

మనిషికైతే సంతోషమే గాని క్రీస్తుకైతే దైవత్వము విడిచి మనిషైనాడు గనుక ఆయనకు ఏమి సంతోషము! ఒక మనిషి నక్కైన యెడల అతనికి ఏమి సంతోషము?

కాబట్టి క్రీస్తు నరావతారిగా ఉండడవే జీవితమంతా ఉండే గొప్ప సిలువ. క్రీస్తు గర్భములో ప్రవేశించినది మొదలు కల్వరిమీద సిలువమీదికి వెళ్లేవరకు అంతా సిలువే. కర్రమీద ఉన్నప్పుడు మాత్రమే సిలువకాదు. ***జీవితమంతా ఆయనకు సిలువే.*** మన నిమిత్తమై అంత మట్టుకు ఆయన తగ్గించుకొన్నాడు గనుక మనము ఆయనకు ఎంతగా వందనములు ఆచరించవలెను! (I తిమోతి 2:5).

'క్రీస్తుయేసు అను నరుడు' అని ఉన్నది గాని 'క్రీస్తుయేసు అను దేవుడు' అనిలేదు. గనుక ***ఆయన అవతారము వేషముకాదు గాని కేవలము నరుడే.***

ఒకప్పుడు జరిగిన సంగతి మీకు చెప్పుదును. అదేదనగా ఇద్దరు క్రైస్తవ రోగులు యేసుక్రీస్తు యొక్క శరీరమును తలంచుకొని, ఒకడు ఈ ప్రక్కను ఉండి క్రీస్తు కేవలము మనుష్యుడేనని వాదించెను. ఇంకొకడు ఆ ప్రక్కను ఉండి నీవు పొరబడుచున్నావు ఆయన మనిషేగాని దేవుడుకూడా అయియున్నాడు అని వాదించెను. ఆ వాదము మిగుల మగ్గిపోయెను. అప్పుడు అతడు ఆ ప్రక్కనుండి, ఇతడు ఈ ప్రక్కనుండి గుద్దుకొన్నారు. ఏమి ప్రయోజనము! వాదమువల్ల ఏమి వస్తుంది? వాదమువల్ల బుద్ధిరాదు గాని, గుద్దులాట వస్తుంది ***గనుక ఉన్నది ఉన్నట్టుగా నమ్మవలెను. అంతరంగమున కూడా నమ్మవలెను.***

ఇప్పుడు మనమున్నాము. మన శరీరము కనబడుచున్నది. గాని మన ఊపిరి కనబడుచున్నదా? లేదు. అయినను రెండును నమ్ముచున్నాము. అలాగే క్రీస్తు దేవుడనియు, మనిషి అనియు రెండునూ నమ్మవలెను కాని ఆయన మనిషిగా మారడము ఆయనకు సిలువ. కాని మనకు సిలువకాదు. ఆ సిలువను మనము గౌరవించితే మనకు విలువ యున్నది. ఎందుచేతనంటే ఆయన మనిషి అవడము అవమానము పొందడమే. ఆయన శ్రమలు అనుభవించడము, సిలువమీద మరణము పొందడము మనకు విలువ

పాట: ***కులగోత్రముల బుద్ధి కుటిలంబు దెగెరా - బలవత్పిశాచ శృంఖలము విరిగెనురా- సిలువమోసినవాని మా యేసుక్రీస్తుని మరుగు గల్గెనునురా.***

*క్రీస్తు సిలువను బడితే ఆయన శరీరమునకు నష్టముగాని పిశాచికేమి నష్టము? శృంఖలము అనగా (పాపపు) సంకెళ్లు వదలిపోయి సైతానుకు సిలువ అయినది. అయ్యగారు ఒక పేపరు వేసిరి. పైన ప్రభువు సిలువ అయితే క్రింద సైతానుకు సిలువ. గనుక ప్రభువుకు సిలువ కాదు. పిశాచికే సిలువ. ఉదా: మోషే అరణ్యములో ఇత్తడి సర్పమును స్థంభముమీద నెత్తెను.* ***ఆ ఇత్తడి సర్పమే పిశాచి. ఆ పిశాచికే సిలువ.*** మనమందరము

Bible Mission HQ Guntur

యేసుక్రీస్తుకే సిలువ అనుకొంటున్నాము గాని, ఆ సిలువ క్రింద సైతానుకు సిలువ. సాతానును మీ పాదముల క్రింద శీఘ్రముగా చితుక త్రొక్కిస్తాను (రోమా 16:20) అని బైబిలులో ఉన్నది గదా!

యేసుప్రభువు సిలువమీద ఉండగా ఆయన పాదములక్రింద సైతానును త్రొక్కివేసినాడు గదా! ఆలాగే మనచేత కూడా త్రొక్కిస్తాడు. సైతాను వల్ల, సైతాను దూతలవల్ల, సైతాను మనుష్యులవల్ల బాధలు పడుచున్నవారలారా! మీ మీదికి గొప్ప ఆదరణ కలిగించునుగాక!

**సిలువమీద నున్న క్రీస్తుయొక్క పని:**

1) శత్రువులు తనకు హాని చేస్తున్నప్పటికిని, ప్రభువు వారిని క్షమించుటకు కోరినాడు ఇది మనుష్యుని లక్షణమునకు విరుద్ధము. మనుష్యులు తమ్మును హింసించువారిని హింసింపుమని కోరుదురు గాని క్షమించుమని కోరరు. అయితే క్రీస్తు తన విరోధులను క్షమించెను. 2) క్రీస్తు శ్రమపడుచున్నను, దొంగను పరదైసుకు తీసికొని వెళ్లెను. గనుక రక్షించే పనిమీద ఆయన వచ్చినాడు. గనుక శ్రమలోనున్నను రక్షించే పనిమానలేదు. 3) యోహానునకు తన తల్లిని అప్పగించెను. ఆయన దేవుడైనప్పటికిని, ఈ లోక మనుష్యులతో బంధుత్వము కలిగించుకొన్నాడు గనుక ఆ బంధుత్వము చివరివరకు పోగొట్టుకొనలేదు. 4) వారు ఆయనను చేతులలో మేకులతోకొట్టినారు. అయినప్పటికి ఆయన రెండు చేతులు చాపి లోకమును దీవించుట మానలేదు. ఆయన చేతులు చూడగా లోకమును దీవించుచున్నట్లు అగుపడును. 5) ఆయన వేదనలో ఉన్నప్పటికిని ఏడ్చే స్త్రీలను ఓదార్చినాడు. బాగా ఉన్నవారు ఓదార్చుదురుగాని వేదనలో ఉన్నవారు లోకములో ఎక్కడ ఎవరినీ ఓదార్చరు. ఆయన ప్రక్కలో బల్లెపు పోటు పొడిచినప్పటికిని, పెండ్లి కుమార్తె సంఘమును తన ప్రక్కకు చేర్చుకొనినాడు.

ఈలాగు ఆయన శ్రమల కౌగిలిలోనికి చేరి, ఆయన అంతరంగమును ఆనందింపజేయు ధన్యత నేటి దినమున ప్రభువు మీకు దయచేయునుగాక. ఆమేన్.


**కీర్తన :** *"నరరూపు బూని ఘోర - నరకుల రారమ్మని - దురితము బాపు*
*దొడ్డ - దొరయౌ మరియా వరపుత్రుడు = కర మరు దగు క-ల్వరి*
*గిరి దరి కరి - గి రయంబున ప్రభు - కరుణను గనరే"*

॥వినరే యో॥

# లెంటులోని పన్నెండవ దినము - మంగళ వారము

## అంతరంగ సిలువ

కొలొస్స. 2:13-15.



**ప్రార్ధన:- యేసుప్రభువా! నీ సిలువను ఇపుడు ధ్యానించనై ఉన్నాము. అందులోని అంతరంగ చరిత్రను మా కన్నులకు కనపర్చుము, జ్ఞానమునకు బోధపర్చుము. యేసునామమున వందించుచున్నాము. ఆమేన్.**

సిలువధ్యాన పరులారా! ఈ వేళ మంచి శుక్రవారము. యేసుప్రభువు సిలువమీద బాధపడుచుంటే ఇది ఎట్లు మంచి శుక్రవారము? మనకు అర్ధము కాదు. ఒక మిషనెరీ దొరగారు చెప్పినారు. ఏమనగా ఈ సిలువవల్ల మనకు రావలసిన మంచి యావత్తు వస్తుంది. అందుచేత ఇది మనకు మంచిశుక్రవారమే అన్నారు. ఓ ప్రియులారా! సిలువ చరిత్ర, సువార్తికులు వ్రాసిన చరిత్ర అంతా చదివితే, శ్రమ తప్ప మరేమియు లేదు. సంతసింపవలసిన ఒక్క చిన్న సంగతియైనను లేదు. అయినను విశ్వాసులైనవారు సంతసింపవలసిన దినము ఇదే. ఈ దినము సైతానుకు మాత్రమే బహు భయంకర దినము. మనకందరికి అనగా మన దృష్టికి మామూలుగా ఒక సిలువ కొయ్య కనబడు చున్నది. ఆ సిలువ కొయ్యమీద గాయపరచబడిన యేసుప్రభువు శరీరము కనబడు చున్నది. శిరస్సు మొదలుకొని క్రింది పాదమువరకు ఏక రక్తధార కనబడుచున్నది. అది మనకు మామూలుగా కనబడుచున్నది.

యేసుప్రభువును వేసిన సిలువ కొయ్య సామాన్యమైన పొడుగైనదే. అయితే అయ్యగారియొక్క మనోదృష్టిలో అది సామాన్యమైన పొడుగుకాదు. కర్రసిలువ మించిన పొడుగు ఈ సిలువ ఉన్నది. ఈ కర్ర సిలువమీదనున్న శరీరము, సిలువచుట్టు ఉన్న బహిరంగ మనుష్యుల సమూహము; ఇదంతా బహిరంగ సిలువవేత. సరే ఈ బహిరంగ సిలువ చరిత్ర ప్రతిసారి మనకు తెలిసినదే. ఇది మనకు కంఠతే. ఇపుడు దానిని గూర్చి కాదు. మన మనోదృష్టిలో ఈ వారము మన మనోనేత్రములకు అంతరంగ సిలువ కనబడుచున్నది, దానిని మనము ధ్యానిస్తే మనకు అసలు విషయము తెలుస్తుంది. అసలు కథ మిక్కిలి చిన్నది, మిక్కిలి విశాలమైనది. అది మిక్కిలి చిన్నది గనుక ఈ వేళ ప్రసంగముకూడా చిన్నదే. ఎక్కువ సంగతిలేదు. సరుకెక్కువ కనిపించుటలేదు. **ఉదా:** గోడమీద ఒక బొమ్మ ఉంటే ఆ బొమ్మను చూచుటకు ఎంత టైము పట్టును? ఎంతో టైము పట్టదు. అలాగే అంతరంగ సిలువను వినుటకు ఎంతో టైము పట్టదు. కొద్ది సం॥లు ఈ బహిరంగ సిలువ ధ్యానిస్తూ ఉంటుండగా దాని వెనుక అంతరంగ సిలువ ఉన్నది. అని నేను చెప్పగా ఆ సంగతి మీకుకూడా తెలిసియుండును. యేసు ప్రభువు ఈ బహిరంగ సిలువమీద ఉన్నారు. 1) ఇక్కడ శిరస్సుమీద ముండ్లకిరీటము

ఉన్నదిగదా! అయితే ఆయన వెనుక భాగములో ఉన్న అంతరంగ సిలువమీద ఆయనకు ముండ్ల కిరీటము లేదు. మహిమ కిరీటము ఉన్నది. ఆ కిరీటమునకు ఆయనకు బాధలేదు. సంతోషమున్నది. ఆ ముండ్ల కిరీటము వెనుక ఎంత మహిమ కిరీటము దాగియున్నదోకదా! ఆ రెండు ఎంతవరకు సాగినవంటే ఆ మహిమ కిరీటము ఎంత సాగినదంటే పరలోకములో దైవభక్తులున్న మోక్షము వరకు సాగింది. ఈ కిరీటము భూలోకములో ఉన్నప్పుడు అనేక శ్రమలుపొంది పరలోకమునకు వెళ్లిన పరిశుద్ధుల వరకు వెళ్లినది. ఎందుకు సాగివెళ్లింది? ఓ పరిశుద్ధులారా! ఓ భక్తులారా! నేనింక సమాధి కాలేదు. మరణము కాలేదు. సమాధి మీదనున్న రాయి తీయబడలేదు. నేను బ్రతికి సమాధిలోనుండి బయటకు రాలేదు. వచ్చినపుడు నాకు జయముండును. బయటకు వెళ్లినప్పుడు జయముండును. వచ్చును.

అయితే ఇవేవీ జరుగకముందే నాకు మహిమ కిరీటమున్నది అని ప్రభువు చెప్పినట్లున్నది. సిలువ వెనుక ఉన్న ఈ మహిమ కిరీటము ఎవరికినీ తెలియదు. శిష్యులకుకూడా తెలియదు. ఇది పరలోక వాసులకే తెలియును. భక్తులకు తెలియాలి. కర్ర సిలువ ఇంకా తీయనిదే, కర్ర సిలువ వెనుక మహిమ కిరీటమున్నదని రాణువ వారికి, శత్రువులకును, వారితో ఉన్న శిష్యులకును తెలియదు. ఈ సంగతి పరలోకమందున్న పరిశుద్ధులకు తెలియును. గనుక మహిమ కిరీటము అక్కడికి వెళ్లిపోయెను. దావీదు కీర్తన 2వ అధ్యాయములో ఏమున్నదనగా, ఆయన అభిషిక్తునికి శత్రువులు కీడు చేయాలని పన్నాగములు పన్నుచుండగా పరలోకమందు సింహాసనమందున్న దేవుడు ఈ పన్నాగములు నెరవేరవనియు, ఆయనకు జయము కలుగుననియు, ఆ జయమువల్ల కిరీటమున్నదని చెప్పి పకపక నవ్వుచున్నాడు కీర్తన 2:1-4;

ఈ సిలువ చరిత్రవల్ల మనము చాలా దుఃఖిస్తాము గాని మహిమ కిరీటము పరలోకము వరకు పొడిగించబడినందున తప్పక సంతోషించవలెను. ఎందుకనగా సిలువ చరిత్రలోని జయము మనకు తెలుసును. ప్రభువు సర్కీటులో శిష్యులకు చూచాయగా చెప్పినందున వారికి తెలుసు గాని ప్రభువు లేస్తారనేది పన్నెండు మందిలో ఒక్కరికైనా రవ్వంతైనా జ్ఞాపకములేదు. జ్ఞాపకముంటే సంతోషించి యుందురు. ఈ మహిమ కిరీటము పొడవు పరిశుద్ధలోకము వరకే కాదు. దేవదూతల లోకము వరకు ఈ పొడవు వెళ్లెను. అంతవరకు వెళ్లినదని మనకేలాగు తెలియుననగా స్త్రీలు సమాధి దగ్గరకు వెళ్లగా, ఇద్దరు దేవదూతలు ప్రభువు లేస్తారని తెలియదా? అని చెప్పి, లేచినారని జ్ఞాపకముంచుకొని చెప్పిరి. దేవదూతలు జ్ఞాపకముంచుకొని స్త్రీలకు చెప్పిరి. ఈ చరిత్రలో జయించినాడనే మాట దేవదూతలకు ముందే తెలిసింది. నేను జయించినాననేది

ముండ్ల కిరీటముతో ఉన్నప్పుడే ప్రభువు చెప్పెను. ఏలాగనగా మార్కు 11:24ను బట్టి జరుగకముందే జరిగిందని ప్రభువు చెప్పిరి. ఈ క్రియవల్ల ఈ వాగ్ధానము నెరవేరిందని చెప్పిరి. ఈ కిరీటము అంతవరకు వెళ్లెను.

ప్రభువుయొక్క హస్తములు ఈ రీతిగా కొయ్యకు తూర్పు పడమరలుగా చాపబడి యున్నవి. ఎడమ చెయ్యి ఆదాము, హవ్వలు పాపము చేసిన సమయమునుండి, సిలువమీద ఆయన గాయములు పొందిన అంతవరకు చాపబడియున్నది. జాలరులు వల దూరముగా విసరి, అందులో పడిన చేపలను మెల్లగా దగ్గరకు లాగును. ఆ చేపలు దగ్గరకు వచ్చును. దగ్గరగా వలవేస్తే ఎక్కువ చేపలు పడవు. దూరముగా వేస్తేనే పడును. ఆయన ఎడమ చెయ్యి ఆదాము, హవ్వలు మొదలు సిలువవరకు, 4 వేల సం॥ల నుండి పాపులుగా నున్న పాత నిబంధన పాపులందరిని దగ్గరకు లాగుచున్నది. (లాగుకున్నది) దూరముగానున్న బిడ్డను దగ్గరకు మనము లాగుకున్నట్టుగా ప్రభువు వారందరిని తన దగ్గరకు లాగుకొనెను.

కుడిచెయ్యి, మహిమ సిలువమీద నున్న చెయ్యి ఈ చేతిలో ఆయన రాకడ వరకు, 7సం॥ల శ్రమలవరకు, 1000 ఏండ్ల పాలన చివరి వరకు; దీని చివరన అంత్యతీర్పు చివర వరకు ఉన్న ప్రజలను తన దరికి ఆకర్షించుకొనుచున్నారు. ఆలాగు ఆయన ఇక్కడ వరకు ఉన్నవారిని తనదరికి చేర్చుకోపోతే మనిషి అక్కడ వరకు వెళ్లి, ఆ తరువాత నరకములోకి దూకివేస్తారు. అక్కడ వరకు వెళ్లిన ఈ చెయ్యిని చూచి అపుడు, ఏమయ్యా! మేము ప్రవచింపలేదా! బోధించలేదా! అద్భుతాలు చేయలేదా! అంటారు. ప్రభుని రెండు చేతులిట్లు పొడిగించబడినవి.

కొందరు ఆ రెండు చేతుల దరి అంచునుండి దుమికి వేస్తారు. వారిని గూర్చి అయ్యగారు రక్షించుమని ప్రార్థించగా ప్రభువు ఇలా అన్నారు; 'ఎవ్వరు చేయని ప్రార్థన నీవు ఒక్కడవే చేసినా'వని చెప్పిరి. ఈ రెండు చేతులు ఇచ్చటి వారిని లాగి ఏమి చేసెననగా: ఆయన ప్రక్కలో బల్లెముతో పొడువగా ప్రక్క గాయము ఏర్పడినది. అది ఏక ద్వారము, ఏక గాయము క్రింద ఆయెను. తప్పిపోయిన కుమారుని, తండ్రి తన ప్రక్కలోనికి చేర్చుకొన్నట్లు ***ప్రభువు రెండు చేతులతో, ఈ పాపులందరిని తన ప్రక్కలోకి చేర్చుకొనెను***. అందుచేతనే ఈ ప్రక్క గాయము. ***ఆయన చేతులు అంతవరకు పాపుల నిమిత్తమై సాగుటకు కాబోలు ఆయన చేతులకు గాయములు***. దేవదూతల లోకానికి వెళ్లుననే కాబోలు, ప్రభువుకు ముండ్ల కిరీటము శత్రువులు వేసిరి. కాలిపై కాలు పెట్టి ఆయన కాళ్ళకు పొడుగైన మేకులు కొట్టిరి. ఈ మేకు అంతరంగ సిలువలోనుండి పాతాళ అగాధమైన హేడెస్సుకు వెళ్లెను. మారుమనస్సులేని అవిశ్వాసుల లోకము వరకు వెళ్ళిన,

ఆ మహిమ పాదాల గాయములు చూచి, ఆ క్షణములో అక్కడి వారందరునూ, మా నిమిత్తమై పొందిన గాయములని మహిమ ఆ పాదాలను చూచి, ఆ పాదాలు అంతవరకు వెళ్లినందున వారును రక్షించబడిరి. ఇంతవరకు వెళ్లిన ఈ సిలువ ఎంత పొడవో, ఎన్ని మైళ్ళ విస్తీర్ణములో వ్యాపించి ఉన్నదో, తెలియదు. ఇన్ని సం॥లనుండి ఉన్నది అని కూడా చెప్పలేము గాని, 7 ఏండ్ల శ్రమలు గల సంవత్సరములని, వేయ్యేండ్ల ప్రభువు పరిపాలన సంవత్సరములని తెలియును. అదెప్పటికో తెలియదు.

అయ్యగారు ఒకసారి సముద్రము ఒడ్డున నిలచిరి. దగ్గరున్న జాలరులు మైలు దూరము వరకు వలవేసిరి. అందులో కొన్ని పడ్డవి. వారితో కొంతదూరము అయ్యగారు వెళ్లిరి. ఈ వల చరిత్ర చూచినట్లు, ఈ సిలువ చరిత్రలోని నాలుగు భాగములను మనో దృష్టితో వెళ్లిచూచి చెప్పుచున్నాను. ఆ మహిమ కిరీటమును చూచి, నాకును ఇట్టి కిరీటమున్నదనియు, ఆ చేతులుచూచి నన్నుకూడా ఆ చేతులతో ప్రక్కలోనికి చేర్చుకొను– ననియు, ఆ పాదాలుచూచి నాకు సంబంధించిన వారిని అధోలోకమునుండి తెచ్చి తన ప్రక్కలోనికి ఆయన చేర్చుకొనుననియు తలంచాలి. ఈ చరిత్ర అంతా మహిమ చరిత్రే. గనుక మనమందరము 3 గంటల వరకు ఈ చరిత్రలోని మహిమయొక్క మహిమ ఎంత గొప్ప చరిత్రో చూస్తాము.

1) దేవాలయపు తెర చిరుగుట అనగా దేవునికి మనిషికిమధ్య అడ్డులేదు. దైవసన్నిధికి ప్రతి పాపి వెళ్లవచ్చును. 2) సిలువధ్యానమును గ్రహించి చేయుట మంచిది. అది ప్రభువుకు కిరీటము. అది ఆయనకు ఆనందము. 3) భూగర్భము, ప్రభువు సిలువ కొయ్యను తనలో పాతినందుకు దుఃఖించు చున్నది. అయితే అందులోనుండి పాతాళములో ఉన్నవారిని ఆయన రక్షించెను. 4) పరలోక పరిశుద్ధులు ప్రభువు మహిమ సిలువను చూచి సంతోషించుచున్నారు. 5) భూలోకములోని విశ్వాసులు సహితము పాపులు గనుక ప్రతివారు సిలువ మోయవలెను. 6) మీ హృదయములను సిలువలోనున్న క్రీస్తు పాదములమీద వేయండి. అపుడు శుద్ధి కలుగును. 7) మన పాపములు ఆయనను బాధపెట్టెను గనుక దుఃఖించవలెను.

ఈలాగు క్రీస్తు ప్రభువుయొక్క అంతరంగ సిలువలోని మహిమ చరిత్ర మీ అనుభవములలో ఉండును గాక. ఆమేన్.

**కీర్తన :** *"అందు దిమిరము కమ్ము గడియయ్యె – నా నీతి సూర్యుని నంత చుట్టెను*
*బంధకంబులు = నింద వాయువు లెన్నో వీచెను – కందు యేసుని*
*ఆవరించెను– పందెముగ నొక కాటు వేసెను – పాత సర్పము ప్రభువు*
*యేసును"* ॥ఎంత గొప్ప॥

# లెంటులోని పదమూడవ దినము - బుధవారము

## అంతరంగ శోధన

మత్తయి 4:5-7; లూకా 4:5-8.



ప్రార్థన:- మా నిమిత్తమై సైతానుచే శోధించబడిన తండ్రీ! నీకెదురైన అన్ని శోధనలను నా నిమిత్తమై జయించినావు. నీకు స్తోత్రములు. **మేమును ఎంతగా శోధింపబడిననూ నీ తట్టుచూచి జయము పొందుటకు మమ్మును నీ సిలువ తట్టు ఆకర్షించుము. ఆమేన్.**

మొదటి శోధన అరణ్యములో జరిగినది. ఈ రెండవ శోధన పట్టణములో కనబడుచున్నది. మొదటి శోధనలో ఓడిపోయివానికి అనగా సైతానుకు సిగ్గులేదు. దిగులు లేదు, నిరాశ లేదు. మన మతనివలన గొప్ప పాఠము నేర్చుకొనవలెను. అతడు దుష్టుడైనను అతనికి నిరాశ లేదు. మనుష్యులలో ఎవ్వరును అంతటి దుష్టులు లేరు. ప్రభువుకు ఈ వేళ శోధనలు ఎదురైనవి. ఆయనను పరిశుద్ధ పట్టణమునకు తీసికొని వెళ్లినారు. ఆయన దేవుడును, నిజమైన మనిషియునైయుండి సాతాను ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్లుట, ఎంత అవమానకరమో చెప్పుటకు వీలులేదు.

ఇట్టి సంగతియే గురువారము రాత్రి, మరియు శుక్రవారము పగలు జరిగింది. గురువారము తిన్నగా ఊరిలోనికి చేతులు కట్టి తీసికొని వెళ్లినారు. ఎక్కడి కంటే చర్చి కౌన్సిల్ లోనికి తీసికొనివెళ్ళిరి. ఆయన వారిని ఆటంకపెట్టక వారు ఎక్కడకు తీసికొని వెళ్తే అక్కడకు వెళ్లెను. గనుక వారు ఆయనను అక్కడ నుండి కోర్టునకు తీసికొనివెళ్లినారు. ఇక్కడ ఏమియు లేదు. అక్కడనుండి గవర్నమెంటు కోర్టుకు తీసికొని వెళ్లి, అక్కడనుండి కల్వరి కొండకు తీసికొని వెళ్లినారు. ***'నేను రాను అని అంటే వారేమి చేస్తారు.*** ఏమి చేయలేరు గాని ఆయన అలా అనలేదు. ఆయన శోధింపబడుటకు, శ్రమపడుటకు, అవమానము పొందుటకు, తీర్పుపొందుటకు, మరణము పొందుటకు వచ్చారు గనుక ఆయన ఏమియు అనలేదు. ***మన సంగతి కూడా అంతే. శ్రమలు పొందుటకే మనము సంఘములో ఉన్నది.*** యేసుప్రభువును పరిశుద్ధ దేశములోనికి, పరిశుద్ధ పట్టణములోనికి అనగా యెరూషలేముకు తీసికొని వెళ్లినారు. 'పరిశుద్ధ పట్టణమనే' మాట మత్తయి వ్రాసిన మాట గనుక యేసుప్రభువును సైతాను పరిశుద్ధ పట్టణమునకు తీసికొని వెళ్లి శోధించెను. అది మరీ గొప్ప శోధన.

అరణ్యములో మనుష్యులు లేరు, శుభ్రత లేదు, ఇండ్లు లేవు. ఈ పరిశుద్ధ పట్టణములోనైతే ఇండ్లు, మనుష్యులు, శుభ్రత ఉన్నది. ముందు శోధనలో పరిశుద్ధమైన అడవి అనిలేదు. అది వట్టి అడవే. మార్కు- అది అడవి మృగములతో నిండిన అడవి అనియు, వాటి మధ్య ప్రభువు ఉన్నారనియు వ్రాసెను. ఇప్పుడు మనుష్యులున్న స్థలములో శోధన. పరిశుద్ధమైన స్థలములో శోధన. *గనుక ఏది ఎక్కువ బాధ చెప్పండి?* మనుష్యులు లేని దగ్గర, ఎవరికి తెలియని దగ్గర శోధింపబడుట ఎంతబాధ! ***అన్నీ ఉన్న పట్టణములో శోధింపబడుట ఎంతబాధ?***

ఈ శోధనలో 2 భాగములున్నవి. ఒకటి దేవాలయములో జరిగే శోధన. అనగా ఆయనను దేవాలయమునకు తీసికొనివెళ్లుట. రెండవది పరిశుద్ధ పట్టణములో జరిగే శోధన. దేవాలయములో జరిగే శోధన, పట్టణములో జరిగే శోధన; ఈ రెంటిలోను ఏదిగొప్పది? ప్రభువుకు కలిగే తలంపు ఏదనగా, ఈ పరిశుద్ధ పట్టణములోను నేను కట్టించిన దేవాలయములోను నాకు శోధన వచ్చినదనే చింత రావలసింది గాని రాలేదు. ***అవి రప్పించుటకే ఆ స్థలాలకు సాతాను ఆయనను తీసికువెళ్లినాడు గాని ప్రభువు మనస్సు ఏమియు చెదరలేదు.***

వాడు ఆయనను దేవాలయ శిఖరానికి తీసికొని వెళ్లినాడు.

1) పరిశుద్ధ పట్టణము.

2) పరిశుద్ధ దేవాలయము.

3) దేవాలయ శిఖరము.

ఇక్కడికి వాడు ఆయను తీసికొని వెళ్లెను. ఒక దానికంటే ఒకటి శోధన ఎక్కువగా యున్నది. అలాగే క్రైస్తవ సంఘానికి, క్రైస్తవ కుటుంబానికి శోధనలు ఒకదానికంటే ఒకటి ఎక్కువ వచ్చును.

రాజమండ్రిలో ఒకరికి జైలు శిక్ష పడగా, కానిస్టేబుల్ వచ్చి తీసికొనివెళ్తూ ఉండగా; ప్రజలు వచ్చి ఆ మనిషిని, ఆ సంకెళ్లను చూస్తూఉంటే ఆ నేరస్తునికి ఎంత చింత. ఆ మనిషి క్రిందికే చూస్తూవెళ్తూ ఉండగా ఒకరు ఇలా అన్నారు: 'ఏమయ్యా నీవు ఏమి నేరము చేసావని తీసికొని వెళ్తున్నారు? దిగాలుగా ఉన్నావు. ఏమి నేరముచేసావని ముఖము వంచావు? ముఖము ఎత్తుకొని పో' అన్నాడట. అలాగే ***మనముకూడా మా యేసుప్రభువులోను, మా సంఘములోను ఏమి నేరమున్నదని అనవలెను.*** యేసుప్రభువు చెప్పినట్టు మా సంఘాన్ని వృద్ధిచేస్తున్నాము. నీకెందుకు అని సైతానుతో అనవలెను.

మా ప్రభువును అక్కడకు, ఇక్కడకు, ఆ కొండకు, ఈ కొండకు త్రిప్పుచున్నావు గాని ఆయనలో ఏమియు నేరములేదు అని అనవలెను.

**నేరమున్న వానిని శిక్షించుటకంటే నేరము లేని వానిని శిక్షించుటవల్ల శిక్షింపబడుచున్న వానికి ఘనత.** గనుక యేసుప్రభువునకు పరిశుద్ధ పట్టణములో, పరిశుద్ధ దేవాలయములో, దేవాలయ శిఖరముమీద సాతాను వలన శోధింపబడుట ఆయనకు ఘనతే. నేరముంటే, అవును నేరమువల్ల శిక్షింపబడినారంటారు. **నేరములేకుండగనే శిక్షింపబడితే ఆయనకు ఘనతే.**

పరిశుద్ధ పట్టణమునకు అరణ్యమునుండి తీసికొని వెళ్లుట. ఇది రెండవది. ఇందాక ఆ నేరస్థుని జైలుకు తీసికొని వెళ్లుట ఒక శిక్ష. ఇంటివద్దనుండి నడిపించుకొని వెళ్లుట మరొక శిక్ష. దేవాలయములోనికి తీసికొని వెళ్లుట మూడవ శిక్ష. ఆ దేవాలయములోనికే యేసుప్రభువు వెళ్లి అనేక సార్లు ప్రసంగించిరి. ఆ దేవాలయములోనే విధవరాలు కానుకనుగూర్చి మెచ్చుకొన్నారు. ఆయన ఇదివరకు మసలిన (తిరిగిన) పట్టణానికి, ఇది వరకు ప్రసంగించిన దేవాలయనికి, తీసికొని వెళ్లి శోధించుట ఎంత కష్టము? ఎంత అవమానకరము? పరిశుద్ధ పట్టణము, దేవాలయము, శిఖరము, **'శిఖరమున ఆగు......అని ఆయనను నిలువబెట్టుట, ఆజ్ఞ ఇచ్చి నిలువబెట్టుట మరింత భారము.** ఆయన అలాగే నిలువబడెను.

యూదులు పిలాతు దగ్గరకు తీసికొని వెళ్లుచున్నప్పుడును, ఆయన అలాగే నిలువబడిరి. ఏలాగంటే, (యాకోబు మేనమామ దగ్గరనుండి పారిపోతూఉంటే) వెనుక మామగారు తరుముతూ రావడము ఒక ముంగుర్తు. ఏలాగంటే, యాకోబుకు 12 మంది కొడుకులు. వారిలోనుండి 6 లక్షలు వచ్చిరి. ఆ 6 లక్షల మంది సముద్రములో నుండి పరుగెత్తుతూ ఉంటే మామగారు తరిమే దానికి ముంగుర్తు. **అలాగే యేసుప్రభువు వారికి కలిగే శోధనలన్నియు ఇకముందుకు జరుగబోయే కార్యానికి ముంగుర్తు.**

*ఈ నలుబది దినములలోను మీకు కలిగే శోధనలన్నిటిలోను ప్రభువువలె జయము పొందుదురు గాక!*


***కీర్తన :*** *"లేని నేరములు నీ – పైన దుష్టులు వేయగాను క్షమించితివా = నీకు – ఈ నేరములు గూడ – యెంతో భారంబాయె – ఇది రెండవ సిలువాయెనా"*

*||మూడు||*

# లెంటులోని పదునాలుగవ దినము - గురువారము

## సిలువమీది మేఘము

మార్కు 10:32-34.



**ప్రార్థన:- తండ్రీ! నీ శ్రమలు మేఘమువలె నిన్ను ఆవరించియుండగా, వాటినన్నిటినీ నీతిసూర్యుడవైన నీవు సహించి, జయించినావు. నేడు సంఘము మీదికి రానైయున్న శ్రమలను నీ సంఘము జయించి నిలబడునట్లు నేటి దిన ధ్యానములోనుండి వర్తమానము దయచేయుమని వరుడుగా వచ్చుచున్న యేసు నామమున అడుగుచున్నాము. ఆమేన్.**

యేసుప్రభువు వారికి కలిగే శ్రమలు సంఘానికి జరుగబోవు శ్రమలకు ముంగుర్తు. బైబిలులో అనేక ముంగుర్తులున్నవి. అవి చెప్పాలంటే నెల దినములు పట్టును. ముంగుర్తులు వేరు, గుర్తులు వేరు. ముంగుర్తులు జరిగిపోయినవి. మనకాలములో గుర్తులు జరుగుచున్నవి. యేసుప్రభువువారు రెండవ రాకడకు ముంగుర్తులు జరుగునని చెప్పినారు. భక్తులు అవి చూచి, చంద్రలోకానికి వెళ్లిన సంగతి చూచి, ఆ తరువాత ఏమి గుర్తులు జరుగును అని ఆ భక్తులు అడుగుచుండగా, 'కనిపెట్టుడి' అని ప్రభువు అనుచున్నారు. (వచనం గురుతులను ప్రవచనములను- గుణియించు చున్నది. 'వధువు సంఘము') ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలో పై రెండు గుర్తులు నెరవేరుట చూచుచున్నాము.

1) ప్రవచనము 2) గుర్తులు 3) ముంగుర్తులు. ఈ క్రమమునుబట్టియే అయ్యగారు ఆ కీర్తన వ్రాసిరి. ఉదా: కారు మేఘము పట్టునప్పుడు భారీ వర్షము వచ్చునని ప్రకటించగా, అందరు అలాగేనట అని చెప్పుకుంటారు. పొలములో ఉన్నవారు గబగబా ఊళ్లోకి పారిపోవుదురు. ఆ మేఘము అక్కడ ఉన్నప్పుడు మేఘము వాసన కొట్టును. అనగా వర్షము పడుచున్న మట్టి వాసన వచ్చును. గాలి ఆ వాసనను తీసికొని వచ్చును. దానియొక్క నీడలు కొంతదూరము వరకు కనబడును. తీరా వీరు ఇంటికి వెళ్లగానే పొలములో కుంభవర్షము కురియును. ఆ వర్షమువల్ల కొన్ని ఇండ్లు పడిపోవును. చెట్ల కొమ్మలు విరుగును. త్వరగా పరుగెత్తనివారు తడిసిపోదురు. నేను శానిటోరియములో నుండగా ఒక కంట్రాక్టరుగారితో ఏమిచెప్పినానంటే, ఈ పాకలు కట్టి 4 సం॥లు అయినది. ఇకమీదట ఇవి పనిచేయవు. 'తీసివేసి మంచి ఇండ్లు కట్టండి' అని చెప్పి కేసవరము సర్కీటుకు వెళ్లిపోయినాను. అక్కడికి 18 మైళ్లు ఉండును. అక్కడకు వెళ్లగా, ఉజ్జీవ కూటములు పెట్టిరి. మరునాడు ప్రభువు ఒకమాట నాకు చెప్పినారు. ఏమంటే, శానిటోరియమ్ పరిస్థితులు బాగోలేదు గనుక నీవు వెంటనే వెళ్ళవలసిందని చెప్పినారు. కూటస్థులకే ఈ సంగతి చెప్పిరి. అపుడు వారు అయ్యో! ఒక్క కూటమే జరిపినారు. ఇంతలోనే వెళ్లిపోతారా? అనిరి. వారు నమ్మినా నమ్మకపోయినా ప్రభువు మాట అనిచెప్పి,

బైలుదేరి శానిటోరియం వచ్చివేసితిని. 4 గంటలప్పుడు మిర్తిపాడు గ్రామము మీదుగా నాలుగు మైళ్లదూరము వరకు నల్లని మేఘముకమ్మి, కనిపించగా మేమందరము సర్దుకున్నాము. ఇంతలో వర్షము వచ్చివేసింది. అయ్యగారి పాకమీదికిని వచ్చివేసినది. అయ్యగారు గొంగళి కప్పుకొనిరి. వంటగదికి చేరిరి.

అయ్యగారు అచ్చటికి చేరినారని తెలుసుకొని, 10 సం॥లు వయసు గల ఇద్దరు ఆడపిల్లలు అయ్యగారివద్ద అపాయము రాదని చేరిరి. మిగిలినవారు బాబూ, నాయనా అంటూ కేకలువేస్తున్నారు. అయ్యగారు వారిని ప్రార్థించమన్నా వారికి ప్రార్థన రాలేదు. పాకలన్నీ పడిపోయినవి. 400 రూపాయలు ఖరీదైన మందుబుడ్లు ముక్కలైపోయినవి. ఇంటిమీద రేకు పడి ఒక మనిషి కాలికి గాయము తగిలినది. ఒక రోగి, రెండు ఫర్లాంగులు రోడ్డుమీదికి దొర్లిపోయెను. ఎంత నష్టము! 1) బుడ్లు (సీసాలు) నష్టము, 2) పాకలు నష్టము, 3) కాలు తెగిన నష్టము, 4) రోగి రెండు ఫర్లాంగులు దొర్లిపోయిన నష్టము. అయ్యగారు గొంగళి కప్పుకున్నారు. కప్పుకున్నను బాధలోయున్నారు. ఎందుచేత? మేఘము దూరముగా ఉన్నప్పుడే, సమీప గ్రామములోనికి అయ్యగారు వెళ్ళి ఉంటే అయ్యగార్కి జబ్బుచేయకపోవును. ప్రభువు నన్ను శానిటోరియంకు వెళ్ళమంటే, వేరొక ఊరికి ఎట్లు పోదునని దగ్గరున్నా ఊరైనా పోలేదు. *(అందుచేత వారం రోజులు జబ్బుచేత బాధపడిరి).*

ఇదిగో మనము యెరూషలేముకు వెళ్లుచున్నాము. యూదులైన వారు నన్ను అక్కడ పట్టి చంపుదురు. అన్యులకు అప్పగింతురని ప్రభువు చెప్పిరి. మంచి శుక్రవారమునాడు ఆయన అనుభవించబోయే శ్రమ, మరణమనే మేఘచ్ఛాయ ఆయన శిరస్సుమీద పడినది. అయినను ఆయన లెక్కచేయలేదు. దానిని శిష్యులు గ్రహించలేదు. ప్రభువుతో వారును యెరూషలేము వచ్చిరి. అక్కడనుండి యేసుప్రభువు, తన శిష్యులతో గెత్సేమనే తోటకు వెళ్లినారు. అప్పుడు ఆయన మహా వేదనతో ప్రార్థించారు. ***అప్పుడు శుక్రవారమునాడు అనుభవించవలసిన సిలువ శ్రమల నీడ మరింత దగ్గరకు వచ్చినది.*** అదే ఎక్కువ బాధ, అందుచేతనే తండ్రీ! నీ చిత్తమైతే తొలగించుమని ప్రార్థించెను. రక్తము స్వేదము (చెమట) వలె ప్రవహించెను. ఎంత బాధ లేకపోతే అట్లు రక్తము స్వేదముగా ప్రవహించును! ***నేడే ఇంత బాధయైతే శుక్రవారము పొందబోయే బాధ ఇంకెంతగా యుండును!*** ప్రభువు తోటనుండి బైటకు వచ్చియున్నారు. అప్పుడు ఊళ్లోనుండి యూదులు, అన్యులు, గవర్నమెంటువారు- కత్తులతోను, గుదియలతోను, కర్రలతోను ఎదురువచ్చారు. అప్పుడు ఆ మేఘఛాయ మరింత దిట్టమై పోయింది. కత్తులు, గుదియలు చూస్తే భయముండదా? తప్పకుండా ఉంటుంది. ప్రభువు భయపడలేదు. అట్టిది ఇప్పుడుంటే మనకు భయము ఉండదా? ఉంటుంది.

అక్కడనుండి ఆయనను యూదుల పంచాయితీకి, సన్‌హెడ్రిన్ సభకు అనగా 70 మంది పెద్దలు గల సభకు తీసికొని వెళ్లిరి. అప్పుడెంత బాధ! 1) మర్యాదస్తులు,

ఎరిగినవారి ఎదుట చేతులు కట్టుకొని ఉండుట ఎంత సిగ్గు, అవమానము! అలాగే యూదుల గురువైన యేసు యూదుల ఎదుట నిలువబడి ఉండుట ఎంత సిగ్గు! అది మరియొక విధమైన సమీప మేఘచ్ఛాయ. అప్పుడు వారాయనను బంధించి పిలాతు కోర్టుకు తీసికొని వెళ్లిరి. ఇక్కడ స్వజనులు, అక్కడ పరజనులు; ఇదీ సిగ్గే, అదీ సిగ్గే.

ఇక్కడ స్వజనులు శిక్షించుటకంటే అక్కడ పరజనులు శిక్షించుట మరీ కష్టమైన మేఘచ్ఛాయ. క్రమముగా ఆయనను శ్రమల మేఘచ్ఛాయ వద్దకు నడిపించుకొని వెళ్లుచున్నారు. అసలు మేఘము దగ్గరకు నడిపించుకొని వెళ్లుచుండిరి. ***ఈ నీడలన్నీ సిలువ మేఘ స్థలములు. ఈ మేఘములన్నీ క్రమక్రమముగా అసలు మేఘమైన సిలువ దగ్గరకు తీసికొని వెళ్లుచుండెను.*** అక్కడ మేఘము కుమ్మరించినట్లు వేదన, గాయములు, దుర్మరణము ఇవి ఆయనపై కుమ్మరింపబడినవి. పెద్ద వర్షము కురిసినప్పుడు ఇండ్లు ఏలాగు కూలిపోవునో, అలాగే శ్రమలు ముమ్మరముగా కుమ్మరింపబడినప్పుడు ఆయన కూలిపోయి చనిపోయెను.

మేఘచ్ఛాయలన్నీ కలసి అక్కడ ఆయనను మరణింపజేసెను. మన కాలములో ఇండియా దేశములో నున్న క్రైస్తవులకు (శ్రమల) మేఘచ్ఛాయ పోయిన సం॥నుండి కనిపించుచుండెను. మనకిది చాయకాలమే గాని సిలువకాలము కాదు. మీరు మా (హిందూ) మతములోనికి రండి, రాకపోతే మీ మతమున్న దేశమునకు పొండి, లేకపోతే మిమ్మును ఏమిచేస్తామో చెప్పమంటున్నారు. ఇదే మనదేశములోని సంఘముమీదికి వచ్చే మేఘచ్ఛాయ అయి ఉన్నది. ***గాని ఎవరికిని చీమకుట్టినట్లైనలేదు. అందరమును ప్రార్థనలో ఉంటే జయించగలము గాని లేనిచో జయమురాదు.***

20 వందల ఏండ్ల క్రిందట స్థాపించబడిన ఆది క్రైస్తవులను, అన్యులు చాలా హింసించిరి. అనేకులను చంపివేసిరి. కత్తితో నరికినవారి చేతులు నొప్పిపుట్టినప్పుడు చంపుట మానిరి. ***అట్టిది తిరిగి రానైయున్నది. మేఘచ్ఛాయ వచ్చినది గాని మేఘము ఇంకను రాలేదు.*** రానైయున్నది. ప్రార్థన చేయనిచో ఆపలేము. క్రైస్తవులందరికీ ఈ సంగతి చెప్పి ప్రార్థన చేయించవలెను. క్రీస్తుమీదికి వచ్చిన 1) మేఘచ్ఛాయలు 2) మేఘములు ఇప్పుడు సంఘముమీదికిని వచ్చును. ***గనుక సిద్ధపడి ప్రార్థించిన యెడల, అప్పుడు సహించుటకు బలము వచ్చును.*** అప్పుడు క్రీస్తునకు సిలువ. ఇప్పుడు మనకు (సంఘమునకు) సిలువ. ఇక్కడేకాదు, ఇండియా అంతట.

ఈ శ్రమలధ్యానముద్వారా రానైయున్న శ్రమలను మీరు తప్పించుకొందురు గాక! ఆమేన్.

***కీర్తన :*** *"ఇచ్చుక మిదిగాదు-మిగుల దలపోయ-ముచ్చట దీరదు= అచ్చి వచ్చిన నా - యవతారుడా నీ ప్రక్క-గ్రుచ్చు గాయము లోపల నే-జొచ్చి నీ ప్రేమ జూతు"*

*॥నాయన్న॥*





# లెంటులోని పదిహేనవ దినము - శుక్రవారము

## సిలువ శ్రమల గుంపు

మార్కు 15:42-47.



**ప్రార్థన:- తండ్రీ! నీ ఘన నామమునకు వందనములు. నీ శ్రమల ద్వారా మాకు పాఠము నేర్పించుచున్నందుకు నమస్కారములు. నీ సహింపును, జయమును మాకును దయచేయుదువని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

నిన్న వాక్యములో శ్రమల నీడలయొక్క గుంపుల గురించి వివరించితిని. అవి మన ప్రభువుయొక్క శ్రమ, మరణ చరిత్రలో తటస్థమైనవి. అయితే ఈ వేళ ఆ నీడలగుంపు గురించికాదు, మన శ్రమల గుంపు గురించి చెప్పవలెను. **మన రక్షకుడు శ్రమలు అనుభవించినాడు. మనముకూడా శ్రమలు అనుభవించి తీరవలెను.** ఇతరులు అనగా అన్యులు మనమధ్యను నిలువబడి, మనమీద ప్రశ్నలు వేయుచున్నారు. ఈలాగు 'అన్యులనే పేరు' కొందరికి, ముఖ్యముగా గవర్నమెంటుకు ఇష్టము లేదు. మేము అన్యులమా? మీరేనా స్వదేశీయులు? అని అందురు.

ఇక్కడ ప్రభువు శ్రమల గుంపున్నది. అక్కడ మన శ్రమల గుంపున్నది. అన్యులంటున్నారు: యేసుప్రభువు ఇన్ని శ్రమలు పొంది సహించిరిగదా! ఆయన నామమును స్మరించు మీరేమి అనుభవించుచున్నారు? అంటున్నారు. జవాబు ఏదనగా ఆయన నామమందు శ్రమలు భరించుటకు మేము సిద్ధమే. అయితే క్రైస్తవులు, ఇతరులుకూడా కొన్ని శ్రమలు అనుభవిస్తున్నారు. అవి ఎన్ని రకములైన శ్రమలనగా ఐదు రకములైన శ్రమలు.

**1) శ్రమ:-** వంశపారంపర్యముగా వచ్చిన శ్రమ.ఏదనగా చిన్నప్పుడు చంటి పిల్లలు జబ్బుచేసి చాలా బాధపడుచుంటారు. కారణం వంశపారంపర్య పాపమునుబట్టియే వారికి ఈబాధ. పిల్లలకు, యౌవనస్థులకు, పెద్దలకు, వృద్ధులకు వారి వంశములోనున్న శ్రమ, కీడులను తొలగించుకోవలెను గాని తొలగించుకోలేము. తొలగించుకొనుటకై మనము ప్రయత్నము చేస్తాము గాని కొంతవరకే శాంతి, పూర్తిగా కాదు. ఇక్కడున్న మనందరిలో ఎవరికైనా వంశపారంపర్య జబ్బు, కష్టము, దుర్బుద్ధి ఉన్నదేమో పరీక్షించండి. అప్పుడు మనము క్రైస్తవులము. నొప్పి గనుక వంశపారంపర్యమును బట్టి వచ్చిన వ్యాధితో మనకేమి సంబంధములేక పోయినా,

Bible Mission HQ Guntur

వచ్చిన బాధనుబట్టి తప్పక ప్రార్థనలో పెట్టాలి. దేవుని చిత్తమైతే పోతుంది, లేనియెడల చనిపోవువరకు అట్లే యుండును. పెద్దల జబ్బు మనకు వస్తుంది, ప్రార్థించినా పోదు. అది ప్రభువు పూర్తిగా తీసివేస్తే తీసివేస్తారు. ఆయన తీసివేయుట మన ఆత్మీయ జీవితానికే కీడు. అందుకని తీసివేయరు. అనేకులకు ఇది తెలియదు. పౌలుకూడా నాశరీరములో ఒక ముల్లున్నది. దానిని తీసివేయమంటే తీసివేస్తాడు. గానీ ఆయన తీసివేస్తాను అనక 'నా కృప నీకు చాలు' అన్నారు. "**భక్తుడు శ్రమకు సహిస్తే పిశాచి సిగ్గుపడును**".

**2) శ్రమ:-** 1.మనిషి అశ్రద్ధగా ఉంటే ఏదో ఒక దెబ్బ తగలనైనా తగులును. ఉదా:- ఫుట్‌బాల్ ఆడే కుర్రవాడు గోల్ చేయాలనుకొని కొడితే, అశ్రద్ధవల్ల దవడమీద దెబ్బ తగిలింది. అయితే అది వంశపారంపర్యము గాదు. అశ్రద్ధ దెబ్బలు అనేకములు. ఇది మనకు అనుభవమే. మరియొక సంగతి ఏమనగా, స్టేషనులో బండి ఆగును. ఒకరు దిగుచున్నారు. ట్రైను తిరిగి కదలగా క్రిందపడి దెబ్బలు తగిలెను. అది అశ్రద్ధ. అశ్రద్ధవలన వచ్చిన శ్రమలు సహించుకోవలెను గాని ఏడ్చినట్లైతే పోవునా?

**3) శ్రమ:-** శత్రువులవల్ల బాధ. అనగా శత్రువులు మనమీద పగపట్టి అన్యాయముగా బాధించి కోర్టుకు లాగుట, రౌడీలతో కొట్టించుట, ఇల్లు దోపిడీ చేయించుట; ఇవన్నియు శత్రువులవల్ల జరిగిన బాధలే గాని వంశపారంపర్య బాధలు కావు.

**4) శ్రమ:-** మనిషి పాపము చేసినందువల్ల లేదా ఒకరిని కొట్టినందువల్ల అవతలవారు పోలీసువారికి రిపోర్టు చేస్తే ఇతనికి శిక్ష. ఇంకొకరు వేరొకరిని చంపితే అతనికి ఉరి. ఆ ఉరి తన పాపమువల్ల వచ్చినది. గాని వంశపారంపర్య పాపమువల్ల వచ్చినది గాదు. అది తప్పదు. భక్తులకైనా పాపముచేస్తే, ఫలితము తప్పదు. భక్తులకైనా వంశపారంపర్యంవల్ల వచ్చిన శిక్ష కొంత వరకు తగ్గ వచ్చును, ఈ నాలుగు రకాల ప్రార్ధనల వల్ల. అయితే, అశ్రద్ధవల్ల వచ్చిన శిక్ష, శత్రువులవల్ల వచ్చిన శిక్ష తప్పదు. గాని ప్రార్థనవల్ల శ్రమ తగ్గినప్పుడు దేవునికి మహిమ, తనకు మేలు. సహింపువల్ల తనకు మేలు.

**5) శ్రమ:-** ఇది మహా గొప్పది. అదేమనగా నీవు బజారులో ఒక వీధిలో కీర్తనలు పాడుచూ, బైబిలు చదువుచూ, ప్రసంగిస్తూ ఉన్నప్పుడు మత విరోధులు వచ్చి నిన్ను పట్టుకొని చితుకబాది ఈడ్చివేస్తారు. ఆలాగు జరుగుట దేనినిబట్టి? వంశపారంపర్యమా? పొరబాటునుబట్టియా? కాదు. మత విరోధమునుబట్టి.

యేసుప్రభువు నిమిత్తమై ఆ శ్రమ వచ్చెను. అది చాలా మంచిదే. క్రైస్తవులను మత విరోధులు చంపుచున్నారు. అపొస్తలులులో 7 గురిలో ఒకడైన స్తెఫనును చంపుచుండగా 'వీరిని క్షమించుము' అని ప్రార్థించి చనిపోయెను. దేవుడు అతనికి మరణం తప్పించకరానిచ్చెను.

**6) శ్రమ:–** స్తెఫను గొప్పతనము (అతిశయము) ఏమనగా, నేను ప్రభువు కొరకు చనిపోయినాననేది. స్తెఫను బంధువులు క్రైస్తవులై యుంటే, మాలో ఒకరు మా ప్రభువు కొరకు భక్తినిబట్టి, హతసాక్షిగా చనిపోయెనని చెప్పుకొందురు. పాపమును బట్టి కాదు అని ఘనంగా చెప్పుకుంటారు. గనుక ప్రభువు నిమిత్తమై కష్టము, నష్టము అనుభవించినా; లేని పోని నిందలు, దెబ్బలు అనుభవించినా; అన్యాయముగా జైలుకు వెళ్లినా; ప్రభువును బట్టి హతమై పోయినా; ఈ 6 అంశములద్వారా ఆ భక్తులకు కీర్తి. ***భక్తుడంటే పైవన్నీపడి అనుభవించి సహించినవాడే. చిన్నమాట పడనివానిని భక్తుడంటారా? పై 6 సహించి స్తుతించిన వారే భక్తులు.*** పై ఆరునూ అందరికి కావాలని చెప్పను, రావాలని కోరను. ఒకవేళ వస్తే! 1) ప్రభువునుబట్టి సహించాలి. 2) క్రీస్తు మతానికి పేరుతేవడానికి సహించాలి. ***అట్టివారు హతమైననూ. మా మతము సత్యమతము, జీవమతము, పరలోక మతము, దైవమతము గనుక కీర్తి తెచ్చినాము అని చాటించగలరు.*** అప్పుడు మా గ్రామ, సంఘ తరుపున ఫలాని వారు హతసాక్షి అయ్యారు. మా ప్రభువునకు కీర్తి, క్రీస్తునకు కీర్తి అని అందరు సాక్ష్యమియ్యగలరు. ఇతరులకు ఇతర మతములకు ఈ సంగతులు మాదిరి. ***ఇవన్నియు వ్రాయుట, వినుటేకాదు. హృదయములో ఉంచుకొని ఆ ప్రకారము నడుచు కోవాలి. గ్రహింపు, సహింపు కలిగియుండాలి. అప్పుడు మీరు ఇహపరములయందు ధన్యులైయుంటారు.*** ప్రభువు తన శ్రమలన్నీ సహించి భరించుకున్నారు గనుక మరణము వచ్చినా తిరిగి పునరుత్థానమైనారు.

ఆలాగు అన్ని విధములైన శ్రమలను ఓర్పుతో సహించుకొని, శ్రమలనుండి పునరుత్థానమగు ధన్యత ప్రభువు మీకు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన:*** *"మరణంబులో నాకు చిర జీవమెవ్వారు! – మరణంబునకైె గొప్ప – మరణ మెవ్వారు = విరివి లేని మహిమ సేనలు – దరిని నుండగ నన్ను చెంతను – స్థిరముగా స్థాపించు నెవరు! సిల్వబడ్డ యేసుక్రీస్తే!"* ॥నాకింత॥

# లెంటులోని పదహారవ దినము - శనివారము

## సిలువ మన కొరకే

యెషయా 53:3; లూకా 23:33-43; II కొరింథి 5:21.



**ప్రార్థన:- తండ్రీ! నీవు చేసినవన్నీ మా కొరకే. నిన్ను నీవే మా కొరకు ఇచ్చివేసికొన్నావు గనుక నీకు స్తోత్రము. పాప మెరుగని నీవు మా కొరకు అన్నీ చేసినావు. తుదకు నీవే పాపమైనావు. ఏమి గ్రహించగలము! ఈ నీ చరిత్రను తలంచుకొని కృతజ్ఞతా హృదయముతో కన్నీటి వందనములు ఆచరించు కృప దయచేయుము. ఆమేన్.**

'మనకొరకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను' అని ప్రవక్తయైన యెషయా వ్రాసినాడు. ఇది క్రిస్మస్ పాఠము. క్రిస్మస్ చరిత్ర, క్రిస్మస్ ప్రవచనము. ఈ ప్రవచనములో ముఖ్యమైన మాట 'మనకొరకు'. ఈవేళ మన ప్రసంగము కూడా 'మన కొరకు' అనే మాటే. II కొరింథి 5:21లో పాపములేని ప్రభువును మనకొరకు పాపముగా చేసెను. ఇప్పుడు యెషయా వ్రాసింది చూద్దాము. యెషయా జన్మచరిత్ర పోలు మరణచరిత్ర వ్రాసిరి. జన్మము మనుష్యుని జీవితములో మొదటిది, చివరిది మరణము. యేసుప్రభువుయొక్క జన్మము మొదలు మరణము వరకు ఈ మధ్య ఉన్నది, జరిగినది అంతయు, అనగా ఏమి చెప్పినారో, ఏమి జరిపినారో, ఏమి అనుభవించినారో అదంతయు మనకొరకు. ***మొదటినుండి చివరి వరకు మనకొరకే.*** చివరినుండి చిట్ట చివరివరకు మనకొరకే. అనగా మరణమొంది, సమాధిలోకి వెళ్ళిన తరువాత జరిగిన పునరుత్థానము, ఆరోహణము, రెండవరాకడ, వెయ్యేండ్ల పరిపాలన, సజీవుల తీర్పు అంతా మనకొరకే. క్రీస్తు తన కొరకు కాదు అంతా మనకొరకే.

యెషయా 53లో ఆయన ఈలోకమునకు వచ్చి, సిలువ మరణము పొందుదురని ప్రవక్తలందరు ఆయనను గురించి వ్రాసిన వ్రాతలన్ని మనకొరకే. పాత నిబంధనలో ప్రభువును గూర్చి చూచాయగా ఎక్కడెక్కడనున్నదో, ఎక్కడ స్పష్టంగా నున్నదో పరిశీలించవలెను. 'మనకొరకు కుమారుడనుగ్రహింపబడెను, మనకొరకు శిశువు పుట్టెను' అని ఈ విషయము స్పష్టముగా నున్నది. కొన్ని స్పష్టముగాను, కొన్ని చూచాయగాను ఉన్నవి. ఈ రెండును మనకొరకే. బేత్లెహేములో పుట్టుట, యెరూషలేములో శ్రమపడి, కల్వరిలో సిలువ వేయబడుట అన్నీ మనకొరకే. గనుక ఆదికాండమునుండి ప్రకటన వరకు 66 పుస్తకములలోను ఎర్ర సిరాతో మన కొరకే వ్రాసెను. అదంతయు మనకొరకే. గనుక ఈ 66 పుస్తకములలోని కథేగాదు, అనాదిస్థితికూడ మనకొరకే గాని, అది మనకు తెలియదు. ఆదినుండి మనకు తెలుసు.

Bible Mission HQ Guntur

ఆదికాండములో సృజింపబడిన భూమి, వెలుగు, నీరు, గాలి, నేల, పంటలు అవన్నియు మనకొరకే. ఆలాగుననే క్రీస్తు ద్వారా కలిగిన సృష్టి అంతయు మనకొరకే. యోహాను 1:1లో ఆయన లేకుండా ఏమియు కలుగలేదు అని ఉన్నది. గనుక కలిగినదంతయు ఆయనవల్ల కలిగినది. అదంతా మనకొరకే. ఇదంతా మనకొరకే. ***గాన ఇక్కడ, అక్కడ, ఎక్కడైన మనము ధన్యులమే.*** అన్ని కాలములలో, అన్ని స్థలములలో ధన్యులమే. చివరగా పరిశుద్ధులుగానున్న, పాపులగానున్న ధన్యులమే. ఎందుకనగా మన పాపములన్నీ ఆయనమీద వేసికొన్నారు. గాన మనము పాపములలో పడినను ప్రభువు లేవదీయుటకే వచ్చెను. గాన ధన్యులమే. ఆయన మోయడానికే వచ్చెను. గాన మన మీదనుండి పాపభారమును తీసివేసి ఆయన మీద వేసుకొని మోయవలసిందే. ఇక పాపములు మనమీద లేవు. ఆయన మీదనే ఉన్నవి. మనము పాపము చేసినప్పుడు మనము పాపులము. ఆయన వచ్చి అవి తనమీద వేసికొన్నందున ఆయన పాపి. మనము పరిశుద్ధులము. ఆ కథ సిలువ మ్రానుపై జరిగింది.

ఎప్పుడైతే ఆయన తనపై వేసికొన్నాడో ఆయన మన శిక్ష అనుభవించి మరణముపొంది, సమాధియై మూడవ దినమున లేచి మరణము దులిపివేసెను. తరువాత చావు ఆయనమీద లేదు. చావు ఇకముందుకు మనమీదకూడ ఉండదు. ఆయన చావును దులిపివేసి, మహిమ శరీరముతో నున్నారు. రాకడప్పుడు మనలనుకూడ మహిమ శరీరధారులుగా చేస్తారు. (II కొరింథీ 5:21)లో ఉన్నట్లు ఆయన తన కుమారుని ఈలోకమునకు పంపుటద్వారా పరిశుద్ధుని పాపముగా చేసెను. ఈ వాక్యము చదివితే కొందరు అభ్యంతర పడుదురు. అదెంత చెడ్డమాట అందురు. మనము గ్రహించలేము గాని ఒక్కమాట ద్వారా గ్రహించగలము. ఏలాగనగా పాపమెరుగని ఆయనను మనము పాపిగా చేసినాము. మన పాపమే ఆయనను సిలువకు అంటగొట్టెను. గాని ఆయన పాపములేని పరిశుద్ధుడు. కాబట్టి ఆయనజన్మ ఏలాగు మనకొరకో, ఆలాగే ఆయన మరణముకూడ మనకొరకే. శిశువు పుడితే సంతోషము, చనిపోతే దుఃఖము. ఆలాగే ప్రభువు బేత్లెహేమునందు జన్మించగా సంతోషించినాము. గాని తన చావునందు ఆయన మన పాపములు తనపై వేసికొని మనకు విడుదలనిచ్చి మనకు తేలిక చేసినందున సంతోషించవలెను. మన జన్మ లక్షణము ఏదనగా ***జన్మ సంతోషము; చావు దుఃఖము*** గాని ప్రభువు విషయములో జన్మ, చావు రెండునూ సంతోషమే. ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతిగా అగునట్లు తన చావుద్వారా చేసెను గనుక సంతోషించాలి. మనలను నీతిగాను ప్రభువు పాపిగాను చేసెను. ఆయన పాపిగా కాకపోతే మనకు నీతి లేదు. గాన సంతోషించాలి. ప్రభువు

మరణమువలన మనకు మేలే. ఇందులో ఒక రహస్యమున్నది. అదేమనగా ఇతర మతస్థులు ఈ విషయమును గూర్చి మనము పాపము చేయుటేమిటి? దేవుని కుమారుడు చనిపోవుటేమిటి? ఇది కేవలము అన్యాయము అంటున్నారు. క్రైస్తవులు జవాబు చెప్పుట కష్టమేగాని పండితులు చెప్పివేసిరి. ఒక మనిషి అప్పులపాలైనాడు. ఒక ధనికుడు ఆ పేదవానిపై జాలిపడి అతని అప్పులు తీర్చును. అతను అప్పులవల్ల పేదవాడు. ధనికుడు తీర్చినందున సంతోషము. ఇతను తీర్చినట్లే ప్రభువు తీర్చుట అన్యాయము కాదు. అప్పు చేయుట ధనికుడు తీర్చుట అనరుగాని ప్రభువు తీర్చినాడు అంటారు. ప్రభువును అన్నారు గనుక ధనికుని అనాలి. ధనికుని అనకపోతే ప్రభువును అనికూడ అనకూడదు

ప్రశ్న: ఈ ప్రశ్న ఇప్పుడు హిందూ దేశములో బలముగా ఉన్నది. మొదట కలకత్తాలో బలంగా పుట్టెను. ఇప్పుడు అక్కడ తగ్గి మన ప్రాంతములలో బలంగా ఉంది. ఆయనను అన్యాయముగా హింసించుట ఏమి న్యాయమనే వాదము! క్రైస్తవులేమని చెప్పాలంటే, సరే! మనిషి పాపము చేసినందువలన శిక్ష అనుభవించునట్లు ఇక్కడున్నవారు అనుభవించగలరా? లేరా అని చెప్పాలి. ***నిజముగా ఆ సిలువే మనకు వస్తే బ్రతుకలేము.*** ఆయన దేవుడుగాన బ్రతికివచ్చెను. మనము సిలువ మోయవలసివస్తే మనకు చావే గాని బ్రతుకలేము. ప్రభువు చావనూ చనిపోయెను, లేవనూ లేచెను. గాన ప్రభువు మరణము వలన మనకు సంతోషము. ప్రభువుకు బాధాకరము మరణకరమైన చరిత్ర.

క్రైస్తవులందరు ఈ దినము చాలా ఏడ్చెదరు. కథోలిక్కులు ఎక్కువ అంగలార్చెదరు. ఈ దినము వారు ప్రభువు విగ్రహము కొయ్యపైపెట్టి ఆనాడు జరిగినట్లు ఈ దినము జరిగించుచు ఏడ్చెదరు. అది తప్పని చెప్పను గాని, ఆ అప్పుల వానికి దిక్కులేకపోగా ధనికుడు తీర్చినందున ఆ బీదవాడు కృతజ్ఞతతో కన్నీరుకార్చి, నా ఋణము తీర్చి, నను విడిపించినావనే కృతజ్ఞతతో ఏడ్చును. అదే కథోలిక్కుల ఏడ్పుయినది, దుఃఖ కన్నీరుకాదు. ఋణము తీర్చినందున వచ్చే కన్నీరు. కృతజ్ఞత కన్నీరు. మన ధ్యానములో అట్టి కృతజ్ఞత కన్నీరు కార్చాలి. దుఃఖ కన్నీరుకూడా ఆయనకింపే. మన విశ్రాంతి సమయములోను, ప్రభువు ఉపకారములు తలంచితే కన్నీరు వచ్చును. ఇది అయ్యగారియొక్క, మనయొక్క అనుభవము. దుఃఖకన్నీరు అయ్యగారికి రాలేదు, కృతజ్ఞత కన్నీరు వచ్చినది.

***మూడు కన్నీళ్లున్నవి:*** *1)* పశ్చాత్తాప కన్నీరు. ఇది చాలా మంచిది. ఇది అయ్యగారికి కుదిరిందట. *2)* శ్రమ చూచినందున దుఃఖముతో వచ్చిన కన్నీరు. ఇది అయ్యగారికి కుదరలేదు. ఇది తప్పులేదు. *3)* కృతజ్ఞత కన్నీరు. ఈ కన్నీరు అయ్యగారికి వచ్చాయట. రెండవ దానిలో శ్రమచూచి దుఃఖించనక్కరలేదు. మనలను నీతిమంతులుగా తీర్చుటకు

ప్రభువుకు శ్రమలవల్ల కన్నీళ్లు రాలేదు. గనుక మనకును రాకూడదు. 40 దినములలో అయ్యగారికి వచ్చిన ప్రశ్న. బాధలో ఎవరైనా అమ్మో! బాబో! నాయనో! అని మూల్గుదురు కదా! ఈ మూడు ప్రభువుకు వచ్చెనా? ఈ మూడింటిలో ఏదైనా వచ్చెనా? అని వచ్చెనట. సువార్తికులు ఆ సంగతి వ్రాతలలో ఎక్కడ వ్రాయలేదు.

ప్రశ్న: ఆయన ఎప్పుడైన మూల్గెనా? తనయొక్క బాధ మనుష్యులందరు అనుభవించే బాధకంటే ఎక్కువైన బాధ గనుక ఆ బాధకు గుర్తుగా ఏలీ, ఏలీ, లామా, సభక్తానీ అనగా నా దేవా! నా దేవా! నన్నెందుకు చెయ్యి విడిచితివి. ఆ మాటలో ఎక్కువ బాధను చూపించిరి. గాని నిరాశ రాలేదు. ఈ పోకిరి గుంపును అనగా ప్రభువును శ్రమపర్చే గుంపును గూర్చి మొదటి మాటలో తండ్రీ! వీరిని క్షమించు అని అన్నారు. ఏడు మాటలలో మనిషివలె నా దేవా! అనే వరుసలో పిలిచెను. తండ్రీ! అనేది ఇతరులను గూర్చినన్నీ; నాదేవా! అనేది తన్ను గురించినీ పలికెను. గనుక సిలువ ధ్యానములో ఎన్నో మాటలున్నవి.

ప్రభువు జన్మ చరిత్ర మొదలు మరణ చరిత్ర వరకు మధ్యలో నున్న సంగతులన్నీ, మనిషిని శ్రమపర్చేవన్నీ గుంపుగా కనిపించుచున్నవి. ***సిలువమ్రానుమీద అన్నీ ఉన్నవి.*** 1) బాల్య చరిత్ర, 2) కొండ చరిత్ర, 3) రోగులను బాగుచేసిన స్వస్థత కనిపించుచున్నది. సిలువ మీదికి వెళ్లకముందు మృతులను లేపినట్లు, సిలువమరణములోను మృతులను లేపిరి. ***ప్రభువు జీవితచరిత్రలోని విషయాలన్ని సిలువ చరిత్రలో కనిపించుచున్నవి.*** మీరందరు ఇప్పుడు ధ్యానములో ఉండి చూడండి. ఆనంద భాష్పము కొరకును అప్పుడే కన్నీరు ఉపవాసము దేవునికి అంగీకారమగును.

చిన్నప్పుడు అయ్యగారు ఏడ్చి, ఏడ్చే వారిని నవ్వించేవారట. అయ్యగారి టీచరు దొర చనిపోగా ఆయన భార్య మిస్సమ్మ తన దేశము వెళ్లుచుండగా, అందరూ ప్రోగుచేసి కొంత చందా ఇచ్చిరట! వారిని గూర్చి వ్రాసిన మాటలు ఫేర్‌వెల్ మీటింగులో చదువుచున్నారట! చదువుచున్నప్పుడు కన్నీరుకారుతున్నదట. ఆ ఏడ్పుకు ఎక్కుళ్లు వచ్చెను. ఆ దొరసానిగారు ఏడ్చుచున్నారు. అయితే, ఈయన ఏడ్చుచుండగా అమ్మగారికి చిరునవ్వు వచ్చిందట. అలాగే మీ ఏడ్పు ప్రభువుకు చిరునవ్వు తేవాలి. ఈదినము చెప్పినదంతా నా కొరకే. మీలో ప్రతివారి కొరకే" "ఈ దిన ఉపవాస ధ్యానములో చేసినదంతా నా కొరకే. అనుకొనువారు ధన్యులు.

దేవుడు ఈ కొద్దిమాటలను దీవించునుగాక! ఆమేన్.

***కీర్తన:*** *"తల వంచి సిగ్గున – నే జేయు నేర – ముల నెంతు నాలోన = బలుమారు*
*నీ గాయముల – గెలికి నిన్ శ్రమ పరచు నా – ఖల దోషములకై ఇపుడు–*
*విలపించి వేడుకొందు"* *॥నా యన్న॥*

# లెంటులోని మూడవ ఆదివారము

## మూడు సిలువలు

లూకా 23:33.



**ప్రార్థన:- ఓ దేవా! మానవుని కటాక్షించినావు. మాకు రావలసిన శిక్ష భరించుటకు నిన్ను నీవు శత్రువులకు అప్పగించుకొన్నావు. నీ కృపకు వందనములు. ఈ ధ్యానము వలన మా ఆత్మకు శాంతి, కృతజ్ఞతా హృదయము దయచేయుము. వర్తమానము దయచేయుము. ఆమేన్.**

**ప్రసంగము:-** మూడు సిలువలు, మరి మూడు సిలువలు నేడు జ్ఞాపకము చేయుచున్నాను. అవే తలంచుకొనండి. క్రీస్తు ప్రభువు కల్వరిమీద సిలువ వేయబడిన తరువాత, కుడివైపున ఒకరు ఎడమవైపున ఒకరు సిలువవేయబడిరి. అవి మూడు సిలువలు. ఆ విధానమున మూడు సిలువలు జ్ఞాపకము చేస్తున్నాను. సిలువ అనగా బైబిలు అర్ధము, శ్రమ. శ్రమ అనగా సిలువ. ఈ రెండు మాటలకు ఒకే అర్ధము. మనకు చిన్న చిన్న శ్రమలు కలుగును అనగా అవి చిన్న చిన్న సిలువలు. క్రీస్తు ప్రభువుకు గొప్ప శ్రమలు అనగా గొప్ప సిలువలు. ***క్రీస్తు రాకముందు సిలువంటే భయము, అనగా శ్రమ అనగా భయము. అయితే ప్రభువు వచ్చిన తరువాత భయములేదు. ఎందుకనగా ఆయన భరించెను.*** ప్రభువుకు వచ్చిన శ్రమలు క్రీస్తు ప్రభువు యొక్క మనస్సునకును మరియు శరీరమునకును కలిగినవి.

లోకము చాలా పెద్దది. ఆ లోకములోని అందరియొక్క పాపములు ఆయనమీద నున్నవి. అవన్నీ కలసినా ఎంత పెద్దవగునో మనము ఊహింపలేము, కొలువలేము. అందుకే 'లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల' అని యోహాను వ్రాసెను. ఈ వాక్యములో లోకమంతటి పాపములు, అన్ని పాపములు కనబడుచున్నవి. వాటన్నిటినీ మోసే గొర్రెపిల్ల కనబడుచున్నది. లోకముయొక్క, లోకములో నున్న జనులందరియొక్క పాపములు మోయుచున్న గొర్రెపిల్ల కనబడుచున్నది. మరియు ఆ గొర్రెపిల్లలో దేవుడు కనబడుచున్నాడు. ఎందుకనగా అది అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులయొక్క గొర్రెపిల్లకాదు. అది దేవుని గొర్రెపిల్ల. సర్వలోక పాపభారమే అన్నిటికన్న గొప్ప బరువైన సిలువ. క్రీస్తు ప్రభువు ఒక మనిషియొక్క పాపములు వేసికొనలేదు. అనేకుల పాపములు వేసికొని, కొందరివి మానివేయలేదు. అందరియొక్క పాపములు, అన్ని పాపములు తన మీద వేసికొనెను. అన్ని కాలముల పాపములు

వేసికొనెను. కయీను కాలమునుండి ప్రభువు కాలము వరకు ఉండే వారి పాపములు, అక్కడ నుండి రేప్చరువరకు ఉండే వారి పాపములు, అక్కడ నుండి అంత్య తీర్పువరకు పుట్టే వారందరి పాపములు ఆయన వేసికొనెను.

1. కయీను నుండి క్రీస్తు ప్రభువు సిలువవరకు ఉన్న వారి పాపములు ఒక సిలువ.

2. అక్కడనుండి రేప్చర్ వరకు నుండే వారి పాపములు, రెండవ సిలువ.

3. అక్కడనుండి తీర్పు వరకునుండే వారియొక్క పాపములు మూడవ సిలువ.

ఈ మూడు సిలువలు నమ్మనివారు ఒక జట్టు. నమ్మినవారు ఒక జట్టు. వీరికి విముక్తి. నమ్మని వారికొరకు కూడా వారి భారము ఆయన మోసెను గాని వారంగీకరింపలేదు. 'అనేకుల కొరకు చిందించెను' అని వాక్యములో గలదు. ఎవరు ఆ అనేకులు? నమ్మిన అనేకులు, నమ్మనివారనేకులు కలరు, అయితే నమ్మని వారు అంగీకరింపలేదు. గనుక అందరికొరకు చిందించెను అని వ్రాయబడినది వారు అందుకోలేదు. అనేకుల కొరకు అనగా నమ్మిన అనేకుల కొరకు అని అర్ధము. కయీను కాలమునుండి ఏలాగు మోసెను? ఆయన వట్టి మనిషి అయిఉండి, సిలువమీద ఉండే మోయలేదు. ఆయన దేవుడు గనుక మోయగలిగినాడు. ఆయన దేవుని గొర్రెపిల్ల గనుక కయీను దగ్గర ఉన్నాడు. అప్పటినుండి ఉన్న వారికి విమోచన. లోక పాపములు మోయుట ఆయన కిష్టమాయెను. ఉదా: ఒకరు సంతర్పణ చేసినారు. అందరి కొరకు చేసినారు. అయితే, రాని వారికి అందదు గదా! **వారు రానందున వారికి సిద్ధము చేయలేదని అనరాదు**. వారికిని ఉన్నది గాని వారు రాలేదు. అలాగే క్రీస్తుప్రభువు అందరి కొరకు మోసినాడు. ***మోసినది బలమైన సింహముకాదు, పెద్ద ఏనుగుకాదు, పెద్ద ఒంటెకాదు, సాధువైన గొర్రెపిల్ల.*** ఆయన గనుక విసుగుకొనలేదు, మోయననలేదు. సహించినందున క్రీస్తు ప్రభువుకు జయము.

***1) లోక పాపములు ఒక సిలువ. 2) అంతరంగ సిలువ:*** క్రీస్తుప్రభువుయొక్క అంతరంగము లేక మనస్సు ఈ సిలువను మోసినది. అన్న, కయప, సన్‌హెడ్రిన్, హేరోదు, పిలాతు ఈ కోర్టులలో చేయని నేరముల సిలువ ఈ అంతరంగ సిలువలో ఉన్నాయి. లోక పాపములన్ని వేసికొన్నది మొదటి సిలువ. ఇక్కడ క్రీస్తుప్రభువు నేరముల సిలువ మోసారు. అనగా ఆయనలో నేరములు లేకపోయిననూ, నేరములు చేసినాడని మోపిన నేరాలన్నీ ఆయనకు ఒక సిలువయైయున్నవి. మొదటి సిలువలో లోకస్తుల పాపములన్నీ కయీను వద్దనుండి సజీవుల తీర్పు వరకు ఉన్నవారందరి పాపాలు ఆయన మోసారు. అంత పొడుగైన సిలువ అది.

ఇక్కడ ప్రత్యేకమైన సిలువ గలదు ఆ సిలువ ఏమి? 1. తాను మనిషైనప్పటికిని, దేవుడనని చెప్పుకొనుచున్నాడనిరి. అది ఒక నేరము. ఎవడు దేవుడని చెప్పుకొనునో, వాని చంపవలెనని మోషే ధర్మశాస్త్రము చెప్పుచున్నదనిరి. అది ఒక నేరము. 2. యూదుల రాజునని చెప్పుకొనుచున్నాడు. అడిగి చూడండి! అది ఒక నేరము. 3. గలిలయ మొదలు యూదయ వరకు చక్రవర్తికి పన్ను ఇవ్వద్దని ప్రజలను రేపుచున్నాడు. ఇది గవర్నమెంటుకు విరోధముగా నేరము.

(1) దేవుడనని చెప్పుకొనుట, దేవునికి విరోధముగా నేరము.

(2) సన్‌హెడ్రిన్ సభకు విరోధముగా రాజునని చెప్పుకొనుట.

(3) గవర్నమెంటుకు విరోధముగా తిరుగుబాటు నేర్పుట.

ఈ మూడు గొప్ప నేరములు ఆయనమీద మోపినారు. ఆ కాల ప్రజల సిలువలు మూడు, నేరములు మూడు. ఈ నేరములవల్ల మనస్సునకు హాని, చింత, విచారము. ఆయనలో నేరములు లేకపోయినా నేరములు మోపినారు.

ఒకటవ సిలువ దైవత్వముయొక్క సిలువ. అది దేవుని గొర్రెపిల్ల తప్ప మరెవ్వరును మోయలేని సిలువ. ఇంకెవ్వరు మోయలేని పాపము. రెండవ సిలువ ప్రభువుయొక్క మనుష్యావతార సిలువ. క్రీస్తు ప్రభువు అనే మనుష్యునియొక్క సిలువ. ఒకటవ సిలువ దేవత్వముమీదపడిన సిలువ. రెండవది ఆయన మానవత్వము మీద పడిన సిలువ. ముష్యులందరిమీద మోపవలసిన నేరములు ఆయనమీద నున్నవి. అనేక కోట్ల జనులు చేసిన పాపములు మోసిన ఆయన, ఈ మూడు నేరములు మోయలేడా?

క్రీస్తుప్రభువు సిలువమీద నున్నప్పుడు ఒక బంటు బల్లెముతో పొడిచినప్పుడు నీరు రక్తముకారెనని గలదు. రక్తము కారుట సహజముకాని నీరు కారుట సహజముకాదు. ఆయన శరీరములో నీళ్ళెక్కడివి. గురువారము పస్కాలో నీళ్లు త్రాగినాడేమో! తోటలో నీళ్ళులేవు, దారిలోనులేవు. సిలువమీదను నీళ్ళులేవు. గనుక ***ఈ నీరు మనో విచార జలము.***

'అయ్యో! నా గుండె నీరై పోయినది, మనస్సు నీరైపోయినది' అందుము గదా! ఆయనకు విచారము కాదా! లోక పాపములన్నీ మోస్తే, కొందరే అంగీకరించినారు. అందరు అంగీకరించలేదు. విచారముకాదా! లేనిపోని నేరాలన్నీ వేసినారు. విచారముకాదా! ఈ రెండు విచారములవలన ఆయన రక్తము నీరాయెను. అందుచేత నీరుకూడా కారెను.

Bible Mission HQ Guntur

**3. కర్ర సిలువ:-** 1) లోకపాపములు లోకమునకు సంబంధించినవి. 2) నేరముల సిలువ, లేనిపోని నేరముల వలన మనస్సునకు కలిగిన సిలువ. 3) కర్ర సిలువ ఇది శరీరమునకు సిలువ. 1. ***ఆత్మకు విచారము కలిగించే సిలువ. 2. మనస్సుకుబాధ కలిగించే సిలువ. 3. శరీరమునకు బాధ కలిగించే సిలువ.*** మూడవది మనుష్యావతార శరీరమునకు సిలువ. ఈ కర్ర సిలువ చాలా భారమైన సిలువ. ఎంత భారము లేకపోతే అలసి తూలిపోవును. ఇంకొకరిమీద ఎత్తవలసివచ్చును. ఈ మూడునూ భారమైనవి. ఏది ఎక్కువ భారమైనది? నా పాపముల భారము ఆయనకు ఎక్కువ *బాధకరమైనది అని మనము హృదయములలో ధ్యానింపవలసినది.*

ఈ మూడు సిలువలు ధ్యానించుచు మీ హృదయములను దుఃఖముతో నింపుకొనవలెనని చెప్పుటలేదు. ఆయన మూడు సిలువలు మోయుట మానవుల కొరకే, దుఃఖపడుటకు కాదు గానీ సంతోషించి స్తుతించుటకే. ఆయన 1) మీ వ్యసనములను, 2) శిక్షను, 3) వ్యాధులను భరించెను. ఈ మూడు సిలువలు మనమీద నుండి తీసివేయుటకే ఆయన వాటిని మోసెను. గనుక కృతజ్ఞతతో నుండవలెను. ప్రభువా! లోకపాపముల సిలువ, నేరముల సిలువ, కర్ర సిలువ మోసినావు. నా వ్యాధి సిలువ, శిక్ష సిలువ, వ్యసనముల సిలువ మోసినావు గనుక నీకే వందనములు అని చెప్పుట ఈ మంచి శుక్రవార ధ్యానమైయున్నది. అందరు మంచి శుక్రవారమున దుఃఖముతో యుందురు. ఈ దినము దుఃఖాంతదినము. ఈ దినము దుఃఖానంద దినము.

నేటి ధ్యానమును బట్టి, మూడుసిలువలు మోసిన క్రీస్తు ప్రభువు మనలను అట్టి దుఃఖానంద స్థితిలో స్థిరపర్చును గాక! ఆమేన్.

***కీర్తన :*** *"మూడు సిలువలు మోసితివా - నాకై మూడు-సిలువలు మోసితివా! =*
*మూడు సిలువలు మోసి-మూటివలన కలుగు-కీడు సహించితివా!=*
*ఆ- కీడును నీ కాళ్ళక్రింద- వేసి త్రొక్కి - ఓడించి లేచితివా ॥మూడు॥*

# లెంటులోని పదిహేడవ దినము - సోమవారము

## సిలువలోని ప్రతినిధి

యోహాను 18:14.



ప్రార్ధన:- ప్రభువా! నీ సహింపు గ్రహించుకొన్నయెడల ఎండిన మొక్కవలె వాడిపోదుము, తెలిసిన యెడల సహింపలేము, అది సువార్తికులకు తెలియదు, దూతలకు తెలియదు, మాకు అసలు తెలియదు. నీవు శ్రమపడినావన్నది సత్యము గాని దాని వివరమును మేము సహింపలేము ఇదంతా మరుగుచేసి మమ్మును కరుణించుము.

యేసుప్రభువా! నీవు సహింపుద్వారా జయము పొందినట్లు మాకుకూడా సహింపు ద్వారా జయము కలుగు నిమిత్తము, మాకు సహింపు శక్తి దయచేయుము. మేము జయించి జయము పొందకముందు, సహించి జయము పొందే తరుణము దయచేయుము. మేము పాటములో ఏర్పర్చుకొన్న ప్రకారము నీవు 8 పర్యాయములు, 8 విషయములలో సహింపు కనపర్చినట్లు, మేముకూడ అన్నిటిలో సహింపు కనపర్చే ధారుడ్యము అనుగ్రహించుము. ఒక విషయములో సహింపు కలిగియుండుట వల్ల మాకు ప్రయోజనములేదు. కాబట్టి అన్నిటిలో, అన్నికాలములలో, అన్ని విధములైన అవస్థలలో సహింపు, ఓపిక, ఓర్పు అనుగ్రహించుము. మేము సహించేటప్పుడు నీ సహింపు మాకు జ్ఞాపకము చేసి, నీ సహింపులోనుండి సహింపు అందుకొనే విశ్వాసము దయచేయుము. సహించే రక్షకా! మేము సహించే వధువులమై యుండే కృప దయచేయుము. ఎన్నో పర్యాయములు మా అనుభవ ప్రకారము మా సహింపునకు కదలిక, తగ్గింపు, అంతరింపుకలుగుట చూచుచున్నాము. గనుక మా సహింపును దిట్ట పర్చుమని వేడుకొనుచున్నాము. నీవు త్వరగా వచ్చెదవని వాగ్ధానము చేసినావు. మా దృష్టికి 'నీవు ఆలస్యము చేయుచున్నావు' అని తోచుచున్నపుడు, స్వాభావికముగా సహింపు కదలి పోవును. గనుక అట్టి కదలని సహింపువలన పెండ్లికుమార్తె వరుసకు మమ్మును భద్రపర్చుము. ఒక్కొక్క సహింపు తరుణములో నా అనుభవమునకు కొంత అనుభవమును, నా సిద్ధపడుటకు కొంత సిద్ధపడుటయును, నాకు అనుగ్రహింపుము. మహిమకు కొంత మహిమయును చేర్చబడును గనుక ఈ చేర్చబడుటకు నేను దూరము కాకుండే ధైర్యము దయచేయుము. నీకు వచ్చిన శోధనలవంటి శోధనలు నాకురావు అని

**నేననుకొనకుండునట్లు నాకు జాగ్రత్తగల జ్ఞానోపాయము లభింపజేయము. శ్రమలో పాల్గొనుటవల్లనే మహిమలో కూడ పాల్గొందుమని పెద్దలు చెప్పుచున్న వాక్యమును జ్ఞప్తియందుంచుకొనగల జ్ఞాపకశక్తి లభింపజేయుము. ఓ ప్రభువా! నీ శ్రమ ఎంత గొప్పదో ప్రవక్తలకుగాని, సువార్తికులకు గాని, దూతలకుగాని తెలియదని తలంచుచున్నాము. ఒకవేళ మాకు తెలిస్తే మేము ఉండము. నీ మహిమ మాకు మెరుగు, అనగా చాలును, సరిపోవును గనుక అట్టి స్థితిలో మమ్మును స్థిరపర్చుము. ఆమేన్.**

శుక్రవారము మహా సంతోషకరమైన దినము. ఆదివారముకూడా మహా సంతోషకరమైన దినమే. కొందరు శుక్రవారమున దుఃఖింతురు. అయితే ఆ దినమే విముక్తి దినము. శుక్రవారము సిలువమీద జయము. ఆదివారము పునరుత్థాన జయము. సిలువమీద క్రీస్తుప్రభువుకు కలిగిన జయము. ఆదివారమున పునరుత్థానమునుబట్టి జయము. ఈ రెండును రెండు విధములుగా కలిగినవి.

నా దగ్గరున్న పదిహేను బూరలతో నేను మాట్లాడుచున్నాను. ఈ బూరలు శుక్ర, ఆదివారములు వినబడును. చాకలి వాని బట్టల శబ్ధము మనకు వెంటనే వినబడును. అయితే అది కొంచెము సేపుండును. అలాగే గొడ్లచావిడిలోని శబ్ధమును ఉండును. ఈ సమయములో ఆ శబ్ధములవైపు కాక, అందరు సిలువవైపు చూడవలెను. అటువంటి మనో నిదానముండవలెను, చివరి వరకు అది ఉండవలెను. రెండు మనో నిదానములు. 1) సిలువ, 2) సంఘములను తలంచుకొనవలెను. యేసుక్రీస్తుయొక్క శ్రమచరిత్రలో జయము. యేసుక్రీస్తుయొక్క పునరుత్థాన చరిత్రలో జయము. ఇవి సంఘము పొందవలసిన జయములు. వీటిని ప్రభువు పొంది చూపించెను. సంఘము శ్రమలో జయము పొందవలెను. అలాగే సంఘము తన పునరుత్థానములో జయము పొందవలెను.

యేసుక్రీస్తు ప్రభువు శ్రమలో ఎన్ని రకముల జయములున్నవి? హెబ్రీ 12:2 సిలువను గురించి: 1) యేసుక్రీస్తు మన ప్రతినిధియై జయము పొందెను (యెషయా 9:6). 2) ఆయన కాడి సుళువు...... గనుక ఆయనయొద్ద నేర్చుకొనవలెను (మత్తయి. 11:29). 3) ఆయన మన జీవము నిమిత్తమై మన పాపములను మ్రానుమీద మోసి జయము పొందెను (Iపేతురు 2:24). 4) ఆయన మన ప్రతినిధియై మన కొరకు విజ్ఞాపన చేయుచూ, జయమిచ్చు చున్నారు (యోహాను 17:9).

ఆయన జన్మములో, బోధలో, శ్రమలో, విజ్ఞాపనలో, పునరుత్థానములో మన ప్రతినిధియై ఉన్నారు. ఆయన మన కొరకు శిశువై పుట్టెను, మనకొరకు బోధించెను, మన కొరకు విజ్ఞాపన చేసెను. ఆయన మన కొరకు సిలువ మ్రానుమీద శ్రమ

అనుభవించెను. ఆయన మనకొరకు మరణమును జయించి తిరిగిలేచెను. మన కొరకు మనము బోధించుకొనలేము, ఆయనే బోధించవలెను. మన కొరకు మనము ప్రార్థించుకొనలేము. మన కొరకు శ్రమపడలేము, గనుక ఆయనే ప్రార్థించవలెను. శ్రమపడవలెను.

మన జన్మము అసంపూర్తియైనందున, మన జన్మము వర్ధిల్లుటకు ఆయనే జన్మించెను. మన బోధ చాలదు. ప్రార్థన చాలదు, శ్రమ చాలదు. మనము గాని శ్రమపడితే చచ్చి ఊరుకొందుము. ఇక తిరిగి లేవలేము. మనము కీడు కొరకు ప్రార్థింతుము, అజ్ఞాన బోధ చేస్తాము గనుక ఆయన మన కొరకు పూటపడెను. ప్రార్థన, శ్రమ, జన్మ ప్రతినిధిగా మన కొరకు ఆయెను. ఈయన శ్రమలో మనకొరకు ప్రతినిధియై యున్నాడు. **1) మానవ ప్రతినిధి:–** మనకొరకు ఒకరు జన్మింపలేరు. మనమును వేరొకరి కొరకు జన్మింపలేము. అయితే ఆయన మనకొరకు జన్మించెను. మనము సంగతులు పూర్తిగా బోధపర్చుకొనలేము, బోధించుకొనలేము. గనుక మనకొరకు ఆయన బోధించెను. మనము మన కొరకు సరిగా ప్రార్థించుకొనలేము గనుక ఆయన ప్రార్థించెను. మనము మనకొరకు శ్రమ అనుభవించలేము. గనుక ఆయనే మనకొరకు శ్రమ అనుభవించెను. **ఆయన జీవితమంతా మనకొరకే. ఆయనజేసినవి అన్నీ మనకొరకే జేసెను గనుక కృతజ్ఞతతో ఈ పండుగ చేయవలెను.** నా కొరకే నీవు శ్రమపడినావు గనుక వందనములు అని పైనున్నవన్నియు, సంఘములతో చెప్పించవలెను. సంఘముచేత ఈ రీతిగా స్తుతి ప్రార్థన చేయించవలెను.

**2) శ్రమలో ప్రతినిధి:–** శ్రమలో ఆయన మనకొరకు ఏలాగు జయము పొందెను. ఆయన శ్రమలు పొందుట జయము పొందుటకే. శ్రమలు మనము పొందగలము గాని జయము పొందలేము. మనము విసుగుకొందుము. ***యేసుక్రీస్తు ఏలాగు శ్రమపొందెనో శ్రమ చరిత్రలోనుండి లాగుకొనవలెను.*** 1) గెత్సేమనే తోటలోనికి మనస్సు పోవలెను. గదిలో ప్రార్థన చేయండని ఆయన (మత్తయి 6:6) లో మనకు నేర్పెను గాని యేసుక్రీస్తు తోటలోనికి పోయెను. ఒకడు ఊళ్లో, ఎనమండుగురు తోట గేటు దగ్గర, తోటలో ముగ్గురు (కునికి నిద్రపోవుచుండిరి). యేసుక్రీస్తు ఒక్కరు తోటలో చెమట రక్తబిందువులవలె కారునంతగా ప్రార్థించుచుండెను. ఆయన అంతఃశ్రమలో ఉన్నారు. ఈ శ్రమ తప్పించు తండ్రీ! అని ప్రార్థించెను. అది శ్రమలకే గుర్తుగాని సంతోషమునకు గాదు గనుక రక్త బిందువుల వల్ల, వేదన ప్రార్థనవల్ల శ్రమ కనబడు చున్నది. తొలగించుమని ప్రార్థించుచున్నాడు గాని తండ్రీ! నీ చిత్తమన్నాడు. విసుగుకుంటే ఆ గిన్నె తీసివేయవలెను అని ప్రార్థించును. గనుక సంఘము ఆయన వేదనలోని ఓర్పును గ్రహించవలెను.

ఆయన శ్రమలో సహింపువల్ల జయము పొందెను. గెత్సేమనే తోటలోకారిన స్వేద రక్త బిందువులను బట్టియు, తొలగింపుము అనే మాటనుబట్టియు ఆయన శ్రమ ఎంత గొప్పదో గ్రహించగలము. గాని **'నీ చిత్తము'** అని చెప్పడమువల్ల ఆయన ఎంతగా సహించుకొన్నాడో తెలియుచున్నది. కాబట్టి సహింపువల్ల ఆయన జయము పొందెను. రాబోయే శ్రమల గిన్నెను సహించెను.

**3) బంధింపబడుటలో ప్రతినిధి:-** తోటలో ప్రార్థన చేసిన తరువాత శిష్యులదగ్గరకు వచ్చి, వారినిలేపి గేటు దగ్గరకు వెళ్లగా రౌడీలు ఆయనను అరెస్టు చేసిరి. ఆయన తండ్రిని ప్రార్థించినట్లైతే సైన్యమును పంపును. అరెస్టును సహించుటవల్ల, ఆయన గెత్సేమనే తోట వెలుపల శ్రమలు పొందెను. **అరెస్టు చేసినప్పుడు తప్పించుకొనుటకు శక్తిలేని వానివలె పట్టుబడి సహించెను. అట్లు జయము పొందెను.**

**4) సిలువ మోసిన ప్రతినిధి:-** 'నేను మోసికొని పోలేను' అని ఆయన అనలేదు. సీమోనును బ్రతిమిలాడలేదు. మాలలేదు. ఆయన మోస్తూనేయున్నాడు. కడవరకు సిలువ మోసి సహించెను. సిలువకఱ్ఱ మోసి విసుగకుండ సహించుటవల్ల జయము పొందెను. (తూలినను సహించెను) ఇది సహింపుద్వారా పొందిన జయము.

**5) తీర్పులు సహించిన ప్రతినిధి:-** ఆయన తీర్పులు సహించుటవల్ల జయము పొందెను. (కయప తీర్పు, సన్హెడ్రిను తీర్పు, పిలాతు తీర్పు, హేరోదు తీర్పు, పిలాతు తీర్పు (రెండవసారి) మొదలగునవి) ఈ తీర్పులు సహించుటవల్ల జయము పొందెను. ఉదా:- జడ్జిగారికి తీర్పు విధించి, దోషిగా నిలువబెట్టి, దొంగను జడ్జిగా చేసిన ఎంత కష్టము! యేసుక్రీస్తు రేపు పిలాతుకు తీర్పుతీర్చవలెను. కయప ప్రధాన యాజకుడు. అయితే, యేసుక్రీస్తు ఆ ప్రధానయాజకునిచే అబద్ధ సాక్ష్యము పొందెను. అందరికీ తీర్పు తీర్చగల నమ్మకమైన సత్యసాక్షి యేసుక్రీస్తే. అయితే ఇపుడు ఈయనకే తీర్పు. పంచాయితీలో తీర్పు యజమాని చేయవలెను. అనగా సన్హెడ్రిను వారికే ఆయన తీర్పు తీర్చవలెను. అయితే **ఆ నీతిపరునికి నీతిలేనివారు మరణశిక్ష విధించిరి.**

ఆయనలో ఏ నేరములేదని పిలాతు గ్రహించినా, చివరి వరకు ఆ మాట మీద లేడు. కోర్టు నుంచి బోధ వినిన పిలాతు భార్య ఆయన పక్షమాయెను. వెయ్యేండ్లలో సర్వలోకమునకు ప్రభువు తీర్పుతీర్చనైయున్ననూ, ఆయన ఇప్పుడు తీర్పు పొందుచుండెను. 'నేను కలుగజేసిన మానవునివల్ల, అన్యునివల్ల, నేరస్థునివల్ల, స్వజనులవల్ల, తీర్పుపొందనైయున్నాను.' ఇది ఆయనకు కల్గిన గొప్ప అవమానము. హేరోదు కోర్టులో యేసుక్రీస్తుకు నిలువబడుట ఇష్టముండదా! చిన్నప్పుడు పారిపోయెను గాని ఇప్పుడు కోర్టులోకి పోయెను. ***ఈ అవమానమంతయు ఆయన మన కొరకు పొందెను.***

స్వజనులవల్ల తీర్పు, అన్యులవల్ల తీర్పు ఎవరికొరకు ఆయనకు వచ్చెను? వారందరి కొరకు ఆయన తీర్పు పొందెను. ఆ తీర్పు సహించుటవల్ల ఆయన జయము పొందెను. మన ప్రధానయాజకుడైన యేసు, ఇహలోకపు ప్రధానయాజకుడైన కయపవల్ల తీర్పుపొందెను. సంఘ నాయకుడైన యేసు యూదుల సంఘమువల్ల తీర్పుపొందెను (మరణశిక్ష). వెయ్యేండ్ల శాంతిపాలన చేయనైయున్న రాజైన యేసు, రోమా ప్రభుత్వములోని అధికారులగు పిలాతువల్లను, హేరోదువల్లను తీర్పు పొందెను.

**6) శరీర బాధ సహించిన ప్రతినిధి:-** (చేతులలోని పోట్లు, కాళ్ళపై పోటు, ప్రక్కలో పోటు, తలపై వేసిన జల్లెడపోటు) ఇవి ఆయన సహించెను. విసుగుకొనలేదు. ఈ సహింపువల్ల ఆయన జయము పొందెను. దాహము అణచుకొనుట వలన బాధ. ఈలాగు దాహ బాధను అణచుకొనుట వలనను ఆయన జయించెను.

**7) అపహాస్యము పొందిన ప్రతినిధి:-** ఇతరులను రక్షించినవాడా! రక్షించుకో! దేవాలయమును పడగొట్టి, మూడు దినములలో లేపువాడా, ..... దిగి రమ్ము! ఈ హేళన సహించుటవలన జయము. గుద్దుటవల్ల, రెల్లుపుడకవల్ల, రక్షించుకో అని అనుటవల్ల. వీటివల్ల ఆయనను హేళన చేస్తే ఇది ఆయన సహించెను, జయము పొందెను.

**8) మరణమును జయించిన ప్రతినిధి:-** ఆయన మరణమును, సమాధిని జయించెను. నేను మరణించను సమాధికి వెళ్ళను అని అనేవారెవరులేరు. **మరణము లేనివాడు మరణమును సహించుకొన్నాడు.** కనుక జయము. సమాధి అవసరము లేనివాడు సమాధికి వెళ్లి సహించి జయించెను. షరా:- 'తొలగింపుము' అనే మాటలోను, 'ఏల చేయి విడిచినావు' అనే మాటలోను, స్వేద రక్త బిందువులలోను ఆయన శ్రమ ఎంత గొప్పదో గ్రహించగలము! సిలువమీద తాను మనిషై 'దేవా' అని ప్రార్థించెను. కుమారుడైతే తండ్రీ! అని ప్రార్థించును. ఒక మనిషి వలె గొప్ప బాధలో చేయి ఎందుకు విడిచితివనెను. ఆయన మన ప్రతినిధియైనందున ఇన్ని విధములైన శ్రమలను, అవమానములను సహించుకొని భరించెను.

అట్టి ధన్యత ఇక్కడ చేరిన వారికిని, ప్రతినిధియైన క్రీస్తు ప్రభువు దయచేయునుగాక. ఆమేన్.

***కీర్తన :*** *"పంచ గాయములు నే-నెంచి తలంచి నా - వంచన ఇది సోదరా!*
*నన్ను- వంచించు సైతాను- వల నుండి గావ తా- నెంచి బొందెను సోదరా"*
*॥యేసుక్రీస్తు॥*

# లెంటులోని పదునెనిమిదవ దినము - మంగళవారము

## బదిలీయైన ప్రభువు

రోమా 8:3,4.



**ప్రార్థన:- తండ్రీ! మా పాపమునుబట్టి మేము శిక్షకు పాత్రులమైయుండగా మాకు బదులుగా నీవే ఆ శిక్షనంతటిని నీపై వేసికొని మాకు శిక్ష లేకుండా చేసినందుకు వందనములు. మేము చేయలేనివన్నీ మా పక్షమున చేసిన తండ్రీ నీకు నమస్కారములు. మా బదిలీయైన నీవే నేడు మాకు వర్తమానమిమ్మని యేసు నామమున వందించు చున్నాము. ఆమేన్.**

ఈ పాఠములో పాపమునకు విధింపబడిన శిక్షనుగూర్చి చెప్పుచున్నాను. ఇది ప్రభువునకు విధింపబడిన శిక్ష. రోమా 8వ అధ్యాయములో ప్రభువు శరీరమందు పాపమునకు శిక్ష అని వ్రాయబడియున్నది. ఇది పాపమును గురించిన శిక్ష. ఆదాము, హవ్వలయొక్క శరీరములో పాపము ప్రవేశించినది. కాబట్టి మానవ శరీరములో పాపమునకు రాజ్యము ఏర్పడినది. శరీరము ఓడిపోయినది, పాపమే గెల్చినది. క్రీస్తు చరిత్రలో కథ తిరగబడినది. ఎట్లనగా పాపము ప్రభువుయొక్క శరీరములో ప్రవేశింపలేక పోయినది. ***ఆయన శరీరము పాపములేని మానవ శరీరము గనుక పాపము వెలుపట ఉండి పోయినది.*** ఇదే పాపమునకు శిక్ష. కాగడా చుట్టూ దోమలు తిరుగవచ్చును గాని కాగడా లోపలకు వెళ్లలేవు. అట్లే ఏ పాపమైనా, శోధనయైనా, ఏ దయ్యమైనా, సాతానైనా ప్రభువును సమీపింపవచ్చు, శోధింపవచ్చు గాని ***ప్రభువు లోనికి వెళ్లలేవు. అయితే ఆయన వాటన్నిటి నిమిత్తము*** శిక్ష పొందితేనే గాని జయము పొందవీలులేదు. అరణ్యములో సైతాను వచ్చేస్థలమునకు ప్రభువు వెళ్లుట, అతని పని పట్టుటకే గాని అతనివల్ల జయింపబడుటకు కాదు.

గెరాసేనీయుల స్మశాన భూమికి ప్రభువు వెళ్లుట సైతానుయొక్క పటాలమును వెళ్లగొట్టుటకే, జయించుటకే గాని ఓడిపోవుటకు కాదు. ఆదాముయొద్దకు సర్పమును దేవుడు వెళ్లనిచ్చుట ఆదామువల్ల సర్పమును ఓడింపజేయుటకే గాని ఆదాము ఓడిపోయెను. ***తానే గెలిచిన యెడల సర్పమునకు గొప్ప పరాభవము, శిక్ష కలిగి యుండును.*** అది ప్రభువు యొక్క శరీరమునందు జరిగినది.మొదటి ఆదామువద్ద జరగలేదు గాని రెండవ ఆదామైన క్రీస్తునొద్ద జరిగెను. ఆదాము హవ్వలను పాపములో పడవేసినట్లు, క్రీస్తు ప్రభువునుకూడా పడవేయవలెనని సాతాను అనేకమార్లు

ప్రయత్నించెను. ప్రతి ప్రయత్నములో పరాభవము, అపజయము అతనికి కలిగెను. సాతానులోనుండి పాపము వచ్చెను. పాపములోనుండి మానవులకు అనగా పాపమునకు లోబడినవారికి శిక్ష అను పాప ఫలితము వచ్చెను. ప్రభువునకు జన్మములో పాపములేదు, క్రియలో పాపములేదు. కాబట్టి పాపమునకు రావలసిన శిక్ష ఆయనకు రాకూడదు గానీ, ఆయన మనకు బదులుగా వచ్చినందున శిక్ష అనుభవించెను.

**ఉదా:-** ఒక పంతులుగారు వెళ్లగా ఇంకొకరు వచ్చును. ఈ బదిలీ పంతులు గారు మొదటి పంతులుగారు చేసిన పనులు అన్నీ చేయవలెను. అలాగే మనము పాపము చేయగా పాపములేని ఆయన మన శిక్ష అనుభవించెను. ఆయన అక్రమ కారులలో ఒకడాయెను. ఒక ఉపాధ్యాయుడు ఒక నెల సెలవుమీద వెళ్లినప్పుడు, ఆయనకు బదిలీ ఉపాధ్యాయుడు ఆ పంతులు గారి పనులన్నీ చేయవలెను! చేసినంత మాత్రమున ఆయన అసలు పంతులు కాగలడా! కాలేదు. అట్లే పాపాత్ములమైన మనకు బదిలీ ప్రభువైయున్నాడు. కాబట్టి నేను చేయలేనివన్నీ ఆయనే చేసెను. ఆయన మనకు బదులుగా శిక్ష అనుభవించెను. పాప ఫలితము అనుభవించెను. అంత మాత్రమున ఆయన పాపికాడు. ఆ పాపము చేసినవాడు శిక్షార్హుడు గాని, పాపము మోసిన వాడు శిక్షార్హుడు కాడు. మన శిక్ష వహించినవాడుగా, అక్రమకారులలో ఆయన ఒకడుగా ఎంచబడెను. యెషయా 53:12; లూకా 22:37. పంతులుగారి బదిలీకంటే, మన కొరకు బదిలీ చేయవలసినది ఎక్కువ గనుక అన్నిటినీ ఆయన చేయువాడైయున్నాడు. లూకా 10:35. కీర్తన: 'నేను చేయలేనివన్నీ నీవే చేసి పెట్టినావు'.

నీ పాదములు నేను కడిగితేనే గాని నాతో నీకు పాలులేదని (పవిత్రుడవు కావని) ప్రభువు పేతురుతో చెప్పలేదా! (పేతురు కాళ్ళే కడుగుకొనలేడా?) కడుగుకొనలేడు. ఎట్లు కడుగుకొనలేడనగా తన కాలికి అంటిన బురద పోవునట్లు కడుగుకొనగలడు గాని ప్రభువు యొక్క భాగ్యములో పాలు దొరికేటంతగా కడుగుకొనలేడు. ***ప్రభువు కడిగితే ఆయన ఆస్తిలో పాలుపొంపులు దొరకగలవు.*** మనము ప్రతిరోజు కాళ్లుకడుగుకొనుచున్నాము. అంత మాత్రమున ***పరమ భాగ్య వంతులము కానేరము.*** అట్టి వారమగుటకు మనము చేయలేని పనియగు 'కడుగుటను' ప్రభువే చేయవలెను. మనమైతే బాప్తిస్మబలము కలిగియుండగలము గాని బాప్తిస్మమువల్ల ఏర్పడు బంధుత్వమును కలిగియుండలేము. మనమైతే రొట్టె తినగలము గాని ద్రాక్షారసము త్రాగగలముకాని ప్రభువుయొక్క శరీరమును కలిగియుండలేము. గనుక మనము చేయలేని అనేక కార్యాలు ప్రభువు చేయుటకై, ఆయన నరావతారియైనాడు. ఆయన

ఇంకా ఏమి చేయుచున్నాడు? మన కొరకు స్థలము సిద్ధపర్చుటకై వెళ్లుచున్నానని ప్రభువు చెప్పలేదా! యోహాను 14:3. మనమీద నున్న శిక్షను పరిహరించుటకు, మనకు రావలసిన సంపద గడించిపెట్టుటకు; ***ఈ రెండు పనులు చేయుట వల్ల ప్రభువు మన నమ్మకమైన బదిలీయైయున్నాడు.***

**శిక్షలు:-** 1) శిక్షలు ఏవనగా వ్యాధి, కరువు, అనుకొనని ఆపద మొదలైనవి తాత్కాలిక శిక్షలు అనగా మరణ సమయము వరకు కలిగే శిక్షలు. 2) మరణము మరియొక శిక్ష. 3) పాతాళము మరియొక శిక్ష. 4) నరకము అనగా రెండవ మరణము. ఇది అంత్య శిక్ష. ఈ శిక్ష మనకు లేకుండునట్లు ఆయన తన మరణమువల్ల మార్గమేర్పరచెను. అందుచేతనే క్రీస్తుయేసునందుండు వారికి ఏ శిక్షావిధిలేదని వ్రాయబడెను. రోమా 8:11. ***మరణ పర్యంతము భక్తులకు, ఇతరులకు కలిగే శిక్షలు, వారిని కడవరి శిక్షను తప్పించే సాధనములై యున్నవి. గనుక అవి ఉపయోగకరములే.*** ఈ శిక్షలవల్ల మూడు పనులు జరుగును. 1) పాపమును విసర్జించే మారుమనస్సు, 2) ప్రభువును అనుసరించే స్వభావము, 3) ఆత్మీయ జీవనముయొక్క అభివృద్ధి విషయములో కలిగే అనుభవము. *ఈ శిక్షలు పేరుకు మాత్రమే శిక్షలు గాని ఇవి నిజమైన మేళ్లైయున్నవి.* నా కుమారుడా, నీ తండ్రి శిక్షించు శిక్షను నిర్లక్ష్యపెట్టకుము అనే వాక్యము ఇక్కడ అన్వయించును. మరియొక విశేషమేదనగా క్రీస్తుయొక్క జీవితభాగములు. 1) జన్మము మొదలుకొని 12 ఏండ్ల వయస్సు వరకు 2) అక్కడ నుండి 20 ఏండ్ల గృహ నివాసము వరకు, 3) అక్కడనుండి సిలువ వేత వరకు. ఇవి ఆయన సేవ కాలములు. ఏ భాగములోనైనా, ఆయన పాపమునకు లోబడలేదు. ***తల్లిదండ్రులయెడల అవిధేయత, అరణ్యములోని సైతాను మాటలకు లొంగిపోవలసిన విధేయత, సిలువవేత వరకు కలిగిన కష్టములకు దిగులుపడిపోవుట ఈ మొదలైనవి ఆయనలో లేవు గనుక పాపమునకు ఆయన శరీరములోనే శిక్ష కలిగెను.***

అటువంటి క్రీస్తు శరీర స్వభావమును మీరును ధరించుకొందురు గాక. ఆమేన్.

*__కీర్తన__ : "నా ఋణము తీర్చిన- నా దేవా! నా ప్రభువా!-నీ ఋణము తీర్చగలనా!= నీవు-నా ఋషివై బోధించి-నా బదులు చనిపోయి-నావని మరువగలనా"*

*॥మూడు॥*

# లెంటులోని పంతొనిమిదవ దినము - బుధవారము

## ప్రభువు పొందిన తీర్పులు

మత్తయి 26:63-64.



**ప్రార్ధన:- ప్రభువా! మామీదికి రావలసిన ఐదు తీర్పులు తప్పించుకొనుటకుగాను నీవు తీర్పుపొందినావు గనుక అవి మాకు రాకుండా చేసినావు గనుక మాకు శిక్ష రాదు. నీకు వందనములు. ఇంకా ఎన్ని ఉన్నా ఆ తీర్పులుకూడ పొందినావు. మాకు అవి రావు. నీకు వందనములు. దయగల ప్రభువా! మా తీర్పులు పొందిన నీకు వందనములు. మాకు విమోచన దీవెన దయచేయుము. ఆమేన్.**

ఈ శ్రమ చరిత్ర కాలములో రెండు కోర్టులు గలవు. 1. యూదులమత సంఘ పక్షముగా ఏర్పాటైన సన్హెడ్రిను సభలోని నేరపంచాయితీ, 2. దేశ చక్రవర్తియైన కైసరు (రోమా) తరుపున ఉన్న కోర్టు. యేసుక్రీస్తు ప్రభువు ఈ రెండు కోర్టులకు వెళ్లవలెను. యేసు నజరేతులో పుట్టి యూదయ, గలిలయ, సమరయ, సిరియా దేశములలో సువార్త చేసి తిరుగుట ముగించెను. ఇప్పుడు కోర్టులకు పోవలెను, తరువాత సిలువ దగ్గరకు పోవలెను. ఆయన తనను ప్రత్యక్ష పరచుకొనుటకు వచ్చెను గనుక అందరికి కనబడవలెను. గనుక పై ప్రదేశములలోని ప్రజలకు కనబడెను. రేపు కోర్టులలో కూడ తన్ను ప్రత్యక్ష పర్చుకొనవలెను గనుక ఆయనే వెళ్ళెను. రేపు ఎవరు కూడ ఆయన మాకు కనబడలేదు అనకూడదు. యూదులకు కనబడుటకు వారి మత కోర్టులకును, రోమా గవర్నమెంటుకు కనబడుటకు ఆ కోర్టుకును ఆయన వెళ్లెను.

ఇప్పుడు మత కోర్టులో ఆయన దగ్గర వాంగ్మూలము తీసికొని తీర్పు వ్రాయవలెను. తాను ముందు ఇక్కడ తీర్పు పొందవలెను, ఆ తరువాత గవర్నమెంటు కోర్టులో తీర్పు నిర్ధారించబడవలెను. రేపు వెయ్యేండ్లయిన తరువాత సజీవుల తీర్పులో, ఆయనే వారి వాంగ్మూలము తీసికొని; 'వెయ్యేండ్ల బోధ విన్నారు గాన మీ తీర్మానమేమి?' అని అడిగి, తెలుసుకొని తీర్పు చెప్పవలెను. ముందు కథ అయిన తరువాత తీర్పు. అలాగే ప్రభుని కథ అయిన తరువాత తీర్పు.

***ఎందుకు ఆయనకా తీర్పు?:*** మనము పొందవల్సిన తీర్పులనుండి మనలను తప్పించుటకు ఆయనే ఆ తీర్పులు పొందెను. మనముందున్న తీర్పులు ఏవనగా: 1) మరణ సమయము ఒక తీర్పు, 2) రేప్చరు ఒక తీర్పు, 3) ఏడేండ్ల పరిపాలన ఒక తీర్పు, 4) సజీవుల తీర్పు, 5) అంత్య తీర్పు.

Bible Mission HQ Guntur

**మరణము ఒక తీర్పు:-** ఈ తీర్పులన్నియు ఆయన చేయవలెను గనుక ముందు ఆయన తీర్పు పొందవలెను. 1) మరణ సమయములో నీవు హేడెస్సుకా? పరదైసుకా? ప్రభువా! నీవే నా దిక్కు అన్న రక్షింపబడుదువు. 2) రేప్చరునకు సిద్ధపడినావా? లేదా? లేదు. అయితే ఉండిపో. 3) హర్మెగెద్దోను యుద్ధమునకు ముందు ఏడేండ్లు శిక్షలు పొందుతారు. నన్ను నమస్కరించిన యెడల వెయ్యేండ్ల పాలన, ఒప్పుకొనకపోతే నాశనమగుదురు. ఆయనను ఒప్పుకొనినవారు కొండ పగులగా అందులోకి పోయిరి. అంతెక్రీస్తు పటాలము పట్టుకొనబోగా వారు నాశనమైరి. ఇక్కడ యేసుప్రభువు ఒక్క నిమిషము ఊరుకొన్నా వారి పని నాశనమే. 4) సజీవుల తీర్పు:- వెయ్యేండ్ల బోధ విన్న తరువాత ఈ తీర్పు జరుగును. 5) అంత్యతీర్పు:- మరణ సమయములో తిరుగలేదు. అంతకు పూర్వము తిరుగలేదు. హేడెస్సులో మారలేదు. ఏడేండ్లలో మారలేదు. సజీవుల తీర్పులో మారలేదు. ఈ ఐదు తీర్పులు మానవులకు రావలెను. గనుక ఈ ఐదు తీర్పులు తప్పించుటకు తాను తీర్పుపొందెను. ప్రభువు మన బదులు తీర్పుపొందెను. గనుక మనకు తీర్పులేదు.

**ముందు మతములో తీర్పు:** అక్కడ వాంగ్మూలము కొరకు ఒక ప్రశ్న అడిగిరి. 1) నీవు దేవుని కుమారుడవా? 2) నీవు క్రీస్తువా? నీవు రక్షించుటకు వచ్చిన వాడవునీవేనా! మెస్సీయావా? ఇవి వారి మనస్సులో బోధించుచున్నవి. ఇవి చెప్పితే సిలువ వేయరు. సరిగా చెప్పితే నమస్కారము చేయవలసినది. మత గురువులు ఈ ప్రశ్నవేసిరి. వీరి ముందు మత్తయి 4వ అధ్యాయయములో నీవు దేవుని కుమారుడవా! అని సైతాను అనెను. అప్పుడు సైతాను వేసిన మొదటి ప్రశ్న చివరిగా మత గురువులు వేసిరి. 'నీవు దేవుని కుమారుడవైతే రాళ్లు రొట్టెలు చేసికో'. నేను దేవుడను, దేవుని కుమారుడను అంటే యూదులకు సంతోషము. ఇదే యూదులకు సరిపోవును. లోకస్తులకు దేవుని కుమారుడన్న ఒప్పుకోరు. దేవుడనవలెను. వీరు పాతనిబంధన ప్రజలు, వాగ్ధానాలు విన్నారు గనుక దేవుని కుమారుడన్న ఒప్పుకొందురు.

**ఉదా:** ఏమండో ఆయన దొరకొడుకు అంటే 'దొర' అన్నమాట. అలాగే దేవుడంటే యూదులకు తెలుసు. ఇదే ప్రశ్న బయట వేసిరి. జవాబు చెప్పెను. గాని నమ్మలేదు! ఆ ప్రశ్న ఇక్కడ వేసిరి. ప్రభువు నేను దేవుడను అనియు, దేవుని కుమారుడను అనిన యెడల బాగుండును. జవాబు: ఆ రెంటికి 'నీవన్నట్టే' అనెను. 1) నేను దేవుడను, 2) నేను దేవుని కుమారుడను అనెను.

ప్రభువు ఇంకా చెప్పెను 1) ఆరోహణము గూర్చి 2) రేప్చరు గూర్చికూడ చెప్పెను. మత్తయి 2:64లో కోర్టు మొదలు ఆరోహణము తరువాత రేప్చరు వరకు తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండును. తరువాత రేప్చరులో వచ్చును. నీవు గురువువా? నా రాకడ గూర్చి చదివినారా! చూచుకొనండి. రేపు ఆరోహణమగుదును అని శపదం చేసెను. మీ కోర్టు సిలువ, మరణము తప్పించుకొని మిమ్ములను తప్పించుకొని ఆరోహణమౌతాను రేప్చరులో వస్తాను అని సవాలు చేసెను.

మనము ఈ లోకస్తుల మధ్య జీవించినంతకాలము మతస్తుల ఎదుట మనవారి ఎదుట సాక్ష్యమియ్యవలెను. పై నాలుగును ఇవ్వవలెను. 1) నేను దేవుని కుమారుడను. యేసుక్రీస్తు అనే దేవుని కుమారుని ద్వారా నేను దేవుని కుమారుడనని చెప్పవలెను. 2) నేను క్రీస్తును అనెను. రక్షించుటకు ఏర్పాటైనవాడు. ఏర్పాటు జనాంగములో పుట్టిన ఏర్పాటు వ్యక్తి రేప్చరులో అందరిలోని విశ్వాసులను (ఏర్పాటైన వారిని) తీసికొని పోవును. మనము ఏర్పాటు విశ్వాసులము. వారు ఏర్పాటు జనాంగము. ఆయన ఏర్పాటు అయినవాడు మనమును ఏర్పాటైన వారము. నేను పెండ్లికుమార్తెను, ఆయన ఏర్పాటు సంఘములోని వారమని సాక్ష్యమియ్యవలెను. 3) ఆరోహణ మౌదుననెను. నేను ఆరోహణమౌతాననవలెను. 4) ఆయన వస్తాడు. మనము వెయ్యేండ్లలో వస్తాము.

ఈ నాలుగు సాక్ష్యమియ్యవలెను. చెప్పవలెను. ఆయన ఇచ్చినట్లే, మనమును 4 సాక్ష్యాలిచ్చిన రేప్చరులో పోదుము. 1) మనము సంఘము ఎదుట సాక్ష్యమియ్యవలెను. 2) లోకము ఎదుట సాక్ష్యమియ్యవలెను.

ఆలాగు సాక్ష్యమిచ్చు శక్తి, ధైర్యము ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

***కీర్తన :*** *1) "నిరపరాధి యైన తండ్రిని-నిలువ బెట్టిరి = దొర తనము*
*వారి యెదుట - పరిహసించిరి' ॥పాప మెరుగనట్టి॥*

*2) తిట్టినను మరల వారిని - తిట్టడాయెను = కొట్టినను*
*మరల వారిని - కొట్ట డాయెను" ॥ పాప మెరుగనట్టి॥*






# లెంటులోని ఇరువదియవ దినము - గురువారము

## సిలువలోని విజ్ఞాపన ప్రార్ధన

లూకా 22:39-46.



ప్రార్ధన:- దయగల యేసుప్రభువా! (మా నిమిత్తమై నీవు) శ్రమలు పడుచున్నావు. ఎంత కష్టమో, భయంకరమో తెలిసేవచ్చినావు. మాకు భయమున్నదన్న చోటికి మేము వెళ్లము. నీవు తెలిసే వచ్చి సిలువకేగినావు గనుక వందనములు. నా నిమిత్తమైన శ్రమలుకాదు మా నిమిత్తమైన శ్రమలు అనుభవించినావు. నీ శ్రమల గొప్పతనము, మహిమ, ఉపకారము; ఈ మూడును గ్రహించే మనోనిదాన ధ్యానము దయచేయుము. ఒక బోధకుడు అంతా బోధించి సిలువ బోధించకపోయినట్లైనా అంతా సున్నే. అలాగే మా జీవితములో ఏన్నో దర్శనములు, ఎన్నో ఉపకారములు ఉన్నా, మా శ్రమలు ఎన్ని తీసివేసినా, అనగా సిలువ తెలియకపోతే ఏమిలాభము. మేము కొద్దిమందిమి అయినా, కొంతసేపైనా ధ్యానముయొక్క ఊట కలిగించుమని వేడుకొనుచున్నాము. తలంపులకు కావలసిన ధైర్యము, ఆదరణ కలిగించుము. లోకమంతట సిలువధ్యానము చేయుచుండగా, వారందరి మధ్య నీవుండుము.ఆమేన్.

ప్రభువుయొక్క శ్రమలు అనేకులు విచారముతో చేయుదురు గాని మన శ్రమలు, శిక్షలు భరించుటకు ఆయన చెసెను గనుక మనకు సంతోషము, ఆయనకు విచారము. ఒకరు ఒక బోధకునిచూచి ఏమి బోధించ వెళ్లుచున్నావు అని అడిగెను. అందుకాబోధకుడు ఫలాని వాక్యము బోధించుచున్నాను అన్నప్పుడు, ఆ ప్రశ్నకుడు నీవు వాక్యము అంతా బోధించి సిలువ చెప్పకపోతే అంతా వృధా అని చెప్పెను. మన శిక్షలు, పాపములు, భారము ఆయన తన మీద వేసికొన్నాడు. పునరుత్థానము ఉపయోగమే గాని సిలువ ఎక్కువ ఉపయోగము. **ధ్యానము: 'ప్రభువు మనకొరకు పడిన శ్రమ'.**

ఒక బల్లమీద అరటిపండ్లు, సపోటాలు, రొట్టెలు, ఆహారము, బట్టలు అచ్చుపడిన పుస్తకాలు ఒక బీదవానిని కూర్చుండబెట్టి తినమంటే తినునా? వద్దని అంటాడా? అతని కాళ్లు బురద, శరీరము చెమట బట్టలు మాసిపోయెను, తలమాసెను, చేతులు అశుభ్రముగా నుండెను, అలసిపోయి చేతులమీద ఆనుకొనెను, దాహముగా నుండెను. తింటాడా? బట్టలు కట్టుకొంటాడా? బాటసారి పైవన్నీ శుభ్రము చేసికొని అప్పుడు భోజనమునకు కూర్చుండవలెను. ముందు స్నానము చేసి, అన్నీ పనులు చేసి, తిండి తినిన తిన్నట్టు ఉండును. అలాగే సిలువమీద ప్రభువుండి కష్టములు తీసివేయకుండా

Bible Mission HQ Guntur

బైబిలు చదువు, విశ్వాసముగానుండుము అని చెప్పి, పరలోకములో ఇన్ని భాగ్యాలు, ఇహలోకములో ఇన్ని భాగ్యాలున్నవని చూపించిన అతనికి శాంతి ఉండునా? పాపము, శిక్ష, భారము తీసివేసిన యెడల పై వాటికొరకు ప్రయత్నము చేయును. ఉదా: పిల్లవానిని కోతి కరువగా బాధ కలిగి ఏడ్చెను. ఊరుకొనమన్నా, బిస్కెట్టు ఇచ్చినా ఏమిలాభము? బాధ పోవలెను. అలాగే సిలువవలన కూడ.

ఒకరు మోక్షలోకము గురించి అంతావిని, "అవన్నికూడా ఇన్ని బాధలు, కష్టాలు ఉంటే చచ్చిన తరువాత ఏమగుదుమో!" అనెను. ఆయన సిలువమీద అన్నీ తీసివేసినా, పరలోకములోని మహిమ, భూలోకములోని మహిమ వినగలరు, దాని కొరకు ప్రయత్నించగలరు. 1) పాపములు, 2) వ్యాధులు, 3) మిగిలినవన్నీ- నరకము, మరణముకూడా గలదు. వాటికి సంబంధించిన శిక్ష అంతా సిలువమ్రాను మీద ఉన్నవి. ***అవి మనమీద లేకుండా పోవును. ఎప్పుడు? మన అవిశ్వాసము, అశ్రద్ధ అవన్నీ పోగొట్టుకొన్నప్పుడు.*** ఆయనజేసిన మహోపకారము ఏదనగా మన కడ్డముగా నున్న శ్రమలన్నియు, ఆయన భరించెను. ప్రభువా! ఇవన్నీ నా నిమిత్తమై అనుభవించినావు. నామీదనుండే మూడు అవస్థలు అనుభవించినావు. నీమీద వేసికొన్నావు నా మీదలేకుండా చేసినావు గనుక వందనములు. పై మూడు పనులుచేసి మా విషయములో గొప్ప మహోపకారము చేసినావు. అట్టి అనుభవము మా జీవితములో ఋజువు చేయుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

**సిలువ ధ్యానకూటము:-** ధ్యానకూట ఉద్దేశము ఏమనగా, ప్రభువు మనకు ఏమి తలంపు కలిగించునో, అనేది. ప్రార్థన కాదు, మనము మాట్లాడుట కాదు గాని ఒక ధ్యానాంశము కలిగియుండుట మంచిది. మండల కాలములో ప్రభుని సిలువ ధ్యానములో నుండుట మంచిది. సిలువ ధ్యానములో అనేక అంశములు గలవు. ఈ చివరి శ్రమ మట్లాదివారముతో ప్రారంభము. ముఖ్యముగా మరల ఆదివారమునకు పునరుత్థానము. ఆయన మనస్సులో రాబోయే శ్రమల తలంపులు ఉన్నవి. అవి బహిరంగ శ్రమలు కాదు. సిలువమీద కొట్టబడుదునను తలంపు కాదు. చనిపోవుదుననే తలంపు కాదు గాని ఎప్పుడైతేనేమి సర్కిటులోనైతేనేమి? గెత్సేమనేలోనైతేనేమి? సిలువముందు అయితేనేమి? ఆయన శ్రమలో ఎవరిని ధ్యానించెను? ఆ శ్రమలో యేసుప్రభువు నన్నే ధ్యానించెను. నన్నే తలంచెను. తన శ్రమలో యేసుప్రభువు నన్నే తలంచెను. నన్ను గురించే ఆయన ధ్యానిస్తు శ్రమపడుతూ చనిపోయెను. నన్ను గురించి ఆయన ఏమని తలంచెనో! ఇప్పుడు పుట్టిన నన్ను గురించి ప్రభువు అప్పుడు తలంచినాడా! నన్ను గురించి ఆయనకు అప్పుడే, జ్ఞాపకము వచ్చెనా? నా శ్రమలో నేనున్నానా? నిజమైతే

నీవు, నేను కృతజ్ఞులమై యుండవలెను. ఇప్పుడున్న నన్ను ఆయన తలంచుకొనెనా? ఓ ప్రభువా! నీవు మమ్మును తలంచుకొన్నావు గనుక వందనములు. మరియు నీవు దేవుడవు గనుక అందరినీ తలంచుకొనగలిగినావు.

సాధారణముగా ఏపని మొదలుపెట్టినా, మొట్టమొదట చాలా ఉద్రేకముగా నుండి తరువాత తరువాత ఉద్రేకము తగ్గును. విజ్ఞాపన ప్రార్థన విషయములోకూడా మొదట ఉద్రేకముగా నుండి తరువాతసాధారణమై పోవును. బైబిలులో మొదటినుండి చివరివరకు అనేక విజ్ఞాపన ప్రార్థనలున్నవి. ఇది శ్రమలకాలము గనుక ప్రభువు సిలువమీద చేసిన విజ్ఞాపన ప్రార్థన జ్ఞాపకము చేసికొందము. ఆయన శత్రువుల కొరకు చేసెను. మనమైతే, శత్రువులు కాని వారికొరకు చేసెదము. అయితే ప్రభువు మిక్కిలి కఠినమైన విజ్ఞాపన చేసెను. ముఖ్యముగా హింసించే వారికొరకు చేసెను. రెండు రకములైన శత్రువులు ఈ లోకములో గలరు. 1) నిజముగా కీడు చేయవలెనని ఆలోచించేవారు పూర్తిగా శత్రువులు 2) మన పక్షముగా లేనివారు, వ్యతిరేక పక్షముగా నున్నవారు; వీరు నిజముగా కీడు చేసే శత్రువులు. వీరిని ప్రతిపక్షమువారు అందుము.

1) న్యాయముగా మనతో విరోధపడేవారు. వాదించేవారు మీరు అగుదురు. 2) సిద్ధాంతములను బట్టి విరోధులగుదురు. 3) నచ్చలేదు గనుక విరోధముగా నుందురు. కీడుచేయనుద్దేశము కలిగియుందురు. 4) మనతో ఏకీభవించరు. 5) భిన్నాభిప్రాయము కలిగియుందురు. ఇవన్నీ కలిపితే న్యాయము గనుక విరోధము. **ఉదా:-** ఒక సమావేశములో వాదించుకొందురు. ఒకరి సిద్ధాంతము ఒకరికి నచ్చక వాదించుకొని తరువాత షేక్‌హ్యాండ్ తీసికొందురు. లేక 'టీ' తీసికొందురు. ఈ దిన ధ్యానములో యేసుప్రభువు తన విరోధుల కొరకే చేయగలిగిన యెడల, అంత కఠినమైన పనే చేయగలిగిన యెడల మన స్నేహితుల కొరకు ఇంత సుళువైన పని చేయలేమా? ఇది జ్ఞాపకముంచుకొని ఎవరిని గురించి ప్రార్థించుచున్నామో వారిని జ్ఞాపకముంచుకొని చేయవలెను. ఆలాగు చేయుశక్తి సిలువనాధుడు మీకు దయచేయును గాక. ఆమేన్.

**ప్రార్థన:-** యేసు ప్రభువా! నీవు శత్రువుల కొరకు చేసినావు. అంత గొప్ప పని ఎవ్వరు చేయలేరు. అనేక భక్తులు చేసినారుగానీ వారు మనుష్యత్వముతో చేసిరిగానీ నీవు దైవత్వముతో చేసినావు. గనుక నీ పని ఎవ్వరు చేయలేరు. 1) శ్రద్ధ, జాలితో చేసే మనసు. 2) చేసేవారిని తలంచుకొనుట. విన్నా వారిని తలంచుకొనుటకు అంశము తలంచుకొనుట. ఈ రెండూ జ్ఞాపకముంచు కొనునట్లు మనసు దయచేయుము ఆమేన్.


***కీర్తన :*** *"తన్ను జంపు శత్రువులకు-దయను జూపెనా తన -నెనరు జూపెనా-ప్రభు కనికరించెనా= ఓ - జనక ఈ జనుల క్షమించు-మనుచు వేడెనా"*

*॥మనస యేసు॥*

# లెంటులోని ఇరువది ఒకటవ దినము - శుక్రవారము

## సిలువధ్యాన మనో నిదానము

ఆది. 3:1-8.



**ప్రార్థన:- తండ్రీ! మా నిమిత్తమై మానవ శరీరము ధరించినందువలన నీవు శోధింపబడవల్సి వచ్చినది. మా కొరకు నీవు ఎన్నో అవమానములను, తిరస్కారములను అనుభవించినావు. నా మీది ప్రేమతో అన్నిటినీ జయించినావు. అట్టి నీ జయ వర్తమానము నేడు అందించుమని నిన్ను వందించుచున్నాము. ఆమేన్.**

క్రిందటి మంగళవారము ప్రభువుకు కలిగిన శోధన చెప్పగా విని, ఒకరు నా మీద ఒక ప్రశ్న వేసిరి: ప్రభువు శ్రమకాలమునకును, ఈ శోధనకును ఏమి సంబంధమున్నదని అడిగిరి. రాళ్లు రొట్టెలు చేసికొని వాడు తినమన్నాడు. అది శ్రమకాలమునకేమి సంబంధి? రాళ్లకేమి సంబంధము? రొట్టెలకేమి సంబంధము? దీని వ్యాఖ్యానము ఆది. 3వ అధ్యాయములో దొరుకుతుంది. ఇప్పుడది వివరించడానికి సాతాను, ప్రభువును శోధించిన వాక్యము, అక్కడ హవ్వను శోధించిన వాక్యము ఇక్కడ వ్రాస్తాను. అది మత్తయి 4వ అధ్యాయంలో ఉంది. నీవు దేవుని కుమారుడవైతే. వాడు హవ్వ నెట్లు శోధించెను? ***అయితే అనేదే శోధన.*** 'నీవు దేవుని కుమారుడవైతే అన్నప్పుడు' నేను కుమారుడను కానా అనవలసింది. ***అయితే*** అనేది గొప్పశోధన. ఇక్కడ ప్రభువులో సందేహం పుట్టించాలని వాడు అనుకొన్నాడు. అయితే ప్రభువు సందేహములో పడలేదు. హవ్వతో అక్కడ ఇది నిజమా? అని వాడు అన్నప్పుడు, హవ్వమ్మ తనను దేవుడు తినమన్నాడు కాబోలు అని సందేహపడి ఉండాలి. ఆలాగు సందేహము పుట్టించిన మాటవల్ల హవ్వమ్మ అధైర్యపడింది. ***ఈ సందేహపరిచే మాటను ప్రభువు జయించెను.***

సర్పము, భూజంతువులన్నిటిలో యుక్తిగలదని ఉన్నదికదా! సర్పము యుక్తి గలదై శోధించుటకై వచ్చెను. ప్రభువు మరొక యుక్తి గలిగినవాడై సైతానును జయించెను. ***యేసుప్రభువు జవాబు చెప్పకుండా ఉండడమే యుక్తి.*** ఇది హవ్వమ్మకు తెలియలేదు. హవ్వ పడింది. హవ్వ ఎటువంటి పరిశుద్ధతలో ఉందో, యేసుప్రభువుకూడ అదే పరిశుద్ధతలో నున్నాడు. స్త్రీ గర్భములో కన్యక గర్భములో, పుట్టినందున అసలు స్త్రీకున్న పరిశుద్ధత, పవిత్రత ఆయనకు ఉంది. ఆ స్త్రీకి పరిశుద్ధత ఉంది. ఆ స్త్రీని తన పోలిక

చొప్పున చేసినందున ఆ దైవత్వము ఆ స్త్రీలో ఉంది. పరిశుద్ధ శరీరమును, దైవత్వమును ఆ మొదటి స్త్రీలో ఉంది. ఆ పరిశుద్ధ శరీరమును, దైవత్వమును కలిగి రావాలి గనుక అదే వరుసలో యేసుప్రభువు వచ్చి జయించిన అదే జయము. ఆయన దేవుడై వచ్చి జయించిన అది జయము కాదు. ఇప్పుడు ప్రభువు, హవ్వ సందేహించినట్లుగా సందేహించిన యెడల అగాధములోకి దిగినట్లే. అయితే యేసుప్రభువు దృష్టి, ఆయన మనో నిదానము తన పరిశుద్ధ శరీరముమీద ఉన్నది. తనలో ఉన్న పరిశుద్ధమైన పవిత్రతమీద ఉన్నది. ఇప్పుడు ప్రభువు హవ్వమ్మ ఇచ్చిన పరిశుద్ధ శరీరముతో హవ్వమ్మకు తాను ఎంత పరిశుద్ధ శరీరమిచ్చెనో, అంత పరిశుద్ధతతోనే జయించెను. అంత దైవత్వముంటే గాని ఆమె పరిశుద్ధ శరీరముతో యేసుప్రభువు జయించిన (అంత పరిశుద్ధతకాదు) జయమును హవ్వమ్మ అందుకొని ఉండేది. అటు ఆరుగురు, ఇటు ఆరుగురు జయించిన జయమందురు గాని ఒకరెక్కువ ఒకరు తక్కువ ఉండి జయించిన, అది జయముకాదు. హవ్వమ్మకున్న దైవత్వమెంతో ప్రభువుకున్నట్టి ఆ దైవత్వముతోనే ప్రభువు జయించెను. హవ్వమ్మ– 'నాకు సంపూర్ణమైన పరిశుద్ధ శరీరమిచ్చిన, నాకు సంపూర్ణ దైవత్వమిస్తే ఎందుకు పడతాను. నేను పడేటప్పుడు, ఓ హవ్వమ్మా! ఎందుకు పడతావని పిలిస్తే ఎందుకు పడతాను' అన్నదట.

పల్లెటూరిలో బోదికాలువలో ఒక పట్టి ఉంటాది. ఒక పెంకివాడు ఇంకొకడిని ఒరే పడతావు' అంటే వాడు పడతాడు, కంగారుపడి పడిపోతాడు. ***సర్కసులో మరాటిపిల్ల తీగమీద నడిచేటప్పుడు పడతావంటే పడదు. అలాగే ప్రభువు పడలేదు.*** ఎంత గొప్ప శోధననగా: 'నీవు దేవుని కుమారుడవైతే' అనగా ప్రభువుకు మహా శ్రమ. ***నీవు దేవుని కుమారుడవు అనుట ప్రభువుకు మహా గొప్ప శ్రమ.*** దేవుని మాట ఎత్తి తన పేరెత్తినందున మహా శ్రమ. ఇక్కడ దేవుని కుమారుడవైతే అన్నాడు. ఇక్కడ కుమారుడని మరొకమాట పెట్టినాడు. ప్రభువు దగ్గర ఉన్న శోధనలో ఏముందనగా, 'ఏమండోయ్! మీరు చాల మంచివారు, ధర్మకర్త' అన్నట్లున్నది. అనగా ఇది దగానా, లేక సాక్ష్యమా? ఇక్కడ ప్రభువును వాడు శోధించినపుడు, దేవుని మాటను తుడుపుపెట్టదలంచినపుడు, అవతారము గల కుమారుని దగ్గర పెరెత్తినందున, తానే అక్కడ నిలబడ్డాడు. ముందు సర్పములాగా వాడు వచ్చినాడు. సర్పమైనందున హవ్వమ్మ గుర్తించలేదు. ఇక్కడ ఆయన దేవుని కుమారుడు. అయినప్పటికిని, దేవుని కుమారుడని సైతానువలననే_తెలిసింది మనకు. మనిషికుమారుని కంటే దేవుని కుమారుడే గొప్ప. ఈ సంగతెత్తి ఆదాము

హవ్వల దగ్గర దేవుడనేది తుడుపుపెట్టినందున ఇక్కడ తానే నిలబడ్డాడు. అది నిజమా? అని అక్కడ అడిగాడు గనుక ఇది దగా. మార్కు 1వ అధ్యాయములో నీవు దేవుని కుమారుడవు అన్నాడు. అక్కడ ప్రభువు 'నోరుముయ్యి' అన్నాడు. ఇప్పుడు ఇక్కడ హేళనగా అన్నాడు. మత్తయిలో దేవుడనేది తుడుపుపెట్టి, అదే (సాతానే) నిలబడింది. ఇక్కడ కుమారుడు అనేది తుడుపుపెట్టి అదే నిలబడింది. యెషయాలో, ఆ దేవుడు సింహాసనముమీద కూర్చున్నాడు. అది వాడు చూచాడు. నేను అక్కడ కూర్చుండ కూడదా? అనుకొన్నాడు. అక్కడ తానే ఉండాలనుకున్నందున వాడు పడిపోయినాడు. ప్రభువుకైతే మనోనిదానముంది. నేను దేవుని కుమారుడను, వీడు సైతాను అనుకొన్నాడు. అందుకే ఆయన పడలేదు. అందుకే ప్రార్థనమెట్లలో మనో నిదానము మొదటిది. ఆయన కన్నులలో నేను దేవుడను, ఆయన చూపులో ఇది దయ్యము అని ఉంది. నేను దేవుడనని ఆయనకు ఉన్నది గనుక ఇక్కడ శ్రమకాలములో రెండు శోధనలున్నవి. 1) వీడు సైతాను. దానికెదురుగా నిలబడుటయే శ్రమ. కుమారుని తుడుపుట (ప్రశ్నించుట) శ్రమ, దేవునిని తుడుపుట శ్రమ. 2) మొదట వీడు దూత, తరువాత సైతాను. వీడిని కలుగజేసినప్పుడు ఆయన ఆ దూతకు పైగా ఉన్నాడు. ఇప్పుడు మనుష్యునిగా వచ్చినందున ఇప్పుడు క్రిందగా ఉన్నాడు. పిలాతును పుట్టించినవాడు యేసుప్రభువు. తనకు తీర్పుచేసినవాడు తాను పుట్టించిన మనిషే. కాబట్టి ప్రభువు ఇవన్నీ చూచెను.

ఇక్కడి శోధనలో దైవత్రిత్వము మనకు కనబడుచున్నది. దేవుని కుమారునివైతే అను మాటలో కుమారుడున్నాడు, తండ్రి ఉన్నారు. ఇక పరిశుద్ధాత్మ ఏరి? ఆయన ఆత్మచేత అరణ్యమునకు కొనిపోబడెను. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ ఇక్కడున్నారు. కాబట్టి ఈ త్రిత్వ తలంపువల్ల యేసుప్రభువు శోధనలో పడలేదు. ఆ ధ్యానములో లేకపోయిన యేసుప్రభువు పడిపోవును. మనకు రాకడ గడియ ఎక్కువగా దగ్గర పడుతుంది. ***మనకు ధ్యాన కూటములు, బైబిలు తరగతులు, వీధిలో ప్రసంగాలు, ఆదివారపుబడులు, కుటుంబ ప్రార్థనలు చాలవు.*** రాకడ సిద్ధబాటుకు ఇవి చాలవు. క్రైస్తవ జీవనమునకు అనగా రక్షణకు సరిపోవును. రాకడకు సిద్ధపడుట కొరకు ప్రత్యేకించుకొని కనిపెట్టుట అవసరము. యేసుప్రభువు మొదలుకొని ఈ 20 వందల సం॥లలోకి చేరిన భక్తులు మోక్షములోనికి వెళ్లిరి గాని ప్రభువు వచ్చేగడియలో ఆయనను ఎదుర్కొనుటకు తగిన స్థితిలోలేరు. అబ్రహాము, ఇస్సాకు మొదలైనవారు వెళ్లిపోయిరి గనుక రాకడకు ప్రత్యేకమైన ఉపవాస కార్యము అవసరము. యేసుప్రభువు ఉపవాసము

చేసిరి, ఏలీయా చేసిరి, అంతకుముందు మోషే చేసిరి. మోషే 40 దినములు, ఇంకొక 40 దినములు ఉపవాసముండి తండ్రి, కుమార, పరిశుద్ధాత్మని చూచినందున, దేవుని ధ్యానములో నున్నందున చూపు, వినికిడి, శరీర బలము తగ్గలేదు. ఈ 80 దినములు మోషే ఏమి తినలేదు. తినలేదు గాని త్రిత్వదేవుని తలంపులో నుండిరి. అయ్యగారు లూథరుగిరిలో నున్నప్పుడు ధ్యానములో పెట్టగా అందరూ మోకాళ్లమీద ఉండిరి. అపుడు అయ్యగారు– "మీరు జాగ్రత్తగా యేసుప్రభువు తలంపు మీదనే ఉండండి" అని చెప్పిరి. ఇంతలో ఒక పిల్లవాడు అయ్యా స్టోరులో ఉప్పులేదని గట్టిగా చెప్పగా అందరికి వినబడి ధ్యానము చెడిపోయినది. అలాగే మనము ధ్యానించుచుండగా సైతాను వచ్చి మన ధ్యానము చెడగొట్టును. గనుక జాగ్రత్త.

ఈలాగు ఏక దృష్టితో సైతాను పుట్టించే శోధనవైపు చూడక, జయించిన ప్రభువువైపు చూచుచూ సాగి వెళ్ళు కృప ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

**కీర్తన :** *"ప్రేమాతిశయుడ నేను – ఏ మాత్రుడను నెన్న – నా మానసమున*
*కందను – నాయేసు – ప్రేమ సారంబు తెలియును = పామరాళిని*
*బ్రోచు– క్షేమాధికారి నిన్ను–యేమంచు వర్ణింతును!"*

*॥ఏమి నేరంబులేక॥*

# లెంటులోని ఇరువది రెండవ దినము - శనివారము

## సిలువధ్యాన ఉపవాసము - సైతానుపై జయము

మత్తయి. 4:1-11.



**ప్రార్థన:- తండ్రీ! నీవు ఉపవాసముండి సాతానును జయించినావు. అట్టి శక్తినే సంఘమునకు ఇచ్చినావు. మేమును నీ సిలువధ్యాన ఉపవాసము ద్వారా శరీరమును, లోకమును, సాతానును జయించునట్లు నీ వర్తమానముద్వారా బలపర్చుమని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

ఏలీయా ఒక పూట తిని 40 దినములు ప్రయాణం చేస్తున్నపుడు, దారిలో మృగముల తలంపుగాని, మరే తలంపుగాని రాలేదు. మోషేగారు 40 దినములు కూర్చొని ఉపవాసం చేసిరి. ఏలీయాగారు 40 దినములు ప్రయాణం చేస్తూ ఉపవాసము చేసిరి. ఈయన నడుస్తూ రాత్రింబగళ్లు ఉపవాసము చేయుట వలన దేవుని తలంపు కుదురుట కష్టము. ఏలీయాగారు ఒక పూట తిని 40 పగళ్లు, 40 రాత్రులు ఎండను, రాళ్లను, మృగములను, ఇసుకను, పాములను, దొంగలను, చీకటిని చూడలేదు. 40 దినములు ప్రభువును చూచి నడిచెను. అలాగే ప్రభువు 40 దినములు ఉపవాసము చేసెను. అక్కడ సైతాను హవ్వయొక్క చూపును త్రిప్పెను. హవ్వ దేవుడు చెప్పిన పండ్లు చూస్తూ ఉంటే, సైతాను వెళ్లి అసలు పండు తినకుండా చేసి, హవ్వ మనస్సును త్రిప్పివేసెను. అట్లు హవ్వ తప్పిపోయింది. ***హవ్వ త్రిత్వదేవుని చూడలేదు గాని బువ్వవంక చూచింది.*** మనమును అట్లే ఉందుము.

సన్నిధి కూటములో 'మనోనిదానము కుదిరిందా' అనగా లేదందురు. కుదిరిననూ, కుదరకపోయిననూ సైతానును జయించవలెను. ఒకరు అయ్యగారికి వేసిన ప్రశ్న: సైతాను యేసుప్రభువును దేవాలయమునకు, కొండమీదికి తీసికొని వెళ్లినపుడు దేవుడెందుకు వెళ్లాలి? సైతాను పిలిచిన స్థలమునకు ప్రభువు పోకపోయిన యేసయ్యకు జయమేది? అని అయ్యగారు జవాబిచ్చిరి. అప్పుడు వారు అది రమ్మన్న దగ్గరకు వెళ్లి జయము పొందడమేల? ఇక్కడుండి రానంటే జయముకాదా! ప్రభువు రాననగా, దానికి భయపడినట్లే. పాము ఉన్నప్పుడు కొట్టాలిగాని వట్టి స్థలములో కొట్టిన ఏమి లాభము? అని చెప్పిరి. శోధన స్థలానికి అనగా సైతాను శోధించే స్థలమునకు మనలను నడిపించేది ఎవరు? ప్రభువును నడిపించినది ఎవరు? ఆయనను ఆత్మ కొనిపోయింది. సైతాను శోధించవలెననగా, పరిశుద్ధాత్మ ఆ శోధన స్థలానికి మనలను నడిపించును.

Bible Mission HQ Guntur

**ఆత్మ నడిపించకపోతే శోధనరాదు. శోధన రాకపోతే జయము రాదు. బహుమానము రాదు. ఆత్మ నడిపించకుండా మనిషే నడిచివెళ్లునా? వెళ్లును. స్వంతాత్మ నడిపించుకొని వెళ్లును. ఈ రెండునూ ఉన్నవి.**

ఇప్పటికి శోధన ముగిసింది. మనలను స్వంతాత్మ లేక పరిశుద్ధాత్మ నడిపించినదని ఎట్లు తెలిసికొనగలము? మనిషికి స్వంతాత్మ ఉన్నది. 'ఫలానిచోట అన్యులు పండుగ చేసికొంటున్నారు. నీవక్కడికి వెళ్లి వాక్యము బోధించు అది తప్పులేదు' అని ఆత్మ నడిపించును. అక్కడకు వెళ్లి బోధ చేస్తాము. కొంతమంది వ్యతిరేకులు వస్తారు. అక్కడ కలహము వస్తుంది. అక్కడ ఇద్దరు గొడవపడినందున కలహము వస్తుంది. అది శోధన. ఆ శోధనలో పడతావని తెలిసి తన పనిమీద వెళ్లినపుడే పడతావు అని ఆత్మ ముందే హెచ్చరించును. అప్పుడు కోపపడకపోయినా జయిస్తావు. ఇంటిదగ్గర కోపపు తలంపు పుట్టినప్పుడు పడినావు. ఇప్పుడు వెళ్లావు. వెళ్లి సువార్త ప్రకటించినావు. వాళ్లు కోపపడిరి. కోపపడినందున, తిరిగి కోపపడినావు గనుక అక్కడ పాపము వచ్చినది.

అయ్యగారి స్నేహితుడు ఒకరు బోధిస్తున్నపుడు ఆయనకు, ఆయన బోధ వినువారికి కలహము రేగింది. అప్పుడు అయ్యగారు పిల్లలను పాట ఎత్తమనగా కలహము ఆగింది. పిమ్మట అయ్యగారు అయ్యా! మీరాయనకు వేసిన ప్రశ్ననాకెయ్యండి అన్నారట. సంగతి అదని చెప్పగా వారు అయ్యగారు చెప్పినట్లుగా ఆయన చెప్పలేదు అన్నారు. అయ్యగారి స్నేహితుడు మళ్లీ వాదమునకు వెళ్లిరి. ముందు వచ్చినవారే వచ్చిరి గాని ఈ సారి వారు అయ్యా మీరే చెప్పండన్నారు. ***గనుక మనకు శోధన వచ్చిన కోపపడరాదు.*** దేవుడు సైతాను మీద కోపపడలేదు. అది వచ్చే వారము చెబుతాను. *(దేవుని మాటవల్లే మనము బ్రతికేది గనుక కోపపడరాదు.)*

1) సందేహము పుట్టించే ప్రశ్నలు, 2) పాపములు, 3) దేవుని మీద తిరుగుబాటు, 4) ఈలాగు చేయుట నీకు తగునా! అని అనుట మరి పాపము. ఇవి మనలో ఉన్న యెడల రాకడకు సిద్ధపడలేము గనుక దేవుని మీద ఈ ప్రశ్నలు వేయరాదు.

అలాగే రొట్టెలవలె ఉన్న రాళ్లు ఎదురుగా పెట్టి, ప్రభువు మనోనిదానము త్రిప్పాలని చూచింది. ఆయన మనస్సు రొట్టెలవైపు గాని, రాళ్లవైపుగాని పోలేదు గాని ద్వితి. 6వ అధ్యా॥లో ఉన్న మాట మీదికి పోయింది. మనిషి బ్రతుకుట దేవుని మాటవల్లగాని, రొట్టెవలన కాదు అన్నాడు. ఓ సైతానా! నేనొక సలహా ఇస్తాను: 'రొట్టెవల్లకాదు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవల్ల మానవుడు జీవించును' అని ప్రభువు అన్నారు.

అక్కడ హవ్వమ్మకూడ అట్లే అనవలసిందిగాని అనలేదు. ఆమె చూపు పండుమీదికి పోయింది. నీవు దేవుని కుమారుడవైతే అనేది భ్రమ. ఏదెను తోటలో సైతాను ఒక్క పండు చూపలేదు, మొత్తం పండ్లు చూపింది. ఇక్కడ రాయి ఒక్కటి కాదు, రాళ్లు చూపింది. ఇక్కడ వాడి యుక్తి ఉన్నది. ఇది ప్రభువుకు తెలిసింది. ఆయన లోకమునకు వచ్చిన పిమ్మట కలిగిన మొదట శోధన ఇదే. ప్రభువునకు వచ్చింది. ***మంచి పిండివంటలు పెట్టి ఓటు వేయించుకొందురు. ఇక్కడ మాయ గాని జాలిగాదు.*** ప్రభువది గ్రహించి సైతానుకు లోబడక, రాళ్లు వైపుచూచి 'దగా' అన్నారు. రొట్టెలవైపు చూచి, 'దగా' అనుకున్నారు. సైతాను అక్కడ ప్రభువును పొగడింది. అయ్యా మీరు రాళ్లు రొట్టెలు చేయగలరన్నది. గట్టి రాయిని, నీవు మెత్తని రొట్టెగా చేస్తావన్నాడు. కొరకలేని రాతిని, కోరికే రొట్టెగా చేస్తావని పొగడింది. శోధనలోని మరొక శోధన; ***అక్కడ తోటలో తిండి, ఇక్కడ రొట్టెలు తెచ్చి తిండి.*** తోటలోను తిండి శోధన వచ్చినది గనుక ప్రభువు తిండికి ఇక్కడ లోబడలేదు. దేవుని మాటవల్ల మనుష్యుడు జీవిస్తాడు అని చెప్పిన వాక్యములోని మూడు మాటలు, మూడు జెండాలు.

లూథరుగిరిలో పాదిరిగారికి అయ్యగారు ఈ పాటమే చెప్పిరి. అక్కడ గ్రేపు దొరగారు అది విని అందరికి, వారు వెళ్లే వరకు చెప్పేవారు. మనముకూడ ఇది అర్ధము చేసుకోవాలి. ***ఇది మీ మనస్సులో జ్ఞాపకమున్నప్పుడు మీకు జయమే.*** అక్కడ (ఏదెను తోటలో) తినగూడని పండు తినమనియు, ఇక్కడ అరణ్యములో తినదగని రాళ్లు తినవలసిన రొట్టెలని వాడు చెప్పినాడు గనుక అక్కడా, ఇక్కడా దగా. అంతా దగే.

ఓ దయగల ప్రభువా! నీవు జయించినట్లుగా మేముకూడ జయించే శక్తి దయచేయుమని వేడుకొంటున్నాము. ఆమేన్.

అట్టి శక్తితో వరుడు మిమ్మును అలంకరించును గాక! ఆమేన్.

**కీర్తన :** *1)* " ఏమి కావలె నా-కేమి కావలె = యేసు సిలువ దీక్ష తప్ప ఏమి కావలె॥
*2)* ఏమి కావలె నా- కేమి కావలె = యేసు జయము తప్ప నా - కేమి కావలె " ॥ఎవరు కావలె॥

# లెంటులోని నాలుగవ ఆదివారము

## మారుమనసు పొందిన దొంగ

మత్తయి 27:1-44.



**ప్రార్థన:- సిలువ విలువ నిలువ చేయుటకై ఏటేట సిలువధ్యానము చేసికొనే ఏర్పాటు దయచేసిన నీకు వందనములు. సిలువమీదనుంచి వచ్చే నీతి సూర్యకిరణములు మామీద ప్రకాశింపజేసి, నీ వాక్కు, నీ సందేశము దయచేయుమని వేడుకొంటున్నాము.**

దొంగ పరదైసుకు వెళ్లిన కథ పూర్తికాలేదు. ఎందుకంటే దొంగయొక్క ఆత్మ పరదైసునకు వెళ్లినా, అతని శరీరము సిలువకు అంటగొట్టబడియున్నట్లు, ఈ దొంగ కథ మనలను అంటుకొనియున్నది. ఈ దొంగ గజదొంగ, బందిపోటు. దొంగ మోక్షము కోరుకున్నాడు ఏమిటి? స్వస్థత కోరుకోవాలి గాని. "యేసు ప్రభువా! నీవు అనేకమందిని రక్షించుచున్నావు, నాకు దేహముమీద అనేక గాయములున్నవి. కాబట్టి ఈ గాయములు మాన్పివేయుము. అప్పుడు నేను ఇంటికి పోయి కష్టపడి బ్రతుకుదును, పాటుపడతానుగాని దొంగ పని చేయను" అని అనవలెను. ఇతడు ఆలాగు ప్రార్థన చేస్తే సబబుగా ఉండును. కానీ ఆలాగు చేయలేదు.

***ఈ కాలములో అనేక స్థలములలో, ఇక్కడ కాకానిలోను అనేకులు జబ్బులు పోగొట్టుకొనే దృష్టితోనే వస్తున్నారు, గాని రక్షణ కొరకు కాదు.*** శరీరములోనున్న కష్టమును తొలగించుకొనే ప్రార్థన ఉన్నది. కాని ఈ దొంగ ఆ ప్రార్థన చేయలేదు. ఇప్పుడు యేసుప్రభువు అతనిని సిలువ మీదనుండి బాగుచేసి దింపి, ఇంటికి పంపివేయుట గొప్పా? లేక పరలోకమునకు రక్షించి తీసికొని వెళ్లుట కష్టమా! అయితే యేసుప్రభువు గాయములు మాన్పలేడా? పేతురు ఆయన రక్తముచేత స్వస్థత అని వ్రాసినారు. ఇక్కడ ఎందుకు చేయలేదు. ఇతను తాను భూలోకములో నివసించి చూడవలసిన స్థాయి అయిపోయినది. కాబట్టి పరలోకములో యేమున్నదో చూడవలెనని కోరాడు. పరలోకమునకు వెళ్లలేదు. అయినను పరలోక రాజ్యము కోరుకొన్నాడు. మన దేశములోని గవర్నమెంటు వేరు, మన ఇల్లు వేరు. ఇతడు ఆ గవర్నమెంటును కోరుకున్నాడు. పరలోకములో రాజ్యమున్నది. పరలోకములో ఇల్లు ఉన్నది. అయితే పరలోకములోని రాజ్యము ఎక్కువ. ఈ దొంగ ఇంటిని కోరుకోలేదు గాని గొప్పదైన దానిని కోరుకొనెను. ఈ దొంగ కష్టపడి సంపాదించుకొనక, వారిని వీరిని దొంగిలించినాడు. ఇప్పుడు

Bible Mission HQ Guntur

పరలోకములోని గొప్పది కోరుకొన్నాడు. యేసుప్రభువు అక్కడనుండి ఇక్కడకు వస్తాడు అని గ్రహించినాడు. ఉదా:- గవర్నమెంటు వారు (ఢిల్లీలో) మీటింగుచేసి మీటింగు అయిపోయిన తరువాత ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోతారు. కేసు విచారణకు రాజ్యమునకు వస్తారు. అంతవరకు ఇంటివద్ద నుంటారు. పనిచేయుటకు రాజ్యమునకు వస్తారు. అలాగే యేసుప్రభువు రాజ్యము చేయుటకు భూలోకమునకు వస్తారు. అందుచేతనే ఈ దొంగ నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము అన్నాడు. గనుక మన కోరికకూడ ఆయన తీరుస్తారు. ఆ దొంగ కోరిక ఆయన నెరవేర్చాడు. ఎందుచేత? అతడు అందుకు సిద్ధమైయున్నాడు. అందుకు దొరికింది. అతడు తన పాపముల విషయమై పశ్చాత్తాప పడినాడు. ప్రక్క దొంగతో నీవును, నేనును పాపులము. శిక్షకు పాత్రులమని చెప్పాడు. కాబట్టి మారుమనస్సు పొందాడు.

**బోళము:-** అనగా మారుమనస్సు అందించే చేదు. పాపములు ఒప్పుకొన్నప్పుడు కూడ ఈ బోళమువలె నుండును. మద్దెల వాయించేటప్పుడు బోళము వేస్తారు. ఈ బోళమనేది అరేబియా దేశములో నున్నది. అది ఒక చేదైన వేరు. ఆ చేదే పశ్చాత్తాపమునకు, మారుమనస్సునకు గుర్తు. ఆ బోళము అనగా మేము మారుమనస్సు పొందాము అని అన్నట్టే. గనుక ఇతడు మారుమనస్సు పొందాడు గనుక యేసుప్రభువు దగ్గరకు తూర్పుజ్ఞానులు తెచ్చిన బోళము తెచ్చాడు.

**రెండవది సాంబ్రాణి:-** సాంబ్రాణిని నిప్పులపై వేస్తే పొగ పైకి వెళ్లును. అది ప్రార్థనకు గుర్తు. దొంగకూడ సాంబ్రాణి తెచ్చినాడు. ఎందుకంటే దేవా! అని ప్రార్థన చేసినాడు. ఇతడు మారుమనస్సు పొందాడు, ప్రార్థన చేసాడు. 1) మారుమనస్సు అనగా బోళము. 2) ప్రార్థన అనగా సాంబ్రాణి (జ్ఞాపకము తెచ్చుకొనుము) 3) మనిద్దరమైతే నేరస్థులము కాని ఆయనలో ఏ నేరములేదని మెచ్చుకొన్నాడు. ఇది మాట. మారుమనస్సు పొందేకంటే, ఈ మెచ్చుకొనడము ఎక్కువ.

**ఉన్నపాటు:-** పాపములు ఒప్పుకొని, స్నానముచేసి, బట్టలువేసికొని, శుద్ధిచేసికొని రావడము ఏలాగున్నదో అలాగే ఈ దొంగ ఉన్నపాటున ప్రభువు దగ్గరకు రావడము, మారుమనస్సు పొందడము తప్పుచేసినప్పుడు పట్టు పడినప్పుడు, పోలీసులు కొట్టినప్పుడు, మారుమనస్సు పొందలేదుగాని యేసుప్రభువు వద్దకు వచ్చినప్పుడు అతనికి మారుమనస్సు వచ్చింది. ఆయనలో నేరములేదు, ఆయన పరిశుద్ధుడు గనుక ఆయనతో పోల్చుకుంటే అతనికి దుఃఖము వచ్చింది. అప్పుడు పశ్చాత్తాపము, మారుమనస్సు కూడా వచ్చింది. అలాగే యేసుప్రభువును మెచ్చుకోవడము వచ్చింది.

అందుకే యేసుప్రభువును గురించి రెండవ దొంగకు ప్రసంగము చేశాడు. అనగా యేసుప్రభువు సేవ చేశాడు. మనము ప్రసంగము చేస్తే అందరు మారుమనస్సు పొందరు. అలాగే ఈ దొంగకూడ ప్రసంగము చేశాడు. ఇతనిలో చాలమంచి సుగుణమున్నది. ఆయన చచ్చిపోయి తన రాజ్యముతో వస్తాడు అని అనుకొన్నాడు. గొప్ప జ్ఞాని. తూర్పు జ్ఞానులకంటే ఎక్కువ జ్ఞాని గనుక ఇతనిని పదమటి జ్ఞాని అందాము.

ఇతడు సేవచేయుట, ప్రసంగము చేయుట ఈ మొత్తము కలిపి బంగారపు ముద్ద అయినది. గనుక ఈ దొంగ బంగారముకూడ తెచ్చాడు. యేసుప్రభువు దగ్గరకు ఈ మూడు తెచ్చాడు. అతడు చేసిన సేవ, ప్రార్థన, పెద్దఎత్తు వేయడమా? ఏది బంగారము? ***ఆ దొంగే బంగారము.*** యేసుప్రభువుకు కావలసినది మనిషి. తండ్రి తప్పిపోయిన కుమారుని విషయములో సొమ్ము అక్కరలేకపోయింది. కొడుకు కావలసి వచ్చింది. అలాగే మనమే యేసుప్రభువుకు కావాలి. ***యేసుప్రభువుకు ఉన్నపాటున వచ్చినవారు కావాలి.*** యేసుప్రభువు పరలోకమునుండి మనిషి కొరకు వచ్చాడు. కాబట్టి మనిషినే తీసికొని పోయాడు. ఆయన కోరిక నెరవేరినది. పని సంపూర్తి అయినది. దొంగను రక్షించి పరలోకమునకు తీసికొని వెళ్లుట, రాబోయే కాలములో కూడ మనిషిని తీసికొని వెళ్లుటకు ముంగుర్తు. దొంగ, శ్రమలద్వారా ప్రభువును తెలిసికొన్నాడు. మనిషి దేవుని తెలిసికొనవలెనంటే శ్రమలు కావలయును. ***ఒక వేళ శ్రమలు లేకపోతే సమాప్తము కాలేదన్న మాట.*** శ్రమలు భక్తులకు శ్రమలుకాదు. ఎడమ ప్రక్కనున్న దొంగకు శ్రమయైనదిగాని, కుడిచేతి ప్రక్క నున్న దొంగకు శ్రమకాలేదు. ***దొంగకు కలిగిన ఈ శ్రమ ఎటువంటిదైనదంటే, ఆ శ్రమ అతనికి తూర్పు నక్షత్రమువంటిదైనది.*** తూర్పు జ్ఞానులకు యేసుప్రభువును చూపింది నక్షత్రము. అలాగే ఈ సిలువమీద నున్న దొంగకు శ్రమ అనే నక్షత్రము యేసుప్రభువును చూపింది గనుక శ్రమలు నక్షత్రములు. ***యేసుప్రభువుకు మారుమనస్సుపొందిన వ్యక్తి దొరికితే, బంగారము దొరికినట్లు మనకు శ్రమలు కలిగితే నక్షత్రములు కలిగినట్లు.***

**ప్రార్థన:-** యేసుప్రభువా! నీ పాపములు జ్ఞాపకము చేసికొనునన్నావు. ***దొంగను జ్ఞాపకము తెచ్చుకొన్నావు. అతని పాపమును జ్ఞాపకము చేసికొనలేదు.*** అతనికి రావలసిన మోక్షమును జ్ఞాపకము చేసికొన్నావు. నక్షత్రము నిన్ను జ్ఞానులకు జ్ఞాపకము చేసింది. ఇంటివద్దనున్నప్పుడు నిన్ను జ్ఞాపకము చేసింది. అలాగుననే ఇతని శ్రమ నిన్ను జ్ఞాపకము చేసింది. జ్ఞాపకం చేయడము రహస్యముగా నీవే, అనగా పైకి శ్రమద్వారా జ్ఞాపకము చేసావు. 'నేను జ్ఞాపకము చేసికొంటాను నిన్ను' అని నీవు

చెప్పలేదు. దానికంటే ఎక్కువే చేస్తావు. ప్రభువా! 'నేడు నీవు నాతో పరదైసులో ఉంటావు' అని చెప్పినావు. అలాగే తండ్రీ! మేము కూడ మారుమనస్సు పొంది నీ దగ్గర ఉంటే, మోక్షములో చేర్చుకొంటావు. మా జబ్బులు తీసివేసిననూ, తీసివేయక పోయిననూ మోక్షము ఇవ్వకుండా ఉండవు. నీకనేక వందనములు. ఈ వేళ మేము మాట్లాడుకున్న మాటలు, మా ఆత్మకు ఉపయోగకరముగా నుండునట్లు దీవించుమని సిలువమీద నున్న యేసు ప్రభువు ద్వారా పరలోకపు తండ్రీ వేడుకొంటున్నాము. ఆమేన్.

ఒక్క పాపి మారుమనస్సు పొందితే పరలోక దేవదూతలు ఆ దినము డిన్నర్ పార్టీ పెట్టుకొందురు. అంత సంతోషము అక్కడ కలుగును.

అట్టి స్థితిలో, ఈ శ్రమల ధ్యాన కాలములో ప్రభువు మనలను స్థిరపరచుకొనును గాక! ఆమేన్.

**కీర్తన :** *"తన్ను జంపు జనుల యెడల–దయను జూపెను = చెన్నుగ దొంగను*
*రక్షింప – చేయి చాపెను"* *॥పాప మెరుగనట్టి॥*

# లెంటులోని ఇరువది మూడవ దినము - సోమవారము

## పశ్చాత్తాపము పొందనివారి దుస్థితి

హెబ్రీ. 6:4



**ప్రార్థన:- తండ్రీ! నేడు మాలో అనేకులు నిజమైన పశ్చాత్తాపము లేనివారై ఉన్నారు. హృదయ పరితాపముతో నూతనపర్చబడుటకు నీ శ్రమల ధ్యానములే ఆధారము. గనుక హృదయమును కఠినపర్చుకొనే దుస్థితి నుండి ఇక్కడి వారిని తప్పించి, నీ తట్టుచూచి మారుమనస్సు పొంది, నిన్ను మరల సిలువవేయని ధన్యత కల్గించుమని యేసునామమున అడుగుచున్నాము. ఆమేన్.**

సిలువ ధ్యాన కూటస్తులారా! ఈ పాఠము ఇది వరకు వివరించినాను కాని ముగించలేదు. ఇంకను అందు కొన్నిమాటలున్నవి. మొదటిది ఏమనగా 'మరల', రెండవది ఏమనగా, 'సిలువవేయుచు', మూడవది ఏమనగా 'మారుమనస్సు' నాలుగవది ఏమనగా 'నూతన పరచబడుట'. ఇవన్నీ ఈ వేళ చెప్పను. ఈ నాలుగు నేను ముగించే వరకు సిలువను మీ కండ్ల ఎదుట ఉంచుకొనవలెను. ఆయనను మరల సిలువ వేసినారు. అది మొదటి మరల. నాల్గవ మాట దగ్గర నూతన పరచుట అనేమాట దగ్గర మరలా అనే మాట రెండవసారి ఉన్నది. మొదటగా, యేసుప్రభువును మరల సిలువవేసినారు. కాబట్టి మరల నూతన పరచుట అసాధ్యము, అని వ్రాయబడినది. మొదటి వరుసలో మరల అని చెప్పాను. మూడవ వరుసలో మారుమనస్సని చెప్పాను. ఈ మారుమనస్సుకు మరియొక పేరు 'పశ్చాత్తాపము' అని ఉన్నది. మారుమనస్సు కొంతమందికి లేదు. ఇప్పుడు మారుమనస్సు అనగా ఏమిటో, నూతనపరచబడుట అనగా ఏమిటో మనము తెలిసికొనవలయును (అనగా ఆలోచించవలయును).

ఈ శ్రమ కాలములో పెద్దలైనవారు మారుమనస్సు, పశ్చాత్తాపము అను వాటిని ఏర్పరచినారు. ఎందుకంటే, యూదులైన వారు ఆయనను రెండువేల సం॥ల క్రిందట మొదటి సారి సిలువ వేయడము గొప్ప అన్యాయమని. తెలిసిననూ రెండవసారి మనము సిలువవేయుట మరింత గొప్ప అన్యాయము. ఇప్పుడు మారుమనస్సు లేని స్థితి ఏమిటో, మనము తెలిసికొనవలెను. మారుమనస్సు లేని స్థితి ఈ వరండా మీద కూర్చున్న వారిలో ఎవరిలోనైనా ఉన్నదేమో ఎవరి మట్టుకు వారే పరీక్షించుకొనండి. మారుమనస్సు లేని వారి స్థితి ఏమిటనగా తనలో పాపమున్నదని తెలిసికొనలేకపోవుటయే. మొదటిది తమ తప్పు కాదు. అయితే మాలో పాపములేదు, మాలో పొరబాట్లు లేవని

Bible Mission HQ Guntur

ఎవరనుకొంటారో, తమయొక్క పాప స్థితి ఎవరు తెలిసికొనలేరో, వారికే మారుమనస్సు లేని దుస్థితి ఉన్నది. ఈ దుస్థితి వలన యేసుప్రభువును వారు మరల రెండవసారి సిలువ వేస్తున్నారు. నాలో తప్పులేదు, నన్ను కాపాడు అని చెప్పుటే మారుమనస్సు లేకపోవుట. ***పాపమున్నప్పటికిని, దుస్థితి ఉన్నప్పటికిని నాలో పాపము లేదనుకోవడమే దుస్థితి.*** ఎవరైనా మాలో తప్పులు ఉన్నవి అనుకొంటే వాటిని ఇప్పుడు దిద్దుకోవలెను. ఆదివారమునాడు పాపపు ఒప్పుదలలో పాపములేదని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొను చున్నామని ఉన్నదా? లేదా? అదే ఇది. ***అనగా మారుమనస్సులేని అంశములో మొదటిస్థితి.*** రెండవ అంశము ఏమంటే, వారిలో తప్పు ఉన్నప్పటికిని వారికి విచారమే లేదు. ఆ విచారము లేకపోవుటే మిక్కిలి భయంకరమైన దుస్థితి. ఇన్ని తప్పులు, ఇన్ని పొరబాట్లు, ఇన్ని లోట్లు పెట్టుకొని, మాలో ఏమిలేదని ఏ విచారము అనుకొనుచూ, తమను గురించే లేకపోవుట మరింత భయంకరము. ***అయ్యో! నేను ఎరుగక పోయి తప్పుచేసినాననే విచారము లేకపోవుట, మరింత భయంకరమైన దుస్థితి.*** ఈ విచారమే లేకపోతే అది మిక్కిలి దుస్థితి ఈ వరండామీద గత్తరవుంటే నీళ్ళు పోసికొట్టివేస్తే, గత్తరంతా పోయినట్లుగా పాపములను గురించి విచారపడితే, కన్నీటి ధారల వలన మొదటి పాపము కొట్టుకొని పోయింది. ఇప్పుడు, ఆలాగు కొట్టుకొని పోవు కన్నీరుగాని, చింతగాని, బోధగాని లేదు. అందుచేత ప్రభువునకు మరియొక బల్లెపుపోటు.

అయ్యగారు ఏడిద అనే గ్రామములో ఉన్న గుడిలో ఒకరాత్రి మీటింగు చేస్తున్నపుడు, అందులో ఉన్న 70 మంది ఘొల్లున ఏడ్చినారు. దూరాన, రోడ్డుమీదనున్న ముసలమ్మ గుడిలో ఎవరో చచ్చిపోయినారు కాబోలు, పాపము! అందుచేతనే వారు ఏడుస్తున్నారు అని గుడి దగ్గరకు వచ్చింది, చూచింది. అందరూ మోకాళ్లమీదనే యున్నారు. ఈ ముసలమ్మ కూడా మోకాళ్లూనింది. అందరితో పాటు తను కూడా ఏడ్చింది. తక్కిన వారందరికి నిజమైన దుఃఖము వచ్చింది. అందరు ఏడ్చారు గాని ఒకమ్మాయి మాత్రము ఏడ్వలేదు. ఆ అమ్మాయి మీటింగు అంతా అయిపోయిన తరువాత అయ్యగారియొద్దకు వచ్చి అందరు ఇంతగా ఏడ్చినారు గాని నాకసలు ఏడ్పే రాలేదు అన్నదట. అది రాత్రి ఒంటి గంట సమయము. నాకు ఏడ్పు రాకపోతే నేనేమి చేసేది అన్నదట.

కాబట్టి ఎన్ని తప్పులున్నా, ఎన్ని పొరబాట్లున్నా వాటి నిమిత్తము విచారముగాని, కన్నీళ్లుగాని, పశ్చాత్తాపముగాని లేని క్రైస్తవులు ఇప్పుడున్నారు. అట్టివారు ప్రభువుకు బల్లెపు పోటుపొడిచిన వారితో సమానము. ఇక్కడ ఈ లోపములు కలిగినవారు

పశ్చాత్తాపపడి ఏడువకపోతే, పరలోకమునందున్న ప్రభువు వారిని గురించి ఏడుస్తున్నారు. పాతనిబంధన కాలములో ఇట్టివారున్నారు. ఇప్పుడును ఇట్టివారున్నారు. 1) పాపమున్నదని తెలిసికూడ లేదనుకోవడము. 2) 'దానికే ఏడ్వనా!' అని మొండికెత్తి ఊరుకోవడము, 3) తనలో తప్పున్నదని ఒప్పుకోక పోవడము. ఆ దుస్థితి ఏమనగా, తెలుగు సామెత ఒకటి ఈలాగు ఉన్నది: "చేసిన పాపము చెప్పితే మాసిపోతుంది". రాతిగుండె గల వారికి ఆ లోక సామెతకూడ తెలుసు, నాది తప్పు అని తెలుసు, దుఃఖపడాలి అనికూడా తెలుసు. అయితే వారు ఒప్పుకోక పోవడమే కాక, అడిగితే అబద్ధమాడుదురు. అది మరియొక దుస్థితి. ***ఒప్పుకొనక పోవడము ఒకటి, అబద్ధమాడుట మరియొకటి.*** ఈ రెండును ఒకటే.

4) ఇంతవరకు తెలిసో తెలియకనో తప్పుచేసెను. 'ఇకమీదట నేను వాటిని చేయను' అని ప్రమాణము చేయాలి అయితే (మనిషి) చెయ్యడు. ఎందుకు చేస్తాడు? ఈ పై మూడింటిలో పెద్ద మనిషిగా ఉంటే, నాలుగవ దానిలోకూడా పెద్ద మనిషిగానే యుండును. ప్రమాణము చేయడు గనుక ఆ ప్రమాణము చేయక పోవడము ప్రభువుకు మరియొక బల్లెపు పోటు.

5) మాలో ఏ తప్పులేదనుకొని మరల ఆ తప్పే చేస్తున్నారు. ఇక్కడన్నట్టే అక్కడను మనిషి అంటాడు గనుక చేసిందే చేయడము, పైన వివరించిన తప్పులున్నను లేదనుకోవడమువలన, ఆ మొదటిదే ఇక్కడికి అవతార మెత్తి వస్తుంది. మొదటి నాలిగింటికంటే ఈ ఐదవది ఇంకా ఎక్కువ దుస్థితి. అప్పుడు కూడ ప్రభువుకు మరల మరియొక బల్లెపు పోటు. అది మరలా సిలువ వేయుటయే.

6) ఎన్ని తప్పులున్నా మొదటి అంశములో తప్పులేదని అనుకోవడముకాక, క్రొత్త తప్పు ఇంకొకటి ఉన్నది. అదేదనగా, ఆ తప్పు చెప్పడు. ***ఉన్నదని చెప్పడు. లేదని చెప్పడు, బహుబింకముగా తప్పులేనట్లే అందరకు కనబడతాడు.*** తప్పున్నదనీ చెప్పడు, లేదనీ చెప్పడు. ఇతరులకు ఏ తప్పు లేని వానివలె అగుపడతాడు. అట్టివారు ఈ లోకములో ఉన్నారు. ఉదా: ట్రైన్ వచ్చింది, బండినుండి ప్రయాణీకులు దిగుతున్నారు. టీ.సి. గార్కి ప్రయాణికులంతా టిక్కెట్లు ఇచ్చి వేస్తున్నారు. దొంగలను పట్టుకొనుటలో ప్రసిద్ధికెక్కిన ఒక జవాను అక్కడనే నిలబడి, ప్రతియొక్కరి ముఖము చూచుచున్నాడు. అందరి కళ్లు ఆయననే చూస్తున్నాయి. ఒక పెద్ద మనిషి మంచి బట్టలు వేసికొన్నాడు, బయటకు వస్తున్నాడు. అప్పుడు ఆ పోలీసు జవానుగారు ఆ పెద్ద మనిషి యొద్దకు వచ్చి 'మీది ఏ ఊరు' అని అన్నారు. ఏదో ఒక ఊరు పేరు చెప్పాడు. అయితే నిలబడు! అన్నారు. అతడే దొంగ అని తోచింది గనుక అతన్ని పట్టుకొని అడిగాడు. అప్పుడు ఆ దొంగ నేనెందుకు నిలబడాలి? అన్నాడు. అప్పుడు ఆ జవాను 'నీవు

దొంగవు కాకపోతే వెళ్లిపోవుదువుగాని లేదా స్టేషనులో ఏదోయొక సమాధానము చెప్పుదువు గాని' అన్నాడు. ***ఈలాగు అతని రికార్డు వెతకగా అతడే దొంగని ఋజువైనది. అదే మారుమనస్సు లేని దుస్థితి. అది ప్రభువుకు ఒకపోటు.***

7) ఇది అన్నింటికంటే చెడుగు. అది దేవునిమీది మంచి అభిప్రాయము, చాలా గొప్ప గౌరవము. ఇక్కడ మనిషి ఏమనుకుంటున్నాడంటే దేవుడు గొప్పవాడు, ప్రేమగలవాడు, ఎన్ని తప్పులు చేసినా క్షమిస్తాడు, నేనడిగినా అడుగకపోయినా క్షమిస్తాడు. నేనేదైనా తప్పుచేస్తే నా తల్లిదండ్రులు పట్టీపట్టనట్లు ఊరుకుంటారు, క్షమిస్తారు. ***దేవుడు అంతకంటే దయగలవాడు అని అనుకొని తమ ఇష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తారు. అదే మారు మనస్సులేని దుస్థితి.*** చాలామంది దీనివలననే చెడిపోవుచున్నారు. కాబట్టి, ఇక్కడున్నా మనమందరము ఈ ఏడు అంశములలో ఏదీ లేకుండా చేసుకొంటే, మారుమనస్సు ఉండును. అవి ఉండేటట్లు చేసికొంటే మారుమనస్సు ఉండదు. ఇప్పుడు ఏడు అంశములు చెప్పాను. అవతల మరియొక ఏడు అంశములున్నవి. అందులో మొదటి వాటికి వ్యతిరేక గుణములున్నవి. ఒకదాని ప్రక్కన ఒకటి. రెండవదాని ప్రక్కన రెండవది, అలాగే ఏడు అంశములకు ఏడు ఉన్నవి. కానీ, అవి మంచివి. గనుకనే అవి మొదటి వాటికి వ్యతిరేక గుణములుగా ఉన్నవి. మొదటివాడు పాపముచేసి చేయలేదు అంటున్నాడు. అయితే, రెండవవాడు నేను పాపము చేసాను అని తెలుసుకొంటున్నాడు. ఈ మొదటి అంశమును మనిషి ఎప్పుడైతే తెలుసుకుంటాడో, ఇక మిగతా విషయములు దిద్దుకుంటాడు. అవతల ప్రక్కనున్న ఏడుగురు మారుమనస్సు గలవారు. మొదటి వరుసలో ఉన్నవారు మారుమనస్సు లేనివారు. ఆ మొదటి వరుసలో ఉన్నవారిని గూర్చి మార్చుట అసాధ్యము అని వ్రాయబడినది గనుక ఆ కాలములోనున్న వారిని మార్చుట అసాధ్యము. గనుక ఆ కాలములో ఈ ఏడు రకముల వారున్నారు. ***1) ఈ ఏడు రకములవారు తెలియనివారు కాదు. తెలిసియు ఒకప్పుడు మంచిపేరు పొందినవారే.*** అటువంటి వారిని గురించియే ఈ వాక్యము వ్రాయించినారు. ***2) ఆ కాలములోనే అట్టివారుంటే, మన కాలములో అట్టివారికి కరువు రాదు. ఎక్కువ చౌక.*** ఎందుకంటే జనసంఖ్య ఎక్కువైనది. దానితోపాటు పాపముకూడా ఎక్కువైపోయింది. పాపము చేసినా దానిని కప్పుకోవడానికి తెలివికూడా ఎక్కువైనది.

ఈ కాలములో వింత లేదు. గనుక మనము ఈ లోకుల జనసంఘము మధ్యను విశ్వాసజనసంఘముగా నున్నాము. అనగా క్రీస్తుజనసంఘముగా ఉన్నాము. దైవవాక్యమును ఎరిగిన జనసంఘముగా ఉన్నాము. ***కాబట్టి ఈ రెండవ గుంపు వరుసలోనుండి ఆ మొదటి ఏడుగురి వరుసలోనికి మనము జారి రాకూడదు.*** కానీ,

ఈ మొదటి ఏడుగురికి ఒక శక్తి ఉన్నది. ఆ శక్తి ఏమనగా, ఆ రెండవ వరుసలోనున్న ఆ ఏడుగురిని ఆకర్షించుకొనే శక్తి ఉన్నది. గనుక మనము జాగ్రత్తగానుండే నిమిత్తమై పౌలుగారు ఈ మాటలు వ్రాసారు. రెండవసారి 'మరలా మరలా' అంటే అర్ధమేమిటంటే; ఒకప్పుడు బాగా ఉన్నారు, అయితే, ఇపుడు పడిపోయారు. అందుచేత మరల సిలువ వేసినారు అని వ్రాసినారు. 'మరల, అనుమాటకు అది అర్ధము. **ఈ రెండవ వరుసలోనున్నవారు ఆ మొదటి వరుసలోనికి జారివస్తే, వీరిని మరల ఆ మొదటి వరుసలోనికి మార్చుట కష్టమని పౌలుగారు వ్రాసినారు.** కాని చాలామంది వారి వరుసలు మార్చుకుంటున్నారు. మొదటినుండి రెండవదానికి మారుట ఆరంభములో కుదురును గాని, ముదిరిన తర్వాతకాదు. పౌలు ఇందులోనుంచి అందులోనికి వెళ్లిపోయిన వారిని గురించి చెప్పుటలేదుగాని, మొదటి వరుసలోనే ఉండి 1) మనస్సాక్షి ఎంత చెప్పినా వినకుండా, 2) మనస్సాక్షి ఎంత గద్దించినా వినకుండా, 3) దేవుని గ్రంధము ఎంతగా గద్దించిననూ వినకుండా, 4) తన జ్ఞానము ఎంతగా గద్దించినా వినకుండా, 5) నలుగురు బోధకులు ఆదివార ప్రసంగములలోను ఎంతగా బోధించి, గద్దించినప్పటికినీ వినని వారు మారుమనస్సు లేనివారు. వీరు మారుమనస్సు పొందేటంత శిక్షలను దేవుడు రప్పిస్తే, వారు దేవునిని దూషించుచూనే నేనెంత తప్పుచేసాను? అంటారేగాని ఎంతమాత్రము మారరు. పై ఐదు అంశముల ద్వారా దేవుడు వారిని గద్దిస్తారుగాని వారు మారరు. అట్టివారే మరల మనుష్యకుమారుని, దేవునికుమారుని మరల సిలువ వేయుచూ, బాహాటముగా అవమానపరచుచున్నారు. క్రీస్తుప్రభువు ఇప్పుడు దేవుడుగా నుండక దేవుని కుమారుడుగా నున్నారు. అదేగాక మనుష్య కుమారునిగా ఉన్నారు. *గనుక ఇప్పుడట్టివారు మనుష్య కుమారుని, దేవుని కుమారుని సిలువ వేస్తున్నారు.* పౌలు దేనిని ఎత్తలేదు గాని 'దేవునిని సిలువవేస్తున్నారు' అనే వ్రాసారు. ఈ ఏడు అంశములలో ఏ యొకటియున్ననూ, ఈ ఏడులోను ఉన్నట్లే. గనుక మనలో ఏదియు ఉండకూడదు. అప్పుడు మనము దేవుని కుమారుని సిలువ వేసినవారముకాము. ***గనుక ఈ ఏడు జ్ఞాపకముంచుకొని పరీక్షించుకొని మంచిస్థితిలోనికి రండి.*** వచ్చే మంగళవారము ఆ మిగతా అంశముల వివరము చెప్పుతాను.

ఇది మీ ఉపయోగము నిమిత్తమై దేవుడు దీవించునుగాక! ఆమేన్.

***కీర్తన :*** *"నిన్ను మరల సిలువ వేసి-యున్న పాప జీవినయ్యో! = నన్ను క్షమియించు మని-యన్న నరులు మారు వారు"* *॥ఏకాంత స్థలము॥*

# లెంటులోని ఇరువది నాలుగవ దినము - మంగళవారము

## సిలువలోని నీతి చరిత్ర

కీర్తన. 22:30-31.



ప్రార్థన:- దయగల ప్రభువా! నీ ముఖము ఎదుటను, ఈ శ్రమచరిత్ర ఉంచినావు. ఆ వెనుకను ఈ ప్రకారము సంఘములో జరుగుచున్నది. ప్రభువా! నీవు లోకములో నున్నప్పుడు నీకు, నీ ముఖము ఎదుట, నీకు రానున్న శ్రమలన్నీ కనబడుచున్నవి. అవి జరిగి ఇప్పటికి రెండువేల నాలుగు సం॥లు అయినది. మాకు అవి మా వెనుక ఉన్నవి. మేము వెనుకకు తిరిగి వాటిని మా ముఖము ఎదుట పెట్టుకొని ధ్యానించబోవు చున్నాము. గనుక వాటిని మాకు చూపుము. నీ శ్రమలను ధ్యానించిన యెడల మాకు జయము, బలము కలుగును. నీవు దాచిపెట్టిన వర్తమానములు అందించుమని వేడుకొను చున్నాము. నీ శ్రమచరిత్రలో మా శ్రమచరిత్ర జ్ఞాపకము వస్తున్నది. లోకములో శ్రమలున్నవి. అవి మా పాపములనుబట్టి కాదు. నిన్నుబట్టి, నీ వాక్యమునుబట్టి, నిన్ను ప్రార్థించుటను బట్టి, నీ మార్గములో నడచుటవల్ల మాకు శ్రమలు కలుగుచున్నవి. నీవు శ్రమలను లెక్కచేయలేదు. మేమును లెక్కచేయకుండునట్లు కృప దయచేయుము.

నీ శ్రమ చరిత్రలో నీ ఓర్పు, నీ శ్రమలో నీకు కలిగిన జయము కనబడుచున్నవి. నీ శ్రమలలో మాకు ఆదరణ మాటలు ఉన్నవి. ఏడు ఆదరణ మాటలు నీవు పలికినట్లు మేముకూడా ఆదరణ మాటలు పలుకు కృప దయచేయుము. ఏదో ఒక శ్రమ కలిగియున్న మేము నీ ఎదుటికి వచ్చి కూర్చున్నాము. మా శ్రమలకు లెక్కయున్నది. నీ శ్రమలకు లెక్కలేదు. యేసుక్రీస్తును నమ్ముచున్న మీకు శ్రమలు ఎందుకు వచ్చుచున్నవి? అని సైతాను, తెలివిలేని జ్ఞానులు, బుద్ధిలేని మనుష్యులు, మనస్సాక్షి, జ్ఞానము, లోకమును అడుగుచున్నవి. హేళనచేయువారికి శాంతముగా సమాధానము చెప్పు మనస్సు దయచేయుము. మా మాటలు నామకార్థ మాటలు కాక ఆత్మలోనికి, జీవితములోనికి వెళ్లేటట్లు కృప దయచేయుము. నీ శ్రమలు ధ్యానించి మా శ్రమలు మరచునట్లు; మమ్మును నీ తట్టు, నీ శ్రమల తట్టు, నీ జయము తట్టు, నీ నిరీక్షణ తట్టు, బహుమానము తట్టు మా హృదయములను త్రిప్పుము. అవిశ్వాసికి శ్రమలు కలిగినపుడు కన్నీరు రాల్చుట, విసుగుకొనుట, కేకలువేయుట యుండును. విశ్వాసులు అట్లు చేయరు. శ్రమలు వచ్చినపుడు ఇది మా భాగ్యము, ఇది మా బహుమానము, ఇది మా విజయ ధ్వజము, ఇది మా విశ్రాంతి అని అతిశయింతురు. అట్లు సంతోషించునట్లు మాకు శ్రమ పాఠము నేర్పుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

Bible Mission Guntur

ఇది సంఘ చరిత్ర. ఏమి చెప్పవలెను? శ్రమ పాఠములో చెప్పకుండ ఏమి కప్పవలెను? ప్రభుని శ్రమల ఎదుట నా శ్రమలు ఏ మాత్రము! యేసుప్రభువు ఈ లోకములోని శ్రమలన్నీ, తన కాళ్లక్రింద త్రొక్కిపెట్టి పై లోకములోనికి వెళ్లి తండ్రి సింహాసనముమీదనున్నట్లు, మనము శ్రమలు కప్పిపెట్టి మహోన్నత సింహాసన సిలువకు వెళ్లుదుము. అది నలిగిన సిలువ. శ్రమ సిలువ, కఱ్ఱ సిలువ కాదు గాని మహిమ సిలువ.

ఒక సంతతివారు ఈ వాక్యములోనున్నట్లు చేయుదురు. ప్రభువుయొక్క శ్రమ చరిత్ర చూస్తే మొదటి కథ గెత్సేమనే తోటలో ప్రార్థించిన పిమ్మట ఆయనను పట్టుకొన్న కథ. 1) పాపుల చేతులలో పట్టబడుట. 2) పంచాయితీ సభలో నిలువబడిన శ్రమకథ 3) కయప తీర్పులో నిలువబడిన శ్రమకథ. 4) పిలాతు ఎదుట (ఊరిలో) నిలువబడిన శ్రమకథ. 5) ఊళ్లో హేరోదు రాజు ఎదుట జరిగిన తీర్పు శ్రమకథ. 6) ఆఖరు పర్యాయము పిలాతు ఎదుట కోర్టులో నిలువబడిన శ్రమ తీర్పుకథ. 7) ఊరిలో వీధిలోబడి, రోడ్డుమీదుగా కొండకు సిలువమోసిన శ్రమ కథ. 8) సిలువమీద వ్రేలాడిన శ్రమకథ 9) సమాధి కథ.

***ఈ కథలన్నిటి పొడుగున మనము నడచి, ఆ కథలలోని నీతిబోధ కొద్దిగా వినవలెను.*** ఈ కథలన్నిటికి ముందు జరిగిన కయప కథ, తరువాత మల్కు కథ.

**1. కయప:-** క్రొత్త పెద్ద పూజారి. ఇతడు సభలో యూదులకు ఆలోచన చెప్పెను. ప్రభువుమీద శాస్త్రులు, పరిసయ్యులు కుట్రాలోచన చేయుచున్నారు. కయప- 1) 'యేసు అద్భుతములు చేయగా ప్రజలందరు ఆయనను వెంబడించుచున్నారు. 2) యేసు బోధ వినుటకు ప్రజలంతా ఆయన వద్దకు వెళ్లిపోయినారు. ప్రజలందరు మనలను విడిచివెళ్తే, మన దేశమంతయు ఖాళీ అయిపోయి, మన శత్రువులు వచ్చి మన స్థలమును ఆక్రమించుకొందురు. మన జనమును ఏలుబడి చేయుదురు. గనుక మనమే ఈ ప్రజలతో మీరు ఆయన వద్దకు వెళ్లవద్దని చెప్పవలెను. ప్రజలను ఆపుచేయవలెను. అక్కడకు వెళ్లవద్దని మనము యేసుకు చెప్పవలెను" అని క్రొత్త పూజారి ఆలోచన చెప్పెను. 'మీ ఆలోచన సరిగాలేదని మీరు తెలిసికొనలేదు. మన ప్రజలు నశింపకుండు నిమిత్తము తాను శ్రమ పొందుటకు వచ్చినానని ఆయన చెప్పుచున్నారు. మన శాపము పోవు నిమిత్తము తాను చనిపోవుటకు వచ్చినాడని చెప్పుచున్నారు. ఇది మనకు మేలే గదా! మనమందరము నశింపకుండు నిమిత్తము ఆయనను చంపివేయవలెను' అని సభవారికి కయప ఆలోచన చెప్పినాడు. ఆ సభలో కయప ఒక్కడే ప్రభువు పక్షముగా ఉండెను. ఆయన మంచి పనిచేస్తున్నాడు, మంచి బోధలు చేస్తున్నాడు గనుక చేయనివ్వండి.

**2. సన్‌హెడ్రిన్ సభవారు** కూడుకొన్నారు. ప్రజలు ఆయనవద్దకు వెళ్లకుండా చేయుట ఎట్లు? ఆయనను (యేసుక్రీస్తును) అట్టి అద్భుతములు చేయకుండ నాశనము (ఖూనీ) చేయజూచిరి. ప్రభువు చేయు మంచి పనులకు, బోధలకు సంతోషించక ఆయన మీద చెడ్డమాటలు కల్పించినారు. ఆయనను హింసించువారున్నారు గాని ఆయన పక్షముగా ఒక్కరైనా లేరు. కయప ఒక్కడే ఉన్నాడు.

అట్లే మన బైబిలుమిషను పక్షముగాను, మన పక్షముగాను ఒక్కరైనను ఉంటారు. స్వస్థిశాలలను గురించి మన బోధలను గురించి ఎదిరించువారు, దూషించువారు, తిట్టువారున్నారు. కయప ప్రధానయాజకుడు. అయితే, కయప ప్రవక్తగా మారిపోయినాడు. గనుకనే ప్రభువును గూర్చి ప్రవచించెను. ప్రభువు గెత్సేమనే తోటలో ప్రార్థన ముగించి, గేటువద్దకు రాగా ఎదురుపడిన జన సమూహములో ప్రధాన యాజకుని దాసుడైన మల్కును పేతురు కోపపడి నరకగా చెవి తెగిపడినది. మల్కు అనారోగ్యవంతుడైనాడు. ప్రభువు అతని చెవి అతికించి బాగుచేయగా ఆరోగ్యవంతుడైనాడు. ***అతడు మారినాడు గాని ఇది చూచిన ఆ ప్రజలు మారుమనస్సు పొందలేదు.*** ప్రభువు శ్రమలో, మొదటి శ్రమలో మారిన కయప ప్రవక్తగా మారినాడు. అట్లే పోకిరి గుంపులో కేకలు వేసిన వారిలో, చెవి నరకబడిన అనారోగ్యవంతుడగు మల్కు ఆరోగ్యవంతుడుగా మారిపోయినాడు. ప్రభువువద్ద మారినాడు. ప్రభువువద్ద నున్నవారుకూడ ఆలాగేమారవలెను. అనారోగ్యవంతులు, ఆరోగ్యవంతులుగా మారవలెను.

**3.** పేతురు కోర్టువద్దనున్నప్పుడు, అక్కడివారు 'నీవు క్రీస్తుతో నున్నవాడవుగదా!' అని అడుగగా పేతురు జంకెను. కోడికూసినపుడు ప్రభువు పేతురువైపు చూడగా పేతురుకు అది బాణమై గుచ్చుకున్నది. పేతురు కోర్టు వెలుపలికి వెళ్లి సంతాపపడి ఏడ్చెను. దుఃఖాక్రాంతుడుగా మారెను. పేతురు మొదట భక్తుడు, పిమ్మట భక్తిహీనుడు, ఆ తరువాత మరలా భక్తుడుగా మారెను. 1) కయప, 2) మల్కు, 3) పేతురు.

**4.** పిలాతు కోర్టులో ప్రభువు తీర్పు శ్రమ పొందుచుండగా, అతని భార్య నాకు కల వచ్చినది. ఆయన నీతిమంతుడు సుమా! "ఆ నీతిమంతుని జోలికి పోవద్దు" అని ఆమె ఆయన నీతిపరుడని సాక్ష్యమిచ్చెను. ఆ కోర్టు ఎదుట, అధికారియగు భర్త ఎదుట ఆయన నీతిమంతుడని ఒప్పుకొని సాక్ష్యము చెప్పునంతగా ఆమె మారెను. ఆయన నీతిపరుడని తెలిసికొనగల జ్ఞానవంతురాలుగా మారెను, ధైర్యశాలిగా మారెను. పేతురుకు అట్టి ధైర్యము లేకపోయెను. ***స్వప్నము ఆధారము చేసికొని గొప్ప సాక్షిగా మారినది.*** కయప యూదుడు. ప్రభువు యూదుడు. యూదుడు యూదుని గూర్చి సాక్ష్యమిచ్చుట గొప్పకాదు గాని అన్యురాలిచ్చినది. ఇది గొప్పది.

**5.** ప్రభువుతో దొంగలు సిలువ వేయబడెను. ఏ బోధ విని కుడివైపు దొంగ మారెను? బోధలేదు గాని ఆయన శాంతమును చూచి మారెను. 'నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకముంచుకొనుమని' ప్రార్థించి, ప్రార్థనాపరుడుగా మారెను. ***దొంగ పరలోకములో దొరయైనాడు.***

**6.** సిలువ ప్రక్కను జరిగిన మరొక కథ. శతాధిపతి అనగా 100 మందికి అధిపతి. సిలువ వేయునపుడు అల్లరి జరుగకుండా చూచుటకు అతడు అక్కడుండెను. అతడు భక్తుడు కాదు, లౌకికుడు. భూకంపము జరుగగా అద్భుతము జరిగినది. ఈయన మరియ కుమారుడు, యోసేపు కుమారుడు అనుకొన్నాను గాని ఈయన 'నిజముగా దేవుని కుమారుడని' సాక్ష్యమిచ్చెను. ప్రభువు కోర్టులో అన్నదికూడ ఇదే. అక్కడ అడిగినవారు పిలాతు. నీవు దేవుని కుమారుడవా? అని అంటే నీవన్నట్టే అనెను. అప్పుడు అనగా ప్రభువు చెప్పినప్పుడు నేను నమ్మలేదుగాని ఇప్పుడు నేను నమ్ముచున్నానని శతాధిపతి అనెను. 'నిజముగా' అని సాక్ష్యమిచ్చెను.

శతాధిపతి ఒక్క 100 మందికే అధిపతిగాని అక్కడ ఆ వందమందే కాదు అనేకులున్నారు. అక్కడ ఆ 'నూరుమంది', యూదులు, అన్యులు అనేకులు ఇక్కడ ఉన్నారు. వారందరియెదుట 'నిజముగా దేవుని కుమారుడని' శతాధిపతి సాక్ష్యమిచ్చెను. ***1952సం॥మునకు 80కోట్లమంది, ప్రభువు నిజముగా దేవుని కుమారుడని సాక్ష్యము వినియున్నారు.*** ఆ మొదటి శతాబ్ధమునుండి ఇప్పటివరకు కోట్లకొలది ప్రజలు ఆ వార్త విన్నవారిలో ఉన్నారు. *100 మందికే అధిపతియైన ఆ శతాధిపతి నేడు కోట్లకు అధిపతియాయెను.* పేతురు సాక్ష్యమిచ్చెను– ఆయన నా గురువని. దొంగ– ప్రార్థించెను.

శతాధిపతి– గొప్ప సాక్ష్యమిచ్చెను. అనేకమంది క్రీస్తు దేవుడనుకొనుచున్నారు. అయితే, ఎవరు ఇట్టి సాక్ష్యము ఇవ్వగలరో వారే గొప్ప సాక్షులు. శతాధిపతివలె సాక్ష్యమిచ్చే వారు అనగా సాక్ష్యమిచ్చుటలో ఆయన కుడిప్రక్కను నిలువబడే వారే, గొప్ప వేదాంత పండితులు.

**7.** ప్రభువునొద్దకు రాత్రి రహస్యముగా వచ్చిన నికోదేము, ముసలి వేదాంత పండితుడు. ప్రభువు ఎవరో! ఆయన నాకు ఏమి చెప్పునో, అని రాత్రివేళ ప్రభువు దగ్గరకు వెళ్లెను. ఆయన రాత్రికాల వ్యక్తి. ప్రభువు భోజనముచేసి, కూర్చుండి నికోదేము వచ్చునని కనిపెట్టుచుండెను. నికోదేము వచ్చి ప్రభువుతో సంభాషించి మారెను గాని ప్రభువునకు 33 1/2 సం॥ల వయస్సు వచ్చేవరకు రహస్యముగా నుండెను గాని ప్రభుని శ్రమానంతరము అనగా ప్రభువు మరణమైన పిదప, బహిరంగ శిష్యుడుగా

బైటికి వచ్చెను. ప్రభుని శరీరమునకు పూయుటకు 156 సేర్లు అగరు తెచ్చెను. రాత్రికాల శిష్యుడు ఈ శ్రమ చరిత్రవల్ల పగటికాల శిష్యుడుగా మారెను.

**8.** యేసుప్రభువునకు వ్యతిరేక సభ ఒకటున్నది. అందులో మంచివాడు అరిమతయియ యోసేపు. ఈయన ధనికుడు, ఘనుడు, సజ్జనుడు, రహస్య శిష్యుడు. ప్రభువు చనిపోగానే పిలాతునొద్దకు వెళ్లి ప్రభుని శవము అడుగగా, పిలాతు అతనికి ప్రభుని శవమును ఇచ్చెను. నికోదేము, అరిమతయియ యోసేపు, ప్రభువు సహోదరుడైన యోహాను ఆయనను సమాధి చేసిరి. యోసేపు విలువగల సన్నని నారబట్ట కొనెను. యోసేపు తన కొరకు తొలిపించుకొనిన సమాధిలో ప్రభుని పెట్టెను. ప్రభుని శ్రమవల్ల అరిమతయియ యోసేపు మారెను. ఆయన శ్రమలవల్ల ఎందరు మారిరో లెక్కవేయండి. మీరు మారినట్లైన ఆ మారిన వారిలో మీ లెక్కకూడ లెక్కించండి.

అట్టి కృప త్రియేక దేవుడు నేడు మీకు దయచేయును గాక. ఆమేన్.

**ప్రార్థన:-** ప్రభువా! నీ శ్రమకాలములో ఎందరిని మార్చినావో, పరలోకము వెళ్లిన తరువాత ఎందరిని మార్చినావో!! ఇక్కడున్న మమ్మును మార్చినావు గనుక నీకనేక స్తోత్రములు. ఆమేన్.

**కీర్తన :** *సిల్వయొద్ద జేరుదున్*
*బీద హీనయంధుడన్*
*లోకమున్ త్యజింతును*
*పూర్ణముక్తి నొందుదున్*

*"కర్త నిన్నె నమ్ముదున్*
*కల్వరీ గొర్రెపిల్లా!*
*మోకరించి వేడెదన్*
*నన్ను గావుమో ప్రభో!!"*

# లెంటులోని ఇరువది ఐదవ దినము - బుధవారము

# సిలువద్వారా కలిగే మార్పు - మారలేని యూదా

యోహాను 1:2-3.



ప్రార్థన:- యేసుప్రభువా! తీర్పు శ్రమలో నిలబడిన ప్రభువా! సిలువను నీ మీద వేసికొన్న యేసుప్రభువా! నీ చరిత్ర ముందు నడిచివెళ్లుచుండగా అనేకమందికి మార్పు కలిగినది. నేటివరకు అట్టి మార్పు కలుగుచూనే యున్నది. నీ సిలువ చరిత్ర మార్పు కలిగించలేనట్టి ఒక వస్తువుకూడ ఈ లోకములో లేదు. 'కలిగియున్నది ఏదియు నీవు లేకుండా కలుగలేదు'. గనుక సృష్టిలో నీవు చేసిన ప్రతి వస్తువు ద్వారా ఒక మార్పు కలిగించుచున్నావు. నీవు సూర్యుని కలిగించినావు. ఆ సూర్యునిద్వారా ప్రతి వస్తువునకు, సృష్టి అంతటికి మార్పు కలిగించుచున్నావు. పువ్వులు రకరకములు. వాటికి రకరకమైన రంగులు సూర్యుడు లేకుండా రావు. అది జరుగదు. ఏ సూర్యుని కలిగించినావో ఆ సూర్యునివల్ల వస్తువులను మార్చే శక్తి కలిగించినావు. నీవు కలుగజేసిన వృక్షములలో మార్పు ఏదనగా, వృక్షము వృక్షముగానే యుండును గాని దానిక్రింద నీడ కలిగించినావు. అలసట నొందినవారు నీడను కూర్చుండి నెమ్మది పొందుదురు. ఇదే మార్పు. చంద్రుని కలిగించినావు, దానివల్ల వెన్నెల. ఆ వెన్నెల వలన చల్లదనము, ఇదే మార్పు నరులకు చల్లదనము కలిగించినావు. అనగా నీళ్లు కలిగించినావు. నీళ్లు దాహము తీర్చును. దాహము తీర్చుటే, మార్పు. ఆహారము తిన్నయెడల దాహము తీరదు. నీళ్లవలనే దాహము తీరే మార్పు. నీవు చేసిన ప్రతి వస్తువువల్ల మార్పు కనబడినపుడు నీవల్ల మార్పు ఎందుకు కలుగదు. తప్పక కలుగజేతువు గనుక నీకు వందనములు. ఈ లోకములో నీవు సంచరించినపుడు ఒకనాడు రోగులలో ఎంత మార్పు కలిగించినావు! ఆనంద గీతము పాడుచు గంతులు వేయుచువెళ్లిరి. 1) పాపాత్మురాలు కన్నీటితో వస్తే ఆనంద భాష్పములతో పంపినావు. నీ బోధవల్ల అజ్ఞానాంధకారమును మార్చివేసి వెలుగు కలుగజేసినావు. నీవు కలిగించిన సృష్టివల్ల మార్పు, నీవల్ల మార్పు నీ శ్రమ చరిత్రవల్ల ఎంతమందిని మార్చినావో అది నిన్న నేర్చుకొన్నాము. నీ వలన మారిన మనిషివల్ల, నీ శ్రమ చరిత్రవల్ల మార్పు. గతవారము జయోత్సవ మార్పు చూపించినావు. పాపుల మార్పు, బాప్తిస్మము ఒక మార్పు, సంస్కారము ఆచరించుట ఒక మార్పు. ఇట్లు పాపులను మార్చుచున్నావు గనుక స్తోత్రములు. నీ శ్రమ చరిత్రలో మరొక అంశము: మార్పు పొందక పోవుట. మరొక క్రొత్త అంశమును ధ్యానించబోవు చున్నాము. కృప దయచేయుము. ఆమేన్.

*1. నీకును, నీ శ్రమలకును - నిత్యమును జయము జయము.*

*2. నీకును, నీ ఓర్పునకును - నిత్యమును జయము జయము.*

*3. నీకును, నీ సిలువకును - నిత్యమును జయము జయము.*

1) ప్రభువు తానే తన శ్రమలను గూర్చి ప్రవచించెను. 'మనుష్య కుమారుడు చనిపోయి తిరిగిలేచునని' ప్రవచించెను. 2) కయప ప్రవచనము - ప్రజల కొరకు ఒకడు చనిపోవుట ప్రయోజనము.(ఇది సర్వలోకమునకైన ప్రవచనము). 3) ప్రభువు గార్ధభాసీనుడై సీయోనుకు వచ్చునని జెకర్యా ప్రవచించెను, (జెకర్యా 9:9). 4) తోటలో ప్రార్థన 5) గేటువద్ద పట్టబడుట 6) ఐదు కోర్టులలో తీర్పు శ్రమలు7) సిలువ మోయుట 8) సిలువ వేయబడుట 9) సమాధియగుట. ఇవి 40 దినముల ధ్యాన కాల కార్యక్రమమునకు పెద్దలు నియమించిరి. ఒక్కొక్కటి ఒకొక్క అర్ధము. (క్రమముగా ధ్యానించిన వివరములతో అర్థమగును. అట్లు చేయనందున కొంత విడిచితిని. చెప్పుటకు సమయము లేదు).

**విడిచిన అంశములు**

1. ఆయన చేసిన విజ్ఞాపన ప్రార్థన (తోటలో) 2. పస్కా పండుగ 3. ప్రభు భోజనము 4. దేవాలయ శుద్ధి 5. సద్దూకయ్యుల వాదింపు 6. రోగుల స్వస్థతకూటము (గుడిలో). ఈలాటి అంశములు అన్నియు, ఆయన శ్రమ చరిత్రలోనివే. ఇవి కూడా ధ్యానింపవలెను. పాట: ఈలాటిదా యేసుప్రేమ.

ముఖ్య కార్యక్రమము వివరింపగోరుచున్నాను. ఆయన శ్రమచరిత్రవల్ల మారిన వారున్నారు. ఆయన పూర్వజీవితము వల్ల మాత్రమేగాక, ఆయన శ్రమ చరిత్రవల్లకూడా కొందరు మారలేదు. ఎవరు మారలేదో వారిని జ్ఞాపకము చేసికొందాము.

**యూదా ఇస్కరియోతు మారలేదు.** 1.శిష్యులలో ఒకడైయున్నను మారలేదు. 12 మందిలో ఒకడని అతనికి బిరుదు ఉన్నది. ఆయన శిష్యులందరికి ప్రజలు ఒక పేరు, ఒక బిరుదు ఇచ్చిరి. అది బైబిలులో ఉన్నది. 'వీరు యేసుతో ఉన్నవారు'. యేసుప్రభువుతో ఉన్న 12 మందిలో యూదా ఒకడైయున్నను మారలేదు.

2. క్రీస్తుతో ఉన్ననూ మారలేదు. వారిలో ఇతనికి ఒక ప్రత్యేక ఉద్యోగమున్నది. అది ఖజానాధికారి. అతని చేతిలో సొమ్మున్నది. అతనికి గొప్ప ఉద్యోగమున్నను మారలేదు. ఈ ఉద్యోగము ప్రభువు ఇచ్చినదే. అయినను యూదా మారలేదు.

3. పరిచారకులలో ఒకడైయుండియు మారలేదు. 12మంది శిష్యులు, 12 గంపలతో రొట్టెలు పంచిరి. ఒక గంపతో తాను రొట్టెలు పంచెను. ఖజానాదారుడే ఉద్యోగియే. అలాగే పరిచారకుడుకూడాను. అయినను మారలేదు.

4. ఆయన శిష్యుడే, తోటలో ఉన్నవాడే, ఖజానాదారుడే, ఉద్యోగియే, పరిచారకుడే. అయినను యూదా మారలేదు. ప్రభువు ఏర్పాటు చేసిన గ్రామాదులకు బోధకులలో ఒకడుగా ఎన్నుకొనబడినవాడై, బోధకుడుగా ప్రభువుచేత పంపబడెను. బోధించి వచ్చెను. అందరితోకూడ పంపబడెను, **ఐనను, బోధకుడైయున్నను మారలేదు.**

5. ఈ యూదా వేదాంత విద్యార్థి. ప్రభువు బోధలు విన్న విద్యార్థి. బైబిలు తరగతిలో 3 1/2 సం॥లు తర్ఫీదులో, ప్రభువు ఇతరులకు బోధించిన బోధలన్నీ విన్నను మారలేదు. ఆయన శిష్యులతో ఏకాంతముగా మర్మములు చెప్పునప్పుడు, ఆ విన్నవారిలో ఒకడైయున్నను మారలేదు. గొప్ప విద్యార్థి అయినను మారలేదు.

6. ప్రభువు చేసిన అద్భుతములు కండ్లారా చూచికూడ మారలేదు. 1) రొట్టెలు, 2) మృతులను సజీవులుగా చేయుట, 3) దయ్యములు వెళ్లగొట్టుట, 4) రోగులను బాగుచేయుట, 5) గాలి తుఫాను అణచుట, మొదలగునవి చూచినా మారలేదు. ఇన్నిటికి అతడు సాక్షిగా ఉంటున్నా మారలేదు.

7. మగ్ధలేని మరియ ఆయన బోధవిని మారినది. ఆమె చరిత్ర చూచి ఆయనవల్ల ఒకరు మారడము యూదా చూచినాడు గాని తాను మారలేదు. ఇదంతయు దుఃఖము కలిగించే వార్త.

8. ప్రభువు 12 గోత్రములలోని యూదా గోత్రములో పుట్టెను. ప్రభువు యూదా గోత్రములో అనగా నా గోత్రములోనే పుట్టినాడని ఇస్కరియోతు యూదా అనును. ఆ యూదా ప్రభువు పుట్టుక వంశకర్త. ఈ యూదా ప్రభువును అప్పగించు వంశమునకు గోత్రకర్త.

9. యూదా అనగా 'స్తుతించువాడు' అని అర్థము. కీర్తి పొందినవాడు. కీర్తించువాడు. ఇన్ని గొప్ప అర్థములిచ్చు పేరు గలిగిన వాడైనను యూదా మారలేదు.

10. లోకములో కొందరు ప్రభువును కోరలేదు గాని డబ్బును కోరుదురు. లోకములో కొందరు ప్రభువువద్దకు చేరరు గాని డబ్బు నొద్దకు చేరుదురు. లోకములో కొందరు ప్రభువువల్ల మారరుగాని డబ్బు ఆశ అధికమగుటవలన మారిపోవుదురు.

అయితే యూదా ఇస్కరియోతు: ***1) ప్రభువును కోరినవాడే. 2) ప్రభువువద్ద చేరినవాడే గాని మారలేదు.*** అట్లే 1. మనలో, 2. గుడిలో, 3. సంఘములో, 4. మతములో 5. క్రైస్తవులలో యూదావలె మారనివారున్నారు.యూదావలె కొందరు 1) ఎన్ని బోధలు విన్నా, 2) ఎన్ని అద్భుతములు చూచినా, 3) ఎందరిలో మార్పుచూచినా, 4) ఎందరో మారినారని విన్నను, కండ్లతో చూచినను మారనివారుందురు. *1.* ప్రభువును కోరండి,

2. ప్రభువువద్దకు మాత్రమేకాదు, వచ్చి ఆయనలో చేరండి. 3. ప్రభువునుబట్టి మారండి. ఎప్పుడో ఒకసారి మారవలెను. మీలో ఎందరు మారినారు? అని అడిగితే మారినాము అందురు. నేను మారినానా? నేను మారిపోయినానా? అని ప్రశ్నించుకోండి. **మిషనులోనివారు, మతములోనివారు అనేకమంది మారరని ఇస్కరియోతు చరిత్రలో యున్నది.**

II. **సన్‌హెడ్రిన్ సభవారు మారలేదు.** ఇది యూదుల ఆలోచన సభ అనగా పంచాయితీ. ఇది 70 మంది సభ్యులతో కూడిన పంచాయితీ సభ. ఈ సభవారు, వారే ప్రభువును అన్యులకు  అప్పగించి సిలువ వేయించిరి. యూదులలో కేసులుంటే ఈ సభవారు విచారణచేతురు. గనుక ప్రభువును గూర్చిన కేసు ఈ సభకు వచ్చింది గనుక వారు సిలువ వేయవలెనని తీర్మానించిరి. ఈ సభవారికి ప్రభువును గూర్చి మంచి సాక్ష్యములున్నవి. వెలుపటివారు సభలో సాక్ష్యమిచ్చిరి. అవి ఏమనగా

1) అద్భుతములు చేస్తున్నాడు,  2) మంచి బోధలు చేస్తున్నాడు. 3) ఆయన శాంత గుణముగలవాడు. ఇవి ప్రజలకు మేలుకరములైనవే.

ఈ మూడు కారణములనుబట్టి ప్రజలు ఆయనవెంట వెళ్ళుచున్నారు.  ఆయనకూడ వెళ్లిపోతున్నారు. ఈ మూడు ఈ ఉపకారములు సభవారు ఎరుగుదురు గాని మారలేదు. ***వీరు ఒక్కరేగాదు ఈలాటి గుంపులు లోకములో ఎందరున్నారో!*** యూదా ఒక్కడేగాదు. యూదావంటి వారెందరోగలరో వారును మారరు. మారని వారందరు ధవళ సింహాసనము మీదనున్న జడ్జిగారైన ప్రభువు ఎదుట నిలువబడవలెను. ఆ రీతిగా నిలువబడవలసిన గుంపులనేకములుండును. అట్టివారు 1) ప్రభువును కోరరు, 2) ప్రభువువద్దకు చేరరు, 3) అందుచేత మారరు. ఈ మూడు గుంపులవారు మారరు. ఇది బహు విచారకరమైనది. ***ఇది లోకచరిత్రలో ఒక విచారకరమైన చరిత్ర. వారెందుకు మారరంటే వారి హృదయములలో ఏదో ఒక పాపముండును.***

**1. *యూదా:*** అతని హృదయములో ఒక పాపమున్నది. ధనాపేక్షగల పాపము. గనుక మారలేక పోయినాడు. ఇతనిలో ధనాపేక్ష అను చెడుగున్నట్లు యోహాను వ్రాసెను. లోక ధనము కొరకు ఆశించెను.

**2. సన్‌హెడ్రిన్ సభవారు:** వీరెందుకు మారలేదు? లోక రక్షకుడైన యేసు వచ్చినప్పుడు లోక రాజ్యము ఇస్తాడని వీరు అనుకొన్నారు. యూదా లోకధనము కొరకు ఆశించినట్లు, వీరు లోకరాజ్యము కొరకు ఆశించిరి. అది వారికి ప్రభువు ఇవ్వలేదు, గనుక వారికి దొరకలేదు, గనుక వారు మారలేదు. తీర్పులో ప్రభువు, 'నా

రాజ్యము ఈ లోక సంబంధమైనదికాదు, అది పరలోక రాజ్యము' అని కోర్టులో చెప్పెను. అందుచేత వారు ఎన్ని అద్భుతములు చూచినను, మంచి బోధలు విన్నను, ఆయనలో ఎన్ని మంచి లక్షణములు చూచిననూ, అవి వారికి లెక్కలేదు. వారికి కావలసినది లోక రాజ్యమే. అందుచేత వారు మారలేదు.

మనలోకూడా అట్టివారున్నారు: 1) ప్రభువు అద్భుత బోధలు, ఆయన లక్షణములు తెలిసినాగాని వారు అనుకొన్నది దొరకనప్పుడు వారు మారరు. కోరినదేదో అది దొరకనప్పుడును, దొరకలేదు గనుకను, ఆలస్యమైనది గనుకను వారు మారరు. **మనము కోరినవి ఆయనవల్ల చిక్కకపోయినను, మారినవారము మారినట్లు, మారే ఉండవలెను.** వారు అనుకొన్నవి దొరకనందువల్ల ఆయన అద్భుతములు, బోధలు, ఆయన లక్షణములును, ఆయనయు కొట్టివేయబడును గనుక మారరు.

***III. సిలువవద్ద మారిన దొంగ, మారని దొంగయు ఉన్నారు. మారని ఇతడు రెండవ దొంగ, మనకు మూడవ మనిషి. (1. యూదా, 2. సభ, 3. దొంగ)***

మొదటి దొంగ దేనినిబట్టి మారెను? ప్రభువుయొక్క శాంతి గుణమునుబట్టి మారెను. రెండవ దొంగ ఆ శాంతి గుణము చూడలేదా? చూచెను గాని మారలేదు. రెండవ దొంగ ఆయన శాంతగుణమునుబట్టియే గాక, ఆయన చేసిన ప్రార్థన వినియు మారలేదు. ఇది మొదటి ప్రార్థన, గొప్ప ప్రార్థన. ఈ ప్రార్థనలో రెండు అడలున్నవి. 1) వీరెరుగరు, 2) వీరిని క్షమించుము. వారెరుగరా? ఎరుగుదురు. ఇవన్నియు ఎరిగియుండి వారు చేస్తున్నను, ప్రభువు 'వీరిని వీరెరుగరు క్షమించుమని' చేసిన ప్రార్థన వినినను అతడు మారలేదు. పౌలు తన పత్రికలో *'ప్రభువుయొక్క మహిమను వారు ఎరిగియుంటే ఆయనను వారు సిలువవేయక యుందురు'* అని వ్రాసెను. రెండవమాట: 'నేడు నీవు నాతో పరదైసులో ఉందువు' ఆ ప్రార్థనయు, ఈ మాటయు అను ఈ రెండు కార్యములును దేవుడు తప్ప మరెవరును చేయలేరు, పలుకలేరు.

పాట: *'దేవుండవు కాని యెడల...'* మొదటి దొంగ దేనినిబట్టి మారెనో, దానిని బట్టియే రెండవ దొంగ మారవలసినది గాని మారలేదు. ఇంతకుముందు ఇద్దరును ప్రభువును దూషించిరి. ఆ తరువాత పైవాటిని చూచి మొదటి దొంగ మారెను. గాని రెండవ దొంగ మారలేదు. ఎందుచేత రెండవ దొంగ మారలేదు? అతని హృదయములో రెండు గలవు. ఇతరులను రక్షించిన ఆయన తనను రక్షించుకొనవలెను. ఆ తరువాత నన్నును రక్షించవలెను. అట్లు జరుగలేదు. గనుక మారలేదు. 1) ఆయన గొప్పవాడైతే సిలువమీదనుండి దిగవలెను. 2) ఇంకా గొప్పవాడైతే నన్నుకూడా దింపవలెను.

**ఆయన దిగలేదు, తన్ను దింపలేదు, గనుక మారలేదు. ఏదో ఒక దుర్గుణమున్నయెడల, ఎలాంటి బోధలు విన్నను మారరు.** 3) బంటులు కూడా మారలేదు. ప్రభువు పునరుత్థానుడైనది వారు చూచినారు. కాని మారలేదు.

1. యూదా మారలేదు సరిగదా! మరింత చెడిపోయినాడు (స్వహత్య చేసికొన్నాడు).

2. సన్‌హెడ్రిన్ సభవారు మారలేదు. మరింత చెడిపోయిరి. రక్తాపరాధము మామీద, మా పిల్లలమీద ఉండునుగాక! అన్నారు.

3. దొంగ మారలేదు. మరింత చెడిపోయినాడు. అనగా దూషించినవాడు మరింత దూషించెను.

4. కావలివారు మారలేదు. చెడిపోయిరి. మరింతగా చెడిపోయిరి. ఏలాగనగా: ఆయన బ్రతికినాడని వారు చూచిరి గనుక బ్రతికినాడని చెప్పవలసినది గాని ఆలాగు చెప్పలేదు సరిగదా! శిష్యులు శవమును ఎత్తుకొని పోయిరి అనిరి. అనేకమంది అట్లే మారరు గాని మరింత చెడిపోవుదురు.

షరా: ***మారకపోతే సరిగాని మరింత చెడవద్దు. ఇట్టివారు సంఘములో ఉన్నారు, చాలా విచారము.*** ఈ రెండు కథలు మీరు పుచ్చుకొనండి. ఇంటికి వెళ్లండి, పండుకొనండి, ఆలోచించుకొనండి. నేను మారినానా? అని ప్రశ్నించి పరిశీలన చేసికొనండి. మారకపోతే సరేగాని మరింత చెడిపోకండి.

ఈలాగు మన హృదయములను నిత్యము ప్రశ్నించుకొని, మారిన అంతస్థులో స్థిరపడి రాకడకు సిద్ధపడు కృప పెండ్లికుమారుడు నేటి శ్రమకాల ధ్యానమునుబట్టి మనకు దయచేయునుగాక. ఆమేన్.

ప్రార్థన:- ఈ మాటలు విని, ప్రయత్నించువారిని దీవించి మార్చుము. **మాలో మారుటకు ప్రతివారిని ప్రతి విషయములోను మార్చుమని వేడుకొనుచున్నాము.** ఆమేన్.


***కీర్తన :*** *1.* *మహాత్ముడైన నా ప్రభు*
*విచిత్ర సిల్వ జూడ నా*
*యాస్థిన్ నష్టంబుగా నెంచి*
*గర్వం బణంగ ద్రొక్కుదున్॥*

*2.* *నీ సిల్వ గాక యో దేవా*
*దేనిన్ బ్రేమింప నీయకు*
*నన్నాహరించు సర్వమున్*
*నీ సిల్వకై త్యజింతును॥ ఆమేన్.*

# లెంటులోని ఇరువది ఆరవ దినము - గురువారము

## ప్రభువు చేసిన సత్కార్యములు - సిలువ కారణము

గలతీ 3:1.



**ప్రార్థన:- తండ్రీ! నీ సిలువలో మేము గ్రహించని సంగతులు అనేకములు ఉన్నవి. ప్రతి దినధ్యానములోనూ ఒక నూతన సంగతి అందించు-చున్నందుకు వందనములు. మా కొరకు ఎన్నో మహిమ సంగతులు దాచి ఉంచినావు గనుక నేడునూ నీ సిలువలోని మహిమ వర్తమానము దయచేయుమని యేసునామమున వేడుకొంటున్నాము. ఆమేన్.**

ఆయన సిలువవైపే చూస్తూ ఉన్న ప్రియులారా! దేవుని పిల్లలారా! ఈ శ్రమకాల దినములలో పభువుయొక్క శరీరచరిత్ర మన మనోనేత్రములకు కనిపిస్తున్నది. అది మూడు భాగములుగా నున్నది.

1. యేసుప్రభువు చేసిన సత్కార్యము.
2. అట్టి సత్కార్యములు చేసినందువల్ల ఆయనకు లభించిన హింస.
3. ఆయనను హింసించిన వారికి కలిగిన దుస్థితి.

పై మూడు భాగములు మూడు విధములుగా ఉన్నవి.

*1) సత్కార్యములు, 2) శ్రమ మరణము, 3) శ్రమ కలిగించిన వారి దుస్థితి* (హింసకుల దుస్థితి) ఈ మూడింటినిబట్టి ప్రభువునకు కలిగిన జయ జెండాలు. వీటిలోనికి ప్రభువుయొక్క సిలువను తీసుకు రాకపోతే అవి నిష్ప్రయోజనము.

I. **సత్కార్యములు:** ప్రభువు చేసిన మొదటి సత్కార్యము– బోధ.

***(1) ప్రభువు చేసిన బోధ:–*** ప్రభువుయొక్క మంచి కార్యముల భాగములో ఇది మొదటిది. ఆయన చేసిన మొదటి సత్కార్యము బోధ. జన సంఘముల ఎదుట ప్రభువు బోధించినారు, బోధకుడుగా బైలుదేరినారు, ఆయన ఎవరో, ఆయన వర్తమానమేమిటో తెలియవలెనంటే ఇతరులకు బోధించవలెను గనుక ప్రజల ఎదుట బోధకుడుగా ప్రత్యక్షమైనాడు. అదిగో 'యూదుల రబ్బీ' అని ప్రజలు చెప్పుకొన్నారు. ప్రభువు బోధించే బోధ, క్రొత్త బోధయై యుండకపోతే ప్రజలు మెచ్చుకొనరు, అంగీకరించరు. గనుక ఆయన బోధ వినిపించినపుడు, ఇది ఎటువంటి బోధో అని ప్రజలు రిమార్కు చేసినారు. ఇది ఆయన చెప్పినందువల్ల క్రొత్త బోధ. అనగా అధికారముతో బోధించినందున, వారు ఆశ్చర్యపడినారు. ఎందుచేత ఆయన అధికారముతో బోధించారు. తాను బోధించినవన్నీ నెరవేర్చినారు. పూర్వికులైనవారు

బోధించిన పాఠములున్నవి. వాటిని మత గురువులు బోధించినారు. నరహత్య చేయుట పాపము అని బోధించినారు. ప్రభువు ఏమి చెప్పినారంటే కోపపడితేనే పాపమని చెప్పినారు. అది పూర్వికులు చెప్పలేదు గనుక ఇది క్రొత్తగా ఉన్నది. 'అబ్బో కోపడితేనే పాపమైతే, మనలో అందరము రుసరుస లాడు వారలమే' అని ఆశ్చర్యపడ్డారు. నరహత్య చేయవద్దని పూర్వీకులు బోధించినారు కాని నేను మీతో చెప్పునదేమంటే అని ప్రభువు తనకున్న సర్వాధికారము చూపించి, బోధించినారు. ఏమిటా అధికారము? దానిభావము కాలక్రమమున తెలిసినది.

నేనే సీనాయి కొండ దగ్గర నరహత్య చేయవద్దని ఆజ్ఞ ఇచ్చింది. ఇప్పుడు నేనే కోపపడవద్దని చెప్పుచున్నాను. ఆ ఆజ్ఞలు ఇంకొకరు చెప్పితే, అది అధికారము కాదు గాని, సందేశమౌతుంది. ***ఆయనే చెప్పినాడు గనుక అధికారము కనబడినది. నేను చెప్పినది వినండి అని చెప్పినాడు.*** ఈ మాటల వలన ఎవరికి ఎక్కువ కోపము వచ్చును? మత బోధకులకు కోపము వచ్చును. మాట ఒక్కటే, గాని బోధ ఆశ్చర్యము. కోపపడితేనే నరహత్య అని ఆయన చెప్పినారు.' ఆ కోపము ఇక్కడే కనబడినది. కాబట్టి దేవుని వాక్యము ఒకటే గాని ఫలితములు రెండు : 1) ఒకరికి కోపము, 2) ఇంకొకరికి ఆశ్చర్యము కలిగించినది. అధికారముతో చెప్పినందున ఆయన దైవత్వము బైలుపడినది. 'నేను మీతో చెప్పుచున్నానని' ఆయన చెప్పినప్పుడు, బోధించినప్పుడు; ప్రధాన యాజకులు అభ్యంతరపడినప్పుడు, ప్రజలు ఆశ్చర్య పడినప్పుడు ఆయనకు నష్టము, హింస కలిగినది. మంచి బోధవలన ఆయనకు హింస కలిగినది. ఈ కాలములో మనకును కలుగుచున్నది. "నేను" అన్నారు. 'మీతో చెప్పుచున్నాను' అన్నారు. ఇంకొకటి 'నిశ్చయముగా చెప్పుచున్నాను' అన్నారు. ఇది ఎక్స్‌ట్రా బోధ అనగా శాస్త్రులు, పరిసయ్యులు చెప్పినదానికి పైగా చేర్చి చెప్పిన బోధ. ఆయన అనుబంధమును కల్పినారు. అనగా అందులో (వారి బోధలో) లేని దానికంటే చేర్చి చెప్పుట. వారు చెప్పినదే స్థిరపరచితే వారికి అంత కోపము రాదు. మూడు సం॥లు కేసు నడచినది. గనుక చివరకు ప్రభువును హింసించుటకు పూనుకున్నారు. ఎన్ని గుంపులవారు? 1. పెద్దలు, 2. ప్రధాన యాజకులు, 3. శాస్త్రులు, 4. యూదుల ఆలోచన సభ, 5. రాణువవారు, 6. అధికారులు. వీరందరూ ఆయనను నిరాకరించిరి, హింసించిరి, చంపించిరి. ఈలాగు ఆయనచేసిన బోధవల్ల ఆయనకు ముప్పు వచ్చింది. బైబిలులో ఉన్నదిగాక ఎక్స్‌ట్రాగా (అధికముగా) మనము బోధించితే, అది న్యాయముగా ఉంటుందా! సబబుగా ఉంటుందా! ఉంటుంది. ఎందుచేత? ఒక కారణము చెప్పండి. ***ప్రభువే ఎక్స్‌ట్రా టీచింగ్ చేసినారు. గనుక మనమెందుకు వినిపించకూడదు!***

Bible Mission HQ Guntur

**ఒక దృష్టాంతము:** 'నేను వెళ్లుచున్నాను, సహాయకుడను పంపిస్తాను' ఇది పూర్వీకులు బోధించిన బోధకంటే ప్రభువు చెప్పిన ఎక్స్‌ట్రా బోధ. పరిశుద్ధాత్మ చెప్పినది ఇంకా ఎక్స్‌ట్రా. ఇప్పుడు అవి బోధించితే, విరోధులు లేస్తారు. ***ఈ కాలమందు ప్రభువు ఆత్మ బోధించిన ఎక్స్‌ట్రా టీచింగ్ ఎవరు చేస్తారో వారికి విరోధులు జాస్తి.*** ఆయన బోధవలన వారి అసూయ ఎక్కువై, తుదకు ఆయనను చంపినారు. "హింసపొందుటకు, చంపబడుటకు కారణము ప్రభువే. ఆలాటి బోధ ఎందుకు చేయవలెను? అందరు చెప్పినట్లు ఆయన ఎందుకు చెప్పకూడదు? అనివారందరు ఆయనను తరిమినారు. 1) ఎక్స్‌ట్రా బోధ, 2) ఆయన. ఈ రెండూ ఆయనను చంపుటకు కారణాలే. 'గనుక *మీరు ఎక్స్‌ట్రా బోధ చేయకండి'!* ఎవరైనా ఇలాగు బోధించేవారుంటే, ధైర్యము తెచ్చుకొనండి. మోషే, ప్రభువు, పరిశుద్ధాత్మ ఎక్కువగా బోధించినారు. మీరు ఎక్కువ *బోధించితే ప్రజలు మిమ్మును హింసిస్తారు, అయిననూ మానవద్దు.* కారణము ప్రభువునూ, ఆయన ఎక్స్‌ట్రా బోధనూ ప్రభువు చనిపోవుటకు కారణములు.

పూర్వికులు ఈలాగు చెప్పుచున్నారనగానే ఆనాడు వారికి విరోధము ఎక్కువైనది. మనమును నేడు ఆలాగు చెప్పవచ్చునా? చెప్పవచ్చును. అనవచ్చునా? అనవచ్చును. ఎందుచేత? ప్రభువు ఆత్మ చెప్పుచున్నాడు గనుక అనవచ్చును. **ఇప్పుడు మేము చెప్పుచున్నాము వినండి అని అనవచ్చును.** ఎవరు దేవుని వాక్యము సరిగా నేర్చుకొంటారో వారే, ఆలాగు  అనగలరు. ఎవరు మోషేవలె, ప్రభువువలె సంపూర్ణ అధికారము సంపాదించుకొంటారో, వారే ఆలాగు చెప్పగలరు. ఇప్పటి బోధకులు అధికారము గలవారా? శత్రువుయొక్క బలమంతటి మీద ఆయన అధికారము ఇచ్చినారు. అయితే, సంపూర్ణ సువార్త ఎరిగినవారు, అంతకంటే అధికారము గలవారు. ***మీరు అంత బాగా వాక్యమును నలగ చదువుచున్నారా? కంఠతగా నేర్చుకొన్నారా?*** ఎవరు ఏమి అడిగినా జవాబు చెప్పగలరా? వాక్యములో ఏదో సగము నేర్చుకొన్నారు. అయితే ఆ సగములో సగము మాత్రమే చెప్పగలవారు ప్రభువుయొక్క బోధను అధికారముతో ఇతరులకు ఏలాగు వినిపించగలరు? ఓ బైబిలు మిషను సువార్తికులారా! పరిశుద్ధాత్మ సహాయము ద్వారా ఎక్స్‌ట్రాగా బోధించండి. 2. అధికారముతో బోధించండి. 3. ఎక్కువగా నేర్చుకొన్నాననే అధికారముతో బోధించండి. 4.'సత్యము నేను చెప్పుచున్నాను, నేను బాగా నేర్చుకొన్నాను' అని బోధించండి. సువార్త బోధ ఎటువంటి బోధ? సేద తీర్చే బోధ. మధుర సువార్త బోధ. అనగా తగిన సమాధానము చెప్పి దాహము తీర్చి, సేద తీర్చే బోధ.

Bible Mission HQ Guntur

**(2) ప్రభువు చేసిన పరిచర్య:-**

తాను ఏమి బోధించినాడో అదే పరిచర్యగా, ప్రభువు రోగులను బాగుచేసినాడు. దృష్టాంతము: కుష్టరోగిని ముట్టకూడదు గాని ముట్టుకొని బాగుచేసినారు. జ్వరము గల వానిని, గుడ్డివానిని, శవమును ముట్టుకొని బాగుచేసినారు, ఉపకారము చేసినారు. యావగించుకొనలేదు, అసహ్యించుకొనలేదు. రోగులకు ఉపకారము చేసినాడు. ఏమి ఉపకారము? స్వస్థత. ఇవి తక్కిన బోధకులు చేయలేదు. ఈయన బోధించిన తరువాత రోగులను బాగుచేస్తే, **రోగులకు ఇష్టము కలిగినది. బోధకులకు కష్టము కలిగినది.** అందుచేత పగ రెట్టింపు అయినది. 'అందరికి ఇట్టి అద్భుత కార్యములు చేస్తున్నారు. అందరూ ఆయన వెంట బోవుచున్నారు' అని వారు అసూయ పడ్డారు. ఆయనలోని ఉపకారము చివరకు వారికి దుర్గుణము అయింది. ఆయన ఉపకారము ఒక కారణము, ఆయనే ఒక కారణము. ప్రభువు రోగులను బాగుచేసినట్లు ఈ కాలమందు ఎవరైనా చేస్తున్నారా? మనము చేస్తామా? మనము చేస్తే నమ్ముతారా? ఈ కాలమందు ఆలాగు చేస్తే ఎవరికి కష్టము? డాక్టరులకు కష్టము. మా బ్రతుకు దెరువు పడిపోయిందని, ఒక డాక్టరు అన్నారు. రోగులను బాగుచేయుట, గాలి తుఫాను అణచుట, చిక్కులు విడిపోవునట్లు చేయుట; ఈలాగు ప్రభువు చేసినట్లు మనమును చేస్తే అందరూ బాగవుతారు. అయితే ఇదివరకు ఎవరైతే బాగుచేయలేదో వారికి ఇది కష్టము.

1) ఎక్స్ట్రా బోధ,

2) ఎక్స్ట్రా (ఉపకారము) పరిచర్య,

3) ఎక్స్ట్రా సాధుత్వము.

***(3) ప్రభువు సాధుత్వము:-*** 'కొట్టినను మరల వానిని కొట్టడాయెను. తిట్టినను మరల వారిని తిట్టడాయెను'. అందుచేతనే ఆయనను వారు చంపివేసిరి. ఏలీయా లాంటివారైతే అగ్ని కురిపించి, వెంటనే చంపించుదురు. గాని ఈయనలోనున్న సాధుత్వము, అధిక సాధుత్వమును బట్టి వారు- 'అంత మందిని రక్షించుకొన్నావు, నిన్ను నీవు రక్షించుకోరాదా' అన్నారు. గనుక ఆయనలో ఉండే సాధుత్వము ఆయన మరణమునకు కారణము. కొందరు సువార్త బోధించుటకు వెళ్లినపుడు, అన్యులు వారిని దూషించితే, కొంతమంది తిరిగి దూషిస్తున్నారు. మరికొంతమంది దూషించుటలేదు. అయితే తిరిగి దూషించుట సాధుత్వము కాదు. ప్రభువాలాగు చేయలేదు. దూషించి- నప్పుడు దూషిస్తే, కొట్టినపుడు తిరిగి కొట్టితే జయము దొరుకవచ్చునేమో గాని, ఆత్మ దొరకదు. ఘనత కొరకు, గొప్ప కొరకు సొమ్ము కొరకు,

మనము సువార్త పనిమీద వెళ్లము. గాని మనిషి కొరకు వెళ్ళుదుము గనుక మనిషి దొరకునట్లు, సాధుత్వమువల్ల సంపాదించవలెను. ***ప్రభువు తన సాధుత్వమువల్ల అందరిని చెరపట్టినారు. అయితే మీ ద్వేషము వలన మీరు అందరిని చెదరగొట్టు చున్నారు.*** ఆ మహిమ గల ప్రభువుయొక్క మహిమ వారికి తెలిసియుంటే, ఆయనను సిలువవేయనే వేయరని పౌలు చెప్పినారు. ప్రభువును ఎందుకు వారు హతము చేసినారు? ఆయనలో ఉన్న ఎక్స్ట్రా సాధుత్వమువల్ల హతము చేసినారు. ఆయన సాధువులందరి కంటే సాధువు. ఉపకారులందరి కంటే మహా మహోపకారి. బోధకులందరికంటే మహా మహోపాధ్యాయుడు. హత సాక్షులకు యేసుప్రభువు మాదిరివల్లనే ధైర్యము వచ్చింది.

**(4) ప్రభువు సత్ప్రవర్తన:–** సత్ప్రవర్తన అనగా మాటలో దోషములేదు, చూపులో కళంకము లేదు, వినడములో కళంకములేదు, క్రియలో కళంకములేదు, ఎందులోనూ కళంకములేదు. గనుక ఆయన మహా పవిత్రుడు. ఆయన ప్రవర్తన సత్ప్రవర్తన గనుక ఆయన పరిశుద్ధుడుగాను నిష్కళంకముగాను ఉన్నారు. ఆయన తన బోధలో పరిచర్య, ఉపకారములో సాధుత్వము, సత్ప్రవర్తనలో నిష్కళంకుడుగా నున్నాడు. అంతకు పూర్వమున్న భక్తులు మాత్రమే సత్ప్రవర్తనగలవారు కారు. వారిలో పొరబాటులు గలవారు ఉన్నారు గాని తరువాత వారు దిద్దుకున్నారు. ఈయన ఎందుకు దిద్దుకోలేదు. ఈయన అసలే కళంకమును లేనివారు గనుక దిద్దుకొనలేదు.

***ఎక్స్ట్రా సత్ప్రవర్తన:–*** 'ఆయన ప్రవర్తించినట్లు ఎవరూ ప్రవర్తించలేదు. 'ఎందులో ఒక దానిలో మనము జారిపోయినాము' అని ఆ కాలము నాటివారు ఆయన ఎక్స్ట్రా సత్ప్రవర్తన పై మత్సర పడ్డారు. మనలో నిన్న అపవిత్రత ఉంటే, ఈ వేళ సత్ప్రవర్తన యుండవచ్చు గాని **ప్రభువువంటి సంపూర్ణ సత్ప్రవర్తన గలవారు ఎవరూలేరు.** ఆయనవంటి సత్ప్రవర్తన చూపించే వారు లోకములో ఎవ్వరూ లేరు. చివరిది, అన్నిటికంటే గడ్డయినది, 'నాలో ఏ దోషము లేదు. ఎవరైనా దోషము ఆరోపించ–గలవారుంటే ఆరోపించండని' జనసమూహము ఎదుట ఆయన చెప్ప గలిగెను.

***(5) నేనే ఆయనననని (దేవుడనని) బోధించుట:–*** ప్రభువు వాక్యోపదేశము చేసే సమయమందు ఏమన్నారంటే 'అబ్రాహాము పుట్టకముందే నేనున్నానని' చెప్పెను. *'30 ఏండ్లున్న ఆయన సృష్టికిముందే ఉన్నాను'* అన్నందున వారికి కోపము వచ్చినది. ఆయన నేను మెస్సియాను అన్నారు. దేవుని కుమారుడవా! అంటే అవును. తండ్రి నేను ఒక్కటే అన్నాడు. నరమాత్రుడు, దేవునితో సమానం చేసికొన్నాడు. ఆ కోపముకంటే

ఈ కోపము ఎక్కువ కాగా, నేనే దేవుడనని చెప్పుకుంటున్నాడని అధికారులకు అప్పగించారు. కేసు విచారణప్పుడు గవర్నమెంటువారి ఎదుటే దోషము ఆరోపించిరి. దేవునితో సమానము చేసికొన్నాడని చెప్పిరి. ***కోపము, పగ ఎందులోకి దిగింది, ఆలోచనలోకి దిగింది. ఆ ఆలోచన, చంపడములోకి దిగింది.*** ఇవన్నీ నేను దేవుడనని చెప్పుటలోకి దిగింది. సత్ప్రవర్తనపుడు నీతిపరుడుగా కనబడెను. ఇదంతా సినిమాగా కనిపించినది. సినిమాలో ఈ ప్రకారముగా బొమ్మలుచూపిస్తే, కూలివాడు చివరకు రాజైనాడు అని అందురు' ఆలాగే బోధకుడు, సాధువు చివరకు దేవుడైనాడా! అని వారందరూ అనుకున్నారు. సమరయ స్త్రీతో మాట్లాడినపుడు, తాను దేవుడైయున్నాడని ఆయన బోధించినాడు.

ఆయన, 1. బోధకుడు 2. పరిచారకుడు 3. సాధువు 4. నీతి ప్రవర్తన కలవాడు. 5. ఆయన మన దేవుడు గనుక విరోధము ఎక్కువాయెను. పెండ్లికుమార్తె శాఖవారు. ఇవన్నీ చేయగలరు. బోధ, సాధుత్వము, ప్రవర్తన, పరిచర్య ఎక్స్ట్రాగా చేయగలరు. ఆయన బోధించినపుడు దేవుడని తెలుసుకోలేదు గాని బైలుపరచుకొన్నప్పుడు దేవుడని తెలుసుకొన్నారు. నేను మీలో, మీరు నాలో ఉన్నారనే సంగతి పరలోకము వచ్చినపుడు మీరు తెలిసికొందురని ప్రభువు చెప్పెను. గనుక పెండ్లికుమార్తె మాత్రమే అట్టి ఐక్యతను, అనుభవమును సంపాదించుకొనగలదు. నాతో కూడ నా సింహాసనమందు జయించువానిని కూర్చుండబెట్టుదునని ప్రక 3:21లో ప్రభువు చెప్పెను.

అట్టి అంతస్థు ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్

***కీర్తన :*** *ధీరుండై దీనుండై-ధారుణ్య పాప భారంబు మోసెను సోదరా=తన్ను- జేరిన వారిని-పారదోలనని-ఎవరు బల్కిరి సోదరా! ॥యేసు క్రీస్తుని సిలువ॥*

# లెంటులోని ఇరువది ఏడవ దినము - శుక్రవారము

## అంధకారపు లోయ

"గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను, ఏ అపాయమునకు భయపడను" కీర్తన 23:4



**ప్రార్థన:- తండ్రీ! నీ శ్రమలు అంధకారపు లోయవంటివైనను, నీవు ఒక్కడవే ఒంటరిగా అన్నిటినీ నా కొరకు సహించి, భరించి, జయించినావు గనుక నీకు వందనములు. నీ శ్రమలు అధికమైన కొలది, నీ ఓర్పు సహనము మరింతగా అధికమైనవి. గనుక నీ శ్రమానుభవములోనుండి నేటిదిన వర్తమానము దయచేయుమని యేసు నామమున అడుగుచున్నాము. ఆమేన్.**

ప్రభువు శ్రమలను ధ్యానించు కాలములో ఉన్న సిలువ ధ్యానపరులారా! వినండి. ఆయన సిలువ తట్టు చూచుచున్న ప్రొద్దు తిరుగుడు పువ్వు, సూర్యుడు కనిపించు వైపునకే తిరుగుచుండును. కుండకు చిన్నరంధ్రము చేసి, చిన్న మొక్కమీద బోర్లించి అప్పుడప్పుడు త్రిప్పుచున్న యెడల, మొక్క శిఖరము కూడా ఆ రంధ్రము వైపే తిరుగుచుండును. దానిలో నుండియే కదా సూర్యరశ్మి కనబడును. అట్లే క్రిస్మసు కాలమందు తొట్టెలోని శిశువు తట్టును, ఎపిఫనియా కాలమందు జ్ఞానులారాధించిన శిశువు తట్టును, లెంటుకాలమందు శ్రమపడుచున్న ప్రభువు తట్టును, మంచి శుక్రవారమునాడు మరణమొందుచున్న ప్రభువుతట్టును, ఈస్టరునాడు పునరుత్థానుడైన ప్రభువు తట్టును, ఆరోహణ దినమున పైకి వెళ్ళుచున్న ప్రభువు తట్టును, పెంతెకోస్తు దినమున పరిశుద్ధాత్మను పంపనైయున్న ప్రభువు తట్టును, త్రిత్వకాలమందు మాదిరి చరిత్ర నడిపిన ప్రభువు తట్టును, అడ్వెంటు కాలమున రెండవసారి రానైయున్న ప్రభువు తట్టును, సంఘము తన ముఖము త్రిప్పుకొని, నీతి సూర్యునియందానందించుచు వందనములర్పించును. ఇది క్రైస్తవ పెద్దలలో కొందరి ఏర్పాటై యున్నది.

ప్రభువు జీవితకాలమంతటిని చీకటిగల ఒక లోయకు పోల్చుచున్నాము. శ్రమకాలచరిత్ర గాఢాంధకారమైన లోయవంటిది, అమావాస్య చీకటికాలము వంటిది. గాఢాంధకారమైన లోయలో నడుచుచున్నాను అను తలంపు దావీదునకు కలిగెను. అది ఆయన అనుభవము. దావీదు కుమారుడయిన క్రీస్తు ప్రభువు యొక్క అనుభవము కూడ అట్టిదే. ఆ లోయ గాఢాంధకారమైన లోయ, ఆ లోయ సంచారపు లోయ, ఆ

Bible Mission HQ Guntur

లోయ అపాయకరమైన లోయ. అయినను దైవజనుడు భయపడని లోయ. ఆలాగే మన ప్రభువు తన జీవితకాలమంతయు శ్రమలు అనుభవించినను భయపడలేదు. నిజ క్రైస్తవులకు శ్రమలు వచ్చినను భయపడరాదు. ప్రభువు శ్రమలు తలంచుకొన్న దైవజ్ఞుడు, నా శ్రమలు ఆయన శ్రమల ఎదుట ఏమూల అని అనుకొనును.

3. ప్రభువుయొక్క గాఢాంధకారపు లోయలో ఆయనను భయపెట్టునవి.

**1. మనుష్య కుమారునికి మరణము సంభవించునని ప్రభువే ప్రవచించుట:** తనకు రానైయున్న కీడు ఆయన ముందుగానే తెలిసికొనెను, వణకలేదు. అవి, మన నిమిత్తమై పొందవలసిన శ్రమలు గనుక ఆయన సంతోషముతో ఆ లోయలో ప్రవేశించెను. ఒక నేరస్థునికి ఉరి అని నెలక్రిందట తెలసినప్పుడే అతనికి ఉరియైనట్టు ఉండును. క్రీస్తునకు కూడ అట్లే ఉండును గాని జంకలేదు. చేప నీటికి ఎదురెక్కినట్లు ఆయన శ్రమలకు ఎదురెక్కెను.

**2. ప్రభువు మీద చిక్కు ప్రశ్నలు పడుట :** ఆయనను దేనిలోనో ఒకదానిలో పడవేయవలెనని ఉద్దేశించిన సాతాను, ఇప్పుడు కొందరి చేత చిక్కు ప్రశ్నలు వేయించెను. "ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు?" అని శత్రువులు ఆయన నడిగిరి. యోహాను బాప్తిస్మము ఎక్కడనుండి కలిగినది? అని ఆయన వారి కెదురు ప్రశ్న వేసెను. వారు జవాబు చెప్పలేకపోయిరి. కావున క్రీస్తే గెలిచెను. ఇట్లే తక్కిన ప్రశ్నలకు కూడ జవాబు చెప్పి గెలిచెను. అవేవనగా: కైసరుకు పన్నిచ్చుట న్యాయమా? పునరుత్థానమనునది యొకటి గలదా? ముఖ్యమయిన ఆజ్ఞ ఏది?- ఈలాగు ఆయనను చిక్కులు పెట్టవలెనని ప్రశ్నించిరి గనుక ఇది మాయ. ఆ మాయ ప్రభువు గ్రహించి తగిన జవాబుచెప్పి గెలిచెను. జవాబులు చెప్పలేనేమో అని ఆయన జడియలేదు.

**3. యూదులు కుట్రాలోచనలు చేయుట :** ఆయనను చంప నాలోచించినవారు ఎన్నిక ప్రజలగు స్వజనులే గనుక ఆయనకు ఎంత బాధగా నుండును!

**4. తోటలో, రక్తపు చెమట కార్చినంత వేదన కలుగుట :** "ఆయన చెమట నేలపడుచున్న గొప్ప రక్తబిందువులవలె ఆయెను". చెమట కలుగునంత గొప్ప వేదన ఎవరికైన ఉండవచ్చును గాని రక్తపు చెమట పట్టునంత వేదన ఎవరికైన ఉన్నదా?

**5. శత్రువులు ఆయనను బంధించుట :** యూదుల గుంపును, అన్యుల గుంపును, వారికత్తులను, గుదియలను చూచి ఆయన బెదరలేదు.

**6. ఆయన దివ్యబోధలు, పరిశుద్ధ ప్రవర్తన, అద్భుత కార్యములు, ఆయనలోని దైవప్రభావము స్వయముగా ఎరిగిన శిష్యులు పారిపోవుట :** అంతకుముందు ఆయన

యూదాను త్రిప్పుటకు చేసిన ప్రయత్నము నిష్ఫలమగుట; శిష్యులైతే పారిపోయిరేగాని యూదా స్వహత్యయే చేసికొనెను. ఇదిచూచి ఆయన నిరాశపడలేదు, దిగులుపడలేదు.

**7. స్వజనులే సభ కూర్చి, ఆయనకు మరణ శిక్ష విధించుట :** శిక్షావిధికి ఆయన జంకలేదు. అన్యులు విధించు శిక్షావిధికన్నను, స్వజనులు విధించిన శిక్షా విధియే బాధకరమైనది. స్వజనులనగా ఎవరు? ఆయన ఎవరిలో జన్మించెనో వారే. ఆయన గురించి బోధించిన ధర్మశాస్త్రమును, ప్రవచనములును గలవారే. వారు ఆయనను సత్కరించుటకు బదులుగా విసర్జించినారు. ఎంత విచారము!

**8. ఆయన ప్రభుత్వము వారివలన మరణశిక్షావిధి నొందుట :** ప్రభువునకు ఇది మరియొక విధమైన అవమానము. తాను యూదులకు అన్యులకు తీర్పు తీర్చవలసిన తీర్పరియై యుండియు, ఉభయులవలన తీర్పు పొందెను. ఎంత అవమానము! అయినను ఆయన ముందునకు సాగి వెళ్ళెను.

**9. ఆయనను క్రుంగజేసిన భారమైన సిలువను మోయుట :** దీనికన్నను లోక పాపభారము అను సిలువయే ఆయనకు ఎక్కువైన భారము కలిగించినను. ఆయన సహించెనే గాని అదరిపోలేదు. "ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల".

**10. సిలువ వేయబడుట :** ఆయన శరీరము యావత్తును గాయపరుపబడెను. అయనను తన్ను సిలువవేసినవారిని శపించక క్షమించమని తండ్రిని వేడుకొనెను. శరీరమంతయు రక్తమయముగా నున్నపుడు, బాధ-దాహము కలిగినపుడు, శత్రువులను క్షమించుట అసాధ్యముగదా! అయినను వారిని క్షమించెను. "ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి". బాధకు, చావునకు ఆయనలో భీతి కలిగి దిగివచ్చుటకు యత్నింపలేదు.

**11. సిలువ ప్రక్కనున్న ఒక నేరస్థుడాయనను దూషించుట:** "నీవు క్రీస్తువు గదా! నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్ముకూడ రక్షించుము" అని నేరస్థుడాయనను దూషించెను. శరీరమునకు బాధ కలుగుచుండగా అది చాలనట్టు మనస్సునకు ఇతని దూషణ బాధ కలిగింపక మానదు. కాని రెంటిని ఆయన ఓర్చుకొనెను. ఆ దూషణ కాయన సిగ్గు పడనూ లేదు. విన్నవారు ఆయనను గురించి దురభిప్రాయపడుదురేమో అని భయపడనూ లేదు.

**12. చూపరులు హేళన చేయుట :** "వీడితరులను రక్షించెను. తన్ను తాను రక్షించుకొనలేదు" అని ఆయనను అపహసించిరి. 'అతడు సిలువమీద నుండి దిగివచ్చిన యెడల నమ్ముదుము' అని కొందరు హేళనగా మాట్లాడిరి. ఆయన బాధలనుండియు,

మరణము నుండియు, సిలువమీదనుండియు దిగివచ్చిన పునరుత్థాన కాలమందు, వారు నమ్మినారా? కనుక ఇది ఎక్కడిమాట? హేళనమాట: ఆ హేళనను ఆయన లెక్కచేసెనా?

**13. మరణమగుటయు, భూస్థాపన యగుటయు :** వృక్ష ఫలము తిన్నయెడల మరణము కలుగునని, మన ఆది తల్లిదండ్రులకు దేవుడు చెప్పిన మాట వారు మీరినందున వారి వంశమంతటికి మరణము కలిగెను. ఆ వంశము నుండి వచ్చిన ప్రభువునకు కూడ మరణము కలిగెను. వారికి బదులుగా మరణము పొందుటకు దేవుని కుమారుడు సంశయింపలేదు. ఒక మర్మమేదనగా చావును తన చావుచేత చంపివేసెను. ఆయన పునరుత్థానములో మరణమును జయించినట్లు కనబడుచున్నది. మరణము ఓడిపోయినది. ఆ గాఢాంధకారపు లోయ ఇంతటితో అంతమాయెను. సిలువ-నీలో నిలువ-ఉన్నయెడల నీకు విలువ-కష్టాలలో చలువ. పైనవ్రాసిన బైబిలు వాక్యములో మరికొన్ని మాటలున్నవి. అవేవనగా "నీవు నాకు తోడైయుందువు నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును". ఈ వచనములో కవి పొందిన ఆదరణ గలదు. దుడ్డుకర్ర, దండము అను ఈ రెండు పనిముట్లవల్లను రెండువిధములైన ఉపకారములు కలుగును. ఒకటి కష్టాలలో నశింపకుండ లాగునట్టి సాధనము, మరొకటి తిన్నగా నడిపించునట్టి సాధనము. "నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును" అను శుభవాక్యము ఈ కీర్తన చివర కనబడుచున్నది. ముగింపులో ఒకటి వినండి:

ఆయన తన శ్రమలను గురించి ప్రవచించినపుడు ఆయన యెదుటనున్నది **లోయ;**
దగ్గర దగ్గరకు సాగివచ్చినది సిలువ **చాయ;**
చిక్కు ప్రశ్నలు వేసిన వారియత్నము **మాయ;**
ఈతగాడు నీళ్ళను పాయచేసికొనుచు అద్దరికి చేరును. అట్లే క్రీస్తు శ్రమల లోయలోబడి ఎదురు వచ్చిన శ్రమలను ఒత్తిగించుకొనుచు అద్దరికి వెళ్ళగలిగెను.
ఇది ఆయన చేసికొన్న **పాయ;**
ఈ శ్రమలు మీ శ్రమలను శ్రమింపజేయును గాక.

***కీర్తన :*** *"కష్టంబులను చీ-కటి లోయలో = స్పష్టముగ ఘన సౌఖ్యమును*
*నా- దృష్టికిన్ జూపి - నా - నష్టముల్ దీర్చున్ గనుక ॥నాకేమి॥*

# లెంటులోని ఇరువది ఎనిమిదవ దినము - శనివారము

## ఆదరణ లోయ

కీర్తన 23:4



**ప్రార్ధన :- మా యేసుప్రభువా ! నీవు శ్రమలలో ఆదరణ పొందినావు. నీవు శ్రమలలో పొందిన ఆదరణ మేము గ్రహింపలేకపోయినను, గ్రహింపగలిగినంత మాకు అందించుమని, వేడుకొనుచున్నాము ఆమేన్.**

శ్రమకాల ధ్యానము : గత ప్రసంగములో "లోయ" అను పాఠమును చదివితిమి. అందు క్రీస్తు ప్రభువు యొక్క శ్రమానుభవము వివరింపబడెను. ఈ పాఠములో ప్రభువు ఆ గాఢాంధకారపు లోయలో ఎట్టి ఆదరణ పొందినది వివరించుదును. ఇదివరకు వివరించిన శ్రమల లోయలో "ఇదిగో యెరూషలేము వెళ్ళుచున్నాము" (మత్తయి 20:17) అని ప్రభువు ప్రవచించినప్పటినుండి, లోయలో ప్రవేశించి, లోయ చివరనున్న మరణము సమాధివరకు వివరింపబడెను. లోయ మధ్యభాగములో చిక్కుప్రశ్నలు, దూషణలు, అవమానములు, శ్రమలు కలవు. ఇపుడు ధ్యానించేది శ్రమలు కాదు, అవమానము కాదు, శిక్షావిధి కాదు, సిలువవేత కాదు, అయితే మన ధ్యానాంశము మరేది? ఆయనకు శ్రమలో ఆదరణ, అవమానములో ఆదరణ, శిక్షావిధిలో ఆదరణ గలదు. గనుక మన ధ్యానము ప్రభువు పొందిన ఆదరణ. మన శ్రమలలో కూడ మనకు ఆదరణ కావలెను. అందుచేత ఆయన మనకు ముందుగా తనశ్రమలో ఆదరణ పొందెను. లోయ పొడుగునా, ఎడమప్రక్క శ్రమలు, అవమానము, కొట్టుట, దూషించుట, సిలువ వేయుట, చంపుట అను చీకటి గలదు. అయితే లోయ కుడిప్రక్కన ఆదరణ, ఆదరణ, ఆదరణ గలదు. మనము లోయలోబడి ఆయనతో వెళ్ళవలెను. శ్రమ అనుభ- వించుటకే కాదు, ఆయన పొందిన ఆదరణ కూడ పొందుటకు మనము వెళ్ళవలెను.

1. యూదుల సభలో ప్రధాన యాజకుడు 'ఒక మనుష్యుడు మన జనాంగము కొరకు చనిపోవుట మంచిదే' అని చెప్పెను. ప్రధాన యాజకుడు అట్లనునా? సన్హెద్రిము సభలోనున్న ఆయన, ప్రభువు మీద కుట్రాలోచన చేయు సభలోనున్న ఆయన ఆలాగు అంటాడా? అది దేవుడే అనిపించెను. అదే ప్రభువునకు కలిగిన ఆదరణ. సభలో అందరు నీకు వ్యతిరేకముగా మాట్లాడినను, ఒకరు నీ పక్షముగా మంచి మాట మాట్లాడినా నీకు సంతోషము కాదా! ఆలాగే ఆ సభలో అందరు ప్రభువును తిట్టిరి గాని ఆ ప్రధాన యాజకుడు ఈ మంచి మాటఅనెను. అందును బట్టి ప్రభువునకు ఆదరణ.

2. లోయలో మరికొంత దూరము వెళ్ళగా ప్రభువు యొక్క తీర్పు సమయములో ఒక గొప్ప మాట వినబడినది. ఆ నీతిమంతుని జోలికి వెళ్ళ వద్దు, ఆయనను గూర్చి

Bible Mission HQ Guntur

కలలో బాధపడితిని, (మత్తయి 27:19) కోర్టులో క్రీస్తు పక్షముగా ఒక ఆదరణమాట వచ్చెను. ఈమాట అన్యురాలిదగ్గర నుండి వచ్చెను. మొదటి మాట స్వజనుల వద్దనుండి కయిపనుండి వచ్చెను. కనుక ప్రభువునకు ఆదరణ.

3. ఇంకా కొంతదూరముపోగా శిష్యులెవ్వరూ లేరు. అందరు పారిపోయిరి. యోహాను ఒక్కడే ప్రభువును వెంబడించెను. శిష్యులందరు ప్రభువునకు ఎడమైరిగాని, యోహాను మాత్రము కనబడుచుండెను. ప్రభువునకు ఎంత సంతోషము.! ఎంత ఆదరణ! యోహాను 19:26 అందుచేత "అమ్మా, యిదిగో నీ కుమారుడు", "ఇదిగో నీ తల్లి" అని ప్రభువు పలికెను. ఈలాగున శ్రమలలోనే ఆదరణ పొందెను. ఆయనతో గేత్సేమనే తోటనుండి పంచాయితీ సభకు, అక్కడినుండి గవర్నమెంటు కోర్టునకు, కల్వరిగిరి రోడ్డుమీదకు, చివరకు సిలువదగ్గరకు యోహాను వెళ్ళెను. తన శ్రమలో ఆయనకు ఒకప్రక్కన తన నమ్మకమైన శిష్యుడు కనబడెను. ధైర్యముగల పేతురు ఎక్కడ? నేనా, నేనా అని చెప్పిన మిగతా శిష్యులు ఎక్కడ? యోహానును చూడగానే ప్రభువునకు ఆదరణ. ఇంటిలో ఎవరైన చనిపోయి దుఃఖములో నున్నపుడు, బంధువులు కనపడినయెడల ఆదరణ కలుగును గదా! అలాగే ఈ యోహాను, తోట దగ్గరనుండి తిన్నగా కల్వరిగిరివరకు వచ్చెను. గనుక ప్రభువునకు ఆదరణ. యేసు వెంబడి వచ్చెను, నిలువబడి చూచుచుండెను. ఏమియు చేయలేదు. అట్టి శిష్యుడు ప్రభువు కంటపడెను గనుక ఆదరణ.

4. ఇంకా లోయలోబడి పోగా, గలిలయనుండి వచ్చిన స్త్రీలు, ప్రభువును చూచి రొమ్ముకొట్టుకొనుచు ఏడ్చుచున్నారు (లూకా 23:27). వారిని చూచి యేసుప్రభువు ఏమి అనుకొనును? నా దుఃఖములో వారు పాలు పొందుచున్నారు, నన్ను చూచి జాలిపడు చున్నారు. మిగిలిన వారికైతే జాలిలేదు. ఈలాగు ఆయనకు ఆదరణ కలిగి, అమ్మా నాకొరకు కాదు, మీకొరకు మీ బిడ్డల కొరకు దుఃఖించండి అని చెప్పెను.

5. లోయ చివర ప్రభువునకు శత్రువును, గవర్నమెంటు అధికారియు మరియు పటాలపు నాయకుడుయైన శతాధిపతి పలికినమాట "నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే" (మార్కు 15:39), అన్యులలో ఒకరు అట్లు పలుకుట ఎంత గొప్ప సంగతి! ఇది ఆయనను శిక్షించేవారిలో ఒకరినుండి వచ్చిన మాట. పిలాతు భార్య శిక్షించేవారిలో ఒకరు కాదు. గాని ఇతడు క్రీస్తును శిక్షించేవారిలో ఒకడు. ***ఎంతమార్పు అతనిలో లేనియెడల ఇంత గొప్పమాట అనగలడు!***

6. కుడివైపుననున్న నేరస్థుడు ఇంకొకరిని గద్దించి, ప్రభువుతో పలికిన మాటలు (లూకా 23 :10): ప్రభువా! నీవు నీ రాజ్యముతో వచ్చినపుడు నన్ను జ్ఞాపకముచేసి–కొమ్మని అన్నాడు. ప్రభువునకు ఎంత ఆదరణ! ఒకప్రక్క ఆయనను దూషించుచుండగా ఇతడు ఆయనను భూషించుచున్నాడు. ప్రభువునకు కలిగిన ఆదరణను బట్టి "నీవు నాతో కూడ పరదైసులో నుందువని" చెప్పెను. సిలువమీద గొప్ప సాక్ష్యము; సిలువమీద

గొప్ప వాగ్ధానము; అనగా ఇతడు సిలువమీద నుండి పలికిన సాక్ష్యము మరియు పటాల నాయకుడు క్రిందుండి పలికిన సాక్ష్యము, ప్రభువునకు గొప్ప ఆదరణ. ఈ లోయ, శ్రమల లోయ అయినప్పటికిని ఆదరణగల లోయ. మన జీవితము శ్రమల లోయ అయినను అందులో ఆదరణ కూడ నుండును. అవమానమున్నను ఆదరణ కూడ ఉండును. వ్యాధిఉన్నను ఆదరణ గలదు. క్రీస్తుప్రభువునకు వ్యాధికంటె గొప్ప వ్యాధి ఉన్నది అనగా ఆయన శిరస్సు రక్తమయము, శరీరము రక్తమయము, చేతులు రక్తమయము, పాదములు రక్తమయము. జబ్బుల కంటే జబ్బు ఉన్ననూ అట్టి స్థితిలో కూడ ఆదరణ గలదు. జబ్బు జబ్బుగానే యున్నది గాని ఆదరణ కూడ ఉన్నది. మన విషయములో కూడ అలాగే ఉండును. యేసుప్రభువు శ్రమలు సహించినపుడు దేవుడుగా సహించలేదు, మనిషి వలె శ్రమపడెను, మనిషివలెనె సహించెను, మనిషివలెనె ఆదరణ పొందెను. ఈ లోయలో ప్రభువు పొందిన ఆదరణ సంగతులు ఇంకను గలవుగాని వివరించుటకు సమయము లేదు గనుక ఉదహరించుచున్నాను.

7. పేతురు ప్రభువును ఎరుగనని అబద్ధమాడెను. గాని వెంటనే పశ్చాత్తాపపడెను. ప్రభువునకు ఆదరణ కలిగించు సంగతులలో ఇది ఒకటి లూకా 22 : 61,62.

8. గెత్సేమనేలో ప్రభువు పొందిన ఆదరణ లూకా 22 : 43. ఇది దూతల వలన కలిగినది బలాదరణ. 9. మీలో ఒకడు నన్ను అప్పగించునని ప్రభువు చెప్పగా, శిష్యులు ప్రభువా, నేనా! నేనా! అని అన్నారు మార్కు 14 :19. ఇదికూడ ప్రభువునకు ఆదరణ. 10. ఇంకా ఏమైన ఒక ఆదరణ ప్రభువునకు కలదా? లేదుగాని ఉన్నది. ఏమిటి? (లూకా 23 : 46) తండ్రీ, నీచేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను. నా ఆత్మను చేర్చుకొనుము అని ఆదరణలేనివారు అనగలరా? దేవా, దేవా! నా చేయి ఏల విడనాడితివి? అన్న ప్రభువు, 'నా ఆత్మ అందుకొనుము' అని ఆదరణ లేనిదే అనగలడా! 11. క్రైస్తవ జీవితములో ఇది చివరి ప్రార్ధన. ఈ ప్రార్ధన తర్వాత ఇంకా చేయవలసిన ప్రార్ధనలు లేవు. లూధరుగారు ప్రతిరాత్రి పరుండబోవునపుడు, చివరిలో ఈ ప్రార్ధన చేయించేవాడు. దాని తర్వాత ఇంక ప్రార్ధన లేదు, పండుకొనుటయే. మనము చివర చేయు ప్రార్ధన ఆయన ప్రతిదినము చేసేవాడు. పరుండిన తర్వాత ఇక లేస్తామో, లేవమో మనకు తెలియదు గనుక ఆ ప్రార్ధన చేయవలెను.

యేసుప్రభువు యొక్క చివరిప్రార్ధన మనకుకూడ అలవాటగును గాక!

***కీర్తన:*** *"ఎవరు నా శత్రువు-నెదిరించి గెల్చిరి-ఎవరు నా శోకంబు-నెగుర గొట్టిరి?=*
*ఎవరు నా హృదయంపు మూర్చను-నీడ్చి సేదదీర్చి మనసు-చివుకు మను*
*గాయంబు మాన్పిరి!-సిల్వబడ్డ యేసుక్రీస్తే"* *॥నాకింత॥*



# లెంటులోని ఐదవ ఆదివారము

## సిలువయందలి ఆనందము

గలతీ. 6:14. అయితే మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమౌనుగాక! దాని వలన నాకు లోకమును, లోకమునకు నేనును సిలువ వేయబడి యున్నాము.



ప్రార్ధన:- దయగల యేసుప్రభువా , నీ ముఖము యెదుట అది(శ్రమలు), మా యెదుట యిది(వాటి జ్ఞప్తి), యీ ప్రకారముగా నీ సంఘములో జరుగుచున్నది. కాబట్టి నీకు స్తోత్రములు. ప్రభువా నీ ముఖము యెదుట శ్రమలన్నియు కనబడుచున్నవి. నీ ముఖము యెదుట, నీ కన్నుల యెదుట నున్నవన్నియు మాకు నీయెదుట కనిపించుచున్నవి. తరువాత రెండు వేల సంవత్సరములు జరిగినవి. ఇపుడవి మా యెదుటలేవు, మావెనుక నున్నవి. రెండు వేల సంవత్సరములైన తర్వాత మేము వచ్చియున్నాము. మేము వెనుకకు తిరిగి, నీ శ్రమ చరిత్ర మా యెదుట పెట్టుకొని ధ్యానించుచు, యీ దినములయందు మా ముఖముల యెదుటకు తెచ్చుకొని, ఒక్కొక్క యంశము ధ్యానించినయెడల అవి మాకుపయోగకరము. నీ శ్రమ చరిత్రలో మాకు దాచి పెట్టిన వర్తమానము అందించుమని వేడుకొంటున్నాము. నీ శ్రమ చరిత్రలో మా శ్రమ చరిత్ర జ్ఞాపకము చేసికొనుచున్నాము. నిన్ను నమ్ముకొన్నందువలన, నీ వాక్యమును బట్టి నిన్ను ప్రార్ధించినందువలన, నీ మార్గములో నడచుటను బట్టి, రానైయున్న శ్రమలను నీవు లెక్కచేయనట్లు, మేమును, లెక్కచేయని కృప మాకు దయ చేయుము. నీ శ్రమ చరిత్రలో నీకు కలిగిన ఓపిక, నిరీక్షణ మాకులేదు, కాబట్టి అవిమాకు దయచేయుము. నీవు పలికిన ఏడుమాటలవంటి మాటలు నాకును, మాకును దయచేయుము. ఏదోయొక శ్రమగలిగినవారమై మేమీ యాలయములో నీ శ్రమల యెదుట కూర్చున్నాము. ప్రతివిధమైన శ్రమయు మాకుపయోగము కలిగేనిమిత్తమే యున్నది. గనుక అవి గ్రుచ్చుకొని మా మనస్సాక్షిని తట్టును. అర్ధము కాని మనుష్యులను తట్టును. ఈలాగున ప్రతి శ్రమద్వారా మాకు దాచిపెట్టిన బహుమానము కొరకు తయారుగునట్లు మమ్ము నాకర్షింపజేయుము.

తండ్రీ! ఈ వేళ మేము మాటలాడుకొనే మాటలు మా యాత్మ లోపలికి పోయే మాటలు. మా జీవితకాలమంతా మేము బ్రతుకుటకు వెళ్ళే మాటలు. కొన్ని నిమిషములు మీ శ్రమలను ధ్యానించునపుడు, మీ శ్రమల ధ్యానము వలన మా శ్రమలను మరచిపోయేటట్లు మా దృష్టిని నీ వైపు త్రిప్పుము. నీ ఉపదేశముతట్టు, నీ శ్రమతట్టు, నీ తట్టు, నీ వీక్షణ తట్టు, నీ జయంతట్టు త్రిప్పుము. శ్రమలు కలిగేటప్పుడు విసుగుకొను చున్నాము, గాని ఇపుడు యిది మా భాగ్యము,మా బహుమాన పళ్ళెము, మా విజయ ధ్వజము, ఇది మా విశ్రాంతియని చెప్పియానందించెదము. అట్టి యానందము మాకు దయచేయుము. శ్రమల పాఠములను మాకు నేర్పించుమని యేసునామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

Bible Mission HQ Guntur

సిలువధ్యాన కూటస్తులారా! ప్రభువు మీకు తోడైయుండునుగాక! ఈ వాక్యములో పౌలుగారు ఏమన్నారంటే నీ సిలువయందే నాకానందమన్నారు. అయితే కష్టములు వచ్చినపుడు విచారించుదురా! లేక సంతోషించుదురా? విచారించెదరు. కాని మన పాపములు, లోక పాపములు పోగొట్టుటకును, మనలను పవిత్రులను చేయుటకును, ప్రభువు ఏ నేరము చేయక సిలువ మరణము పొందియున్నారు. ఆ సిలువ వలన ఏడువిధములుగా విచారమున్నది, సంతోషమున్నది. ఏమనగా ప్రభువు సిలువపై నుండుట అను విషయము విచారమే గాని ఆ సిలువద్వారా మనకు ఆదరణ, శాంతి కలుగుచున్నది. కాబట్టి మనకు సంతోషము. **సంతోషమెందుకంటే మన పాపములు ఆ సిలువ ద్వారా పోయినవి కాబట్టి సంతోషింపవలయును.** క్రైస్తవ విశ్వాసులకు అనేకములైన సిలువలున్నవి. ఆ సిలువలు ఏమనగా శ్రమలు, కష్టములు, శోధనలు, ఇరుకులు, ఇబ్బందులు, పీడకలలు, దుష్టశకునములు, దురాలోచనలు, చెడ్డపనులు, దురాశ, దుష్టత్వము, అనుమానము ఈ మొదలగునవన్నియు మానవులకు సిలువలే. ఒక సిలువ కాదు, అనేక సిలువలున్నవి. అయితే ఈ మొదటిగా ఉన్న సిలువలన్నియు, మనము చేసిన పాపములద్వారా స్వయముగా మనంతట మనము తెచ్చుకొన్న సిలువలు. అయితే ఆ సిలువలు ఎక్కడికి తీసికొని వెళ్తాయంటే నిత్యము శ్రమలనుభవించే నరకమునకు తీసికొని వెళ్ళును. అయితే ప్రభువు పొందిన సిలువ ఆయన చేసిన పాపమును బట్టికాదు, మనలను బట్టి ఆయనకు సిలువ ప్రాప్తమైనది. ఆ సిలువ ద్వారా పాపములను జయించినారు. తుదకు మరణమును జయించినారు. కాబట్టి ఆ సిలువ మనలను మోక్షమునకు తీసికొనివెళ్తుంది. అందుచేతనే ఆ సిలువ ద్వారా ఆనందించవలయును. ఆ సిలువ ఎట్టి కష్టమునైనా తొలగించి మోక్షము ఇయ్యగలదు.

**1.ఉదా:-** ఒక స్త్రీ ఉన్నది. ఆమెకు శరీరమందు రెండురకములైన జబ్బులున్నవి. అంటే ఆ రెండు జబ్బులు కూడా ఆమెకు రెండు సిలువలు. అప్పుడు ఆ స్త్రీ ఆ జబ్బులనే రెండు సిలువలమీద ప్రభువు సిలువ వేసింది. కాదు, ప్రభువు సిలువను తన కట్టువస్త్రము మీద వేసికొంది. వెంటనే తనలోనున్న ఆ జబ్బులనే రెండు సిలువలు ఎగిరి పోయినవి.

**2.ఉదా:-** గూడెం వాస్తవ్యుడు ఒకాయన పుస్తకము వ్రాసి అయ్యగారిని దిద్దమన్నారు. అయ్యగారు దిద్దినారు. అయితే అయ్యగారు ఈ మాట అన్నారు: "ఇప్పుడు దిద్దిన పుస్తకముపై సిలువ గుర్తువేసి ఉంచండి. లేకపోతే దయ్యము ఎత్తికొని పోతుంది". ఆయన నిజముగా దయ్యమెత్తుకొని పోతుందేమోనని తలంచి, ఆ పుస్తకముపై సిలువ గుర్తు ఉంచినారు. మరునాడు ఉదయము లేచి చూస్తే ఉంది. అప్పుడు అచ్చు ఆఫీసుకు

వెళ్లి అచ్చు వేయించినారు. దయ్యమెత్తుకొనిపోలేదు కాబట్టి అయ్యగారి మాట అబద్ధమైనదా? కాదు. సిలువగుర్తు వేసినారు గనుక దయ్యమెత్తుకొని వెళ్లిపోలేదు.

**3. ఉదా:-** రాజమండ్రిలో ఒకాయన పుస్తకము వ్రాసినారు. అయ్యగారిని దిద్దమన్నారు. అయ్యగారు దిద్దినారు. అయ్యగారు పై వ్యక్తికి చెప్పినమాటలే ఈయనకు కూడ చెప్పినారు. అయితే ఆయన ఈలాగన్నారు. దయ్యమునకు కాళ్లున్నవా? చేతులున్నవా? పెట్టెలో పెడతాను. పెట్టెకు తాళము వేస్తాను. ఇంటిలో ఆ పెట్టె పెట్టి, ఇంటికి కూడా తాళము వేస్తాను. అప్పుడు ఏలాగు ఎత్తుకెళ్లగలదో చూస్తానన్నారు. సిలువ గుర్తు వేయలేదు. అయితే ఇప్పటికి 30 సం॥లు అయినది గాని ఇంతవరకు ఆ పుస్తకము అచ్చుపడలేదు. మొదటివ్యక్తి నమ్మినారు. విశ్వసించినారు. సిలువ గుర్తు వేసినారు గనుక అచ్చువేయబడి వెల్లడిలోనికి వచ్చినది. అయితే, ఈ రెండవ వ్యక్తి నమ్మలేదు. కాబట్టి సిలువ గుర్తు వేయలేదు. అందుచేత ఈ 30 సం॥లకు కూడా పని జరుగలేదు. ఆలాగే మీరుకూడా మీకు ఎట్టి కష్టము వచ్చినా మీ సిలువకాదు గాని ప్రభువు సిలువ వెయ్యండి. అప్పుడు కష్టములు తొలగిపోవును. అలాగే ఎటువంటివి వచ్చివప్పటికిని ప్రభువు సిలువవేసి చేయండి. అప్పుడు అవన్నియు పోయి నెమ్మది, శాంతి, ఆనందము, సుఖము లభిస్తుంది. అందుచేతనే అపోస్తలుడైన పౌలు ఈ వాక్యములో ***'నాకు ఈ సిలువలో ఆనందము'*** అని వ్రాసినారు. కాబట్టి మనము కూడా కష్టములు వచ్చినప్పుడు విచారపడక సంతోషపడవలయును. విచారించినట్లైన కష్టములు మరింత ఎక్కువగును. కాబట్టి ఈ కొన్ని వాక్యములను మీ అనుభవములో వాడుకొనుటకు దేవుడు సహాయము చేయును గాక! ఆమేన్.

## సిలువ చరిత్ర

ప్రియులారా! యేమి చెప్పవలెను! యేమి విప్పవలెను! యేమి చెప్పకుండా కప్పవలెను! ఆయన శ్రమయెదుట యేమి చెప్పాలి? ఆయన తనపై నున్న శ్రమలు సిలువపై వేసి మహోన్నత సింహాసనముపై కూర్చున్నట్లు ఉండెనని మనకు తెలియును. మనకును ఆవిధముగానే జరుగును. నల్లసిలువగాదు, చెక్కసిలువ గాదు, మహిమ సిలువ, తెల్లని సిలువ, మీ మనస్సనే తాళపు చెవి విప్పి చూడండి, ఆనందించండి. (దా॥కీ॥ 22 అధ్యా॥)

1. విశ్వాసులైనవారలారా! యేసుప్రభువు యొక్క శ్రమ చరిత్ర చూచినయెడల, గెత్సేమనే తోటలో ఆయన ప్రార్థించుచుండగా గేటువద్ద ఆయనను పట్టుకొనిన కథ.
2. యూదుల పంచాయితీ సభలో చేతులు కట్టిన కథ.
3. కయిపయను న్యాయాధిపతి శాలలో తీర్పు తీర్చిన కథ.
4. గవర్నమెంటువారితో తీర్పు (గవర్నరు పిలాతు)

5. హేరోదు తీర్పు తీర్చిన కథ.

6. గవర్నమెంటు కోర్టులో ఆఖరు తీర్పు కథ

7. సిలువ మోసిన కథ.

8. సిలువ మోసిన, సిలువ వేసిన కథ, సమాధిలోనికి వెళ్ళిన కథ. ఈ కథలకు ముందు జరిగిన కథలు: కయిప, మల్కుఅన్న, పిలాతు, హేరోదు, సిలువచేత, సిలువవేత, సమాధి చరిత్ర.

**కయిప :** పెద్దపూజారి, కొత్త పూజారి. యూదులు, ప్రధాన యాజకులును కలిసి ప్రభువుపై కుట్రలు చేయుచున్నారు. ఏమని? 1. జబ్బులు అద్భుతముగా బాగుచేయు చున్నందున ప్రజలంతా వెళ్ళుచున్నారు. 2. ఆయన బోధించుచుండగా వినుటకు అందరు వెళ్ళుచున్నారు. గనుక మన మెవరికి బోధించెదము? శత్రువులు వచ్చి మనపైబడి జయించెదరు. కాబట్టి మన మాటంకము చేయుదము. అలాగే జబ్బులు పోయేదగ్గరకు ప్రజలను మరియు బోధలయొద్దకు యేసును వెళ్ళకుండా ఆటంకము చేయవలెనని వారు యున్నారు. వెనువెంటనే ప్రధాన యాజకుడు లేచి మీ యాలోచనలు సరిగా లేవు, తప్పేమున్నది. మన ప్రజల కొరకు ప్రతినిధిగా వచ్చాడంటున్నాడు. శాపమును పోవును, మనకు మేలు కలుగును. ఆయన మరణము వలన ప్రజలకు మేలే కలుగునని యాలోచన చెప్పెను గాని అది వారి తలలకు యెక్కలేదు. కయిప వొంటరియై కూర్చుండెను. అలాగే యిపుడును యేసు నామమందు ఎవరైన పనిచేయుచుండగా సంతోషించక, వారిని గూర్చి చెడుగు మాట్లాడుకొందురని గొప్ప పాఠము ఇక్కడ యేసు నేర్పించెను. మనమును ఈ పాఠము నేర్చుకొనవలెను, ఎంతచెడుగా మనలను గూర్చి మాటలాడే స్థలములోనైనను మన పక్షమున మాట్లాడేవారు ఒక్కరైనా యుండెదరు. ప్రజలు ఎంత వ్యతిరేకముగా మాట్లాడినను, ఆయన పక్షముగా ఒక్కరయిన యున్నారు. అదే ఆయనకు ఆదరణ. అలాగుననే మన పక్షముగా మాట్లాడేవారు తప్పకయుండెదరు.

అట్టి ఆదరణ ఈ మండల కాలములో పెండ్లి కుమారుడైన క్రీస్తు ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

***కీర్తన:*** *“నా హృదయంబులోనికి – నా ప్రభువ రమ్మయా!= నీ మ్రాను మోసెదన్ ప్రభూ! – రక్తంబు తుడిచెదన్ – నీ రక్తమే నా యాత్మకెంతో హాయిని జీవము నిచ్చును – నా యాత్మన్ నీ కర్పింతును– నా ప్రభువా! రమ్మయా” ॥వనము॥*

# లెంటులోని ఇరువది తొమ్మిదవ దినము - సోమవారము

## మారనివారు శ్రమ చరిత్రలో

లూకా 23:10



ప్రార్థన:- తీర్పుశాలలో నిలవబడిన యేసుప్రభువా! సిలువను నీమీద వేసికొనిన యేసుప్రభువా! నీ శ్రమ చరిత్రముందు నీవు నడచి వెళ్లుచుండగా, నేటి కాలములో అనేకులకు మార్పు కలిగినది. నేటికాలములో మార్పు కలిగించని వస్తువులను నీవు కలుగ చేయలేదు. కలిగియున్నది ఏదియు నీవు లేకుండ కలుగలేదు.సృష్టిలో నేది కలుగజేసినావో దాని ద్వారా మార్పు కలిగించుచున్న నీకు స్తోత్రములు. సూర్యుని ద్వారా గొప్ప మార్పు అనగా పువ్వులకు రకరకములగు రంగులు కల్గించినావు, సూర్యుడు లేనిదే ఆ రంగులు కలుగవు. ఏ సూర్యుని నీవు కలిగించినావో, ఆ సూర్యుని ద్వారానే రంగు, అలాగే అన్ని వస్తువులకు మార్పు కల్గించుచున్న నీకు స్తోత్రములు. నీవు కలుగజేసిన వృక్షములద్వారా భూమిమీద నీడ యిచ్చుట వలన అలసట పడినవారు ఆ నీడలో కూర్చుందురు. చెట్లవలన యిదే మార్పు. అదినీవు కలుగజేసిన మార్పు అనగా నీడ. అలాగే చంద్రునివలన, మానవులకు చల్లనిదనము. నీళ్ళవలన దాహ శాంతి కలుగును. ఇదొక మార్పు. ఇది వస్తువేగాని దాహము తీరే గొప్ప మార్పు ఇందులో ఉన్నది. దాహమైనపుడు ఏమి తిన్నను దాహము తీరదు. నీరు త్రాగినందున దాహము తీరును.

ఇట్లు గొప్ప గొప్ప మార్పులు సృష్టివలననే కలుగుచుండినయెడల, యింకను యెక్కువమార్పు నీ వలన కలుగును. నీవు సంచరించు చున్నప్పుడు రోగులలో నెంతమార్పు! అపుడు వారు ఆనంద గీతములతో గంతులువేసిరి. పాపులు వచ్చిన యెడల పరిశుద్ధతతో పంపించియున్నావు. నీ బోధ వినినవారి కానంద మార్పుకలిగినది. దయగలప్రభువా! నీ శ్రమ చరిత్ర వలన నెందరిని మార్చినావో వినినాము. నీ వలనను, నీ సృష్టి వలన మారిన ప్రతి మనుష్యుని వలనను మార్పు కలుగుచున్నది. అంతయు వింతగానే యున్నది. నీకు స్తోత్రములు. నీ శ్రమచరిత్ర వలన మరొక వాలు తీసికొంటున్నాము. దానివలన యిక్కడున్నవారిని మార్చుము. ఆదివారము సింహాసనాసీనుడవై యూరేగింపుగా నూరేగి, ప్రజలలో జయోత్సవ మార్పు కలిగించినావు. ఈ వేళను అట్టి మార్పును కలిగించుమని వినయముగా వేడుకొను చున్నాము. ఆమెన్.

ప్రభువు యొక్క శ్రమానుభవ, విశ్వాసానుభవముగల విశ్వాసులారా! చెప్పిన దానినే మరియొకసారి చెప్పుచున్నాను వినండి.

Bible Mission HQ Guntur

1. ప్రభువే స్వయముగా చెప్పిన ప్రవచనము : ‘మనుష్యులచేతికి అప్పగింపబడి చనిపోయి తిరిగి లేచును.
2. కయప, సర్వలోకముకొరకు ఒకరు చనిపోవుట అవసరము అని ప్రవచించుట.
3. ప్రభువు యెరూషలేములో జయోత్సవముతో ప్రవేశించుట.
4. గెత్సేమనే తోటలో ప్రార్థించుట.
5. గేటువద్ద ఆయనను పట్టుకొనుట.
6. ఐదు కోర్టులు 1) కయిపకోర్టు, 2) అన్నకోర్టు 3) పిలాతు కోర్టు, 4) హేరోదు కోర్టు, 5) పిలాతు కోర్టు
7. సిలువ వేయుట.
8. సమాధి చేయబడుట.
10. మృత్యుంజయుడగుట.
11. ఆరోహణుడగుట.

ఈ విధముగా ప్రభువు యొక్క శ్రమల జీవితమును ధ్యానించుటకై పెద్దలు నలుబది దినములు శ్రమల ధ్యానకూటముల నేర్పాటు చేసిరి.

***అనుదినమును ఒక గంటయైన గుడిలో కూర్చొని వీటిని ధ్యానించవలెను.*** వీటిలో ప్రభువు విజ్ఞాపన, పస్కాపండుగ, ప్రభుభోజనము మొదలగు కొన్ని అంశములను విడిచినాము. దేవాలయమును శుద్ధీకరించుట, ఆవరణములో రోగుల కొరకు స్వస్థత కూటములు చేయుట, సద్దూకయ్యులకు బోధించుట, ఇవి విడిచిపెట్టినాము. తన పూర్వ చరిత్రవలననే గాక అంత్య జీవిత (శ్రమల) చరిత్రవలననూ ఆయన ప్రజలను మార్చెను. దేనివలనను ఆయన మార్చకుండా లేదు. పేతురును, గవర్నరు భార్యను, సిలువపై దొంగను మార్చెను. ఈ వేళ పాఠము శ్రమచరిత్ర కార్యక్రమము పొడుగున వచ్చుచున్న మరొక వాలు తీసుకొంటున్నాను. శ్రమ చరిత్రలో కొందరు మారలేదు. ఎవరు మారలేదు.

***మారని వారి దుస్థితి :***

***1) ఇస్కరియోతు యూదా:–*** పండ్రెండుమంది ప్రభువు శిష్యులకు ప్రజలిచ్చిన బిరుదు : బైబిలులో వ్రాసినది – ‘యేసుతోనున్నవారు.’ ఎంత మంచిపేరు! అందులో నొకడు ఇస్కరియోతు యూదా. ప్రభువుతో నున్నను మారలేదు. ఎంత దుఃఖకరము!

ఆయన దగ్గర ఉద్యోగములోనున్నాడు, ఖజానాధికారి, (ట్రెజరరు) చేతిలో డబ్బుసంచి యున్నది. ఆయన దృష్టికి అందరు సమానులే. అంతటి యధికారమిచ్చినను యూదా మారలేదు. 1.ప్రభువుతో నున్నవాడు. 2.ఉద్యోగి. 3. పండ్రెండు గంపలలో యొకటి యూదా పంచిపెట్టెను. అనగా పరిచారకుడే గాని మారలేదు. 4. ప్రభువు పండ్రెండు మందిని జతలు  జతలుగా బోధకొరకు పంపించెను. బోధించిన వారిలోనొకడు, అయినను మారలేదు. 5. యేసుప్రభువు యొక్క బోధలన్ని వినిన గొప్ప వేదాంత విద్యార్థి,అనగా బైబిలు తరగతిలో నున్నను మారలేదు. 6. అద్భుతాల సాక్షి. అనగా ప్రభువు అద్భుతములను చేయుచుండగా చూచెను. ఉదా: చనిపోయిన వారిని లేపుట; ఐదురొట్టెలను రెండు చేపలను, ఐదువేలమంది ప్రజలకు పంచిపెట్టుట, తుఫానును గద్దించుట, స్వస్థపర్చుట మొదలగునవి ఎన్నో యద్భుతములను చూచినను అద్భుత సాక్షిగా మారలేదు. 7. మార్పు చెందిన వారిని చూచినను మారనివాడు.  మగ్దలేని మరియ మార్పు చెందగా చూచియున్నాడుగాని తాను మారలేదు. ఎంత విచారకరమైన సంగతి! 8. యూదా గోత్రము: యూదా యనగా కీర్తి, స్తుతి కల్గిన గోత్రము. ఈ యూదా కీర్తి పొందవలసినదిగాని తాను మారలేదు, కీర్తి పొందలేదు. యేసుప్రభువు, పండ్రెండు గోత్రములలో యొకటయిన యూదా గోత్రములో పుట్టెను. ప్రభువెవరి గోత్రములో జన్మించినాడని యెవరయిన ప్రశ్నించినయెడల నా గోత్రములోనే అని యూదాయనును. ఆ గోత్రీకుడైన యూదా కాదీ యూదా, ఆ పేరు పెట్టుకొన్నవాడు. ఆ యూదా వంశకర్త యూదా. ఈ యూదా అప్పగించినవాడు. ఎంతవిచారం! కొందరు ప్రభువును కోరలేదు, చేరలేదు, చూడలేదు. ఈ యూదా యీ మూడింటిని కలిగినవాడే గాని మారలేదు. మనలో యెంతమంది యూదాలున్నారు? ఎందరు మారనివారున్నారు? ఎన్ని బోధలు వినినను, యెన్ని మీటింగులకు వెళ్ళినను, మారనివారెందరో ఉన్నారు. ఆయా సభలలో మారిన యనుభవ సాక్ష్యములు వినినను మారనివారున్నారు. ప్రియులారా! ప్రభువును కోరండి, చేరండి, మారండి. నేనీ శ్రమకాల ధ్యానములవలన మారిపోయినానని సాక్ష్యము చెప్పగలవారు ఎంతమంది ఉన్నారు? అన్ని స్థలములలో మారనివారుందురు. అలాగే శిష్యులలో నొకడై యున్న యిస్కరియోతు యూదా మారలేదు.

**2) సన్‌హెడ్రిన్‌సభ:-** సన్ హెడ్రిన్ సభ అనగా యూదుల సంఘము, వీరు 70 మంది. వీరు ప్రభువును అన్యజనులకప్పగించిరి. సిలువ వేయించిరి. ఇది బైబిలులో లేదుగాని 'యూదుల యాలోచన సభయ'ని యున్నది. ఫిర్యాదులుంటే యీ సభకు

రావలెను. తీర్మానమైనను సిలువ వేయుమని దీనికి ముందుసాక్ష్యము. ప్రభువు ఉపకారములను, అద్భుతములను చేయుచున్నారని మంచి సాక్ష్యమున్నది గాని యీ సభ సిలువ వేయకుండ యుండలేదు, ఎందుకనగా మారలేదు. అద్భుతములను, సహింపును ఉపకారముల నెరిగియున్న వారేగాని మారలేదు. ఎన్నో గుంపులు మారని వారున్నారు. అంత్యదినములయందు మారని వారుందురు. అంత్యతీర్పు దినమున ప్రభువు ధవళ సింహాసనా (జడ్జి) న్యాయాధిపతిగా నుండును. ఆయన యెదుట నిలువబడుదురు. మూడు గుంపులవారు యేసు ప్రభువును కోరనివారు, చేరనివారు, మారనివారు, యూదాలోని లోపము ధనాపేక్ష గాన యెన్ని బోధలు వినినను, ఉపకారములను పొందినను, అద్భుతములను చూచినను మారలేదు. సన్ హెడ్రిన్ యెందుకు మారలేదు. మెస్సీయ లోకమునకు వచ్చినపుడు, ఇశ్రాయేలీయులకు, రాజ్యమునకు రాజ్యమే యిస్తాడని వారాశించిరి. (అయితే ఆయన రాజ్యము ఆది యంతము లేనిది). యూదా ధనము కొరకాశించెను. కాని యది దొరకలేదు. అలాగే సన్ హెడ్రిన్‌వారు లోక రాజ్యము కొరకు ఆశించిరి. అయితే యేసుప్రభువు నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదనెను. నా రాజ్యము పరలోకరాజ్య సంబంధమైనదనెను. ఎన్ని యద్భుతములను చేసినా, యెన్ని బోధలు చేసినా, ఎన్ని ఉపకారములను చేసినా వారు మారలేదు. మనలో కొందరెన్ని యద్భుతములను చూచినను, బోధలు విన్నను ఉపకారములను పొందినను, మన మనుకొనినది దొరకనందున మారము. మనలో నట్టిదేదైనను ఉన్నయెడల మారలేము. జాగ్రత్త! తాననుకొనినది కలుగక పోయినను, ఆలస్యముగా నందినను వారి యాత్మీయ జీవనము మారదు.

షరా:- ఉపకారములున్నను లేకపోయినను మారవలెను.

**3. సిలువ దగ్గర మారని దొంగ:-** సిలువ దగ్గర మారినదొంగ మోక్షమునకు (పరదైసు) వెళ్లెను. రెండవ దొంగ మారలేదు. మన అంశములోనున్న ఈ మూడవ వ్యక్తి మారలేదు. 1.యూదా 2.సభ 3.రెండవ దొంగ.

1. మొదటి దొంగ యేసుప్రభువు యొక్క సహనమును, శాంతిగుణములను చూచి మార్పు చెందెను. రెండవవాడును చూచిన యెడల మారడా ? యేసుప్రభువు యొక్క సిలువ వద్ద మొదటి ప్రార్థన ఏమనగా దేవా! సిలువ నావరించిన వీరు నాకు ఏ కీడు చేయుచున్నారో వీరెరుగరు. 1. వీరు యెరుగరు. 2. వీరిని క్షమించుము. అప్పగించిన వారు ఆయనను అప్పగించినామనియు, సిలువపైన పెట్టి నామనియు, మేకులు గొట్టినా మనియు నెరుగరా? ఆ ప్రార్థనకైనను మారవలసినదేగాని మారలేదు.

అ॥కార్యాలలో పౌలు యేమి వ్రాసెను? వారు యేసుప్రభువు మహిమ నెరిగియుంటే సిలువ వేయరని యన్నాడు. పౌలు బాగుగా గ్రహించెను. ఈ క్షమాపణ ప్రార్థనకే దొంగమారెను. రెండవ మాట నీవు నాతో పరదైసులో నుందువు. మొదటి దొంగ మారినదానిని బట్టి రెండవ దొంగ కూడ మారవలసియున్నది గాని మారలేదు. మొదట యిద్దరును దూషించినారు. పిదప మొదటివాడు మారెను. యూదా, ధనాపేక్ష గలవాడు గాన మారలేదు. రెండవ దొంగ నిన్ను నీవు రక్షించుకొని నన్నును రక్షించుము, నీవు దేవుడవైన యెడల, గొప్పవాడవైనయెడల నిన్ను నీవు సిలువనుండి దించుకొని నన్నును దించుమని దూషించెను. తాననుకొన్నది దొరకనందున దూషించెను. మారలేదు.

షరా :- ఏదో లోపము మనస్సులో నున్నయెడల పాలువంటి పదార్ధములను తినినను ఆరోగ్యము మారదు.

***4. సమాధి కావలివారు:-*** సమాధి కావలి కాచిన రాణువవారు మారలేదు మారవలసినదేగాని మారలేదు. ఎందుకంటే ప్రభువు సమాధిలో నుండి లేచి వెళ్ళిపోయిన చరిత్రను చూచినారు. ఆయన మహిమా ప్రభావమును చూచి పడిపోయినను మారలేదు.

1. యూదా స్వహత్య చేసికొనినాడు.

2. సభ:- ఆయన రక్తము మా మీద మా పిల్లలమీద యుండునుగాక.

3. దొంగ మరింత చెడిపోయి దూషించినాడు.

4. కావలివారు ఆయన బ్రతికి వచ్చినాడని ఊరిలో సాక్ష్యమివ్వక, శిష్యులు శవము నెత్తుకొని పోయిరని అబద్ధసాక్ష్యము చెప్పి మరింత చెడిపోయిరి. ఆలాగే మనలో కొందరు మారలేదు. మరింత చెడిపోవుచున్నారు. ఈ దినము నేను మారినానా! యని ప్రశ్నించుకొనండి. క్రైస్తవులలో ననేకులు మరింత చెడిపోయి మారకుండయుంటున్నారు.

ఆలాగు మారనివారివలెకాక పూర్తిగా మారినవారి స్థితి ప్రభువు మీకు దయచేయునుగాక. ఆమేన్.

ప్రార్థన:- యేసుప్రభువా, మాలో ప్రతివారిని నీలోని ప్రతికార్యమువలన మార్చి ప్రతిదినము ప్రతి గండముల వలన తప్పించుమని సిలువపైనున్న ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

**కీర్తన:** "తల వంచి సిగ్గున-నేజేయు నేరముల-నెంతు నాలోన = పలుమారు నీ
గాయములన్-గెలికి నిన్ శ్రమపరచు నా - ఖల దోషములకై ఇపుడు-
విలపించి వేడుకొందు ॥నా యన్న॥



# లెంటులోని ముప్పదియవ దినము - మంగళవారము

## సిలువలోని సిలువలు

యెషయా 53:3-5



ప్రార్థన:- యేసుప్రభువా! ఈ వేళ మా సిలువలు మోసిన నీయెడల; నిన్ను చంపువారి కొరకు సిలువలు మోసిన నీ యెడల; నీతో సిలువ వేయబడిన దొంగ సిలువ మోసిన నీ యెడల; కృతజ్ఞత కలిగి ధ్యానము చేయునపుడు మా హృదయములను కృతజ్ఞతతోను, మా నేత్రములను కన్నీళ్లతోను నింపుము. కృతజ్ఞతతో కన్నీరు కార్చుటకు శుక్రవారము కూడుకొనినప్పుడు మా కష్టము కొరకు, వ్యాధి, బాధ కొరకు, కన్నీరు రాల్చక నీ యెడలగల కృతజ్ఞతతో కన్నీరు రాల్చే కృప ఇమ్ము. అప్పుడు నేలమీద, ఒంటిమీద, బట్టలమీదపడు కన్నీరు పరలోక నీ సింహాసనము వరకు వచ్చును. అట్లు కన్నీరు రాకపోతే యూదా ఇస్కరియోతువలెను, మారని దొంగవలెను, ఏడ్చిన స్త్రీలవలెను ఉందుముగదా! మాకు అట్టి ఆనంద కన్నీటితో నింపుకొను కృప ఇమ్ము. ఇట్టి ధన్యత, ప్రయత్నస్థితి, ఈ కూటములో ఉన్న వారందరికిని ప్రాప్తించు కృప దయచేయుమని వేడుకొనుచున్నాము. దావీదు- నా యొక్క పాపము, కష్టమువల్ల నా పడకను నా కన్నీటితో నింపుచున్నాననెను. మాకు అదికాదు. అనగా అది వద్దు. కృతజ్ఞతతో నిండిన హృదయమును, కన్నీటితో కృతజ్ఞతతో నింపుకొను కృప ఇమ్ము. త్వరగా రానైయున్న ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమేన్.

శ్రమకాల ధ్యానవాస్తవ్యులారా! శ్రమ చరిత్ర అంతయు సువార్తికులు వరుసగా చేర్చియుంటే అది ఒక క్రమము అగును. ఆ చరిత్ర క్రమప్రకారముగా చెప్పుటకు 40 దినములు అవసరము. మనము ధ్యానము చేయునది కొద్ది కాలమే గనుక మిగిలినవి విడుచుచున్నాము. మంచి శుక్రవారము కొరకైన ధ్యానము ముందుగనే చెప్పుచున్నాము. లోకమంతా ఆ దినము ధ్యానింతురు. 1) మట్టలాదివారమున ప్రభువు సింహాసనాసీనుడై- నాడు. 2) ఆయన శ్రమలో మారినవారి చరిత్రలు (వర్తమానములు), 3) మారనివారి చరిత్రలు (వర్తమానములు). ఈ మూడును మంచి శుక్రవారమున ధ్యానించవలెను.

**1. మూడు సిలువల ధ్యానము:-** కొండమీద సిలువలు అనేకములున్నవి. అవి చిక్కులు గలవి. వీటిలో ప్రభువుయొక్క సిలువను జాగ్రత్తగా ధ్యానింపవలెను. ఆయన సిలువమీద మన పాపములు, శాపములు, వ్యాధి బాధలు అన్ని వేసికొన్నారను సంతోషమును మీ హృదయములో ముద్రించుకొనవలెను. ఆ సిలువ మన కొరకే.

Bible Mission HQ Guntur

కొండమీద మూడు సిలువలు కనబడుచున్నవని సువార్తికులు వ్రాసిరి. 1) దొంగ సిలువ 2) ప్రభువు సిలువ 3) మారని దొంగ సిలువ. ప్రభువుయొక్క సిలువలో మూడు సిలువలున్నవి. 1వ సిలువ: లోకపాప భార సిలువ. 2వ సిలువ: ఆయన మీద శత్రువులు మోపిన నేరముల సిలువ. 3వ సిలువ: కర్ర సిలువ. కర్ర సిలువలో పై రెండును ఉన్నవి. అదిలేకపోతే 3 సిలువలు జ్ఞాపకమునకు రావు.

**(1) లోక పాపముల సిలువ :-** లోక పాపములు మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల. ఇది కర్రకంటే ఎక్కువ భారమైన సిలువ. లోక పాపము అనగా ఆదాము మొదలుకొని తీర్పు దినము వరకు గల పాపులందరియొక్క పాపభారపు సిలువ. ఎన్ని పాపములున్నవో ఆ అన్ని పాపములు; ఆ పాపములవల్ల కలుగు శాపము ఎంతో, అదంతా ఆయన తనమీద వేసికొన్న భారమైన సిలువ.

***(2) శత్రువులు మోపిన నేరపు సిలువ:*** ఏమి నేరములు మోపినారు?

(1) స్నానికుడైన యోహాను తిండి తిప్పలు లేనివాడు అన్నారు. ప్రభునిగూర్చి 'ఈయన అన్నపానములకు అలవాటు పడినవాడు, అలవాటు చేసికొన్నాడు గనుక తిండిబోతు' అన్నారు.

(2) పాపులు పిలిచినా, సుంకరులు పిలిచినా, వెళ్లి పాపులతో కలసి భోజనము చేయును. గనుక పాపులకు, సుంకరులకు స్నేహితుడుగాని గొప్ప వారికి, జ్ఞానులకు, పండితులకు, మాకు స్నేహితుడుకాదు. పాపులలోకెల్ల గొప్ప పాపి. 'అతనికి తిండి, తిండి' అని నేరము మోపిరి. ఇది మోయవలెను.

(3) ఈయన కేవలము మనిషియైయుండి దేవుని కుమారుడనని చెప్పుకొంటు-న్నాడు. ఇది చంపబడే నేరము. ఇది రెండవ సిలువలోని నాల్గవ నేరము.

(4) దయ్యము శక్తికలిగి దయ్యపుపూజవల్ల దయ్యమును వెళ్లగొట్టుచున్నాడు. గాని అది దైవశక్తికాదు అను నేరము మోపిరి.

(5) 'గలిలయ మొదలు యూదా దేశము వరకు సంచారముచేసి, ప్రజలను ప్రభుత్వముమీద (రాజు) తిరుగబడ ప్రేరేపించుచున్నాడు గాని సువార్త బోధ కొరకుకాదు. రోగులను బాగుచేయుట కొరకుగాని ప్రజల ఉపకారము కొరకు గాని సంచరించలేదు. తిరుగుబాటు చేయుటకే సంచరించినాడు' అను నేరము మోపిరి.

(6) ఇతరులను రక్షించెదనన్నాడు. తనను రక్షించుకొనలేదు. తనను తాను రక్షించుకొనలేనివాడు ఇతరులనేలాగు రక్షించగలడు? ఇది గొప్ప అబద్ధము! అను నేరము మోపిరి.

(7) 40 సం॥లు కట్టిన దేవాలయమును 3 దినములలో లేపుదునని చెప్పినాడు. ఇదిఎంత అబద్ధము? ఇట్టి అబద్ధములు చెప్పి ప్రజలను భ్రమపరచినాడనే నేరము మోపిరి.

(8) పిలాతు, హేరోదులు ఈయనను విచారించి, మాకు ఈయనలో ఏ నేరము కనబడలేదనిరి. వారు, యేసును ఎందుకు తీసికొని వచ్చితిరి అని ప్రజలను అడుగగా, వారు– ఏమి నేరములేకపోతే ఎందుకు తీసికొని వస్తాము. దుర్మార్గుడు కాని యెడల ఎందుకు తీసికొని వచ్చెదము అని అన్నారు. జడ్జిగారి ఎదుట ఆలాగు అన్నారు. నేరము మోపినారు.

***3) కఱ్ఱ సిలువ:*** ఈ కఱ్ఱ సిలువలో పై రెండు సిలువలున్నవి. పైకి ఆ రెండు సిలువలు కనబడుటలేదు. కఱ్ఱ సిలువ కనబడెను. ఇందులో మూడున్నవి. ఇది భారమైన సిలువ. మోయలేక పోయినను ఆయన మోసెను. ఈ మూడు సిలువలు ప్రభువుపైన ఉన్నవి. ఈ మూడు సిలువలు ప్రభువును అణచివేసెను. ఈ మూడు సిలువలలో ఏది ఎక్కువ భారమైనది?

1) పాపభార సిలువా?
2) నేరముల సిలువా?
3) కఱ్ఱ సిలువా?

} దేనికదే భారమైనది. ఆయన మనమీద ఉన్న ప్రేమనుబట్టి ఈ మూడును మోసెను.

ఆయనకు మనమీద నున్న ప్రేమనుబట్టి కఱ్ఱ సిలువ మోసెను.

ఆయనకు మనమీద నున్న ప్రేమనుబట్టి నిందల సిలువ మోసెను.

ఆయనకు మనమీద నున్న ప్రేమనుబట్టి పాప భార సిలువ మోసెను.

మొదటి, మూడు సిలువలు: కొండమీది కఱ్ఱ సిలువలు.

రెండవ, మూడు సిలువలు: 1. పాప భార సిలువ 2. నేరముల సిలువ 3. కఱ్ఱ సిలువ ఇవన్ని ప్రభువు మోసెను.

1. ఆదాము మొదలు అనగా (పాపములో పడినది మొదలు), తినవద్దన్న పండు తిన్న చెట్టు వద్ద నుండి దేవునికి దుఃఖము, శ్రమ ఆరంభమాయెను. ప్రజలు పుట్టి పెరిగి వృద్ధి పొందినకొలది, క్రొత్తగా నరులు పుట్టి పెరుగుకొలదీ, ఆయనకు ఈ పాపులకొరకు శ్రమ మరియు దుఃఖముండెను. ఈ దుఃఖము లేక ఈ శ్రమలు, తినవద్దన్న చెట్టు మ్రానువద్ద నుండి కల్వరి కొండమీది ఈ సిలువ మ్రాను వరకు అనగా 4వేల సం॥ల పొడగున ఉన్న శ్రమ సిలువ ఆయన మోసెను. అది మనకుగాని, లోకమునకు గాని కనబడలేదు. ఈ కల్వరిగిరిమీదికి మోయవలసిన సిలువను అప్పటినుండి జ్ఞాపకము చేసికొంటు ఆయన మోయుచున్నాడు.

2. నరావతార ధారియైన పిమ్మట ఆ కఱ్ఱ సిలువను మోసెను (ఇది కఱ్ఱ సిలువ). మరణమొంది సమాధి చేయబడి బ్రతికి మోక్షమునకు వెళ్లినందున ఆయన ఈ కఱ్ఱ సిలువ తప్పించుకొనెను. ఇక కఱ్ఱ సిలువలేదు.

3. అంత్య తీర్పువరకు కఠినులుందురు. పాపులుందురు. వారిని గూర్చిన దుఃఖము, చింత వలన ఆయన తన సిలువను లోకాంతమువరకు మోయుచునేయుండును. మనము పాపము చేయునపుడెల్ల ఆయన క్రొత్త సిలువ మోయుచునే యున్నాడు. ఆయనకు కఠినులమీదనున్న ప్రేమనుబట్టి వారిని ఇంకనూ సంపాదించుకొంటునే యున్నాడు.

నాలుగవ వరుసలో మరి మూడు సిలువలు గలవు (యోహాను 3:16) దేవుడు లోకమునెంతో ప్రేమించెను. 1) దేవుడు లోకమును ప్రేమించి, తన కుమారునిచ్చెను (సిలువమోత). 2) దేవుడు లోకమును ప్రేమించి ఆత్మను పంపెను (సిలువ మోత). 3) దేవుడు లోకమును ప్రేమించి సిలువను మోసెను.

1. కుమారుడు సిలువ మోసెను, ఇంకను మోస్తు ఉండెను. ఆత్మకూడ మోసెను.

2. ఆత్మ ఎట్లు సిలువను మోసెను? ఆత్మను అంగీకరింపకుండుట ఆయనకు శ్రమ. ఆత్మ నడిపింపు ఒప్పుకొనక పోవుట ఆయనకు సిలువ. 3. తండ్రి సిలువను మోసెను. ఎట్లు మోసెను? కుమారుడు గోతిలోనికి దిగినయెడల తండ్రికి శ్రమకాదా? కుమారుడు శ్రమలోనికి వెళ్లిన యెడల తండ్రికి శ్రమగదా! కుమారుడు అంగీకరించిన యెడల తండ్రికి శ్రమగదా! (అది తండ్రికి సిలువ). ఆత్మను అంగీకరించరు, అది ఆత్మకు సిలువ. ఒక నాస్తికుడు– దేవుడు లేడనుచున్నాడు ఇది తండ్రికి సిలువ. తండ్రికి, అనగా త్రిత్వమునకు ఇది సిలువ అనగా త్రియేక దేవుడు ఈ రీతిగా సిలువను మోయుచుంటే మనిషికి ఏమి చింతలేదు. చీమకుట్టుట లేదు. ***పాపి, పాపమువల్ల బాధ వచ్చినప్పుడు ఏడ్చును. పాప ఫలితమును గూర్చి ఏడ్చును గాని నేను పాపము చేసితినే అని ఏడ్వడు.*** కష్టములు రాగా ఏడ్చెదరు గాని పాపమును చేసితినని ఏడ్వరు. శ్రమవల్ల ఏడ్పు రాదు. కోటానుకోట్ల ప్రజలుందురు గాని పేతురువలె పశ్చాత్తాపపడి ఏడ్చువారుండరు.

మనకొరకు బాధపడుచున్న ప్రభువునుగూర్చి, రేప్చర్ వరకు బాధ పడుచున్న ఆయనను గూర్చి ఏడ్వవలెను. ప్రభువు సిలువ శ్రమలో ఉండగా కొందరు స్త్రీలు ఏడ్చిరి. అప్పుడు ఆయన వారితో ఇట్లనెను. కుమార్తెలారా! నన్నుగూర్చి మీరు ఏడ్వవద్దు. మిమ్మును గూర్చి, మీ పిల్లలను గూర్చియు ఏడ్వుడి. నేనైతే పాపమును, సిలువను, సమాధిని, మరణమును తప్పించుకొని బైటకి వత్తును గాని మీరైతే బైటకు రాలేరు గనుక మీ నిమిత్తము ఏడ్వుడి;

1. పాపములనుగూర్చి పశ్చాత్తప్తులై ఏడ్చుట ఆయనకు ఇష్టముండును గాని కష్టమును గూర్చి ఏడ్చిన యెడల ఆయనకు ఇష్టముండదు. పాపములను గూర్చి నొచ్చుకొని ఏడ్చిన యెడల, "నా బిడ్డలు పాపము నిమిత్తము ఎంత నొచ్చుకుంటున్నారు" అని తండ్రి సంతోషించును. అందుకై కన్నీరు రాల్చిన, మన పాపములను గూర్చి కన్నీరు కార్చిన త్రియేక దేవునికి చాలా సంతోషము. దుఃఖించి, పాపి మారినయెడల పరలోకములో దూతలు పండుగ చేసికొందురు అని ప్రభువు చెప్పెను ( లూకా 15:10).

2. పాపక్షమనొందిన తరువాత మరల పాపినని ఏడ్చిన, కన్నీరు రాల్చిన యెడల వారినిగూర్చి ప్రభువు కన్నీరు రాల్చి దుఃఖించును, సంతోషించడు. క్షమాపణ పొందిన తరువాత ఏడ్చితే క్షమాపణ పొందనట్లేగదా! గనుక దేవునికికూడా దుఃఖము.

3. కష్టము నిమిత్తము కన్నీరు కార్చిన యెడల ఆయన గైచేయడు.

4. యేసుప్రభువు లోకము నిమిత్తము, నా నిమిత్తము ఇన్ని శ్రమలు పడినారని ఆయనమీదనున్న ప్రేమనుబట్టి కృతజ్ఞత కన్నీరు రాల్చిన, ఆ కన్నీరు చూచి ప్రభువు సంతోషించును. ఆ కన్నీరు ప్రభువుయొక్క చేతిలో ముత్యమువలె ప్రకాశించును. అది అంగీకారమగును.

5. ***ఇన్ని సిలువలు మీ ఎదుట ఉంచినాను. మీరు పరుండి మెళకువ వచ్చినప్పుడు ఆయన యెడల కృతజ్ఞత చూపుచూ కన్నీరు విడువండి.***

6) పాపము చేయడమెందుకు? కన్నీరు విడుచుట ఎందుకు? పాపము చేయుట మానండి. ప్రభువు చేసిన ప్రతి ఉపకారమునకు కన్నీరు విడువండి.

అట్టి కన్నీరు ప్రభువు మీకు దయచేయును గాక. ఆమేన్.

*షరా:- అపవాది నీ శరీరములోని వ్యాధి, కష్టము, అవమానము, జ్ఞాపకము తెచ్చి కన్నీరు రప్పించుటకు పొంచియుండును జాగ్రత్త.*

***కీర్తన :*** *"నా ఋణము తీర్చిన - నా దేవా! నా ప్రభువా! నీ ఋణము తీర్చగలనా=*
నీవు - నా ఋషివై బోధించి - నా బదులు చనిపోయి-నావని
మరువగలనా" ॥మూడు॥

# లెంటులోని ముప్పది ఒకటవ దినము - బుధవారము

## దేవుని ప్రేమ - సిలువ వేత

రోమా 8:35-39; గలతీ. 2:20;



**ప్రార్థన:- తండ్రీ! నా నిమిత్తమై శ్రమపడుచున్న తండ్రీ! నన్నుచూచుచూ శ్రమను అనుభవించిన తండ్రీ! నా మేలుకొరకై నీ ప్రాణము పోవునంతగా రక్తము ధారపోసిన తండ్రీ! నీకే ఆగని వందనములు, తరుగని స్తోత్రములు. పాపముతో కప్పివేయబడిన ఈ మానవులను నీ ప్రేమతో వెలికితీసి, నీ రూపములోనికి మార్చుకొని మురియుచున్న తండ్రీ! నీ సిలువపై నీవు కనపర్చిన ప్రేమను మేము గ్రహించుటకు, అనుభవించుటకు ఇతరులకు అందించుటకు నేడు మాతో మాట్లాడుమని ప్రేమనాధుడైన యేసునామమున అడుగుచున్నాము. ఆమేన్.**

ప్రభువు ఈ లోకములో 33 1/2సంగలు జీవించినపుడు సుఖమనుభవించినాడా? కష్టము, శ్రమ అనుభవించినాడా? ప్రభువు ఎప్పుడైనా సంతోషమనుభవించెనా? సిలువమీద నున్నప్పుడు సంతోషించెనా? సంతోషించెను. దొంగ మారినప్పుడు, అత్తరు పూసిన స్త్రీ అభిషేకించినపుడు సంతోషమనుభవించెను. ***యేసుప్రభువు భూమిమీద సుఖము, కష్టము అనుభవించినాడు గనుక సంఘము కూడా వాటిని అనుభవించ వలెను.*** నేడు సంఘము సుఖమనుభవించుచున్నది గాని ఎప్పుడు కష్టము అనుభవించు చున్నది? సంఘము శ్రమలను అనుభవించకపోతే ప్రభువుతో సమానముకాదు. ఇప్పుడు సంఘమునకు ఎగుడు దిగుడులు ఉన్నవి గాని సంఘము పరలోకమునకు వెళ్ళినప్పుడు ప్రభువుతో సమానముగా ఉండును. ప్రభువు సంఘమును తీసికొని వెళ్లవలసినదిగాని, శ్రమ అనుభవించుమని చెప్పి, నేను వచ్చి తీసికొని వెళ్లెదననెను. ప్రభువు శ్రమపడి పైకి వెళ్లెను. మనము శ్రమ అనుభవించకపోతే ప్రభువుతో సమాన అంతస్థు లేదు అనగా ఆయనవలె పైకి వెళ్ళలేము. ప్రభువు- పాపము, శిక్ష, రోగము, సిలువ, మరణమును అనుభవించెను. మనమీద అవి లేవు అనెను. అయిననూ అవి మనమీద ఎందుకున్నవి? మనవంతు మనము అనుభవించ వలెను గనుక. ప్రభువు, సంఘము సమానముగా ఉన్నారు. విశ్వాసి శ్రమ అనుభవిస్తే క్రమశిక్షణ, కొత్తపాటము నేర్చుకొనును. దీనివలన 'గొప్ప ఉపకారము చేయుటకు ఈ శ్రమ వచ్చెను' అని విశ్వాసి అనును. అవిశ్వాసి పాపము, ప్రభువు మోసినను 'నాకు తీసివేయలేదు, కష్టము

Bible Mission HQ Guntur

పంపుచున్నాడనును'. విశ్వాసి కొన్ని విషయములలో అవిశ్వాసపడును. తుదకు విశ్వాసము పూర్తియగును. పొందబోవు మహిమ ఎదుట ఈ శ్రమలు ఎన్న తగినవి కాదు అని పౌలు వ్రాసెను. **మన యెదుట ఉన్న మహిమ ఆకాశమంత-శ్రమ చోడిగింజంత!** ప్రభువు పొందిన ఆ ఏడు అవస్థలు సంఘమునకున్నవి. ఆత్మ జీవనము: సంఘముయొక్క అవస్థ.

**1. ప్రవచన శ్రమ:-** బాప్తిస్మము పొందని వారి యొద్దకు వెళ్లి; రండి! కార్లు, ధనము అన్నీ మీవే అంటే వచ్చెదరు. అయితే, క్రీస్తు మతములోనికి వచ్చినవారికి అన్ని శ్రమలే అని చెప్పవలెను. క్రీస్తు మతములోనికి రాగా పాప శోధనలు, కష్టములు ఎక్కువగును. ప్రభువు చెప్పినది ఏమనగా, 'శత్రువులు పట్టుకొని చంపుదురనెను'. అట్లే సంఘమునకు జరుగును. నన్ను వెంబడించువాడు సిలువను ఎత్తుకొనవలెననెను. 'అవిశ్వాసులు కష్టములలో మునిగిపోతారు, విశ్వాసులు తేలుదురు అని మనలను గురించి గ్రంథము ప్రవచించుచున్నది.

**2. ప్రార్థన:-** కష్టములలో సువార్తకు వెళ్ళమన్నప్పుడు విశ్వాసులు ప్రార్థనలో ఏడ్చెదరు. ఇది ఒకరకమైన శ్రమ.

**3. బంధించుట:-** క్రైస్తవ విరోధులు మనలను బంధించి చిక్కులలో పెడతారు.

**4. అన్యాయతీర్పు:-** క్రైస్తవులు మంచి చేస్తే ఇతరులు చెడ్డదనుదురు. ఆలాగు అన్యాయపు తీర్పు తీర్చుదురు. భక్తి కలిగి ప్రకటించినను జీతము పుచ్చుకొని ప్రకటించుచున్నారందురు.

**5. సిలువ మోత:-** విశ్వాసులు జీవితకాలమంతా ఈ మోతను అనుభవింతురు. ప్రభువు మోయలేని ఈ భారము నాకు పెట్టినాడని అందురు.

**6. చంపుట:-** "ప్రభువు విశ్వాసులను చంపనిస్తాడా! ఆయన ఎక్కడికి వెళ్ళతాడు! వారు ఆయనను చంపలేదా! ఆయనను చంపకపోయినా వారు నన్ను చంపివేస్తున్నారు అని అనుచున్నారు కొందరు. ఇది ఒకరకమైన శ్రమ.

**7. భూస్థాపన:-** ఇదియుకూడ సంఘమునకు జరుగును. కాని అన్నిటిలో సంఘమునకు జయమే కలుగును. అన్నిటిలో జయము కలుగునని స్తుతిచేయవలెను. ఈ శ్రమలు కలిగినప్పుడు అవిశ్వాసపడవద్దు.

విశ్వాసులకు ఆహారము లేకుండునా? లేకుండును. ప్రభువు ఆహారలేమిని అనుభవించెను. ఆయనకు సిలువమీద నీళ్ళు దొరకలేదు. **ప్రభువుకు వచ్చినవి అన్నియు సంఘమునకు వచ్చును.** అన్ని కష్టములలో ప్రభువు ఉన్నాడు. ఈ ఏడు

శ్రమలు మనకు కలిగినప్పుడు ప్రభువు ఉండును. ఈ ఏడు అవస్థలు సంఘమునకు కలిగినప్పుడు ప్రభువు ఉండును. ఎందుచేత? 'ఏడు అవస్థలు పడి సంపాదించిన ఈ సంఘమును ఎట్లు విడువను!' అని ప్రభువు సంఘముతోనే ఉండును. విశ్వాసుల అన్ని అవస్థలలో ప్రభువు ఉండును. యేసు ప్రభువునకు వచ్చినవే సంఘమునకు వచ్చును. కాని ప్రభువు సహాయకారిగా ఉండును. విశ్వాసి అవస్థలలో ప్రభువు ఉండకుండా ఉండడు. ఆయన సంఘమును విడిచిపెట్టి ఉండలేడు. ఈ విషయములు తలచి, స్తుతించవలెను. అప్పుడు శ్రమలు పూర్తిగా తీసివేయును. పూర్తిగా తొలగించును. ప్రభువా! ఇన్ని ప్రార్థనలు చేసినను, నా కష్టములు తీసివేయవే ప్రభువా! అంటే, "మీరు శ్రమలకు భయపడకండి, నాకు భయపడండి. మిమ్మును రక్తముతో కొన్నది శ్రమలకు భయపడుటకు కాదు. నేనున్నాను, ఫర్వాలేదు" అనును. విశ్వాసికి పాపశోధన వచ్చునా? వచ్చును గాని వడిలిపోకూడదు. ***శ్రమలలో మూల్గితే ప్రభువుకు శత్రువులగుదురు.*** 'ప్రభువా! ఈ వేళ మేలున్నది' అని శ్రమ దినమున అంటే ప్రభువుకు మిత్రులౌతారు. మీకు ఏది ఇష్టము? మీరు విసుగుకున్నను ప్రభువు ఏమీ అనడు. ***శ్రమ పెట్టినప్పుడే ఏమీ అనలేదు.*** విసుగుకుంటే విసుగుకొన్నవారికే శ్రమ కాని ప్రభువుకేమి కష్టము లేదు. ఆయన అన్ని జయించెను. 'నేను ప్రార్థన చేయను' అని అనుకొంటే మనకే కీడు. ***కనుక శ్రమలలో ప్రభువును స్తుతించండి.*** ఇదే గొప్ప విషయము. మన శ్రమలలో ఆయన మనలను విడిచి వెళ్ళరు. మనము శ్రమ పడుచున్న కొలదీ, ఆయన ప్రేమ మన యెడల అధికమగుచుండును. ఈ పాప జీవుల యెడల దేవునికి ఉన్న ప్రేమను తెలియజేయుటకు ఒక ఉదాహరణ చెప్పుదును.

**దృష్టాంతము:-** ఒక మామిడి తోటలో కోతులు ఉన్నాయి. వాటిలో ఒక కోతి పిల్ల చనిపోతే దానిని తోటమాలి చూచి విచారించెను. కోతి తన పిల్లను ముద్దు పెట్టుకొనుచుండగా, తోటమాలి 'నీవు వెళ్ళిపో! పిల్ల చనిపోయినదని చెప్పి అదిరిస్తే వెళ్ళలేదు. కర్రతో జడిపించగా పిల్ల జారిపడెను. తోటమాలి పిల్లను తీసివేసెను. కోతి- పిల్లవైపు, కర్రవైపు చూచుచున్నది. తోటమాలి గొయ్యి తీసి పాతిపెట్టగా, కోతి దానిని (గొయ్యి) త్రవ్వబోయెను. తోటమాలి బెదిరించగా అక్కడక్కడ తిరుగుచుండెను. ఇతడు అవతలకు వెళ్ళగా కోతి త్రవ్వి తీసెను. మరలా తోటమాలి పాతిపెట్టగా, మరలా త్రవ్వి తీసి, ముద్దుపెట్టుకొనెను. తోటమాలి అది చూచి ***దేవుని ప్రేమ ఎంత గొప్ప ప్రేమ!*** ఈ కోతిలో ఇంత ప్రేమ పెట్టినాడని సంతోషించినాడు. తోటమాలి ఆ పిల్లను తీసి మరియొక చోట పాతిపెట్టెను.

**1. *మానవ దుస్థితి-దైవ ప్రేమ:-*** మనిషి జీవితము జన్మము నుండి మరణము వరకు చూస్తే 1) దేవుడంటే మానవునికి లెక్కలేని స్థితి ఉన్నది గనుక దేవునికి మానవునిమీద కోపముండవలెను. 2) వయస్సు ఎదిగిన కొలది, అనుభవము పొందిన కొలది, చదువుకొనే కొలది; తల్లిదండ్రులు, పెద్దలు అంటే లెక్కలేని వారిమీద దేవునికి కోపముండవలెను. న్యాయ ప్రకారము మానవుని జీవితకాలమంతా అనేక పర్యాయములు అనేక పాపములు చేసినాడు. అందరిని ధిక్కరించి, శ్రమలు వచ్చినా మారక, పాపము చేసిన యెడల ఎంత కష్టముండవలెను! మనిషి జీవితము రెండు భాగములు. చేయకూడనిది చేయుట, చేయవలసినది చేయకపోవుట. (1) మంచి కార్యములు (2) చెడ్డ కార్యములు. మానవుడు ఇంకా పాపము చేస్తున్నాడు. దేవుడు ఇంకనూ కనికరించుచున్నాడు. ఎంత ప్రేమగల దేవుడు! దుర్జనుని ప్రేమించుట న్యాయమా? జీవిత కాలమంతా పాపియైన మానవుని అనంత పరిశుద్ధుడు ప్రేమించుట న్యాయమా? సాధ్యమా? కోతి చనిపోయిన తన పిల్లను బయటికితీసి, ముద్దాడుట న్యాయమా! సాధ్యమా! రేపు మురిగిపోయి కంపుకొట్టే దానిని ప్రేమించుట సాధ్యమా! వీలా? కోతి ప్రేమను తోటమాలి తరమగలడా? ***తోటమాలి కోతిని తరమగలడు గాని కోతి ప్రేమను తరమగలడా?*** ఆలాగే దేవుని న్యాయము, పరిశుద్ధత ఒప్పుకొనునా! కోతి పిల్ల శవములో ఏమైనా ప్రయోజనమున్నదా? ఎక్కడైనా ఒక మూలను ఆవగింజంత విలువైనా ఉంటే, కోతి త్రవ్వి తీసికొని వెళ్ళవలెను గాని ఏ ప్రయోజనము లేదు. అయినా గాని తీసికొని వెళ్ళుచున్నది. చావు కళ గల పిల్లను కోతి తీసెను. ఆలాగే నశించిపోయిన మానవుని విడిచివెళ్ళుటకు దేవుని పరిశుద్ధత, న్యాయము ఒప్పుకొనునా? తోటమాలి కోతినిచూచి- 'దేవుడు ఎంత ప్రేమ పెట్టినాడు!' అనెను. నశించిన దానిని వెదకి రక్షించుటకు ప్రభువు వచ్చెను. ఒక వైద్యుడు తల వెంట్రుకలలో జీవముంటే వచ్చి, బాగుచేస్తానన్నాడు. కాని ప్రభువు నశించిన దానిని రక్షించుటకు వచ్చెను. ***పాపపు చావుగలవానిని ప్రేమించి రక్షించుట సాధ్యమా? న్యాయమా?***

**2. *ఆయనను త్రాళ్ళతో బంధించుట:-*** యూదా గవర్నరుగారు- రాణువవారు వచ్చి ప్రభువును బంధించినట్లు ప్రజలకు తెల్పిరి. కాని ప్రభువు దృష్టికే ఇంకొకటి కనబడుచున్నది. మనిషియొక్క ఆత్మ బంధింపబడినది. పాపమువలన, పాపక్రియల వలన, పాపనైజమువలన, సైతాను, అతని దూతలవలన, మానవ ఆత్మ బంధించబడెను. ఈలాగు సైతాను మనిషిని బంధించెను. ఈ విషయము అక్కడున్నవారికి తెలియదు గాని రక్షించుటకు వచ్చిన ప్రభువుకు తెలియును. ***ఏదైనా విడిచిపెట్టవచ్చును గాని***

**పాపనైజము విడిచిపెట్టదు** గాన ప్రభువు ఇన్ని బంధకములు గల మనిషిని రక్షించుటకు వచ్చెను. మనిషి బంధకములను తనపై వేసికొనెను. ఒక కుర్రవాడు నూతిలో పడెను. అప్పుడే జమిందారు ఆ వైపుగా వెళ్ళుచున్నాడు. అప్పుడా పెద్దమనిషి- అబ్బాయ్! నిన్ను రక్షిస్తానని అనునా! ఆలాగు అంటే ఉపయోగముండదు కానీ వెంటనే అందులో దుమకవలెను. ఆలాగు దూకినపుడు మట్టి అంటుకొనును, దెబ్బలు తగులును. అట్లే ప్రభువును కూడా పాపశిక్ష బంధకములు బంధించెను. ఈ శ్రమలు ఆయనకు కష్టమేగాని, ప్రభువు మానవునికున్న బంధకములు చూచి, జాలిపడి విడిపించుటకు వచ్చెను. ప్రభువు ఈ బంధకములు విడిపించుటకు వచ్చెను. మానవుడు పైనున్న వాటిద్వారా బంధింపబడెను. ఇవన్నీ విడిచినా నైజము విడువని, మారనిమనుష్యుని రక్షించుటకు ఎందుకు ప్రభువు వచ్చెను? ఆయన ప్రేమ, దయ. అంతేకాక, మానవుడు చనిపోయినందుచేతను ఆయన వచ్చెను. ***ఇవియు కాదుగాని నశించిన వానిలో ఏదోయొక విలువ ఉన్నది. కనుక ప్రభువు అది చూచి లోకమునకు రావలసి వచ్చెను.*** అంత విలువైనది కాకపోతే ప్రభువు బంధకములో ఉండునా? నశించిన దానిలో విలువ ఉన్నది కనుక ప్రభువు విడువలేదు. ఆత్మలో విలువ ఉన్నది. పనికిరాని ఈ తనువు ఎందుకు?ఇది ప్రభువునకు కావలెనా? 'తనువు నాదిదిగో.....ప్రతిష్ఠించుమీ'!

***3. న్యాయసభ:-*** తీర్పు శిక్ష విధించుట, బహిరంగ కథ. ప్రభువుకు కనబడే కథ ఏదనగా, పాపి లోకాధికారుల వద్దకు వెళ్ళుట. అయితే పాపి వారి వద్దకు కాదుగాని ప్రభువువద్దకు వెళ్ళవలెను. 'ప్రభువా ప్రవచింపలేదా! దయ్యములను వెళ్ళగొట్టలేదా'! అని వారు అనినపుడు- 'మీరెవరో ఎరుగను' అని ఆయన అన్నారుకదా! వారినే ఎరగనన్నప్పుడు వారి కార్యములు ఎరుగునా? మనుష్యులు ఏ పాపము చేయకుండా ఉన్నప్పటికిని, సొంత క్రియలు ఎన్ని చేసినను, మానవుని జీవితము పాపజీవితము, జన్మము పాప జన్మము, ఉనికి పాపపు ఉనికి కనుక ఎన్ని మంచి పనులు చేసినను, మానవునికి రక్షణలేదు. పాపిఆత్మ ప్రభువుయొద్ద చేతులు కట్టివేయబడియున్నది. కనుక వానిని విడిపించుటకు ప్రభువు బంధింపబడెను. విలువలేని పాపి కోసరము ఆయన బంధకములు, తీర్పు తనపై వేసికొని, మనిషికి రావలసిన బంధకములు, నిత్య తీర్పులు రాకుండా చేసెను. ఇక్కడున్న ముఖ్యాంశము ఏదనగా, ***యేసు ప్రభువు దృష్టిలో మానవుని ఆత్మ విలువగలది కాకపోతే ప్రభువు ఇన్ని పనులు ఏలాగు చేయును!***

***4. సిలువ మోత:-*** ప్రభువు పైన పెట్టబడిన కర్ర సిలువ, అందువలన ఆయన తూలిపోవుట, తదుపరి విజ్ఞాపన చేయుట వారికి కనబడుచున్నది కాని ప్రభువుకు ఇంకొకటి

కనబడుచున్నది. మానవునికి తీర్పు విధించిన తరువాత, మానవుడు బ్రతికినంత కాలము ఆ భారము మోయవలసినదే. సిలువ భారము మనిషిని క్రిందికి అణిచివేస్తుంది, లేవనీయదు. బంధకము, తీర్పు మానవుని చంపవు గాని సిలువ భారము మానవుని క్రుంగజేయునుగాన సిలువ కనబడును. మానవుడు సిలువ దగ్గరకే వెళ్ళుచున్నాడు. సిలువ ఎత్తినప్పుడు మరణమే. ఇక విడుదల దారి కనబడకున్నది. మనిషికి చింతలు, భయములు, అనుమానములు, అవిశ్వాసములు కలిగి ఇవన్నీ అణిచివేయుచున్నవి. ***ఇవి మాత్రమే గాక నిరాశ మనిషిని అణచివేయును. ఇది వచ్చిన తరువాత ఇక ఏమీ మనిషికి రావు.*** ఆఖరున మనిషిని ఇన్ని సిలువ భారములు అణిచివేయుచున్నవి. యేసుప్రభువుకు ఇవి కలిగినా నలగలేదు. *ఈ సిలువే ఆయనకు కావలెను.*

యేసుప్రభువు మోయుచున్న సిలువ రెండు కర్రలతో చేయబడెను గాని మానవుడు *మోసే సిలువ అవిశ్వాసము, చింత, భయము, నిరాశ అను కర్రలు గలదై యున్నది.* ఆ సిలువచేత మానవులు కృంగిపోతున్నారు. అనిశ్చయము, అనుమానములతో కృంగిపోవుచున్నారు. కాని ప్రభువు ఈలాటి మానవుని గురించి విచారించక, వీరి ఆత్మను విడువనని తానే శ్రమలనుభవించెను. మనిషి ఎంత విలువైనవాడు కాకపోతే ప్రభువు మానవుని కోసరము చనిపోవును! కాసీము (దగ్గు) చేత మంచము ఎక్కినవానిని చూడలేదా! సిలువకాదా! తోటమాలికి చనిపోయిన కోతిపిల్ల మంచిది కాదు. గాని కోతికి తనపిల్ల విలువ తెలుసును గనుక వచ్చెను. ***మానవుని విలువ తెలిసినవాడు ప్రభువు తప్ప మరి ఎవరు?***

***5. సిలువ వేయుట:–*** కొందరు– 'ప్రభువు చనిపోలేదు గనుక బ్రతికి వచ్చెను' అని అనుచున్నారు. ప్రభువు చావు మాయయైతే ఆయన పొందిన తీర్పు, శిక్ష, శ్రమలు అన్నీ మాయ కావలెను. అవి మాయకాదు గాన ఆయన మరణము మాయకాదు. మనుష్యులకు ప్రభువు శరీరమరణము మాత్రమే కనబడుచున్నది. ప్రభువుకు మనుష్యుల శరీర, ఆత్మ మరణము కనబడుచున్నది. ***ఆత్మ శరీరములో నుండి వేరైనప్పుడు అది శరీరమరణము. దేవునినుండి పాపి వేరైనపుడు అది ఆత్మమరణము.*** నరకము రెండవ మరణము. శరీర మరణము మనకు ప్రారంభమైనదా? అయినది. ఆత్మ మరణముకూడ ప్రారంభమైనది. జబ్బు, పాపమువలన ఈ రెండు మరణములు ప్రారంభమైనవి. **పూర్తిగా నశించిపోయిన ఆత్మను రక్షించుటకు ఆయన మరణము పొందెను.** మరణమైన మనుష్యులలో విలువ ఉన్నది గాన ప్రభువు మరణమాయెను. మనిషి చనిపోయే మంచముమీద ఉండగా, పిల్లవాడిని చూసేవరకు బ్రతుకుదురని అనుకొందురు. పెట్టెలో పెట్టినా అనుకొందురు. అయితే, సమాధిలో పెడితే అనుకొనరు.

***6. సమాధి:–*** శిష్యులు, ఆ కాలములోని భక్తిపరులందరూ– 'యేసుప్రభువు లోకులను ఉద్ధరిస్తారని అనుకొంటిమి గాని లాభములేదు' అని ఆయన సమాధి చేయబడుట చూచి అనుకొన్నారు. 70మంది, 12మంది శిష్యులు, ప్రజలు మొదలైన వారికికూడ ఈ తలంపే ఉన్నది. ఆయన యూదా జనాంగమును ఉద్ధరించునని వారు అనుకొన్నారు గాని సమాధిలో వారి ఆశ ఆవిరైపోయినది. ఒకవేళ ప్రాణము వచ్చినా, రాతి సమాధి కనుక ఆయన మరలా చనిపోవును. ఎమ్మాయి శిష్యులైన క్లెయోపా, లూకాల మాదిరి మిగిలిన యూదులలో ఈ ఆలోచనే ఉన్నది. అందుకే ప్రభువు వారిని గద్దించెను. మోషే మొదలు ప్రవక్తల వరకు ఉన్న చిట్టా విప్పెను. ***పాపముచేయ మొదలుపెట్టి, పూర్తిగా నశించి పోయిన వానిమీద సహా ప్రభువుయొక్క ఆశ పోలేదు.*** మానవుని చేసి ఆ మానవునిలో తన ఆత్మను పోసిన ఆయన విడుచునా? ఆయన విడువడు గాని మనిషే ఆయనను విడుచుచున్నాడు. మనిషి నశించుట దేవునికి ఇష్టములేదు కాని మనిషికి ఇష్టమే. ఒక మిషనరీగారు కలరా వచ్చి చనిపోవుచున్నాడు. ఒక ఉపాధ్యాయుడు వచ్చి, నాటు మందు వేస్తాననగా దొరసాని వేయవద్దనెను. ఓ పాపి! నీవు తప్పుకోమనెను.

అలాగే దేవుడు– నిన్ను రక్షిస్తానంటే, మానవుడు వద్దు అనుచున్నాడు. ***చివరి గడియవరకు ప్రభువు మనిషి ఆత్మను విడిచి పెట్టడు. లాభము లేకపోయినా*** ప్రయత్నించుచూనే ఉండును. మనిషి దృష్టి, మనిషి విలువ, మనిషికి అక్కరలేదు గాని దేవుని దృష్టి మాత్రము మనిషిని రక్షించుటే. 'నన్ను వెంబడించుడి' అని యేసు ప్రభువు శిష్యులతో అన్నారు. నేడును యేసుప్రభువు 'పాపీ! నన్ను వెంబడించు మనుచుండెను. పాపి– బంధకములు, తీర్పు, మరణములో ఉండగా ప్రభువు పాపివద్దకు వెళ్లెను. కోతిపిల్లశవము తల్లిని పిలువలేదుగాని కోతి తనంతట తానే వెళ్లెను. యేసుప్రభువునకు కూడా ఆలాగు మనిషి కోసము వెళ్ళినది నిజము. నశించిపోయిన మనిషి వద్దకు వెళ్ళి రక్షించినది నిజము. పాపికూడ యేసుప్రభువు తనవద్దకు వచ్చెనని సంతోషించుచున్నాడు గనుక యేసుప్రభువు– ***'పాపీ! నీవు ఊరుకో! నేను నిన్ను రక్షిస్తాను' అనుచున్నారు.*** ఇది దేవుని అనంత ప్రేమయై ఉన్నది. గనుకనే నశించిపోయిన మానవుని శరీరాత్మలను వెదకి రక్షించెను, తన తనువును సిలువపై చాలించెను.

అట్టి నిండైన దేవుని ప్రేమ ఈ శ్రమకాలమంతయు మిమ్ములను ఆవరించుకొని, ఆయన అనంత ప్రేమలో ఓలలాడించును గాక. ఆమేన్.

***కీర్తన:*** "తనువు బలిపెట్టెను మా యన్న – తప్పు ల్విడగొట్టెను మా తండ్రి=
మనసులో సాక్ష్యమిట్లున్న – మనుజు లెట్లన్నను మాకేమి' ॥యెహోవా॥

# లెంటులోని ముప్పది రెండవ దినము - గురువారము

## మహా ప్రార్థన దినము

మత్త. 26:36-46; మార్కు 14:32-42 లూకా 22:39-46; యోహాను 18:1.



**ప్రార్థన:- తండ్రీ! మానవ మాత్రునిగా గెత్సేమనె తోటలో నీవు పడిన శ్రమ, వేదన మా జ్ఞానమునకు అందదు. మా అందరి నిమిత్తము నాడు నీవు చేసిన ప్రార్థనే నేటివరకు మమ్ములను విమోచించుచున్నది, బలపర్చుచున్నది, నడిపించుచున్నది గనుక నీకు వందనములు. అట్టి నీ ప్రార్థనానుభవము మాకును కలుగుటకు నేటి దిన వర్తమానమిమ్మని యేసు నామమున అడుగుచున్నాను తండ్రీ ఆమేన్.**

ప్రభువు గెత్సేమనే తోట వెలుపల ఎనిమిదిమంది శిష్యులను ఉంచిరి, తోటలోపలకి ముగ్గురిని మాత్రము తీసికొని వెళ్ళెను. ఈ ముగ్గురి యొద్దనుండి రాతివేత దూరమువెళ్ళి అక్కడ ప్రార్థనలో నుండెను. ఆ మహాప్రార్థన దినము మూడు ఏర్పాటు ప్రార్థన స్థలములు గలవు. అచ్చట ఆయన **1.** (i) చింతించుటకును, (ii) దుఃఖపడుటకును, (iii) విభ్రాంతి పడుటకును, (iv) వేదనపడుటకును, (v) అతురపడుటకు - దుఃఖసముద్రములో మునిగిపోవుటకును ఆరంభించెను. యేసుప్రభువు వెలుపలనున్న శిష్యులతో 'నేను ప్రార్థనకు వెళ్ళుచున్నాను. మీరిక్కడ ఉండుడని' మాత్రము చెప్పెను. తోటలోపలనున్న ముగ్గురితో మాత్రము తన హృదయంలోని దుఃఖమును మాటలతో కాక దుఃఖచర్యలతో చూపించెను. ఆ తోటలోని చర్యలన్ని చూడగా నేమి కనిపించు చున్నది. యేసుప్రభువు తన దైవత్వమును మరుగుచేసి కేవలము మనుష్యత్వముతోనే ఉండి, మనుష్యత్వముతోనే తోటలో ప్రవేశించెను. మనుష్యునివలెనే మాట్లాడెను. మనిషి అడిగినట్లుగానే అడిగెను, మనిషివలె దుఃఖపడెను. మనుష్యునివలె సాగిలపడెను. మనుష్యునివలె ప్రార్థించెను. మనిషివలె మనిషి జతకోరెను. ఈ చర్యలన్నియు మనుష్యుని చర్యలే. దైవత్వమెక్కడను కనబడదు. ఒకరు కష్టమైన పని చేయునపుడు పై వస్త్రము తీసి ఒకచోట ఉంచి పనిచేయునట్లు యేసుప్రభువు తన దైవత్వమును ఒక మూలపెట్టి కేవలము మనుష్యత్వముతోనే గెత్సేమనే తోటలో ప్రవేశించి ప్రార్థించెను.

**2.** ప్రభువు తన వేదన దేవదూతలకు చెప్పుకొనలేదు. మనుష్యులకు చెప్పుకొనెను. ఇది కేవలము మనుష్యత్వమును వాడుకొనుట. మానవుల యెడల ఆయనకెంత గౌరవము. వారివలన ఆదరణ కలుగక పోయినప్పటికిని వారితో సంభాషించుటవలన వారియెడల కనపరచినది ఎంత ప్రేమ! ఎంత గౌరవము! ఎంత చనువు! తోటలో ఆయన మనిషి సహాయము కోరుకొనెను. ఒక ఇంటిలో అందరు వెళ్ళిపోయిరి. ఒక్కరు మాత్రము ఉన్నారు. పెంపుడుపిల్లి, కుక్క, ఇంటిలో ఉన్నప్పటికిని ఇంకొక మనిషి ఉన్నట్టుండునా?

చిన్నవారైన ఉన్నయెడల బాగుండుననిపించును. ఎలాగైనను మనిషికి మనిషే జత. జంతువునకు జంతువే జత. తోటలో నున్న ముగ్గురు శిష్యులైనా మెళుకువగా లేరు. నిద్రమీద ఉన్నారు. అయినను ప్రభువువారిని లేపి పలుకరించుచుండెను. ఇంతగా ఆయన మనిషి జత కోరుకొనెను.

**3.** ప్రభువు యొక్క వేదన తెలుపునట్టి మాటలు చూడగా మానవులు దుఃఖించు దుఃఖము యొక్క వర్ణన కనబడుచున్నది. ఆ మాటలు దుఃఖము యొక్క అంతస్తును తెలియజేయుచున్నవి. మనముకూడ ఎక్కువ దుఃఖ సమయమందు కొంతసేపు చింతతోను మరికొంతసేపు చాల దుఃఖముతోను ఇంకా కొంతసేపు హడలిపోవుచు తుదకు దుఃఖసముద్రంలో మునిగి పోవునట్లుందుము. ప్రభువు యొక్క వేదన కూడ గడియ గడియకు హెచ్చుగునట్లు కనబడుచున్నది.

**4.** ప్రభువు దైవత్వముతో నున్నయెడల దుఃఖించుటకు వీలులేదు. దుఃఖబాధ అనుభవించుటకు వీలులేదు. ఎందుచేతననగా లోకములోని వారేమందురు? దేవుడు గనుక దుఃఖము అనుభవించగలిగినాడందురు ఆయన దైవత్వము కలిగి దుఃఖసముద్రము అనుభవించలేదు కేవలం మనుష్యత్వముతోనే అనుభవించెను. అందులోనే గొప్పతనమున్నది. దైవత్వ సహాయము వల్ల దుఃఖమనుభవించిన గొప్పతనమేమున్నది. దైవత్వముంటే మామూలు మనిషి కూడ అనుభవించగలడు. అనగా మనము కూడ అట్టి దుఃఖము అనుభవించగలము. దైవత్వ సహాయముతో కాక పూర్తిగా మనిషివలెనె ప్రభువు గెత్సేమనెలో దుఃఖపడెను.

**5.** విశ్వాసులు రెండు భాగములుగా నున్నారు. గెత్సేమనేలో తోటలోపల ఉన్నవారు (ముగ్గురు శిష్యులు మాత్రమే) వెలుపల ఉన్నవారు (ఎనిమిదిమంది) యేసుప్రభువు తన హృదయరహస్యము వెలుపలఉన్నవారికి చెప్పలేదు. 'నేనక్కడికి వెళ్ళి ప్రార్ధన చేసి వచ్చువరకు మీరిక్కడ కూర్చుండుడని' (మత్తయి 26:36) మాత్రం చెప్పెను. అయితే లోపలనున్నవారికి తన హృదయ రహస్యము చెప్పెను. "నా ప్రాణము...నాతో కూడ మెళకువగా నుండుడి" మత్తయి 26:37,38 విశ్వాసులు కూడ ప్రభువుతో ప్రత్యేక సహవాసము కలిగి యుండవలెను. అట్టివారికి ప్రభువు యొక్క హృదయ రహస్యములు తెలియును. వారే పెండ్లికుమార్తె వరుసలో నుందురు.

**6.** ప్రభువు తోటలోపల ఉన్న ముగ్గురు శిష్యులతో చెప్పిన మాటలు : మెళుకువగానుండండి. ప్రార్ధన చేయండి, ప్రార్ధన ఎట్లు చేయవలెనో ప్రభువు వారికి చెప్పలేదు. ప్రార్ధన చేయండి అని యేసుప్రభువు ముభావముగ చెప్పి వెళ్ళిపోయెను. అయితే ముమ్మారు ఆయన వచ్చి చూచిన శిష్యులు నిద్రమీదనే యుండిరి. నిద్రపోవుదురని ప్రభువుకు తెలిసినను వారినే ప్రభువు ప్రార్ధించమని కోరెను. సంఘము యొక్క స్థితి కూడ నేడు అలాగే యున్నది. నామకార్ధమైన ప్రార్ధన, పట్టింపులేని ప్రార్ధన, నిరీక్షణ లేని

ప్రార్ధన, ఆత్మ ఏకీభవించని పెదవుల ప్రార్ధన, త్వరగా ముగించవలెనని చేయునట్టి బద్ధకమునకు సంబంధించిన ప్రార్ధన, ప్రార్ధనాంశములు కొన్ని మరచి కొన్ని మాత్రమే చేయునట్టి ప్రార్ధన– ఇవన్ని కలసి నిద్ర అని పేరుపొందును. శరీర నిద్ర కంటె ఈ నిద్ర కీడుగల నిద్ర. శరీర నిద్ర కూడా ఆ సమయమందు కీడుగల నిద్రయై యున్నది.

**7.** ఈ ముగ్గురు శిష్యులును సేవలోనికి పిలువబడక ముందు చేపలు పట్టుటకు రాత్రి అంతయు నిద్రమాని వేసిరి. గాని ఇక్కడ ఒక గంట నిద్ర మానలేకపోయిరి. ఇది అందరకు మెళుకువ చెప్పు పాఠము.

**8.** ప్రార్ధన: 1. ప్రార్ధన లోకముయొక్క ఎడబాపుమీద ఆనుకొనియున్నది. 2. ప్రార్ధన మీ తత్వము మీద ఆనుకొనియున్నది. 3. మీ తీవ్రత మీద ఆనుకొనియున్నది. 4. దేవుని చిత్తము అని ఆనడము మీద ఆనుకొని యున్నది. 1. యెరూషలేమునకు గెత్సేమనే ద్వారమునకును కొంతదూరము ఉన్నది. ఆ దూరము చాలదు. 2 తోట వెలుపల నున్న శిష్యులకును, లోపల ఉన్న శిష్యులకును కొంత ఎడమున్నది. అది చాలదు. 3. లోపలనున్న శిష్యులకును ప్రభువునకును రాతివేత దూరమున్నది. అంత ఎడముగా నుండవలెను. 4. ప్రభువు ప్రార్ధన చేయుటకు యెరూషలేము విడిచినట్లు మనమును లోకస్థులను విడిచి ఏకాంత ప్రార్ధనకు వెళ్ళవలెను. 5. ప్రియులయిన శిష్యులను ఎనమండుగురిని విడిచి ఏకాంత ప్రార్ధనకు వెళ్ళవలెను. అలాగే మనమును మన ప్రియులను విడిచి ఏకాంత ప్రార్ధనకు వెళ్ళవలెను. 6. ప్రభువు తనకు అట్లే మనమును అతిప్రియులను కూడ విడిచిపెట్టవలెను. అపుడు గొప్ప ప్రార్ధన స్థలము ఏర్పడును. గొప్ప ప్రార్ధన జరుగును. గొప్ప ప్రార్ధనాపరుడు తయారుగును. గొప్ప ప్రార్ధన తీవ్రత వచ్చును.

అట్టి స్థితిలో పెండ్లికుమారుడైన క్రీస్తు ప్రభువు మిమ్ములను స్థిరపర్చును గాక. ఆమేన్.

యేసుప్రభువా! మేము పరలోకమునకు వచ్చువరకు బహు మెళుకువగ నుండు స్థితి అనుగ్రహించుము. మేము పరలోకమునకు వచ్చువరకు ప్రార్ధనలో నుండు శ్రద్ధ అనుగ్రహించుము. మేము పరలోకమునకు వచ్చువరకు శోధనలో పడకుండ జాగ్రత్తగ నుండు స్థితి అనుగ్రహించుము మేము పరలోకము వచ్చువరకు నీతో కలసి సహవాస ప్రార్ధనలో ఏకీభవించు ఏకీభావము అనుగ్రహించుము. మేము పరలోకమునకు వచ్చు వరకు అశ్రద్ధ అను కునుకుపాట్లు రాకుండ మా కన్నులను కాపాడుము. మేము పరలోకమునకు వచ్చువరకు "మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెళుకువగా నుండి ప్రార్ధన చేయండి" అను ***ఈ నీ గద్దింపు మాట, ఈ జాగరూకత వాక్యము ఈ వజ్రవాక్యము జ్ఞాపకముంచుకొను*** శక్తి దయచేయుము. ఆమేన్.

***కీర్తన:*** "*ఒక తోట లోపట – నాడు నీవు పడిన – సకల శ్రమ లిచ్చోట=నికటమై*
*యున్నట్లుగా – నిట్టూర్పులతో – దలంతు – నకట నా రాతి గుండె–*
*శకలంబై పోవునట్లు* *॥నా యన్న రాగదే॥*

# లెంటులోని ముప్పది మూడవ దినము - శుక్రవారము

## ఏడు మాటల ధ్యానము - మొదటి మాట వివరము

లూకా 23:34;



ప్రార్థన:- యేసుప్రభువా! నీవు సిలువమీద పలికిన మాటలు సిలువమీదనే ఉండిపోలేదు. అవి సంఘములోనికి వచ్చినవి. సంఘములో మేము ఉన్నాము. దూరము నుండి వచ్చిన పార్శిల్ విప్పి దానిలో ఏయే సామానులు ఉన్నవో మేము చూస్తాము. అట్లే నీ సిలువ మీదనుండి మాయొద్దకు వచ్చిన పలుకులు విడదీసి చూడగోరుచున్నాము. ఆ పలుకుల అంతర్భాగమందున్న మాటలు మా సంతోషము నిమిత్తమై వినిపించుము. అక్కడ ఉన్న అందరికి నీ మాటలు వినబడినట్లుగా, ఇక్కడున్న అందరికిని ఆ నీ మాటలు వినబడేటట్లు చేయుమని నీ ఘన నామమునుబట్టి వేడుకొనుచున్నాము. ఓ యేసుప్రభువా! నీ శ్రమలవల్ల మా శ్రమలకు ఎన్ని గొప్ప ఆశీర్వాదములు కలిగినవో, అవి మాకు చూపించేవరకు ఈ శ్రమకాలములో నీ శ్రమ చరిత్ర బోధిస్తు ఉండుమని నీ ఘననామమును బట్టి వేడుకొనుచున్నాము. సిలువమీద నుండి సంఘముమీదికివచ్చే మరణశ్రమ మహిమకిరణములు ఈ ఆరాధనలోకూడ అందరిలో ప్రవేశపెట్టుమని నీ మహిమ నామమునుబట్టి వేడుకొనుచున్నాము. ఆమేన్.

యేసుప్రభువు తండ్రిని అడుగకముందు, తానే వారిని క్షమించివేసినాడు. ఆలాగు క్షమించని యెడల 'తండ్రీ! క్షమించుమని' అడుగడు. తనను హింసించుచున్న వారియెడల పగ, కోపమున్న యెడల; వారికి శిక్ష కోరుకున్న యెడల ఆ ప్రార్థన చేయడు.

**1. తండ్రి: –** ఇక ముందుకు తండ్రి కుడిపార్శ్వమున కూర్చుని విజ్ఞాపన చేయవలెను గనుక దానికి ముందుగానే ఇప్పుడు ప్రభువు విజ్ఞాపన చేయుచున్నారు. ఇకముందుకు సింహాసనము (దగ్గర) ఉండి విజ్ఞాపన చేస్తారు. ఇప్పుడైతే సిలువ సింహాసనము మీదనుండి విజ్ఞాపన చేయుచున్నారు. ***విజ్ఞాపన ప్రార్థన అనగా మనము ఇతరుల కొరకు చేయు ప్రార్థన.*** మన కొరకు చేయునది విజ్ఞాపన ప్రార్థన కాదు. ఇతరులను గూర్చి విజ్ఞాపన చేయునప్పుడు మనసులో పగ, ఆయాసము ఉంచుకొనరాదు. ప్రతి రోజు మనలను గూర్చిన ప్రార్థన చేసినా, అది అర్థ ప్రార్థనే గాని, ఇతరులను గూర్చి మనము చేసినది సంపూర్ణ ప్రార్థన. వీరేమి చేయుచున్నారో వీరెరుగరు. ఇందులో 3 పాటములున్నవి. మీరు శ్రమ రాగానే మూలుగుచుందురు. అప్పుడు పొరుగూరునుండి ఎవరైనా వచ్చి, 'ప్రార్థించండి' అంటే విసుగుదల ఉండును గనుక తరువాత చేస్తాము అంటారు గాని అప్పుడే చేయరు. అయితే, ప్రభువు సిలువపై గొప్ప బాధలో రక్తము కారుచు, 'తండ్రీ! క్షమించుమని ప్రార్థించెను'. అది మనవల్ల కాదు. అది మన నోటికి రాదు. మన

Bible Mission HQ Guntur

బాధను గూర్చి మనము ప్రార్థన చేసికొనునప్పుడు, మన ప్రార్థన చెడగొట్టుటకు ఆ బాధ వచ్చెనని అందుము. అది మనిషి నైజము. సిలువపైనున్న మనిషికి మనుష్యుల నైజము లేదు. అదే తేడా! విసుగుకుంటే ఏమి జరుగుననగా; గెత్సేమనే తోటలో ప్రభువును నిన్నటి రాత్రి పట్టుకొనుటకు వచ్చిన రౌడీలను చూచి, మీరెవరిని వెదుకుచున్నారని ఆయన అడుగుటతోనే రౌడీలంతా నేలబడిరి. ఇప్పుడు ప్రభువు విసుగుకుంటే ఆలాగే జరుగును. అనగా ఆలాగు ప్రభువు విసుగుకొనగా వారంతా బోర్లపడితే, తక్కిన ఆరు మాటలు పలుకుటకు వీలులేక పోవును. ఈ తక్కిన ఆరు మాటలుకూడ నరజన్మము యొక్క రక్షణ మాటలే, ఏ మాటలు తీసివేయుటకు వీలులేదు. ఏడు రోజులలో ఏ రోజైనా తీసివేస్తారా? ఆదివారము మొదలు శనివారము వరకు, ఏ రోజు తీసివేయుటకు వీలులేదు. ఏ రోజైనా ప్రాముఖ్యమే, ఉపయోగమే. వారములో ఏ రోజు లేకపోయినా, అది వారము కాదు. పరిశుద్ధ వారములోని ఏడు రోజులలో ఏ రోజు తీసివేసినా, అది సంపూర్ణము కాదు. ఆలాగే ప్రభువు ప్రార్థనలో ఏడు మనవులున్నవి. అందులోని ఏ మనవి తీసివేసినా, అది ప్రభువు ప్రార్థనకాదు. ప్రకటనలో 7 సంఘములున్నవి. ఒక్క సంఘము తీసివేస్తే తక్కిన 6 సంఘములును పోవును గనుక తీసివేయుటకు వీలులేదు. ఇప్పుడు ప్రభువు ఒక్క మాటలో 4 పాఠములు చెప్పెను. మరొక సంగతి: 'వారేమి చేయుచున్నారో అది వారికి బాగా తెలుసును గాని ప్రభువు వీరికేమి తెలియదన్నారు. అదేమి భాష! ఏమి మాట! ఏమంత సబబుగా ఉన్నది. మన దృష్టిలో సబబుగా లేదు. **ఉదా:-** ఒక అబ్బాయి పరాయి కుర్రవానిని మెత్తగా కొట్టి పారిపోయి, తన తల్లి దగ్గరకు వచ్చెను. వాడు వీడిని కొట్టుటకు వచ్చుచుండగా, "బాబూ! నా కుర్రవానికేమీ తెలియదని తల్లి అడ్డు వెళ్లెను". కుర్రవానికి తెలియదా? తల్లి ఎందుకు అడ్డు వెళ్లెననగా తన పిల్లవానిని ఆ కుర్రవాడు కొడతాడని అడ్డువెళ్లెను.

మనిషిలో ఒకటున్నది. అది తనకు తెలియడము. దానికి మంచిమాట స్పర్శ జ్ఞానము. ఈ కుర్రవాడు అవతల వానిని కొట్టినప్పుడు వానికి బాధ కలిగినదని వీనికి లేదు, విచారములేదు. ఇతని విచార లక్షణానికి అది తెలియ లేదు. సృష్టిలోనే దేవుడు మనిషికి విచార లక్షణము పెట్టలేదా? పెట్టినాడు కదా! తల్లి చనిపోతే ఏడవడా? ఆ ఏడ్చిన పెద్ద మనిషికి, అవతల వానికి బాధ అని తెలియదా? గనుక కొట్టినప్పుడు బాధ అని జ్ఞాన లక్షణానికి తెలుసునుగాని విచార లక్షణానికి తెలియదు. అలాగైతే ప్రభువును హింసించే వారందరు- అయ్యో! మేము కొట్టినందువల్ల నీకు రక్తము కారుతుందని, వారి విచార లక్షణానికి తెలిసిన ఏడ్చేయుందురు. తెలియలేదు గనుక ఏడ్వలేదు. వారికి తెలియలేదు గనుక ప్రభువు 'వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదన్నారు. వారికి తెలియలేదు అనగా-

ఇంగ్లీషులో వారి ఫీలింగ్‌నకు (మనోభావమునకు) తెలియలేదు గాని తెలివికి తెలిసినది. గనుక ప్రభువు- తండ్రీ! వీరేమి చేయునది ఎరుగరనెను.

మన క్రైస్తవులను హేళనచేయు ఇతరులు అనగా అన్యులు చాలామంది ఉన్నారు. వారిని గురించి మనము ప్రార్థించునప్పుడు, 'ప్రభువా! వారికేమి తెలియదు వారిని క్షమించుము' అని మనము కూడ చేయాలి. యేసుప్రభువే గనుక 'తండ్రీ! శిక్షించు' అని అంటే అందరు ఒక్కసారే భస్మమై పోవుదురు గాని ఆయన శిక్షించుటకు రాలేదు, రక్షించుటకే వచ్చెను. పూర్వకాలమున హేబెలుయొక్క రక్తము దేవుని దగ్గరేమని మొఱ్ఱపెట్టినది? 'మా అన్న నన్ను చంపివేసెను నీవు శిక్షించు' అని మొఱ్ఱపెట్టెను. ప్రభువు యొక్క రక్తమాలాగు కాదు. 'వారిని క్షమించుము వారికేమి తెలియదు' అని విజ్ఞాపన చేసెను. పౌలు- హేబెలు రక్త స్వరము మరియు ప్రభువు రక్త స్వరము అను రెండు రక్త స్వరముల గురించి వ్రాసెను.

I కొరింథి 2:8 ప్రకారము మనము మంచి పనిచేస్తే, ఎవరికి మహిమ అనగా దేవునికి మహిమ గాని పౌలు ఏమి వ్రాసెననగా: మనము మంచిపని చేస్తే, దేవుడు మనకు ఉపకారము చేస్తే; ఆయన మహిమ నిమిత్తమును, మన మహిమ నిమిత్తమును అని వ్రాసెను. ఇన్నాళ్లనుండి దేవునికి మహిమ అనుకొన్నాము. పౌలు క్రొత్త సంగతి చెప్పెను **దేవుని ఉపకారము వల్ల మనకును మహిమ.** దేవుని జ్ఞానము మర్మముగా యున్నది. మనిషికి తెలిసినా, తెలియదన్నారు. యేసుప్రభువు దేవుడే. దేవుడే కాకపోతే తండ్రీ! అనడు. వట్టి నరుడే *అయితే ఓ దేవా! అంటాడే గాని తండ్రీ!* అనడు. నా దేవా! నా దేవా! అని పలికినప్పుడు దైవత్వము వదలి మనుష్యత్వములోనికి వచ్చి పలికెను.

**రెండు వరుసలు:** యేసుప్రభువు మనుష్యుల లైనులోనికి వస్తే వారిని 'క్షమించుమని' అనడు. దైవత్వములోనికి వదిగెను గనుక 'తండ్రీ!' అన్నాడు, 'క్షమించుము' అని అన్నాడు. మనుష్యులతో తండ్రిని గూర్చి మాట్లాడునప్పుడు, తండ్రీ! అని అనలేదు గాని 'మీ తండ్రి' అని అన్నాడు. 'పరలోకమందున్న మీ తండ్రి సంపూర్ణుడై యున్నట్లు, మీరును సంపూర్ణులై యుండుడి' అని ప్రభువే చెప్పెను గనుక **మనకు కావలసినవి తండ్రికి తెలుసును.** మత్తయి 5:45. పరలోకమందున్న మీ తండ్రి సంపూర్ణుడు గనుక మీరును సంపూర్ణులై యుండుడి. మనిషికి కూడా కొన్ని వరుసలున్నవి. ఒక వ్యక్తి- ఒకరికి అన్న, ఒకరికి పినతండ్రి, ఒకరికి మేనమామ అగును. ఆలాగే ప్రభువు దైవ వరుసలోను, మనిషి వరుసలోను ఉన్నాడు. గనుక ఆయన అద్భుతములన్నీ అలాగే ఉన్నవి.

ఆదికాల దినములు ఏడు, ఏడు గడువుదినములు, ఏడు నమస్కారములుగల సమయములు, ఏడు మాటలు, ఏడు సిలువలు అదే మన పాఠము. ఏడు సంఘములు, పరలోకములో ఏడు తరగతులు. ధ్యానపరులైన ఆనంద వ్యక్తులారా! మీకు శుభము.

ప్రభువుయొక్క శ్రమలు ఆయనకు శ్రమలుగాని మనకైతే ఆదరణ కలిగించే అంశములు. కాబట్టి మనము దుఃఖించుటకన్నా, స్తుతించుటవలన ఆయనను సంతోషపరచ గలము.

**ఏడు దినములు: 1.** అవి సృష్టి కాల ఏడు దినములు అనగా ఆరు దినములు చేసిన సృష్టిని, ఏడవ దినము విశ్రాంతిని కలుపుకొని. **2.** ఏడు గడువులు బైబిలులో ఉన్నవి. మొదటి ఏడు మహా సంతోషకరమైన ఏడు. రెండవ ఏడు సిద్ధపడవలసిన ఏడు నోవహుయొక్క ఓడలోనికి సిద్ధపడవలసిన ఏడు దినములు. **3.** తరువాత ఏశావుయొక్క శత్రుత్వమును తప్పించుకొనుటకు యాకోబు పన్నిన పన్నాగములలో తుదకు 7 పర్యాయములు వంగి చేసిన నమస్కారములు. **4.** క్రొత్త నిబంధనలోనికి వచ్చినట్లైతే యేసుప్రభువుయొక్క ముఖ్యమైన సేవ దినములు లెక్కచూడగా ఏడేసి భాగములు ఉన్నవి. సేవకాలము 3సం॥ల 6 మాసములు. ఈ మూడు సం॥లను అనగా 36మాసములు+6మాసములు కలిపితే 42మాసములు. ఈ 42 మాసములను బాగిస్తే ఆరు ఏళ్ళు వచ్చును. ఆ ఏడును సేవ గనుక శ్రమకాలము. **5.** మూడు సిలువలు ప్రభువు మోసెనని ఇప్పుడు మనము పాడుకొన్నాము. 1) పాపములు 2) నేరములు 3) కర్ర సిలువ. లేనిపోని నేరములు పోగుచేసి జడ్జికి చెప్పినారు. ఇది ఒక సిలువ. ఆ తరువాత ఏడు సిలువలు. ఈ ఏడు సిలువలు మన పాఠము.

యేసుప్రభువు సిలువపై పలికిన 7 మాటలు ఆయనకు ఏడు సిలువలే. అవి ఏలాగు సిలువలో పరీక్షించుటకు ఈ సాయంకాలము మొదటి మాట పరీక్షించుదము. మొదటి మాట ఏదంటే 'తండ్రీ వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు గనుక వీరిని క్షమించుము'. గెత్సేమనేతోట దగ్గరనుండి పాతిపెట్టిన సిలువమీద నుండి పైకెత్తబడేటంత వరకు; యూదులు ఆయనను పెట్టిన శ్రమలు, అవమానములు, నేరములు; ఇవన్నియు ఆయన శరీరమునకు కలిగిన గాయములు. ఆయనకు మేకుల పోట్లకంటే, బల్లెపు పోటుకంటే, ముండ్ల కిరీటములోని ఇనుప మేకుల పోట్లకంటే, వారుచేసిన దౌర్జన్యమే ఎక్కువ బాధ. సిలువమీదనున్నా, అది బాధయేగాని ఇది మరి ఎక్కువైన బాధ. వారిని క్షమించుమని పలుకుట నరజన్మమునకు తగునా? అయినప్పటికిని క్షమించుమని క్రీస్తు ప్రభువు పలికెను. ఆయనకు కలిగిన శ్రమలు ఎన్ని అనగా; ***ఆయన జీవిత కాలమంతయు నిరాకరించబడుట, ద్వేషభావము అనుభవించారు.*** ఈ రెండును శ్రమలే కాని ***'క్షమించు మనుట'*** అంతకంటే శ్రమ. మనిషి నోటిగుండా ఆ మాట రాదు, ఇష్టముండదు. **'కాని క్షమించుము'** అని ప్రభువు అనెను. ఆయన ఎంత దేవుడైనను మనిషి అయినాడు గనుక క్షమించుమని అనకూడదు. శరీరము నొప్పుతుంది, మనస్సు అవమానమువల్ల నొప్పుతుంది. అయినను ఆ నొప్పి సహించుకొని

క్షమించుమని అన్నాడు. **ఉదా:-** ఒకసారి అయ్యగారు బడిలో ఉండగా ఇద్దరు పిల్లలు పోట్లాడుకొని వచ్చారు. ఒకడు రెండవవానిని మెత్తగా కొట్టాడు. ఇతడు అయ్యగారికి రిపోర్టు చేసాడు. ఆ రిపోర్టులో క్షమించుమనియా? లేక శిక్షించుమనియా? ఇద్దరు రాగానే రెండవవానిదే ఎక్కువ నేరమని తెలిసికొన్నారు. అప్పుడు అయ్యగారు మొదటి అబ్బాయితో- అతనిది నేరమే అయినను, ఆ అబ్బాయిని క్షమించుమనగానే; అది అతనికి ఎంత కష్టమైనదో, అతని ముఖములోనే కనబడినది. దెబ్బలు తిన్నవానికి బెత్తమిచ్చి రెండు దెబ్బలు కొట్టమంటే సంతోషముగాని క్షమించుమంటే సంతోషమా! తిన్నదెబ్బలకంటే, క్షమించుమనేదే ఆ అబ్బాయికి ఎక్కువ బాధగానుండెను. ఆలాగు క్షమించుమంటే ఇక్కడనున్న వారిలోకూడ సణుగులు, గొణుగులు బైలుదేరును. సిలువమీద ప్రభువు ఆలాగే క్షమించుమనప్పుడు, ఆయన ఎంతగా క్షమించినారో వర్ణించలేము. అయితే ఆయనకది బాధకాదా? ఇక్కడున్న వారిలో ఎవరికి ఎవరెవరు శత్రువులున్నారో, వారందరి దగ్గరకు వెళ్లి తలుపులు తట్టి వారిని లేపి, వారు నిద్ర కళ్లతో వస్తుండగా అయ్యా! నేను మిమ్ములను క్షమించినాను! అని అనగలరా? బాధ! అనలేరు. ఆ బాధే సిలువ. ఆ సిలువ ప్రభువు గనుక మోసినారు. మనము మోయలేము. ***ఆయన వారిని ఆ వేళ క్షమించకపోతే ఈ వేళ మనలనుకూడ క్షమించలేరు.*** ఆయన సిలువ మ్రాను మీదికి రాకముందే బోధలో ఐదు అంశములు పెట్టిరి.

1. మీ శత్రువులను ప్రేమించుడి; అదెక్కడ వల్లపడుతుంది మనకు!!
2. మీ శత్రువులకు మేలు చేయండి; ఇది కుదిరే పనేనా!
3. మీ శత్రువులను దీవించండి; ఇది అసలే వల్లపడదు.
4. వారికొరకు ప్రార్థించండి; ఈ నాలుగు కష్టమే.
5. లూకా. 6:27,28. తక్కిన సువార్తలలోను 'క్షమించండి' అని గలదు.

ఈ 5 ఏ క్రైస్తవుడు చేయగలడు? క్రైస్తవులందరు ఈ 5 చేయకపోయినా, ఒకటి చేస్తున్నారు. మా ఋణస్థులను మేము క్షమించిన ప్రకారము, మా ఋణములు క్షమించుమని అంటున్నారు గాని యేసుక్రీస్తు చెప్పిన పై ఐదు అంశములు చేయకపోతే ప్రయోజనమేమి? పై నాలుగు చేయరుగాని ఐదవది మాటతో చేస్తున్నారు. గాన అది బూడిదలో పోసిన పన్నీరే. ***ఈ 7 వాక్యములలో క్రీస్తుయొక్క మనుష్యత్వము, దైవత్వము రెండు వెలుగు స్థంభములుగా సిలువమీద నుండి సింహాసనము వరకు వెళ్లినవి.***

1) తండ్రి, 2) వీరు, 3) ఏమి చేస్తున్నారో, 4) వీరెరుగరు, 5) క్షమించుము. 331/2 సం॥లు శ్రమ సహించుట ఒక ఎత్తు. హెబ్రీ. 5:7లో మహా రోదనము అని ఉన్నది. అనగా ఈ రోదనశ్రమలన్నీ ఒక ఎత్తు; క్షమించుమనే మాటలోని శ్రమ ఒక ఎత్తు. మీకు హానిచేసిన వారిని ఎప్పుడు క్షమిస్తారో, అప్పుడు మీకు జయము. శత్రువులకు అపజయము.

**ధ్యానము:–** కుడిప్రక్కనున్న మంచి సంగతులు మరచి పోవలెను. ఎడమ ప్రక్కనున్న చెడ్డవికూడ మరచిపోవలెను. మధ్యను కల్వరికొండపైనున్న రక్షకుని మాత్రమే జ్ఞాపకము తెచ్చుకొనవలెను. మనో నేత్రములతో చూడండి. ప్రభువు సిలువమీద పలికిన 7 మాటలు ఆలోచిద్దాము. ఒక్కొక్క రోజు ఒక్కొక్కమాట ధ్యానిద్దాము. ఈ వేళ క్షమాపణనుగూర్చి ఆలోచించెదము. ఇతర తలంపులు రాకమానవు, అయినను వాటిని పారద్రోలండి. యేసుప్రభువును మాత్రము తలంచండి. ఆయన బాధలు తలంచవద్దు. సిలువను తలంచుకొనవలెను. ఆయన పలికిన మాట మాత్రమే తలంచుచు, తండ్రీ! 'వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము.' ఈ మాటను జ్ఞాపకము చేసుకొందాము. ***సూర్యునిలో 7 రంగులున్నవి. అలాగే నీతి సూర్యుడైన క్రీస్తులోనుండి 7 రంగులుగల 7 మాటలు బయలుదేరినవి.*** ఒక్కొక్క మాటకు ఒక్కొక్క రంగు. సూర్యుని యొక్క కిరణములు భూమిమీద పడుచున్నవి. అట్లే ప్రభువుయొక్క మాటనుంచి 7 రంగులుగల మాటలు అనెడి కిరణములు విశ్వాసులమీద పడుచున్నవి.

**ప్రార్థన:–** యేసుప్రభువా! నీవు మాకు బదులుగా వచ్చినందున దేవా! అని పిలువలేదు, తండ్రీ! అని పిలిచినావు. ఈ మాటలో నీకు గల గొప్ప పరిచయము కనబడుచున్నది. అట్టి పరిచయము, తండ్రీ! అని పిలిచే పరిచయము లేనియెడల, శత్రువులను క్షమించుమనునట్టి ప్రార్థన రాదు. తండ్రీ! అంటేనే, క్షమాపణ ప్రార్థన చేయవీలున్నది. ఎందుకనగా తండ్రి క్షమించువాడు. మనుష్యులు క్షమించగలరు గాని, పూర్తిగా తండ్రే క్షమించగలడు. యేసుప్రభువా! మేముకూడా మా శత్రువులను క్షమించుమని ప్రార్థించే చనువు మాకు దయచేయుము. 'తండ్రీ! నీ కుమారుడు ప్రార్థించిన ప్రార్థన, మాకును వచ్చునట్లు చేయండి' అని ప్రార్థన చేయండి. దైవశక్తి ఉంటేనేగాని క్షమించలేము. రక్తము కారేటప్పుడు ఎవరు అట్లు ప్రార్థింపగలరు? దైవశక్తియుంటేనేగాని ఆలాగు చేయలేరు. ఓ తండ్రీ! మా శత్రువులను క్షమించుటకు మాకు దైవశక్తి దయచేయుము. ***క్షమించే శక్తియు, క్షమించుమని ప్రార్థించే శక్తియు దయచేయుము.*** ఈ రెండు శక్తుల కొరకు ఇప్పుడు యేసు పలికిన ఈ మాటలలో మొదటిది ధ్యానించెదము:

1) తండ్రీ!= ఇది మిక్కిలి చనువుగా పలికే మాట; 2) వీరు = శత్రువులు; 3) ఏమి చేయుచున్నారో= హింసకార్యములెరుగరు; 4) వీరెరుగరు= జ్ఞానమునకు తెలియును, ఆత్మకు తెలియదు; 5) గనుక = క్షమాపణ; 6) వీరిని = హింసించుచున్న వారిని; 7) క్షమించుము = గొప్ప మనవి. ఇది దైవశక్తి.

తండ్రి, వారిని క్షమించునని ఆయన నిరీక్షించినాడు. అందుచేతనే 70 సం॥ల వరకు యెరూషలేము నాశనముకాకుండ ఉన్నది. క్షమాపణ స్థితిలో, కృప పొందిన స్థితిలో ఉన్నది. ఈ ఒక్క ప్రార్థనలో 7 రంగులున్నవి. 7 సంగతులున్నవి. యేసుప్రభువా!

నీవు క్షమాపణ ప్రార్థన చేసినావు. అందులో 7 సంగతులు కనిపెట్టినాము గనుక నీకు వందనములు.

1) ఊహకైనా
2) దర్శనముకైనా
3) మనో నేత్రముకైన

} ఆయన క్షమాపణ రూపము కనబడి తీరవలెను అప్పుడే నేటి సాయంకాల ధ్యానము ఆయనకు ఇష్టమైన ధ్యానము కాగలదు.

పాత నిబంధన కాలములో శత్రువులను క్షమించుమని భక్తులు ప్రార్థన చేయలేదు. ఇక్కడ ఆలాగులేదు, క్షమించుమని ప్రభువు ప్రార్థించినారు. ఇది క్రొత్త నిబంధన. స్తెఫను ఇట్టి ప్రార్థనయే చేసెనని అపోస్తలుల కార్యములో ఉన్నది. అయితే, ఇందులో ఒక్క బేధము ఉన్నది. స్తెఫను, ప్రభువు చేసిన ప్రార్థన జ్ఞాపకము వచ్చి చేసెను గాని ప్రభువైతే స్వయముగా చేసెను. గనుక ప్రభువు చేసినదే గొప్పది. మరియొక ప్రార్థన చెప్పుదును. అది వందన సమర్పణ.

అట్టి క్షమాపణతో కూడిన కృతజ్ఞతా స్థితిలో వరుడు మిమ్మును స్థిరపర్చును గాక. ఆమేన్.

**ప్రార్థన:–** యేసుప్రభువా! శత్రువులను క్షమించుమని నీవు కోరుట మాత్రముకాక, తరువాత వచ్చిన విశ్వాసులకును, ఆ మాదిరి నేర్పినావు. వారిలో ఒకడైన స్తెఫను అట్టి ప్రార్థన చేసినందుకు నీకు వందనములు. ఇదే చివరి ప్రార్థన. యేసుప్రభువా! మేము ఇప్పుడు చేసిన ప్రార్థనలకు నీవే 'ఆమేన్' అని చెప్పుమని వేడుకొనుచున్నాము. యేసుప్రభువా! నీలో క్షమాపణ నైజము ఉన్నందువలన లోకము నీ యొద్దకు నిర్భయముగా రాగలదు. మేము ఎంత పాపాత్ములమైనను, మమ్మునుకూడ నీవు రక్షిస్తావు, క్షమిస్తావు, ప్రేమిస్తావు, మేలు చేస్తావు, దీవిస్తావు, మా నిమిత్తమై విజ్ఞాపన ప్రార్థన చేస్తావు. కాబట్టి మేము మీ ఋణము తీర్చుకోలేము. గాని కేవలము వందనములు మాత్రమే చెప్పగలము. ఈవేళ మాట్లాడుకొన్న మాటలు అన్నిటి నిమిత్తమై మీకు వందనములు. ఆమేన్.

**కీర్తన :** *"దేవుండవు కాని యెడల – నిన్ను – తిప్పి చంపువారిన్ – క్షమియింప గలవా = జీవమైయుండని యెడల – నిన్ను – చావు దెబ్బలు గొట్ట – సహియింపగలవా!"* *॥ ఏడు॥*

# లెంటులోని ముప్పది నాలుగవ దినము - శనివారము

## రెండవ మాట వివరము

**లూకా 23:43;**



**ప్రార్థన:- రక్షణకర్తవైన దేవా! రక్షణ వార్త సిలువమీద ఉన్నది. నేరస్థునికి అందించినట్లు మాకును నీ సందేశమును అందించుము. ఆమేన్.**

ఈ సిలువ కథలో అందరు ప్రభువును దూషించిరి. సిలువ వేతలో పాల్గొన్న వారందరు యేసుప్రభువును దూషించిరి. ఆయన సిలువ వేతలో పాల్గొనని ఆ ఇద్దరుకూడ ప్రభువును దూషించిరి. అయితే భక్తులు దూరమున ఉండి ఏడ్చుచున్నారు. వారిలో ఎవరు ఎక్కువ?

**మూడు గుంపులు:-** 1) సిలువవేత వేయుచున్నవారు, 2) సిలువ వేయుటలో పాల్గొననివారు, సిలువ వేతలో ఆ ఇద్దరును పాల్గొనలేదుగాని దూషించుటలో పాల్గొన్నారు. 3) సిలువ దగ్గరున్న భక్తులు అనగా అక్కడ ఒక మెట్టు దూరములో భక్తులున్నారు. (ఎ) సిలువ వేసేవారు, (బి) దూషించేవారు. ఈ రెండు గుంపులవారు ఉన్నారు వారికి, వీరికి బేధమేమనగా; ఒకరు సిలువ వేసేవారు, మరొకరు దూషించేవారు. రెండవవారు దూషించేవారు మాత్రమే. ఈ రెండు గుంపులలో ఉన్నవారు 1) భక్తులు, 2) ఇతరులు, 3) సిలువ వేసేవారు, 4) దూషణ చేసేవారు. చివరి జట్టు ఇద్దరే. వారు దూషణ చేసేవారు. ఆ దూషణకు బైబిలులో కొన్ని మాటలున్నవి. ఇప్పుడు 1. భక్తులు,2. ఇతరులు, 3. సిలువ వేసేవారు, 4. దూషించేవారు మాత్రమే ఒక గుంపు. అయితే ఆ దూషించే వారిలోనుండి ఒకరు తప్పుకున్నారు.ఆ తప్పుకున్నవాడు రెండవ వానిని గద్దించెను, నిందించెను. 'మనము నేరస్థులము. ఆయన ఏ నేరము చేయలేదు'. అని అతను ఆ జట్టులోనుండి వేరైపోయినాడు.

1. భక్తులు ఏడ్చుచున్నారు. 2. ఇతరులు దూషిస్తున్నారు. 3వ గుంపువారు సిలువవేస్తూ దూషిస్తున్నారు. 4వ గుంపు వారు ప్రత్యేకముగా దూషణ పనిమీదనే ఉన్నారు. 5వ గుంపు వారు దూషించుట మాని ప్రభువు పక్షముగా వచ్చిరి. ఆయన పక్షము ఉన్న ప్రపంచములోని జన సంఘము అంతా ఈ 5వ భాగములో ఉన్నారు. కొందరు భక్తులు ఆ స్త్రీలవలె దుఃఖించేవారై యున్నారు. మరికొందరు రెండవ గుంపు వారివలె యేసుక్రీస్తు దగ్గరకు వెళ్లి, ఎందుకు చావాలి? తప్పించుకోలేవా? అనువారివలె దూషిస్తున్నారు. ఏలగనగా: 'ఆ శత్రువులు పట్టుకొని వెళ్తే మాత్రము ఈయనెందుకు వెళ్లాలి. తప్పించుకోలేడా? సైతాను అరణ్యములో శోధిస్తాడని చెప్పి, ఆయన ప్రభువు వెళ్ళకుండా ఉంటే బాగుండును కదా! వెళ్లినాడు. గనుక సైతానుకు లోకువై పోయినాడు'.

Bible Mission Guntur

ప్రభువు వెళ్లుట జయించుటకైతే, వారేమో సైతానుకు లోకువైనాడని అంటున్నారు. అలాగే నేటి రెండవ గుంపు వారును ప్రభువును అంటున్నారు.

3వ గుంపు:- అనేక పాపములు తెలిసినా, పదే పదే ఆ పాపములే చేస్తూ మరల ప్రభువును సిలువ వేస్తున్నారని హెబ్రీ 6వ అధ్యాయములో ఉన్నది.

4వ గుంపు:- ఎడమ ప్రక్క దొంగవలె మారు మనస్సు పొందనివారు.

5వ గుంపు:- మారుమనస్సు పొందిన దొంగవలె కొందరు తప్పు తెలిసికొని, ప్రభువు తట్టు తిరుగువారు.

6వ గుంపు:- ఈ చరిత్ర అంతా చూచి మారుమనస్సు పొందిన శతాధిపతి (రోమా గవర్నమెంటులో గొప్పవాడు).

ఈ పాఠము సిలువమీద మారి, మారు మనస్సు పొందిన వానిని గూర్చియే. ఆయన ఒక్కడే. ఇతడు ఎవరు? బైబిలులో అతనిని గూర్చి వ్రాయబడినది. 1) బందిపోటు దొంగ, 2) క్రీస్తుయొక్క దూషకుడు, 3) మరియొక దూషకుని గద్దించినవాడు, 4) క్రీస్తునందు నేరములేదని గొప్ప సాక్ష్యము ఇచ్చినవాడు. 5) మోక్షానికి వెళ్లినవాడు, ప్రభువు సిలువను గుర్తించినటువంటివాడు. ఈ ఐదును ఇతనిలో ఉన్న లక్షణములు. 6) ఈయనయందు ఏ నేరమును నాకు కనబడలేదని పిలాతు ఇచ్చిన సాక్ష్యమిచ్చెను. 7) అయ్యగారిచ్చిన బిరుదు:- సిలువమీద రక్షింపబడినవాడు, రక్షితుడు. 8) ప్రభువా! నీవు నీ రాజ్యములో వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొమ్మని ప్రార్థించిన ప్రార్థనాపరుడు. 9) కొందరు మేము ఎన్ని ప్రార్థనలు చేసినా జవాబు లేదు. ఆయన వినుట లేదంటారు. దొంగ ఎన్నిసారులు చేసెను? అప్పుడే చేసి జవాబు పొందినాడు.

***చాలాకాలమునకు మారిన వానికంటే, బందిపోటు దొంగగా చాలా కాలముండి మారిపోవుట అద్భుతము కాదా!*** కొందరు ఎంత ప్రార్థన చేసినా మారరు. కొందరు క్షణంలో మారిపోతారు. లోకము పుట్టినది మొదలు లోకాంతము వరకు ఎందరు మోక్షానికి వెళ్తారో, అందరికి ఈ దొంగ ప్రతినిధి. ప్రతినిధి ఎందుకైనాడనగా సిలువమీద ఉన్నాడు, శ్రమలో ఉన్నాడు *గనుక ఇప్పుడును ఈలోకములో శ్రమలో* ఉన్నవారే మోక్షానికి వెళ్ళగలరు. అయ్యగారు ఆశ్చర్యపడుతున్నారు. ఎందుకు? సన్‌హెడ్రిన్ సభవారు అంతా, గవర్నమెంటువారు అంతా కలసి, ఆయన సిలువకు పాత్రుడని తీర్మానము చేసి పంపితే, సిలువపైనే ఉన్న బందిపోటు దొంగ ఈయనయందు ఏ నేరము లేదన్నాడు. గనుక గవర్నమెంటుకు కోపము రావలెను, యూదులకు ఎంతో కోపము రావలెను. *యేసుప్రభువును, ఆ దొంగయూ ఏలాగు చనిపోతారు!* వారందరి కోరిక నెరవేరుతుంది గనుక వారికి కోపము రాలేదు.

ఆ దొంగ వట్టి దొంగకాదు. బందిపోటు దొంగ అనగా పగలు పగలే దోచేవాడు. మామూలు దొంగలు రాత్రిళ్ళు దొంగిలిస్తారు. ***అందరు గుడిలోయి తీస్తే, వీడు వడిలోయే తీసికొనును.*** ఆ బందిపోటు దొంగ ఇంకా ఎవడు? అన్యుడుకాదు, యూదుడు. ఇతను యూదుడని ఋజువు ఏమనగా యూదుడు కాకపోతే సిలువవేయరు. సిలువ వేసినందున యూదుడు. ఈయన సిలువమీద ఉండి, క్రింద ఉన్నవారిని పరీక్షించుచుండెను. ఈయన గొప్ప పరిశీలన కర్త. బాధలో ఉన్నాడు. అయితే ప్రభువును పరీక్షించినందున, యేసుప్రభువులో ఏ దోషములేదని రోమన్ గవర్నమెంటు జడ్జి చెప్పాలిగాని, కుడిప్రక్క దొంగ ఆ జడ్జి పట్టా తీసికొన్నాడు. పిలాతు ఈయనయందు ఏ దోషము లేదన్నప్పుడు మాటమాత్రమే కాదు, క్రియకుకూడ సిలువకు అప్పగింపకూడదు. ఈయనయందు ఏ దోషములేదు అని తీర్మానించి, మినిట్స్ (అధికారిక సంభాషణలు వ్రాయు పుస్తకము)లో వ్రాసి సిలువకు పంపెను. ఆ పిలాతు ఈ బందిపోటు దొంగ చేసినపని చేయలేకపోయెను. పిలాతు అనవలసినది. 'అయ్యా! నీవు భక్తుడవు, యూదుడవు, దేవుడవు, యూదుల రాజువు. వారు అసూయచేత అప్పగించినారు అని మాకును, మా రాణిగారికి తెలిసెను. గనుక వాళ్ల లెక్కేంటి! వారు అల్లరిచేస్తే నేను ఊరుకొనను. కైసరు పటాలము రప్పించి వారిని అణచి వేయుదును' అని అనవలసినది. అయితే ఈ దొంగ ధైర్యమున్నవాడు, పిరికివాడు కాదు. ***బాధపడుతూ, చచ్చిపోతూకూడ ప్రభువు పక్షముగా ఉన్నాడు.*** అది ఆలాగుంచండి. అతడింకొక మర్మము గ్రహించెను.అతడు (ఆ దొంగ) ఎన్ని ప్రసంగాలు విని మారెను? ప్రభువు చేసిన ఒక్క ప్రార్థనే 'తండ్రీ! వీరు...... ఎరుగరు, క్షమించుము' అను ఈ మూడు మాటలు గల ప్రార్థనకు మారిపోయినాడు.

*బైబిలు తరగతిలో (ఎ) ప్రార్థన విని మారిన వారెవరు? (బి) ప్రసంగము విని మారినవారెవరు? (సి) చూచి మారినవారెవరు?* అనే అంశములను వివరించవలెను. దొంగ 1) ప్రభువు చరిత్ర చూచి, 2) ఆయన ప్రార్థన విని మారెను. అలాగే 1) మన ప్రార్థన వలన ఎందరు మారుచున్నారు? 2) మన మాదిరి బ్రతుకువల్ల ఎందరు మారుచున్నారు? ***ఈ రెండే ముఖ్యము.*** తండ్రీ! అనే దానిలో ఆ దొంగ ఏమి గ్రహించెను. యూదులు దేవునిని తండ్రీ! అంటారు. అన్యులు దేవా! అంటారు. ఈ దొంగ తండ్రీ! అనే మాటవిని, ఈయన మా యూదులలో ఒకడే అని గ్రహించెను. 1) ఇంత శ్రమలో పరలోకపు తండ్రిని తలంచెను. గనుక మహా భక్తుడే అని గ్రహించెను. 2) 'వీరేమి చేయునది వీరెరుగరు గనుక క్షమించుము' అనెను. వీరిని తానే క్షమించెను. ఇంతగా సిలువ వేసేవారినే అట్లు అంటున్నాడాయన. ఇంత దొంగనైన నన్నునూ, ఎరుగననునా! వారిని అన్నట్టు నన్నును క్షమించుదునని అనడా! అని ఈ దొంగ ధైర్యము తెచ్చుకొనెను.

ఈ దొంగ క్రీస్తు పక్షముగా ఉండే వాడు ఏలాగనగా ప్రక్క దొంగను గద్దించుటవల్ల, నీ రాజ్యములో జ్ఞాపకము చేసికొమ్మని ప్రార్థించుట వల్ల; క్రీస్తుకు పునరుత్థానమున్నదని గ్రహించుటవల్ల; ఈయన చనిపోయి తిరిగి రాజ్యముతో వస్తాడు అని నిరీక్షించాడు. ఆ నిరీక్షణే లేకపోతే నీవు వచ్చేటప్పుడు, నీ రాజ్యములో నన్ను జ్ఞాపకము చేసికొమ్మని ఎందుకంటాడు! ప్రభువు తన రాజ్యములో, తన సింహాసనము దగ్గర బందిపోటు దొంగనే చేర్చుకొంటే, అందరినికూడ తప్పక చేర్చుకుంటాడు.

అయ్యగారు ఆ దొంగతో 'ఓ బందిపోటు దొంగా! నీవు ఏ ముఖము పెట్టుకొని నీ రాజ్యములో నన్ను చేర్చుకొనుమని అడిగావు? నీవు మా పెద్ద మనిషివా! నీవు సజ్జనుడవా! చేతిలో బల్లెము గలవాడవు, దోపిడివాడవు! ఎవరైనా అడ్డువస్తే పొడిచిన ఘోర పాపివి! నీ రాజ్యములో చేర్చుకొమ్మని ఎలా అడుగుచున్నావు. ఊరుకో!" అన్నారు. తప్పిపోయిన కొడుకుతో "నీవు దూబరివి. మురికి బట్టలు వేసికొని మురికివాడవై, పందులు కాచి, పొట్టు తిని, ఏ ముఖముతో వచ్చావని" ఆ తండ్రి అనలేదు. అలాగే సిలువపైనున్న తండ్రియు అనలేదు. ***మారినవారి వెనుక సంగతులు తండ్రి ఎత్తడు.***

పరలోకమునుండి వస్తూ వస్తూ రక్షణ తెచ్చి, ఇక్కడనుండి తిరిగి వెళ్తూ రక్షితుని తీసికొని వెళ్లెను. ఈ రెండు మిషనులు ప్రభువు నెరవేర్చెను. 1) రక్షకుడుగా వచ్చి, 2) రక్షకుడుగా ప్రకటించి, 3) రక్షించి, 4) పరమునకు తీసికొని వెళ్లెను. దొంగ, 'ప్రభువా!' అన్నాడు. ఎందుకనగా ఈయన చనిపోయిన కొంత కాలానికి పునరుత్థానము జరుగునని, ప్రభువనే వరుస సిలువమీద ఉండే కట్టుకొనెను. ***ఈ పాఠము చాలా పెద్దది. దొంగే పెద్దవాడు గనుక పాఠము పెద్ద పాఠము.*** ఇందులో అనేక పాఠములున్నవి.

**1వ పాఠము:-** ప్రార్థన: యేసుప్రభువా! నీవు రక్షించడానికి వస్తే, నీ రక్షణ కోరువారు రావాలే గాని, వేడుకొనవలెనే గాని, నిన్ను గ్రహించిన వారైయుండాలే గాని ***ఎటువంటి వానినైనా నీవు రక్షిస్తావు.*** ఇదే మా ఆనందము గనుక స్తోత్రము. ఓ ప్రభువా! తుదకు మోక్షములోనికి నీవు చేర్చుకొనే 'పరిశుద్ధులు' ఎవరులేరు. అందరు ఒకప్పుడు నేరస్థులే. ఆ నేరస్థులలో ఒక నేరస్థుని సిలువమీద నుండి పైకి తీసికొని వెళ్లినావు. అతని చరిత్రలోనున్న ముఖ్యాంశములు మా జీవితమునకు గొప్ప పాఠముగా నిర్ణయించుము. ఆమేన్.

ప్రార్థనలో చేసినట్లు పరలోకములో ఉన్నవారిలో ఎవరు కూడా నేరస్థులుగా ఉండకుండ మోక్షానికి వెళ్లరు. ఆదాము, హవ్వలు నేరస్థులుగా అయిన తరువాతే మారుమనస్సు పొంది మోక్షమునకు వెళ్లిరి. వారు మొదలుకొని ఈ నిమిషము వరకు మోక్షమునకు వెళ్లినవారు, ఒకప్పుడు నేరస్థులై మారుమనస్సు పొంది మోక్షమునకు

వెళ్లినవారే. ఒక బందిపోటు దొంగను గూర్చి మాత్రమే సువార్తికులు నేరస్థుడని వ్రాశారు. అతడొక్కడే నేరస్థుడా? ఆది నుండి మోక్షానికి వెళ్లిన భక్తులందరు ఒకప్పుడు నేరస్థులే. నేరస్థులను నేరములేని వారినిగా మార్చి చేర్చుకొనుటకే యేసుప్రభువు వచ్చాడు. ఈ వరండామీద నేరస్థులు కానివారు ఎంత మంది ఉన్నారో! మీరు నేరస్థులుగానే ఉన్నారు గాని ప్రభువు రద్దు చేసినందున పరిశుద్ధులైరి. **ఏ విషయములోనైనా మీరు నేరస్థులుగా ఉంటే నిరాశపడవద్దు!** ఆ నేరస్థుని మార్చుటకు; అతడు నేరస్థుడు కాదని తీర్పు తీర్చుటకు; 'పరిశుద్ధుడు' అని మోక్షము చేర్చుటకు; ప్రభువు సిలువలో ఎంత ప్రయత్నించినారు! మూడు అంశములు ఇక్కడ ఉన్నవి. 1) మార్చుట, 2) తీర్పు తీర్చుట, 3) మోక్షములో చేర్చుట. **ఆయన మనలను మార్చవలెననే ఇటువంటి కూటములు లోకమంతట పెట్టించుచున్నారు.**

ఆ నేరస్థుని మార్చిన ఆయన ఈ నేరము మార్చడా అనుకొనుటకు ఈ చరిత్రలో ఒక ఆధారము కనిపిస్తున్నది. లోకాధికారులు అతనిని నేరస్థునిగా తీర్పుతీర్చినారు. ప్రభువు అతనిని 1) నీతిమంతునిగా, 2) పరిశుద్ధునిగా, 3) నేరము లేనివానిగా తీర్చి చేర్చుకొన్నారు. పరలోకాధికారి ఈ రీతిగా తీర్చెరి. **నమ్మితే మన విషయములోకూడా అదే జరుగును.** మూడవదిగా ఆయన చేర్చుకున్నాడు. మార్చితే, తీర్చితే గొప్ప సంగతేగాని, చేర్చుకొనకపోతే పై రెండు ఎందుకు! గనుక 'ప్రభువా! నేను మారలేక పోవుచున్నాను. నన్ను మార్చుము. నేను అపరాధినని నాకు బాగా తెలుసు. నన్ను పరలోకమునకు యోగ్యునిగా తీర్చుము. అనగా తీర్మానించుము. నా బలహీనతలు పరిష్కరించుము. తుదకు అతనిని మోక్షములోనికి చేర్చుకొన్నట్లే, నన్నుకూడ మోక్షములోనికి చేర్చుకొనుము'. ఇది నేటి పాఠము.

**2వ పాఠము:-** పోయినవారము మార్చుట, తీర్చుట, చేర్చుట నేర్చుకొన్నాము. ఈ మూడు ప్రార్థనలు ఎవరంతట వారే నేర్చుకొనండి. రాజమండ్రిలో పెర్నాట్రిస్ అనే డాక్టరుగారు ఒకరున్నారు. ఆయన రోడ్డుమీద సైకిల్‌పై వెళ్లుచూ, ప్రతివారి ముఖములోనికి చూస్తూ వెళ్లేవారు. ఒక మనిషి దగ్గరకు రాగానే సైకిల్ ఆపి నిలువబడి, 'నీలో ఫలాని జబ్బు ఉన్నది' అని చెప్పి ఒక చిన్న స్లిప్ (చీటి) అతనికిచ్చి, రేపు ఉదయం ఆస్పత్రికి వెళ్లి మందు తీసికో అని చెప్పేవారు. తన నోట్స్‌లో ఇతని కథ అంతా వ్రాసికొనేవారు. మరుసటి ప్రొద్దున ఆస్పత్రికి దొరగారు వెళ్లి, పలాన వారు వచ్చారా అని కనుగొని, వాడు రాకపోతే మాత్రము అరెస్టు చేయించేవారు. ఆయన సైకిల్ దిగగానే దగ్గరున్న మనిషి గజగజలాడేవారు. సిలువమీద ఒక ప్రక్క మారు మనస్సు పొందని అక్రమకారుడు, మరొక ప్రక్క మారుమనస్సు పొందిన అక్రమకారుడు,

ఇంకొక ప్రక్క అక్రమకారుడుగా ఎంచబడిన ప్రభువు ఉన్నారు. ఆ డాక్టరుగారు అందిరిని వదిలి జబ్బుగా నున్నవాని దగ్గరకు వచ్చినప్పుడు, 'నా దగ్గరకే ఈయన వస్తున్నాడు' అని ఆరోగి గ్రహిస్తాడు. ఇద్దరు అక్రమ కారులున్నప్పుడు ప్రభువునుకూడా అక్రమ కారులలో చేర్చి, సిలువ వేసిరి. పైకి అది కనిపించుచున్నది. కాని అంతరంగములో ఈ డాక్టరుగారు (ప్రభువు) అక్రమకారులలో అక్రమకారులైన వారిని బాగుచేయడానికే సిలువ మీదకు వెళ్లిరి. ప్రభువు అక్రమకారులలో ఒకడుగా ఎంచబడెనను మాట ఇప్పుడు నెరవేరినది. అక్రమకారుల దగ్గరకు ప్రభువును శత్రువులు తీసికొని వచ్చినప్పుడు, 'అక్రమకారుల దగ్గరకు నన్నెందుకు తీసికొని వెళ్తారు? నేను అక్రమకారుడనుకానని' ప్రభువు అనవలసినది కాని అనలేదు. ఎందుకంటే నేను అక్రమకారుల దగ్గరకు వెళ్లినప్పుడు అక్రమకారులు మారవచ్చు. వారు మార్పు పొందుటకు గడువు ఇవ్వాలి అని ప్రభువు మనస్సులో ఉన్నది. ***అలాగే లోకమంతటికి బోధించుటకై బోధకులను పంపించడము వారు మారుమనస్సు పొందుటకే.*** అయితే ప్రభువు వలన ఒకడు మారినాడు గనుక మోక్షానికి వెళ్లినాడు. రెండవ వాడు మారలేదు గనుక పాతాళ లోకములో అరెస్టు అయినాడు. ఆ డాక్టరుగారు చేయించినట్లు; ప్రభువు దగ్గర మారినవారు మోక్షానికి, మారనివారిని వారి పాపమే అరెస్టు చేయించుచున్నది.

సాధు సుందర్‌సింగ్ చరిత్ర చదివినారు గదా! దానిలో ప్రభువు చెప్పినారు: 'దేవుడెవ్వరిని నరకానికి పంపడుగాని వారి పాపమే వారిని పంపుచున్నది'. అమెరికాలో రైలుబండి పడిపోయింది. అనేకమందికి కాళ్లు, చేతులు విరిగాయి, గాయములు తగిలినవి. అందులో ఒక మిస్సమ్మ (దొరసాని) ఉన్నది. ఆమెకుకూడ కాళ్లకు, చేతులకు దెబ్బలు తగిలాయి, ఆమె లేవలేదు. అయితే, బాగా ఉన్నవారి వైపు ఆమె చేతులెత్తి, ***'నన్ను తీసికొని వెళ్లండి. వారి గాయాలకు కట్లు కడతానన్నది.'*** ఆమె డాక్టరు. అట్లే ఆమెను తీసికొని వెళ్లగా కట్లు కట్టెను. ఆ మిస్సమ్మ సండేస్కూలులో అయ్యగారు మాస్టరుగారు. ఆ డాక్టరమ్మవలె ప్రభువు శ్రమలో ఉండి, ఒక ప్రక్క పాపులను రక్షించెను. కుడివైపున నున్న వాని రక్షించెను. శ్రమలో ఉన్నప్పుడే, శ్రమలో ఉన్న ఒక వ్యక్తిని రక్షించినారు, విశేషము గదా! అప్పుడే ఆయన ఒకరిని రక్షించినారు, శ్రమ ఇప్పుడాయనకు లేదు గనుక ఎక్కువ మందిని రక్షిస్తారు. *గనుక సిలువ వేయబడిన చరిత్రలో ఇది రెండవపాఠము.*

**3వ పాఠము:-** ఎఫెసీ 4:8లో ప్రభువు చెరను చెరగా కొనిపోయెనని వ్రాయబడెను. ఇది అనగా మనముండే భూమి గుండ్రముగా నున్నది. అది అనగా పైన కనబడేది ఆకాశము. భూమి క్రిందది పాతాళలోకము. ఇదొక కథ.

**ఒక కథ:-** పాతాళలోకంలో రెండు డిపార్టుమెంటులు ఉన్నాయి. పాతాళలోకమంతా ఒకటేగాని దానికి వందల మైళ్ల దూరములో రెండు గదులున్నవి. ఒక కంపార్టుమెంటులో భక్తులున్నారు. వారిలో ఇద్దరు మనకు బాగా తెలిసినవారు. ఒకరు అబ్రాహాము, మరొకరు లాజరు. రెండవ కంపార్టుమెంటు పాతాళలోకమే. అదే హేడెస్సు లేక చెర. మొదటి కంపార్టుమెంటు పేరు భక్తుల చెర. ఇది మంచి చెర గనుక బాధలేదు. విడి ఖైదీలు గనుక వారికి బాధలేదు. చెర అన్నపేరేగాని వారికి బాధలేదు. దాని అడుగుది చెరయే. దానికి అయ్యగారిచ్చిన పేరు చిన్న నరకము. అసలు పెద్ద నరకములోకి రాకముందు, మార్పులేని అందరు చిన్న నరకములోనికి వెళ్లాలి. చిన్న నరకములో మనకు తెలిసిన ఆయన ధనవంతుడు, చెరలోని ధనికుడు పైనున్న అబ్రాహామును చూచి లాజరును పంపమని అడిగెను.

ఇప్పుడు ప్రభువు సిలువపై చనిపోయి, ఈ కంపార్టుమెంటుకు దిగిరి. ఇది మొదటిది. దీనికి పరదైసు అని పేరు. ఈ పేరు ఆదామునుండి ఉన్నది. ప్రభువు సిలువపై శ్రమలో ఉన్నాడు. ఆయన చనిపోయెనని అందరూ అనుకున్నారు గాని తిన్నగా పరదైసుకు దిగెను. ఆ పరదైసుకు వెళ్లునప్పుడే, కుడిప్రక్క దొంగతో 'నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉంటావు' అని చెప్పిరి. మారిన వానికి అపుడు చాలా ఆనందము కలిగెను. ఆయన (ఆ మారిన దొంగ) ఒక సన్నిధి కూటములో అంగీతో పాదిరై వచ్చి ప్రభువు భోజనము ఇచ్చెను. పరదైసు వెళ్లినందున ఆ మాత్రము చేయవద్దా! ఆ దొంగ మారి పరదైసుకు వెళ్లినందువల్ల ప్రభువుతో అంగీవేసికొని వచ్చి సంస్కారమిచ్చెను. గుంటూరులోనే పోయినవారము ప్రభువుతోవచ్చి సంస్కారమిచ్చెను. పైది, క్రింది కంపార్టుమెంటులు చెరలే. **మొదటి కంపార్టుమెంటులోని చెరకు చెరవేసి, పరలోకానికి తీసికొని వెళ్లెను.**

మీ కొరకు చెరను అనుభవించి, ఆ చెరను చెరగా తీసికొని వెళ్లినాను గనుక మీకిక చెరలేదు (ఎఫెసీ. 4:8).అని ప్రభువు చెప్పినట్లున్నది. ఈలాగు ఆయన చెరను చెరగా పట్టుకుపోయెను. సిలువ మ్రానుమీద ఆయన శ్రమపడినందున మనకు చెర తప్పెను. ఒక మాట: అబ్రాహాము అక్కడి వారు ఇక్కడికి, ఇక్కడి వారు అక్కడికి వెళ్లకూడదని అన్నాడు. అక్కడివారు ఇక్కడకు వస్తే వారికి వేదన ఉన్నది. గనుక వచ్చిన యెడల మహా వేదన ఉండును. పీర్ల పండుగకు అగ్ని గుండములో పరుగెత్తుతారు. కాలవు గాని, కాళ్లు వేడెక్కును. అయ్యగారు పరుగెత్తినారు గాని కాలలేదు.

ధనికుడు- 'యాతన పడుచున్నానన్నాడు'. మొదటి కంపార్టుమెంటు వారు క్రిందికి వస్తే యాతన పడుదురు. పీర్ల గుండములో (మొదటి కంపార్ట్‌మెంట్‌లో) బొబ్బలు లేకపోయినా కాలును గనుక ప్రభువు చెరను చెరగా పట్టుకొని వెళ్లిపోయెను. ఇప్పుడు

హేడెస్సులోని వారికి యాతన ఉన్నది. సిలువ కార్యక్రమము అయిపోయింది గనుక ఇప్పుడు కాల్పు ఉండదు, గాని యాతన ఉన్నది. అయితే పరదైసులోని భక్తులు పాతాళములోనికి వచ్చినా, వారికి బాధలేదు గాని పాతాళములోని వారికి బాధ ఉన్నది.

షద్రకు, మేషాకు, అబెద్నెగోలు కాలనట్లు పరదైసువారు పాతాళానికి వచ్చినా కాలరు. రేపు మనమందరము పరలోకానికి వెళ్లిన తర్వాత, వెయ్యేండ్ల పాలనలో మనమందరము తిరిగి వస్తాము. గాని అప్పుడు క్రొత్త గుంటూరు ఉంటుంది. ఈ గుంటూరు కాదు. ఇది గుంట + ఊరు = గుంటూరు. వెయ్యేండ్ల పాలనలో అగ్నికాలదు, నీటిలో మునిగి చావడము ఉండదు. ***పరదైసువారు పాతాళములోని బాధితులకు, బోధ చేయుటకు వెళ్తారు గాని బాధపడుటకు వెళ్లరు.***

**4వ పాఠము:-** భూమిమీద ప్రభువు ఉన్నప్పుడు శిష్యులు ఆయన దగ్గర ఉన్నారు. అందుకే శిష్యులకు వచ్చిన బిరుదు. 'యేసుతో కూడ ఉన్నవారు' బాలిక పేతురుతో అదే అనెను. సన్నిధి కూటములు చేయు వారందరికి అదే బిరుదు ఉండును. భూలోకములో ఉండగానే దొంగకు వచ్చిన బిరుదు 'నాతో ఉంటావు'. 11మందికంటే వచ్చిన గొప్ప బిరుదు అనగా 'నీవు నాతో ఉంటావని' అతనికి వచ్చెను. ఎంత గొప్ప ధన్యత! ఇతనే గొప్పవాడు. ప్రభువు పరలోకమునకు వెళ్లుచూ 'సదాకాలము మీతో ఉన్నాను' అని చెప్పెను. ఇది వేరు. 'నాతో ఉంటావు' అనేది వేరు. మరొక అంశము ఏదనగా: ***మీరు యేసుతో ఉన్నారా? మీతో యేసు ఉంటారు.*** అప్పుడు మీరు పరదైసుకు, మోక్షానికి వెళ్తారు. ఎంతకాలము బ్రతికినా మన గురి మోక్షమే. అది లేకపోతే హేడెస్సే గురి.

**ప్రార్థన:-** ప్రభువా! వాక్యములోనుండి వాక్యము, వ్యాఖ్యానములోనుండి వ్యాఖ్యానము, అర్థములో నుండి అర్థము, అనుభవములోనుండి అనుభవము, ప్రార్థనలోనుండి ప్రార్థన, సాక్ష్యములోనుండి సాక్ష్యము, మార్పులోనుండి మార్పు, జవాబులో నుండి జవాబు, ***మా జీవిత కాలమంతయు ఊటలోనుండి ఊట తెచ్చుకొనగల కృప దయచేయుము.*** ఈవేళ నావైపు కాక నీవైపు, ఇంకొక సిలువవైపు చూచుచు అందునుండి సారము గడించుకొనగల కృప దయచేయుము.

**5వ పాఠము:-** కల్వరి కొండమీద మూడు సిలువలున్నవి. రెండు సిలువలు చచ్చిపోయి బ్రతికిన వారి సిలువలు. మూడవ సిలువ మీది మనిషి చనిపోవడము ఎరుగుదుము గాని బ్రతుకడము తెలియదు. ఇప్పుడు క్రైస్తవ సంఘము యొక్క కథయు అట్లే ఉన్నది. కొందరు మార్పులేని దొంగవలె, నేరస్థునివలె ఉండి ఉండి ఆ తరువాత మారి, చనిపోయి పరలోకములో బ్రతికే ఉన్నారు. వారెంత ధన్యులు! ***ప్రభువు అందరికొరకు చనిపోయి, ఇప్పుడు అందరి కొరకు జీవిస్తున్నారు.*** ఇది సిలువ మీద జరిగిన చరిత్ర.

ఇదివరకు దొంగ మారుమనస్సు పొందిన కథ విన్నాము. ఆ కథలో రెండు ముఖ్యాంశములున్నవి. 1) నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు, 2) నన్ను జ్ఞాపకము ఉంచుకో అని చేసిన గొప్ప ప్రార్థన. దానికి ప్రభువు గొప్ప జవాబిచ్చెను. అది 'నీవు నేడు నాతోకూడ పరదైసులో ఉందువు' ఈ సంగతి విని భూమిమీద ఉన్నవారెవరైన సరే మార్పుచెంది, ప్రార్థించిన యెడల వారి ప్రార్థన ప్రభువు తప్పక వింటారు. ఆయన మన ప్రార్థనలు వినక పోయినట్లయితే, సిలువమీద దొంగ ప్రార్థన విన్నట్లు, జవాబిచ్చినట్లు వ్రాయించడు. ఆ దొంగ ప్రార్థన, వానికి ప్రభువిచ్చిన జవాబు పాపులందరికి ఆదరణ గనుక గొప్ప ధైర్యము కలుగుచున్నది.

దొంగ ప్రార్థనలో గొప్ప రహస్యమున్నది. అది 'రాజ్యమును' గూర్చినది. 'ఆయన రాజ్యమంటే ఏమో సిలువపైనున్న దొంగకేలాగు తెలిసిందో' తెలియదు! ఆ సిలువమీద ఉన్నవానికి రాజ్యమేలాగు లేదు. అది కావాలని అతడు అడుగలేదు. నీ రాజ్యములో నన్ను జ్ఞాపకముంచు కొనుమంటే, 'చేర్చుకొమ్మని' అర్థము. యెషయాలో ప్రభువు రాజ్యము, శాశ్వత కాల రాజ్యమని ఉన్నది. అది అతనికి తెలిసి, ఆ రాజ్యములోనికి చేరాలనే ఆశ ఆ దొంగకు కలిగినది. ప్రభువుకు భూలోకములో రాజ్యమున్నది. పాప లోకములో పాపులమధ్య అక్కడక్కడ, ఇక్కడ ఒక్కొక్క విశ్వాసి ఉంటే వారిలో ఆయన రాజ్యమున్నది. అందుకే ప్రభువు ఈ లోకములో ఒకమాట అన్నారు: దేవుని రాజ్యము మీతోనే ఉన్నది. అయితే ఆ దొంగ మనసులో ఉన్నది అది కాదు. ఇప్పుడు ఈయన చనిపోయి లేచి, పరలోకానికి వెళ్లి రాజ్యము స్థాపిస్తాడని తెలిసికొని, ఆ పరలోక రాజ్యములోకి చేర్చుకుంటాడని తెలుసుకున్నాడు.

యేసుప్రభువు కొండమీద ప్రసంగములో 'దీనమనస్సు గలవారు ధన్యులు, దేవుని రాజ్యము వారిది' అని చెప్పెను. అది పూర్తిగా పరలోక రాజ్యము. దానిలో పాపులు, పాపము, పాపము వలన కలిగే కీడు, దయ్యాలు లేవు. అట్టి రాజ్యములో చేర్చుకొమ్మని దొంగ అడిగినాడు. ఇంతకు ముందు చెప్పినది, కళంకము లేని పరలోకములో ఉన్న పరలోకము. ముందు చెప్పింది, విశ్వాసులలో ఉన్న రాజ్యము. పరలోక రాజ్యము అనగా పరలోకములోని దేవుని రాజ్యముకూడ విశ్వాసులలోని దేవుని రాజ్యమే. ***భక్తులకున్న నిరీక్షణ ఏమనగా పరలోక రాజ్యము ఎప్పటికైనా ఈ భూలోకమునకు సంపూర్ణముగా వచ్చివేస్తుంది.*** ఆ రాజ్యము సంపూర్ణముగా వచ్చినప్పుడు లోకములో పాపాలు, దయ్యాలు ఉండవు. భూమి పరలోకమువలె శుభ్రముగా ఉండునని యెషయాలో వ్రాయబడినది. అక్కడక్కడ పాత నిబంధన గ్రంథములో కొద్దికొద్దిగా ఉన్నను, యెషయాలో ఈ సంగతి వివరముగా నున్నది. దానికి మించి ప్రకటన గ్రంథములో ఎక్కువ వివరముగా నున్నది.

ప్రకటన గ్రంథము సిలువపైనున్న దొంగకు తెలియదు. అప్పటికి అది వ్రాయబడలేదు. లూకాలోను రాజ్యమును గురించి ఉన్నది. ఇదియు అప్పటికి వ్రాయబడలేదు గాన అదియు దొంగకు తెలియదు. ప్రభువు చనిపోయి లేచిన తరువాత, 40 దినములున్న తరువాత, ఆరోహణమైన తరువాత, పత్రిక (ప్రకటన) వ్రాయబడిన తరువాత, సంఘము స్థాపింపబడిన తరువాత, లూకాసువార్త వ్రాయబడెను. బైండింగ్‌లో ఇట్లు పెట్టిరి. ఈ కథలన్నీ ఇతనికి తెలియదు. యెషయాలోనిదే అతనికి తెలుసు.

అది ఏలాగు తెలుసు అనగా ఇతడు మంచివాడుగాను, ఉన్నప్పుడు శాస్త్రులు, పెద్దలు, తల్లిదండ్రులు సునగోగులలోను చెప్పింది విన్నాడు. లేకపోతే ప్రభువుయొక్క రాజ్యము సంగతి ఆలాగున వినకపోతే దొంగకేలాగు తెలియగలదు! 1) మెస్సీయా వస్తాడు. పెద్ద వాడవుతాడు. 2) రోమా గవర్నమెంటు చక్రవర్తిని పడద్రోసే రాజౌతాడు. 3) దావీదు సంతానములో వస్తాడు. 4) యూదులలో పుడతాడు అనే నాలుగు సంగతులు నిజమే. ఇంతవరకు నిజమేగాని ఆయన వచ్చిన పిదప, ఉన్న రాజ్యాన్ని పడగొట్టి తాను రాజై తన జనులకు రాజ్యమిస్తాడని చెప్పినమాట, ఇతని చెవిలో పడినది. ఎవరైతే బోధించిరో వారే నమ్మలేదు; ఆయన రాజ్యము ఇవ్వనందున. ఆయన (మెస్సీయ) వస్తే రాజ్యము ఇచ్చేవారు. ఈయన పాపులతో దయ్యాలతోపడి ఉన్నాడు అని ఆయనను (ప్రభువును) చంప జూచిరి.

దేవుడని, యూదులరాజు అని చెప్పుకున్నారే గాని, 'ఈయన రాజ్యము ఎక్కడ కనిపించలేదని' చంపివేసిరి. ఇతను దొంగ అయితే అయినాడుగాని ఆయన రాజ్యమును గ్రహించి; "ఈయనకు ఈలోకములో లేదుగాని పరలోకములో ఉన్నది. ***ఉన్నది ఎక్కడో ఒక చోట ఉండునని గ్రహించెను.*** అంతేకాక, దొంగ తలముందే రాజని వ్రాయబడి ఉన్నది. యూదుల రాజు అని ఉన్నది. దొంగకూడ యూదుడే గనుక ప్రభువు రాజే గనుక; ఆయనకు అందులో రాజ్యమున్నది గనుకను, నాకును పాలు దయచేయుమని ఆయనను అడిగి నిరీక్షించెను.

**6వ పాఠము:-** Argument **(సంవాదము):-** ప్రభువుకు భూలోకములో రాజ్యములేదు. ఆయనకు పరలోకములో ఉన్నది. నేను ప్రార్థించాను గనుక నాకు పరలోకములో ఉన్నదని గ్రహించెను. బోధలో ఉండికూడా యూదా ఎట్లు తప్పుకున్నాడో, ఇప్పుడును అట్టి పెద్ద మనుష్యులున్నారు. 1) 'జబ్బు తీసివేయమన్నాను. ఆయన తీసివేయలేదు గనుక నా రక్షకుడు కాదు'. 2) 'రెండు వేల రూపాయల అప్పు తీర్చమన్నాను, తీర్చలేదు. నా రక్షకుడు కాదు' అంటారు. ఈలాటివి పెట్టుకొని ఎడమ ప్రక్కవాడు పాడైనాడు. యూదులరాజును సిలువ వేయుమని అందరు గోల

పెట్టుచుండగా, ఆయన రాజ్యములేకుండా తీసివేయడానికి వీలులేదు అని దొంగ గ్రహించెను. దొంగ చరిత్ర, ప్రభువు చరిత్ర ఆలాగుంచి లోక చరిత్ర గుర్తించాలి. 1) గురుతులు జరగాలి, 2) ప్రభువు మేఘూసీనుడై రావాలి, 3) భూలోకములో ఉన్న భక్తుల సంఘాన్ని తీసికొని పరలోక రాజ్యానికి వెళ్ళాలి. భూలోకములో ఉన్న సంఘమే పరలోకానికి వెళ్ళాలి. 4) పరలోకము మన పుట్టిల్లు అనగా మోక్షనగరము. 1. సంఘము పుట్టింటికి వెళ్ళాలి, 2. మిగిలిన వారికి ఏడేండ్ల శ్రమలు, 3. అబద్ధ ప్రవక్త, అంతెక్రీస్తు, కప్పులవంటి దయ్యాలు, మిగిలిన దయ్యాలను నరకములో వేయాలి 4. వాటి అధికారిని మట్టులేని గోతిలో వెయ్యేండ్లు బంధించాలి. అప్పుడు దేవుని రాజ్యము భూమిమీదకు వస్తుంది. ఇది వరకు అక్కడక్కడ ఉన్న సంఘము ఇప్పుడు రాజ్యముగా  ఏర్పడి, పరలోకానికి వెళ్లి అక్కడ కూర్చున్నది.

పైన చెప్పిన కార్యక్రమము అయిపోయిన తరువాత వెళ్లిపోయిన రాజ్యము మరలా దిగివచ్చును. అందరు అందులో లేరుగాని వారిలో ఉన్న అనేకులైన ముఖ్యమైన భక్తులను, ఈ భూమిమీదికి తెచ్చి, వారితో ప్రభువు వచ్చి సింహాసనము వేసికొని, 12 మంది శిష్యులకు 12 సింహాసనములు వేసి; ఆయన, వీరు కలసి రాజ్యపాలన చేయుదురు. అమెరికానుండి గుంటూరు వరకు అంతటా దేవుని రాజ్యమే. భూమిపై విష పురుగులు, పాపములు, గత్తర, చెత్త, పాములు, ముండ్లు, మరణాలు, యుద్ధాలు లేని రాజ్యము ప్రభువు స్థాపించును.

ప్రకటన గ్రంథములో దేవుని రాజ్యమును పరలోకమునుండి ప్రభువు తీసికొని, ఆ రాజ్యముతోను, భక్తులతోను వస్తారని ఉన్నది. అదే దొంగ అప్పుడు చూచెను. **నీవు నీ రాజ్యములో ఉన్నప్పుడు అనలేదు. నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు** అని అన్నాడు. పై ప్రోగ్రాము జరిగితేనే గాని దేవుడు తన రాజ్యముతో రాడు. వెయ్యేండ్లపాలన మొదట్లో జ్ఞాపకముంచుకొనుమని అడిగెను. గనుక ఈ దొంగకు అది బోధపడుటకు యెషయా గ్రంథములో దేవుని రాజ్యమును గూర్చిన ప్రవచనములను శాస్త్రులు, పరిసయ్యులు బోధించిరి. ఇప్పుడు వస్తుందని ఆ మాటయొక్క అర్థము కాదు. ఈలాగు ఈ దొంగ చరిత్రలో అనేక సంగతులు మిళితమై ఉన్నవి.

ఈ పూర్తి వివరమును ప్రభువు మీ హృదయములలో ముద్రించునుగాక. ఆమేన్.

***కీర్తన:*** *"రక్షణ కథ నడిపినావా – ఒకరిన్ – రక్షించి పరదైసు కొనిపోయినావా!=*
*శిక్షితునికి బోధింపకనే శాంతి – లక్షణము చూపుచు రక్షించినావా!" ॥ఏడు॥*

# లెంటులోని ఆరవ ఆదివారము

## మట్టలాదివారము.

జెకర్యా 9:9; మత్తయి 21:1-10; ప్రవచనము - నెరవేర్పు



**ప్రార్థన:- శ్రమల లోయలో ఈ దినము వరకు మమ్ములను నీతో నడిపించుకొని వచ్చిన తండ్రీ! నీకు నమస్కారము. నేడు నీ కన్నుల యెదుట ఇంకను 7దినములకు పొందనైయున్న జయము కనబడుచున్నది. అట్టి జయమును మేమునూ చూచుటకు నీ ప్రవచన చరిత్రను మాకు కనపర్చుము. నెరవేర్పులోనికి నడిపించుమని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

నేటి కథ తెలిసిన విశ్వాసులారా! ఈ కథలో రెండు ప్రవచనములు గలవు. 1. పల్లెటూరి దగ్గర యేసుప్రభువు నిలువబడి చెప్పిన ప్రవచనము. 2. తరువాత ఆయన గార్ధభాసీనుడై చేసిన ప్రయాణము. ఇది మరియొక ప్రవచనము. 3.ఆయనను గౌరవ పరచిన విశ్వాసులను గూర్చిన ప్రవచనము. ఈ మూడు ప్రవచనములు గ్రామ సమీపమందు; ప్రయాణము మధ్యలో; ఎదుర్కొని వచ్చిన సమూహములలో నెరవేరినవి. కొన్ని ఏండ్ల క్రిందట జెకర్యా ప్రవచించిన ప్రవచనములయొక్క నెరవేర్పే ఈ మూడు ప్రవచనములు. ప్రవచనమనగా ఇకముందు జరుగవలసిన పని.

| | |
|---|---|
| *1) గ్రామము యొద్ద;*<br>*2) ప్రయాణ మధ్యమున;*<br>*3) పట్టణమునుండి వచ్చిన సమూహములో;* | *ఈ మూడు స్థలములలో మూడు ప్రవచనములు నెరవేరినవి.* |

అయితే ప్రవచనము నెరవేరితే వెంటనే నెరవేరవచ్చు **లేక కొన్ని ప్రవచనములు మనలో ఉన్న విశ్వాసమును, నిరీక్షణను వృద్ధి చేయును.** ప్రవచనము ఎప్పుడు ఎంత కాలమునకని విశ్వాసులు అడుగుచుందురు. అప్పుడు వారి నిరీక్షణ, ప్రవచనముమీద నున్నది. పల్లెటూరు యొద్ద యేసుప్రభువు చెప్పినది ప్రవచనము: అనగా 'ఫలాన గ్రామానికి వెళ్లండి'. అది ప్రవచనము. అది ఇంకా నెరవేరలేదు. అక్కడ కట్టబడియున్న గాడిద కనబడును, దానియొద్ద గాడిదపిల్లకూడా యుండును. అదికూడ ప్రవచనమే. ఎందుకు విప్పుతున్నారని అంటారు. అది కూడా ప్రవచనమే గాని జెకర్యా ప్రవచనము దగ్గర ఇవి అన్నియు నెరవేర్పు అయినవి. ఈ ప్రవచనము అనగా ప్రభువు చెప్పిన ప్రవచనము తాత్కాలిక ప్రవచనము అనగా అప్పుడే నెరవేరుట. అటువంటి ప్రవచనాలంటే మనకి పరమానందము. జెకర్యా ప్రవచనము అయితే కొన్ని యేండ్లకు నెరవేరెను. **మనకైతే**

**తాత్కాలిక ప్రవచనములు ఇష్టము.** వాక్యములో రాబోయే కాలములో నెరవేరే ప్రవచనాలు కూడా ఉన్నవి. మనము వాటిని వాక్యములో చూస్తున్నాము. గనుక వాటిని ఎత్తి ప్రార్థించవలెను, అప్పుడు వాటి నెరవేర్పు మన అనుభవములో ఉంటుంది. మనలో అనేకులు ప్రార్థించగానే నెరవేర్పు చూస్తున్నారు. అది అనుభవము. మన కష్టాలు తీసివేయమనగానే ప్రభువు వెంటనే తీసివేస్తున్నాడు. అది తాత్కాలికము. ఇది మనకు మిక్కిలి అవసరము. మనలో ఉన్న

1) విశ్వాసము
2) నిరీక్షణ
3) అభిమానము

} సంపూర్ణము కావలెను. ఎప్పుడో నెరవేరవలసిన ప్రవచనము, నెరవేరుటఅవసరమేగాని, అది మనలను విశ్వాసములోను, నిరీక్షణలోను అనుభవములోను ప్రవేశ పెట్టుటకే కదా!

యేసుప్రభువు ఏమి చెప్పారు? మీరు ఆ గ్రామములో ప్రవేశింపగానే గార్ధభము కనబడును అది వెంటనే జరిగినది. అలాగే కొందరికి ప్రార్థనయొక్క నెరవేర్పులు వెంటనే కలుగుచున్నవి. అది తాత్కాలిక ప్రవచనము, తాత్కాలిక నెరవేర్పు; అవి మన కొరకు వ్రాయబడినవి. ఆ మొదటి ప్రవచనము ఎప్పుడు నెరవేరినది? సువార్తలలో ఉన్నట్టు అప్పుడే నెరవేరినది. అయినను, నేను ఒక ప్రశ్నవేస్తున్నాను. ఎప్పుడు నెరవేరినది? ప్రభువు చెప్పినట్టు శిష్యులు చేసినప్పుడే నెరవేరినది. గాని వారు చేయకపోతే, ఆ ప్రయత్నమే లేకపోతే ఏలాగు నెరవేరుతుంది. ***అలాగే మన ప్రార్థనలు, ఆయన తప్పక నెరవేర్చగలడు గాని అవి నెరవేరుటకు, మన ప్రయత్నములుకూడా ఉండవలెను.*** పేతురు, యోహాను అలాగు వెళ్ళలేకపోతే, గార్ధభములు కనబడవు. విప్పడమనేది ఉండదు, వాటిని తోలిపెట్టడముకూడా ఉండదు. కాబట్టి ప్రవచనము నెరవేరవలెనంటే మన ప్రయత్నములుకూడా ఉండవలెను. తాత్కాలిక ప్రవచనముగూర్చి నేను చెప్పుచున్నాను. అయినప్పటికిని చాలాకాలమునకు నెరవేరవలసిన 1000 ఏండ్ల పరిపాలన ప్రవచన నెరవేర్పుకు; రాకడ ప్రవచనమునకు అనగా అది జరిగేటందుకు, మనమేమి చేయుచున్నాము? ఏమియు చేయుట లేదు గాని మనము వాటి గురించి తెలిసికోగలము, నమ్మగలము, ఎదురుచూడగలము. ఈ ప్రకారము అవి చాలాకాలము-నకు నెరవేరవలసినవి. అనగా అవి దీర్ఘకాల ప్రవచనములు.

ఈ ఆదివారమున నెరవేరవలసిన రెండవ ప్రవచనము ఏదంటే! గార్ధభాసీనుడై ప్రభువుండుట; పల్లెటూరి బయటనుండి యెరూషలేము పట్టణము వెళ్లుట. ఈ వెళ్లుట అనేది ప్రవచనము. అది ఏలాగు నెరవేరుట? అందుకే జెకర్యా యేసుప్రభువు సాత్వికుడుగా వస్తాడు, రాజుగా వస్తాడు, నీతి పరుడుగా వస్తాడు, ధీరుడుగా వస్తాడు ఇన్ని లక్షణములు

Bible Mission HQ Guntur

గలవాడై, నీ యొద్దకు వస్తాడని అన్నాడు. ఇప్పుడు ప్రభువు గాడిదమీద వస్తున్నప్పుడు సాత్వికుడై వస్తున్నాడు. **ఆజ్ఞ ఇచ్చుటకు కాదుగాని, శాంతి రాజుగా ఆయన వస్తున్నాడు.** ఆ పల్లెటూరి బయటనుండి యెరూషలేము ప్రవేశించే రోడ్డుమీద అది జరిగింది.

**2వ కథ:–** రెండవ రాకడ, రేపో, మాపో వచ్చును. దాని తర్వాత ఏడేండ్ల శ్రమ, అంతెక్రీస్తు పరిపాలన; ఆ తర్వాత హర్మెగిద్దోను యుద్ధము, ఆ తరువాత శాంతి రాజుగా యేసుప్రభువు వెయ్యేండ్లు ఏలును. యువరాజుగా ఆయన వచ్చును. ఆయన అప్పుడు సమస్త జనులకు దీనుడై కనబడును. జెకర్యా ప్రవచనము ఇక్కడ నెరవేరినట్లు, వెయ్యేండ్ల పరిపాలనలో చక్కగా నెరవేరును. ఇక్కడ గార్ధభాసీనుడై యున్న రాజు, వెయ్యేండ్ల పరిపాలనలో మహిమ సింహాసనాసీనుడై యుండును. కాబట్టి మొదటిది, రెండవ దానికి ముంగుర్తు. ఇది చివరకు వెయ్యేండ్ల పరిపాలన యొక్క ప్రవచనమై పోయినది. ప్రభువు ఎక్కడికి వెళ్ళినాడు? ఆయన వెయ్యేండ్ల పరిపాలనలో, పరిశుద్ధ పరచబడిన యెరూషలేములోనికి ప్రవేశించుటకు ఈ ప్రవచనము సూచనగా ఉన్నది. ఇది వరకు నేను చెప్పినట్లు పరలోకములోనున్న నూతన యెరూషలేము కాదు గాని, భూమిమీద నున్న నూతనపరచబడిన యెరూషలేమునకు ఆయన వెళ్ళినాడు. ఇది ప్రయాణము కావలసిన చోటు. ఆ వెయ్యేండ్ల పరిపాలనలో యేసుప్రభువును, ఆయన శిష్యులును ఈ యెరూషలేముకు వచ్చి, సింహాసనము వేసికొందురు. అప్పుడు ధర్మపాలన జరుగును. జెకర్యా సాత్వికుడన్నట్లు, ఆ వెయ్యేండ్ల పరిపాలనలో ఆ మాటయొక్క అర్థము తెలుస్తుంది. సిలువ మీదకూడా తెలుస్తుంది. కాబట్టి ఇక్కడ నెరవేరినవి, రాబోయే వాటికి ముంగుర్తులై ఉన్నవి. యేసు ప్రభువుతో అక్కడ శిష్యులున్నట్లు, వెయ్యేండ్ల పరిపాలనలోకూడా వారు ఉందురు. ఇక్కడ శిష్యులు నడిచి వెళ్లారు గాని, వెయ్యేండ్ల పరిపాలనలో ఆయనతోపాటు సింహాసనములమీద ప్రభువుతోకూడా కూర్చుంటారు. ఆ ప్రవచనమునకు ఇది తాత్కాలిక నెరవేర్పు గనుక ఈ ప్రవచనము సూచక క్రియా ప్రవచనము. ఇది రాబోయే దానికి సూచనగా ఉన్న క్రియ గనుక ఈ కథ సూచక క్రియా ప్రవచనము. ***కాబట్టి రాబోయే కాలమందు మన అందరికి కలుగవలసిన మహిమ సింహాసనము యెరూషలేములో ఉండునని ఈ ప్రవచనముబట్టి తెలుస్తుంది.*** కాబట్టి దానినిమిత్తమై మనము నిరీక్షించవలెను.

ఇక్కడ కూర్చున్న వారిలో ఎవరు అట్టి నిరీక్షణ గలవారు? ఇప్పుడు ధ్యానించుచున్న మనము, పాత నిబంధనలో జెకర్యా ప్రవచనము విని, పాత నిబంధనలోని భక్తులు ఎదురు చూచినట్లు, మనముకూడా దాని నెరవేర్పు(వెయ్యేండ్ల పాలన)కై ఎదురు చూడవలెను. అందుకొరకే ఈ ప్రవచనము వ్రాయబడినది. 1) ప్రవచనము 2) నెరవేర్పు. మనవారి

మనస్సులోకూడా గొప్ప కలత, విచారము, ఆందోళనే గాని భక్తుల సహవాసము చేసినప్పుడు, ప్రార్థించినప్పుడు, వాక్యము చదివినప్పుడు సమాధానము, సంతోషము వస్తుంది.

ఒక చిన్న పొరపాటుంది. ఈవేళ గందరగోళం గాని రేపు, ఎల్లుండి సంతోషము. మన బ్రతుకు కాలమంతా విచారము, సంతోషమేగాని, **చివరకు సంతోషమే వస్తుంది.** ఆదరణ, సంతోషము, మహిమ, జయము, చివరివరకు మన కూడ ఉండును. కష్టాలిక్కడ ఉండాలి.కాబట్టి ప్రభువు నేర్పిన ఈ మూడు పాఠములు పరలోకములో రాబోయే పాఠము, వెయ్యేండ్ల పాఠము గనుక ఇవి అన్ని కలుపుకొని స్తుతి చేయవలెను. 1) వచ్చిన దావీదు కుమారునికి జయము; 2) వచ్చిన దావీదు కుమారునికి స్తుతి; 3) వచ్చిన దావీదు కుమారునికి సమాధానము; పరలోకములో జయము, మహిమ, సమాధానము.మనకు కూడా విశ్వాసవారసత్వము ఉన్నది. గనుక ఈ సంతోషముతో మీ హృదయాలు నింపుకొనండి.

అట్టి అంతరంగ ఆనందము ప్రాణ ప్రియుడు మీకు దయచేయును గాక. ఆమేన్.

**కీర్తన:** "వాసిగ హెబ్రీ - హెల్లేనీలో - రోమాయిలోను= హోసన్నా హోసన్నా -
ప్రభుని పేరట వచ్చు - మెస్సీయాదావీదు - కొడుకా శ్రీ శుభములు
॥సీయోను కన్యా - సంభ్రమ పడుచు వేయుము కేకలు॥

# లెంటులోని ముప్పది ఐదవ దినము - సోమవారము

## మూడు, నాలుగు మాటల వివరము

యోహాను 19:25-27; మత్తయి. 27:45-46.



**ప్రార్థన:- యేసుప్రభువా! మిక్కిలి ప్రేమగల సమీపస్తులతో సిలువమీద నుండి మాట్లాడిన ప్రభువా! స్తోత్రము. నీవు మాట్లాడిన మిక్కిలి ప్రేమగల మాటల నిమిత్తమై నీకు వందనములు. మిక్కిలి ప్రేమగలవారితో, మిక్కలి ప్రేమగల నీవు, మిక్కిలి సమీప వాక్యములు చెప్పినందున నీకు వందనములు. నేడు ఈ చిన్న ప్రేమ చరిత్ర ద్వారా మాకు నీ సందేశము అనుగ్రహించుము. ఆమేన్.**

విశ్వాస ప్రియులారా! ఈ వేళ యేసుప్రభువు ఇద్దరితో మాటలాడుట చదువుకున్నాము. ఇది వరకు అనగా నిన్న మొన్న, ఇద్దరితో మాట్లాడినారు. 1) మొదటి మాటలో పరలోకపు తండ్రితో, 2) రెండవ మాటలో భూలోకమందు అవిశ్వాసిగా ఉండి సిలువమీద విశ్వాసిగా మారిన వానితో మాట్లాడినారు. ఈ వేళ తల్లితో, శిష్యునితో మాట్లాడినారు. తక్కిన శిష్యులు తోటలో నుండే దూరముగా పారిపోయినారు గనుక దూరస్థులైనారు. కొండమీద కొందరు స్త్రీలు దూరముగా నిలువబడి ఏడుస్తున్నారు. అయితే ఇద్దరు మాత్రమే సిలువకు దగ్గరగా నిలువబడి ఉన్నారని వ్రాయబడినది. వారు ఎవరనగా తల్లి మరియు శిష్యుడు. తల్లితో ప్రభువుచెప్పిన మాట 'అమ్మా నీ కుమారుడు'. శిష్యునితో చెప్పిన మాట 'ఇదిగో నీ తల్లి.'

**1వ ప్రార్థన:-** యేసుప్రభువా నిన్ను కన్న తల్లిని, నీవు ప్రేమించిన శిష్యుని నీ మరణావస్థయందు జ్ఞాపకమునకు తెచ్చుకొన్నావు గనుక నీకు వందనములు. నన్ను జ్ఞాపకము తెచ్చుకొనుము అని అడిగిన శిష్యుడైన, విశ్వాసిగామారిన ఆ నేరస్తుని నిజముగా జ్ఞాపకమునకు తెచ్చుకొన్నావు. ఈ వేళ తల్లిని, శిష్యుని జ్ఞాపకమునకు తెచ్చుకున్నావు. శ్రమకాల చరిత్రలో అనగా మేము నిన్ను జ్ఞాపకము చేసికొనే ఈ కాలములో; అనగా నేటి సాయంకాలము మేము చేయు ఆరాధనలో మమ్మును జ్ఞాపకము తెచ్చుకొనుము. నీవు జ్ఞాపకమునకు తెచ్చుకున్నావనే సంతోషము, ఆ నేరస్తునికి, తల్లికి, శిష్యునికి కలిగించినట్లు మాకును నేటి దినమందు నీ ఆరాధన సంతోషము కలిగించుము. ఆమేన్.

1) మొదటి సంగతి తల్లితో మాట్లాడెను. 2) సంగతి శిష్యునితో మాట్లాడెను. 3) తల్లియొక్క కాపుదల, పోషణ విషయము ఏర్పాటు చేసెను. 4) తాను ప్రేమించిన

శిష్యునికి ఒక పనిని అప్పగించెను. 5) యేసుప్రభువు తన స్వకీయుల యొద్దకు వచ్చెను గాని ఆయన స్వకీయులు ఆయనను అంగీకరించలేదని వ్రాయబడినది. అయితే ఈ సిలువయొద్ద ఆయనను అంగీకరించిన ఇద్దరు స్వకీయుల సంగతి వ్రాయబడినది. ఆయనను అంగీకరించిన నేరస్తుని గురించికూడా వ్రాయబడియున్నది. 6) తన అనేమాటకు అర్ధము 'తన తల్లి'. అది స్వకీయులకు సంబంధించిన మాట. 7) ప్రేమించిన శిష్యుడు: ఈ 7 సంగతులు ఈ మూడవ మాటయందు గలవు.

**2వ ప్రార్థన:-** యేసుప్రభువా! నీవారిని నీవు మరచిపోలేదు. కాబట్టి నీకు వందనములు. బంధుత్వమును మరువలేదు. జ్ఞాపకమునకు తెచ్చుకున్నావు. నేరస్తుడు నీ బంధువుడు కాదు. అయినను విశ్వాసమును బట్టి అతడు కూడా నీ బంధువే. అభిమానమునుబట్టి కూడా నీ బంధువే. అలాగుననే నేడు మేము నీ తల్లివలె నీ బంధువులమే. శిష్యునివలె కాకపోయినా, విశ్వాసమువల్ల మేముకూడా నీ బంధువులము, నీ స్వకీయులము. గనుక నీవు నీ తల్లితో 'అమ్మా!' అని మాట్లాడినట్లు, మాతోనూ పరిశుద్ధాత్మ ఆత్మతో సహవాస భాగ్యముగల ఆదరణమాట మాట్లాడుము. ఆ నీ మాట మాకు వినిపించుము, ఆదరణ కలిగించుము, సంతోషపెట్టుము. విచారముతో ఉన్నవారిని సంతోషపెట్టినట్లు, మా కష్టములనుబట్టి విచారములో ఉన్న మమ్మునుకూడా ఆదరించుము. ఆమేన్.

**3వ ప్రార్థన:-** యేసుప్రభువా! నీతల్లి కొరకు పోషణ ఏర్పర్చితివి. మాకును అట్టి సదుపాయము ఏర్పర్చినావు. ఇకముందుకుకూడా మా విషయమై పోషణ ఏర్పర్చుచుందువని నమ్ముచున్నాము. యేసుప్రభువా! నీ శిష్యునికి ఒక పనిని అప్పగించినావు. అలాగుననే మాలో ప్రతివానికి ఒక పనిని అప్పగించుము. అప్పుడు అప్పగించినావు గనుక ఇకను అప్పగిస్తావు. ఆ పని నమ్మకముగా చేయుటకు శక్తికూడా మాకు ఇస్తావు. గనుక నీకు అనేక వందనములు. పోషణపనిని, పని చేయవలసిన శక్తిని దయచేయవలెనని వేడుకొంటున్నాము. ఆమేన్.

**4వ ప్రార్థన:-** యేసుప్రభువా! నీ తల్లిని చూచి ఎవరైనా 'నీ కుమారుడు ఏమి చెప్పినాడని' అడిగినప్పుడు ఆఖరుమాట సంతోషముతో చెప్పును? యోహానును నీకేమి చెప్పెను? అని ఎవరైనా అడిగితే సంతోషముతో చెప్పును. ఓ యేసుప్రభువా! నీవు చనిపోయేటప్పుడు చెప్పిన మాటలు ఏడునూ సంఘము కొరకే. 7 మాటలు మా కొరకే. మీ ప్రభువు చనిపోయినప్పుడు మీ సంఘమునకు చెప్పినమాటలేవి? అని అడిగితే, ఈ 7 మాటలే మిక్కిలి సంతోషముతో చెప్పుకొనగలము. అట్టి ధన్యత మాకు దయచేయుము. 1) క్షమించే ప్రార్థన, 2) మోక్షములోనికి తీసికొని వెళ్లే ప్రార్థన

3) భూలోకములో ఉన్నప్పుడు మా పోషణ కొరకైన ప్రార్థన. మా పని కొరకు ఏర్పాటు చేసిన సంగతి. ఇవి అన్నియు మేము తలంచుకొని ఇతరులకు నేర్పే ధన్యత అనుగ్రహించుము. ఆమేన్.

**5వ ప్రార్థన:–** యేసూ! నన్ను ప్రేమించినావు. పాపినైన నన్ను ప్రేమించినావు. యేసుప్రభువా! తల్లి ప్రేమ, ప్రేమనిన; శిష్యుని ప్రేమ రొమ్మున ఆనుకొన్న ప్రేమ. ఈ ఇద్దరిదీ గొప్ప ప్రేమ. అందుచేత అందరూ దూరముగా ఉంటే, వారిద్దరు సిలువ దగ్గర నిలువబడి ఉన్నారు అని వ్రాయబడి ఉన్నది. ఓ తండ్రీ! వారిరువురికి నీ మీదనున్న ప్రేమ అట్టిది. అటువంటి ప్రేమ మాకును దయచేయుము అని వేడుకొంటున్నాము. నమ్ముచున్నాము నీకు వందనములు.

**6వ ప్రార్థన:–** యేసుప్రభువా! క్షమించుమని నీవు పలికినప్పుడు పైకి చూచినావు. దొంగతో మాట్లాడినప్పుడు ప్రక్కకు చూచినావు. ***అయితే ఈ వేళ క్రిందకు చూస్తున్నావు.*** అక్కడ నీ తల్లి, నీ శిష్యుడు ఉన్నారు. ప్రభువా! మేము ఇంకా భూమిమీదే ఉన్నాము. ఈ నేలమీదనే ఉన్నాము. ఇంకా పరలోకమునకు రాలేదు. మేము నీ యొద్దకు వచ్చేవరకు మేము నేలమీద ఉన్నంతకాలము మమ్మును చూస్తుండుము అని నీ వాక్యములో వ్రాయబడియున్నది. వారిద్దరి తట్టు చూచినావు అని వ్రాయబడియున్నది. మా తట్టుకూడా బ్రతుకుకాలమంతా చూడుము. మాకు చెప్పవలసిన మాటలు కూడ చెప్పుము నీకు వందనములు. ఆమేన్.

**7వ ప్రార్థన:–** యేసుప్రభువా! వారిద్దరు నీ దగ్గర నిలబడ్డారు. మేముకూడా ఈ మండల కాలములో ఈ పరిశుద్ధ వారములో నీ దగ్గర ఉండే భాగ్యము దయచేయుము. సిలువ దగ్గర ఉండే భాగ్యము దయచేయుము. గుడిలో ఉన్న దేవా! ఆలయములో ఉన్నా, ఇంటిలో ఉన్నా, బయటనున్నా, ఎక్కడ ఉన్నా నీ దగ్గర ఉండేటట్లు వారివలె నీ దగ్గరే ఉండేటట్లు, నీ పాదముల దగ్గరే నీ సిలువ దగ్గరే, నీ సన్నిధిలోనే ఉండేటట్లు మమ్మును నీ ప్రేమచేత నీ తట్టు త్రిప్పుచూనే ఉండుము. ఒకరు మర త్రిప్పుచున్నట్లు నీవు మమ్మును నీ దగ్గరకు త్రిప్పుకొనుచూ ఉండుము. నీకు వందనములు. ఆమేన్.

**ప్రార్థన:–** యేసుప్రభువా! తల్లి ప్రేమ, శిష్యుని ప్రేమ, నీ ప్రేమ, నేరస్తుని ప్రేమ రేపు సాయంకాలము వరకు మేము ఎప్పుడుబడితే అప్పుడు, ఎక్కడబడితే అక్కడ తలంచుకొని నిన్ను వందించే శ్రద్ధ దయచేయుము. నేటి ఆరాధనంతా, ధ్యానమంతా అంగీకరింపుమని వేడుకొంటున్నాము. మరియు ఈ రాత్రి నీ దూతలను మా యొద్ద కావలిగానుంచి సుఖనిద్ర కలుగునట్లు, ఈ నాలుగు దినములైనా అట్టి ప్రేమను జ్ఞాపకము చేయుము. ఆమేన్.

# 4వ మాట. మత్తయి 27:45.

**ప్రార్థన:-** యేసుప్రభువా! నీ బాధ ఎంత గొప్పదో మనుష్యులు గ్రహించలేరు. అంత గొప్ప శ్రమ మా నిమిత్తమై సహించినావు. మామీద నీకున్న ప్రేమ అంత ఎక్కువైయున్నది. మేము గ్రహించ గలిగినంత గ్రహించేశక్తిని మాకు దయచేసి నీ ప్రేమయొక్క లోతును మాకు తెలియజేయుము. వాటినిబట్టి గాఢమైన కృతజ్ఞత ఏర్పడునట్లు, నేడుకూడా వర్తమానము దయచేయుము.

*1. నాదేవా! 2. నాదేవా! 3. నీవు; 4. నన్ను; 5. ఎందుకు 6. చెయ్యి విడిచినావు;* ఇందులో 6 సంగతులున్నవి. నేటి వాక్యములో ఉన్న 6 సంగతులను బట్టి ఆయనకు కలిగియుండిన బాధ ఎంత గొప్పదో! అది 7వ సంగతైయున్నది. మొదటి వాక్యములో ఆయన దైవత్వము కనబడుచున్నది. ఈ వాక్యములో ఆయన మనుష్యత్వము కనబడుచున్నది.

**1వ ప్రార్థన:-** యేసుప్రభువా! నీ క్షమాపణ కార్యమువల్ల నీవు కేవలము దేవుడవై యున్నావని తెలిసిపోయింది. నేటి వాక్యమునుబట్టి నీవు పూర్తిగా దేవుడవే కాక, కేవలము మనుష్యుడవే అని తెలిసింది. నీవు దేవుడవు కాకపోతే క్షమించవు. నీవు మనుష్యుడవు కాకపోతే నా దేవా! నా దేవా! నా చెయ్యి ఎందుకు విడిచినావు? అని అనవు. మనిషివి గనుక అన్నావు. ఆ నీ బాధ గ్రహించుటకు మా తెలివి చాలదు. అంత గొప్ప శ్రమ సహించినావు గనుక నీకనేక వందనములు.

**2వ ప్రార్థన:-** యేసుప్రభువా! ***మనుష్యుడవుగా! నీవు పడిన శ్రమల ఎదుట మా శ్రమలు ఏ పాటివి?*** మాకు శ్రమలు వచ్చినప్పుడు నీ శ్రమలు తలంచుకొని ఆదరణ పొందుదుము. నీకు వచ్చిన శ్రమలవంటి శ్రమలు విశ్వాసులకు కూడా రావచ్చును. గాని అంత అధికమైన శ్రమలు రావు. వస్తే విశ్వాసులు సహితము నాశనము కావలసినదే. నీవు సహించినావు. దైవత్వముతో సహించలేదు, కేవలము మనుష్యత్వముతోనే సహించినావు. కాబట్టి నీకనేక వందనములు. నీవు సహించకపోతే మేము సహించలేము. మేము సహించవలసివస్తే మాకు నిత్య నాశనమే. అందుచేత అంత బాధ మాలో ఎవరికిని కలుగనియ్యవు. కాబట్టి నీకు వందనములు. ఆమేన్.

**3వ ప్రార్థన:-** యేసుప్రభువా! గొప్పవ్యాధి, సహించలేని బాధతో ఊపిరాడని ఒక మనుష్యుడు కెవ్వున కేక వేసినట్లు నీవు నా దేవా! నా దేవా! అని కేక వేసినావు. ఎంత బాధలేకపోతే అంత కేక వేయగలవు? ప్రభువా! అనేక వందనములు. క్షమించే శక్తిని మొదటి మాటలో కనబడేటటట్లు చేసిన **నీవు ఈ మాటతో సహించేశక్తిని నరశరీరముతో కనబర్చినావు.** కాబట్టి నీకు వందనములు.

**4వ ప్రార్ధన:-** యేసుప్రభువా! మొదటి మాటలో నీవు దేవుని వరసలో ఉన్నావు. అందుచేతనే తండ్రీ! అని పిలిచినావు. ఈ మాటలో నీవు మనుష్యుని వరుసలో నిలువబడి ఉన్నావు. అందుచేతనే నా దేవా! అన్నావు. నా తండ్రీ! అని అనలేదు. కాబట్టి నీకు వందనములు. ఎందుకంటే మనుష్యుల వరసులోనికి దిగిపోయినావు. ***సింహాసనము మీదనున్న దేవుని వరుసలోనుంచి భూమిమీద నున్న పాపాత్ముని యొక్క వరుసలోనికి దిగివచ్చినావు.*** కాబట్టి నీకు వందనములు.

**5వ ప్రార్ధన:-** యేసుప్రభువా! లోకములో పాపము ప్రవేశించినది గనుక ఎంత భక్తుడైనా ఇట్టి బాధను సహించలేడు. సహించగలిగిన దానికంటే ఎక్కువ బాధ మాకు రానియ్యవు అని వ్రాయబడి యున్నది. అయితే మేము సహించి ఉన్న దానికంటే, మేము సహించగలిగినటువంటి బాధకంటే నీవు ఎక్కువ సహించినావు గనుక నీకు వందనములు.

**6వ ప్రార్ధన:-** యేసుప్రభువా! ఆరు బానలు నింపించినట్లు, మా హృదయములు కృతజ్ఞతతో నింపబడినప్పుడు- ద్రాక్షారసము త్రాగినప్పుడు (ఉన్నంత తాగినవి) మీ హృదయములు కృతజ్ఞతతో కనబడును. ఆ బాధకు సమానమైన మన కృతజ్ఞత చాలదు. నా దేవా! నా దేవా! అని వేసిన కేకకు సమాధానముగా మా కృతజ్ఞత చాలదు. అయినను స్వల్పమైనప్పటికిని మా కృతజ్ఞత నీకు సంతోషము. నీవు మెచ్చుకొను నటువంటిది. గనుక నీకు వందనములు. ఆయన ఎంత వరకు బాధపడెనో అంతవరకు స్తుతించలేము గాని మన స్తుతికూడా ఆయనకు ఒక రకమే..

**బోధ:-** యేసుప్రభువుయొక్క అవతారమువంటి అవతారము లేనే లేదు. ఆయన బోధయొక్క సారమువంటి సారము మరియొకటి లేదు. ఆయన అద్భుత కార్యములవంటి అద్భుతాలు లేనే లేవు. ఆయన మరణమువంటి మరణము లేనే లేదు. ఆయన బాధవంటి బాధ లేనే లేదు. కాబట్టి ఆయనకు వందనములు చేయవలెను. ఎన్ని వందనములు చేసినా ఆయన బాధకు సమానము కాదు. ఆ బాధ లోకములో ఉన్న పరమ భక్తులలో గొప్పవాడైన మనుష్యుడుకూడ సహించలేడు. పాపములేని దేవదూతలుకూడా సహించలేరు. గనుకనే వారికిని ఈ బాధ రాలేదు. ఎందుకంటే లోకములో ఉన్న మనుష్యులందరి పాపాలు, బాధలు ప్రభువు మీద వేయబడినవి. దూతలే సహించేపనైతే కోట్ల దూతలు వచ్చి సహింపులో పాలుపొందుదురు. అంత గొప్ప శ్రమ కలిగినది. సిలువమోస్తు తూలిపోయినాడు. అందుకే ఒక మనిషికెత్తిరి. సిలువపైని శ్రమ అసాధరణమైన శ్రమ. అది బల్లెపు పోట్లుకంటే ఎక్కువ పోటు.

మేకుల పోట్లకంటే ఎక్కువ పోటు. ప్రక్క పోటుకంటే ఎక్కువ పోటు. అందుకనే వర్ణించుటకు ఏ కవీశ్వరునికి చేతకాదు. ఫలాని బాధ లేదు అని అనడానికి లేదు. అందుకనే దేవుని కుమారుడని చెప్పగలము. దేవుని కుమారుడు దైవశక్తితోకాక, పాపములేని మనుష్యుని శక్తితో సహించెను. దైవశక్తితో సహించిన మనిషి నీరసముగా మాట్లాడును. గాని ప్రభువు పాపములేని మనిషి శక్తివల్ల సహించెను. దైవశక్తి అయితే అది బాధే కాదు. మనిషి శక్తితో అంత గొప్ప శ్రమను అనుభవించెను. లోకము గ్రహించినా, గ్రహించక పోయినా మనము కొద్దిగా గ్రహించుచున్నాము. అందుకనే హృదయములు నింపుకొని వందనములు చెప్పుకుంటున్నాము. ఇట్టి బాధమీదే ప్రార్ధనలు కల్పించిచేయండి.

ఈలాగు కృతజ్ఞతాస్తుతులు చెల్లించగల అంతరంగమును, వరుడు ఈ శ్రమకాల ముగింపు దినములలో మీకనుగ్రహించును గాక. ఆమేన్.

**కీర్తన:** *"తల్లికి నొక సంరక్షకుని-ఎల్లరకు మాదిరి-కనపరచినావా!=తల్లికి సృష్టి కర్తవై-ప్రేమ తనయుండవై గౌరవించి యున్నావా!"* ॥ఏడు॥

*"నరుడవు కాకున్న యెడల-దేవా! నన్నేల విడిచితి-వని యడిగినావా!= నరుడవును దేవుడంవును - గాన-నా పూర్ణ రక్షకుడవని ఋజువైనావా!"* ॥ఏడు॥



# లెంటులోని ముప్పది ఆరవ దినము - మంగళవారము

## 5వ మాట వివరము; సిలువ ద్వారము

యోహాను 19:28.



**ప్రార్థన:- తండ్రీ! మా నిమిత్తమై మిక్కుటమైన శ్రమను పొందినందున సిలువపై నీకు దాహమాయెను. జీవజలదాతా! 'నేను దప్పిగొనుచున్నాను' అను మాటను మేము ఏమి గ్రహించగలము? ఏమి వివరించగలము! మా దాహార్తి తీర్చుటకు నీవు దప్పిగొన్నావు. నీకు దాహమిచ్చుటకు నేటి దిన మా వాక్య దాహార్తిని తీర్చుమని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

అటు తరువాత సమస్తమును అప్పటికి సమాప్తమైనదని యేసు ఎరిగి, లేఖనము నెరవేరునట్లు నేను దప్పిగొనుచున్నాను అనెను. మహాశ్రమలో సిలువమీద వ్రేలాడుచు పలికిన ప్రభువు మాట ఇది. మనకు దాహమెప్పుడగును? దాహము తీరుటకు ఏమి చేయుదుము? ఇది మన అనుభవములోనిదే గనుక దానికి వివరమక్కరలేదు. దాహములు ఎన్ని? ***1) శరీరమునకు కలుగు దాహము. 2) కోర్కెల దాహము (హృదయములోనిది).*** ఉదా:- పనులు ఎక్కువగా నున్నప్పుడు ఆ పనులు ముగించుటకు 1) శరీరమంతయు పనిలో ఉండును. 2) మనస్సంతయు ఏకీభవించును. 3) జ్ఞానమంతయు వాడుటలో శరీరము కదిలి, శరీరమునుండి చెమట కారి, రక్తములోని నీరు ఖర్చుయినప్పుడు దాహము కలుగును. నీరు త్రాగినప్పుడు దాహము తీరును. ఇది మొదటి దాహము.

2. ఏ ఫలితము కొరకు ప్రభువు అంత కష్టపడెనో, ఆ పని ముగింపు తరువాత, తాను నిరీక్షించిన ఫలితము (జీతము) రాకపోవుట అనునది మరొక దాహము. చెమట ఓడ్చి పనిచేసితిని, ఫలములేకుండ వ్యర్థమైపోయినది. అదే దాహము. ఫలితము రాగా దాహము తీరును, తృప్తి కలుగును. యేసుక్రీస్తు ప్రభువునకు సిలువమీద కలిగిన దాహము మన దాహమువంటిదేనా? ఆయన దాహము తీరినదా?

నరావతారమునకు పూర్వము యేసుక్రీస్తు దేవుడుగా దేవలోకములో ఉండు దేవుడు. ఆయనకు భూమిమీద ఒక గొప్ప పని ఉన్నది. ఆ పనినేమి? భూమిపైనున్న పాపులందరకు రక్షణ సంపాదించవలెను. ఈ పని ఆయన తప్ప మరెవ్వరును చేయలేరు గనుక ఆయనే రావలెను. గనుక నరుల మధ్యకు నరావతారియై వచ్చి, యేసుక్రీస్తు అను పేరు పెట్టుకొనెను. ఆయన భూమిమీదికి రాకపూర్వము దేవుడుగా నుండి భూమిపై మరొక పని చేసెను. సర్వజనులలో యూదులను ఏర్పర్చుకొని, వారికి న్యాయాధిపతులను, ప్రవక్తలను ఇచ్చి, వారికి మెస్సీయా అను క్రీస్తు అవతారమును

Bible Mission HQ Guntur

గూర్చియు, ఆయన వచ్చి చేయు పనులను గూర్చియు చెప్పి వారిని సిద్ధపరచి, రాబోయే మెస్సీయయందు ప్రేమ, భక్తి పుట్టునట్లు చేసెను. అందుచేత వారు ఎల్లప్పుడును మెస్సీయ్యాను గురించి చెప్పుకొనిరి. ప్రవక్తల వ్రాతలు చదువుకొని, ఆయన వచ్చే వేళయైనదని కనిపెట్టిరి. ఆయన నరావతారియైన తరువాత ఆయనకున్న దాహమును సిలువమీద బైలుపర్చుకొనుటకు ముందు సమరయ స్త్రీకి నూతివద్ద బైలుపరచెను. వారిరువురి సంభాషణంతయు చదువగా ఆ సంగతి తెలియును (యోహాను 4:7). యేసుప్రభువు సమరయ స్త్రీని ఏమని అడిగెను? 'నాకు దాహమునకిమ్ము!' ఇక్కడ యేసుప్రభువు నీళ్ళిమ్ము అని అడుగలేదు. గాని నీవును, యూదులును ఎదురుచూచుచున్న మెస్సీయ అనబడిన క్రీస్తును నేనే అని చెప్పెను. **ఆమె జీవజలమును తెలిసికొనవలెను అనునదియే ఆయన దాహము.** అట్లు తెలుసుకొంటే ఆమె నమ్మును. అప్పుడు ఆమె ఏమి చేయును? ప్రభువును ప్రార్థించును. ఆ ప్రార్థన ఏమిటీ? వస్తానని చెప్పి వచ్చినావు గనుక నన్ను క్షమించు అని ప్రార్థించెను. ఇదెట్లు? **ఆయనే ఆమెను ప్రార్థించి, ఆమెచేతే ఆ ప్రార్థన చేయించుకున్నాడు.** నాకు దాహమునకిమ్ము. నేను క్రీస్తునని నమ్మును. ఈయన ఆమెకు ప్రార్థన నేర్పి, ఆమెచేత ప్రార్థన చేయించి, ఆమెకు జీవజలమును ఇచ్చెను. ఆమె గ్రామములోని అందరు గ్రామము విడిచి పనులు మాని, నూతివద్దకు వచ్చిరి. వారిచేతను ప్రార్థన చేయించుకున్నాడు. ఆమెయు, ఆ గ్రామస్థులును ఈయన రావలసిన మెస్సీయ అని నమ్మిరి. గనుక ఆయన దాహము తీరినది. అన్యులు ఆయన దాహము తీర్చిరి. ఆయన వారికి జీవజలము ఇచ్చెను. ఆ జీవజలము ఏది? 1) మెస్సీయ వచ్చినాడు. 2) మేము ఆయనను చూచితిమి. 3) ఆయన మాటలు వింటివి. 4) మేము చేసిన పాపములు చెప్పినాడు. 5) వాటిని క్షమించినాడు. 6) మా పాపము మాన్పి, ఆయన మమ్ములను చేర్చుకున్నాడను సంతోషమున్నది. అది ఆయన దాహము. వారాయన దాహమును తీర్చిరి. ఆయన వారికి జీవజలము ఇచ్చెను (యోహాను 7:38).

ప్రభువు తన్ను ప్రేమించిన స్వజనులయొద్దకు వచ్చినాడు. ఆ ఎన్నికజనులైన యూదులు ఆయన దాహము తీర్చలేదు. ధర్మశాస్త్రములో చదివి నేర్చుకొని, ఎవరి రాకకొరకు ఎదురుచూస్తున్నారో, ఆ మెస్సీయ్యాను నేనే. నేనే అసలైన మనిషిని, అసలైన దేవుడను. నేను మీ తండ్రినని చెప్పకుండా ఔనో, కాదో మీ ధర్మశాస్త్రములో నన్నుగూర్చి వ్రాయబడినవన్ని జరుగుచున్నవో లేదో చూడండి అని తన మాదిరి ప్రవర్తనను కనుపరచి, బోధలు వినిపించి, స్వస్థత పొందినవారిని చూపి, మృతులను లేపి, అద్భుత ఆహారముపెట్టి, సృష్టిమీద తన అధికారము చూపి, దురాత్మలను వెడలించి, గ్రుడ్డివారికి కండ్లు, చెవిటి వారికి వినికిడి, కుంటివారికి నడక ఇచ్చి తన దేవత్వమును వెల్లడిచేసెను. శాస్త్రులు, పరిసయ్యులు, ప్రధాన యాజకులు ఇవన్నీ చూచి, ఆయనను పరీక్షించి

మనము ఎదురుచూచు మెస్సీయ ఈయనే. 'మన మెస్సీయ వచ్చినాడు' అని శాస్త్రులు పరిసయ్యులకు, పరిసయ్యులు సంఘమునకు చెప్పి, అందరు ఏకమై ఆయనయొద్దకు వచ్చి ప్రభువా! వచ్చావా? నమస్కారము. మమ్మును రక్షించుమని ప్రార్థించితే, ప్రభువునకు దాహము తీరియుండును. వారికి రక్షణ జీవజలముగా వచ్చేయుండును. అట్లు జరుగలేదు గనుక ఆయన దాహము తీరలేదు.

ఉదా:- సమరయ స్త్రీకి ఒక గుర్తు చూపినాడు. అతని పనులు పాపమని ఆమె అనుకొనని పాపమును ఆమెలో చూపినాడు. ఆమెను అసహ్యించుకొనకుండ, దాచకుండ ప్రేమతో మాట్లాడి ఒక్కమాటతోనే, ఆమె ఆయనను మెస్సీయ అనునట్లు చేసెను. యూదులకు మూడున్నర సంవత్సరములు ఎన్నో చూపినను వారు గుర్తించలేదు. అది ఆయన దాహము. చివరగా సిలువమీద బాధలోనుండి, వారు కనిపెట్టే మెస్సియాకు విధించిన శిక్షనుబట్టి వారికెట్టి శిక్ష రాబోవుచున్నదో అది చూస్తు, అది రాకుండా చేయుటకై వారిని క్షమించిన క్షమాపణ మాటలు వినియు వారు మారలేదు. ఇంత ప్రయాసపడిననూ, సిలువమీద ఆయన పడుచున్న శ్రమలు చూచువారికి రవ్వంతైనా జాలిలేకపోవుట; వారికున్న ద్వేషము, క్రోధము, తీక్షణమైన కోపము ఎండవలె ఆయన నెత్తిని కాల్చుచుండగా; మరొక ఎండ అనగా ఆకాశములో సూర్య కిరణములు గాయములున్న ఆయన దేహమును కాల్చుచుండగా, ప్రభువునకు ప్రియులైన ఎన్నిక జనులు రక్షణను నిరాకరించినందున ఎండకు పడిన ప్రయాస అంతయు నిష్ఫలమైనట్లుగా దాహముండెను. గనుక 'నేను దప్పిగొనుచున్నాను' అని సమరయ స్త్రీని నూతివద్ద ప్రార్థించినట్లు, సిలువమీద వుండి సిలువ క్రిందనున్న శపించు తనవారిని, (ఈ పరిశుద్ధుడైన తన్ను మెస్సియాను) నమ్మండి' అని ప్రార్థించి ప్రాణము విడిచెను. సమస్తమును అప్పటికి సమాప్తమైనదని ఆయన ఎరిగి, వారి ఎదుట ఆయన చేయవలసిన పనులన్నియు ముగించి, వారిచేత అనిపించుకొనుటకు ఎన్నో ప్రయాత్నములు చేసినాడు గనుక ఇక చేయవలసినవి లేవు అని అర్థము. ఈలాగు జరుగునని ముందుగానే దావీదుకు బైలుపరచెను (కీర్తన 69:21).

దాహముతో ప్రభువు చనిపోయెను. ఆయన శరీరమునకున్న దాహమైనా వారు తీర్చక చిరకనిచ్చిరి. ఎంత కఠినాత్ములు? మనము ప్రభువునకున్న దాహము తీర్చుదము. నా నిమిత్తమే వచ్చెను, బోధించెను, శ్రమపడెను, సిలువ వేయబడెను, చనిపోయెను, లేచెను, వెళ్లెను. నా నిమిత్తమై వచ్చును. అని నమ్ముటవలన, నమ్మి నమస్కరించుట వలన; ఇవన్నీ చేసినయెడల మనము ఆయన దాహము తీర్చువారమౌదుము. అట్లు నమ్మువారికి జీవము గల రక్షణ వచ్చును.

అట్టి స్థితి దప్పిగొన్న ప్రభువు నేడు మీకందరకు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన:*** *"ఎన్నికజనుల ద్వేషంబు-నీకు-ఎండయైనందున-దప్పిగొన్నావా!= ఉన్న*
*ఎండకును బాధకును-జిహ్వా-కూట లేనందున-దాహమన్నావా!"* ॥ఏడు॥

Bible Mission HQ Guntur

# లెంటులోని ముప్పది ఏడవ దినము - బుధవారము

## ఆరు, ఏడవ మాటల వివరము ;

**విమోచకుడు-విజయరూపము; యోహాను 19:30.**



**ప్రార్థన:- తండ్రీ! మా నిమిత్తమై నీవు చేయవల్సిన పనులన్నీ చేసి ముగించినావు. నీ జన్మము, నీ జీవితము, నీ చివరి ప్రయాస అన్నీ మా కొరకే. నీ పావన తనువంతయూ మా కొరకే ఇచ్చినందుకు వందనములు. ఈలాగు మమ్మును సంపూర్ణులుగా చేయుటకు మా కొరకు చేయవల్సిన పనులన్నీ చేసినందుకు స్తోత్రములు. నేడునూ నీ వాక్య వివరమును దయచేయుదువని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

కలువరిగిరిపై సిలువ ప్రసంగ పీఠముపై నుండి భూమిమీదనున్న పాపాంధకారములో మరణాంధకారమును పాయలుగా చీల్చుకొని పాతాళపు నరకాగ్నిలోనుండి అంధకార అధికారులతో యుద్ధము చేసి అపవాదిని వాని దూతలను నిరాయుధులుగా చేసి సిలువ రక్తము చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి అనగా పాతాళములో బంధించి, విజయానందముతో పలికిన ఆరవ మాట. మరియు ప్రభువు తన శిరస్సును ఏటవాలుగ పెట్టి నొక నేత్రములో పరలోకపు తండ్రిని చూచుచూ పరలోకపు తండ్రీ! చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమ పరచితిని. మరియు నరుల రక్షణ కొరకు చేయవలసిన పనులన్నియు సంపూర్ణముగా చేసియున్నానని సంతోషముతో పలికిన ఆరవ మాట. ప్రభువు మరియొక నేత్రముతో భూలోకమంతటిని చూచుచూ, సర్వలోకమా! సర్వలోకములోని సర్వ జనాంగములారా! మీరు పొందవలసిన సమస్త బాధలు, వ్యాధులు, శాపములు, మరణము, నరకము, నేను మీ పక్షముగా అనుభవించి యున్నాను. ఇకమీకు రెండవ మరణమనే నరకము లేదు. మీ పక్షముగా చేయవలసిన రక్షణ కార్యక్రమములన్ని చేసి ముగించియున్నాను. కాబట్టి మీ కొరకు సిద్ధపరచిన రక్షణ, మోక్ష భాగ్యములను అందుకొని అనుభవించండని వధువు సంఘమును చూచుచూ వరుడు పలికిన ఆరవ మాట.

విమోచింపబడిన వారలారా! విమోచకుని విజయరూపమును ధరించుకొందురు గాక! 'సమాప్తము' అను ఈ మాట చిన్న మాటగా కనబడినను విలువైనది. ఏది సమాప్తమైనది? ఏది ముగిసినది? ఏది నెరవేరినది? అను ఈ మాటలోని విషయములను పరిశీలన చేసికొందము. ఎ) దేవుడు అనాది కాలములో ఆయన సంకల్పించిన రక్షణ కార్యక్రమము "సమాప్తమైది'. యేసుప్రభువు జగత్తు పునాది వేయబడక మునుపే ఇహలోకములో మానవ జీవితమును జీవించవలెనెడి రక్షణ కార్యక్రమము ముగిసినది.

ప్రభువు తన ప్రజలను వారి పాపములనుండి రక్షించుననెడి రక్షణ కార్యక్రమము సమాప్తమైనది. ప్రభువు 30 సం॥లు సిద్ధపడియున్నారు. మూడున్నర సం॥లు బాహాటముగా బోధించినారు. మూడవ దినమున మృత్యుంజయుడై లేచి దైవ సంకల్పమును సమాప్తి చేసెను. బి) పరలోకపు తండ్రికి తనయుడుగా ప్రభువు బయలు పర్చుకొనియున్నాడు. అనగా నన్ను పంపిన వాని చిత్తమును నెరవేర్చుటకే పరలోకము నుండి దిగివచ్చియున్నానని చెప్పియున్నాడు. అందువలన తండ్రి తనకప్పగించిన పనులు ఈ లోకములో నెరవేర్చుటకే వచ్చి యున్నాడు. అనగా నన్ను పంపిన వాని చిత్తమును నెరవేర్చుటకే పరలోకము నుండి దిగివచ్చియున్నానని చెప్పియున్నాడు. అందువలన తండ్రి తనకప్పగించిన పనులు ఈ లోకములో నెరవేర్చుటకే వచ్చియున్నాడు. తండ్రియందు నేను, నాయందు తండ్రి ఏకమై యున్నామని చెప్పినాడు. తండ్రీ! నీవు నా చేతికి అప్పగించిన పని పూర్తిగా నెరవేర్చి యున్నానని చెప్పినాడు. ఈ పని ముగిసినది. ఈ కార్యక్రమములు ఆయన మరణించుట ద్వారా ముగిసినవి. సి) పాత నిబంధన గ్రంథములో తనను గూర్చి వ్రాయబడిన లేఖనములన్నియు నెరవేర్చబడినవి. ప్రవచనములను అనగా ధర్మశాస్త్రమును కొట్టివేయుటకు కాదుగాని, నెరవేర్చుటకే వచ్చియున్నాను. అనే మాట నెరవేర్చియున్నాడు. సుమారు పాత నిబంధనలోని 200 ప్రవచనములు నెరవేరినవి. డి) సైతాను ఓడించబడుట. సాతాను, ప్రభువు మడిమను కరచుట. "సమాప్తమైనది". ఈ హింసాకాండ చివరి దశ దాహమునకు చిరకనిచ్చుట ఇదికూడ ముగిసినది. పాపపు ముల్లు విరగగొట్టబడెను. ఇది కూడ నెరవేర్చబడినది. అనగా రక్షణ సంకల్పనము, సాతాను సంహారము, ధర్మ శాస్త్రము సమాప్తమాయెను.

సమాప్తమనే చిన్న మాటతో సైతాను తల చితుక గొట్టబడెను. భూమిమీద ప్రభువును సాతాను సిలువ వేయించినది. సమాప్తమైనదనే మాట పలుకుట వలన ప్రభువు కాళ్ళ క్రింద సాతాను సిలువ వేయబడెను. ప్రభువు, తాను కాళ్ళ క్రింద త్రొక్కుట మాత్రమే కాక వధువు సంఘమునకు గూడ అట్టి అధికారమిచ్చెను. రోమా. 16:20. ఈ చిన్నమాట ద్వారా పరలోకమునుండి పడద్రోయబడిన ప్రధానదూత లూసిఫర్ నరకములో నొకమూలకు త్రోయబడెను. యెషయా 14:18. మరియు చీకటి బిలములో బంధింపబడినది. యూదా 6. పెండ్లికుమార్తెకు సాతానును వాని దూతలను బంధించు అధికారమను గ్రహింపబడెను. మత్తయి 16:18. మరియు పరలోకపు తాళపు చెవులు, భూలోకపు తాళపు చెవులు, పాతాళ లోకపు తాళపు చెవులు, వధువు సంఘమునకు అనుగ్రహింపబడెను. అనగా సాతానుకు, వాని దూతలకు నిత్యాగ్ని గుండము ప్రక. 20:10. వధువు సంఘముకు యుగయుగములు సింహాసనాసీనులై రాజ్యమేలు మహాభాగ్యము అనుగ్రహింపబడెను. అట్టి భాగ్యము నేటి దినధ్యానమునుబట్టి ప్రభువు మీకు అనుగ్రహించునుగాక. ఆమేన్.

# ఏడవ మాట; సజీవుడు - మహిమ రూపము;

**'తండ్రీ! నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" లూకా 23:46.**

సిలువధ్యానోపదేశకులారా! కలువరి సిలువ బలిపీఠముపై వధింపబడిన దేవుని గొర్రెపిల్లయైన ప్రభువు పాతాళ గర్భములో ప్రవేశించి పునాదులను పెకిలించివేసి పాతాళలోకపు పరదైసును పరలోకపు పరదైసుగా మార్చెను. అనగా మొదటి ఆదాము పాపము వలన పరదైసు అను ఏదెను తోటద్వారము మూయబడెను. అలాగే రెండవ ఆదామైన ప్రభువు సిలువ ద్వారా పరలోక పరదైసు ద్వారము తెరువబడెను. ప్రభువు ప్రారంభములో పలికిన మొదటి మాట తండ్రి, అలాగే సిలువలో మొదటి మాట తండ్రి. చివరి మాట కూడ తండ్రియని సంబోధించుచు పరలోక తండ్రివైపు చూచుచు తనయుడు పలికిన ఏడవ మాట. ఈ మాటనుబట్టి చూడగా ప్రభువు తన జీవిత పర్యంతము తండ్రిని ఘనపరచుచున్నారు. తండ్రిలోనుండి తనయుడు వచ్చినట్లుగా తనయునిలో నుండి వచ్చిన పెండ్లికుమార్తె జీవితాంతము ప్రభువును ఘనపరచు చుండవలెను. తండ్రి తన కుమారుని తాత్కాలికముగా నాల్గవ మాటలో విడచి పెట్టినట్లు కనబడుచున్నది. గాని ఆయన నన్ను విడువలేదు. కాబట్టి నా ఆత్మను తండ్రికి అప్పగించుచున్నానని చెప్పుయున్నాడు. ఉదా: తల్లి ఒడిలో బిడ్డ పండుకొని తన ఆటబొమ్మను తల్లిచేతికి అప్పగించెను. ఆ బిడ్డ లేచిన తరువాత తన బొమ్మను తాను తీసికొనెను. ఆ విధముగానే ప్రభువు శుక్రవారము తన తండ్రికి ఆత్మను అప్పగించి ఆదివారము తన ఆత్మను తాను తీసికొనెనను. ఆయనకు మరణముపై అధికారము కలదు. యోహాను 10:18 మరణమనగా తండ్రి చేతికి తన యాత్మనప్పగించుటయే.

చావు అనునది మనకు గొప్ప మర్మముగా నున్నందున చావంటే సహజముగా భయము తోచును. ప్రభువు పలికిన ఈ మాట చూడగా భక్తుని యాత్మ శరీరమును విడువగానే తండ్రి చేతిలోకి బోవునని స్పష్టము. ఇదే మనకు చాలును. ప్రసంగి 12:7 మన తండ్రి చేతిలోకి వెళ్ళిన తరువాత నిత్యకాలము మనకు క్షేమము. ఈలాగు మనము ఆలోచించిన మరణమునకు భయపడనక్కరలేదు. తండ్రి చేతిలోకి పోవుటకు ఏ బిడ్డయైన భయపడునా? భక్తునికి మరణము అట్టిదే. దేవుడు ఆయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. 1థెస్స. 4:14. మరియు రెండవ రాకడ దినమున రాకడ విశ్వాసులకు సంతోషము, సన్మాన దినము. అవిశ్వాసులకు అంధకార దినము. ఆపద్దినము. సిలువ నాధునికి మానవ శరీరము పోయి మహిమ శరీరము వచ్చినది. అనగా ఆయనకు మరణము మనకు పునరుత్థానము. మహిమ దినము, మకుటము ధరించుకొను దినము. విమోచన దినము. విశ్రాంతి దినము. మనము మార్పుపొందుదుము, మేఘముల మీద కొనిపోబడుదుము.

సిలువ వీరులారా! సిలువ నాధుని ధ్వజమెత్తుకొని సంపూర్ణులముగా పరమునకు సాగిపోవుదము గాక. ఈ దినము పస్కాపండుగ దినము. లేక మంచి శుక్రవారము. పాత నిబంధనలో ఫరో దాస్యపు విమోచన కొరకు గొర్రెపిల్ల వధింపబడిన దినము పస్కా. అలాగే క్రొత్త నిబంధనలో పాపమనే ఈ లోక దాస్యము నుండి విమోచించుటకు దేవుని గొర్రెపిల్లయైన ప్రభువు వధింపబడిన దినమే మంచిశుక్రవారము. ఈ పండుగ దినమున సాయంకాలు మూడు గంటలకు బలిపశువులను వధించెదరు. మన పస్కా గొర్రెపిల్లయగు ప్రభువు సాయంకాలము మూడుగంటలప్పుడు పాపప్రాయశ్చితార్ధ బలిపశువుగా వధింపబడి తన ఆత్మను దేవునికి అప్పగించుకొనెను. ఈ దినమున ప్రపంచములో చెదరియున్న ఇశ్రాయేలీయులందరు యెరూషలేము పట్టణము దేవాలయమునకు వచ్చి ఒక్కొక్క కుటుంబమునకు ఒక్కొక్క గొర్రెపిల్ల చొప్పున పాపపరిహారార్ధము బలిగా అర్పింతురు. లక్షలాది గొర్రెపిల్లలను వధించగా ఆ రక్త ప్రవాహము కెద్రోను వాగుద్వారా పట్టణము వెలుపలనుండి ప్రవహించును. అలాగే ప్రభువుయొక్క రక్తధారలు యెరూషలేము పట్టణ వీధులు మాత్రమేగాక ప్రపంచమందలి ప్రతి వీధిలో రెండువేల సం॥ల నుండి ప్రవహించుచున్నది. మనము నీతిమంతులముగా తీర్చబడు పర్యంతము ప్రవహించుచునే యుండును. రోమా. 5:9.

తండ్రీ! అనాదిలో నీలోనుండి బయలుదేరినప్పుడు ఏ మహిమతో ఉన్నానో ఆ మహిమతో "నా ఆత్మను నీచేతికప్పగించుచున్నాను" అని పలికెను. తండ్రీ! నేను పాప లోకములో జీవించినప్పటికిని లోకమాలిన్యమేమి అంటించుకోలేదు. పరిశుద్ధముగానే "తండ్రీ! నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను" అని తండ్రితో చెప్పెను. లోకముతో వధువు సంఘమా! నా పిల్లలారా! నేను పుట్టక మునుపు నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమకు వెళ్ళుచున్నాను. మీరు కూడ అక్కడికి వస్తారు. గనుక మరణించిన తరువాత తలవంచుతాము. గాని ప్రభువుమీద మరణమునకు అధికారము లేదు. గనుక ముందే తలవంచి మరణమా! రా! అని పిలిచినారు. సిలువలో ఆయన మరణించి, మన మరణమును మరణింపచేసారు. ప్రభువు సిలువలో పలికిన ఏడు మాటలద్వారా నరులకు సంపూర్ణ రక్షణ, సాతానుకు సంపూర్ణ అపజయము కలిగినది.

ఈ ఏడు మాటల ధ్యానముద్వారా ధ్యానపరులకు రావలసిన దీవెనలు అనుగ్రహింపబడును గాక!

***కీర్తన:*** *"పాపుల రక్షణ కొరకు-చేయ-వలసిన పనులెల్ల-ముగియించినావా!=ఆ పగలు*
*పగవారి పగలు-తుదకు-అంతము కాగా సమాప్తమన్నావా!"*
*"కనుక నీ యాత్మన్ మరణమున-నీదు-జనకుని చేతుల కప్పగించితివా!=*
*జనులందరును ఈ పద్ధతిన్-కడను అనుసరించు-నట్లు-అట్లు చేసితివా" ॥ఏడు॥*

# లెంటులోని ముప్పది ఎనిమిదవ దినము - గురువారము

## పాద శుద్ధికరణ పరిచర్య

యోహాను సువార్త 13వ అధ్యాయము



ప్రార్థన:- తండ్రీ! మా నిమిత్తమై వచ్చిన నీవు మా కొరకు చేసిన పరిచర్యలన్నియు వివరించుటకు మా జ్ఞానము చాలదు. నీవు చేసిన పరిచర్యలను అందుకొనుటకు మా యోగ్యత చాలదు. కేవలము నీ ఉచిత కృపనుబట్టియే అని మేము అందుకొని అనుభవించుచున్నాము గనుక నీకు వందనములు. తండ్రీ! నీవు చేసిన పరిచర్యను మేము ఈ లోకములో కొనసాగించుటకు నేటి దిన వర్తమానమిమ్మని యేసు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

క్రైస్తవులారా! సంఘకాలములో క్రైస్తవసంఘము యొక్క హింసకాలములో ఉన్న విశ్వాసులారా! ఆదివారమునాడు యేసుప్రభువు గార్ధభాసీనుడై వెళ్ళిన కథలో పల్లెటూరివారి పరిచర్య, శిష్యుల యొక్క పరిచర్య; పట్టణస్థులయొక్క పరిచర్య ఈ మూడు పరిచర్యలు వివరించి రెండు వదిలినాను. ఆ రెండును యేసు ప్రభువు మనకు చేసిన పరిచర్యలు. ఆ మూడును మనుష్యులు యేసుప్రభునకు చేసిన పరిచర్యలు. ఈవేళ యేసుప్రభువు మనుష్యులకు చేసిన పరిచర్య చెప్పెదను. అందులో నొక యంశము 1. పై బట్టతీసి యవతల పెట్టుట, 2. నడుమునకు తువాలు కట్టుకొనుట, 3. పళ్లెములో నీళ్లుపోయుట, 4. శిష్యుల పాదములను కడుగుట, 5. తానుకట్టుకొనియున్న బట్టతో తుడుచుట. ఈ కథ చాల పెద్ద కథ. ఈ వేళ కథలో ఈ ఐదంశములున్నవి. ఈ కథలో మొదటి భాగము, రెండవ భాగము వేరు వేరుగానేయున్నది. అది ఈ వేళ చెప్పను. ఈ ఐదు అంశములుగల మొదటి భాగము జ్ఞాపకముచేసెదను, ఇపుడు మనము చెప్పుకొనునది పరిశుద్ధవారము లోని గురువారపు కథ, ప్రభువు ఒకమాటన్నారు, "నేను పరలోకము నుండి రావడము ఎందుకనగా, నేను మీచేత పరిచర్య చేయించుకొనుటకు కాదుగాని నేనే మీకు పరిచర్య చేయుటకు వచ్చాను." పరిచర్య యనగా మన మామూలు మాట **'చాకిరి చేయుట'.** క్రైస్తవులు ఈ మాటను **'సేవచేయడమంటారు'.** ఈ మూడు నొకటే యర్థము ఇచ్చును. మనచేత పరిచర్య చేయించుకొనుటకు కాక తానే మనకు పరిచర్య చేయుటకు వచ్చాడనే సంగతి విడ్డూరమైన సంగతి. మనకు తెలిసినంతవరకు ఇతరుల మతములో నీయాచారమున్నది, అదేదనగా శిష్యులయిన వారు గురువుల పాదములు కడగడము. అయితే గురువులు,

శిష్యుల పాదములు కడగడమనేది ఇతర మతములలో లేదు. అయితే ప్రభువు చరిత్రలో గురువైయున్న యేసుప్రభువు శిష్యుల పాదములను కడుగుట విడ్డూరము. ఇది లోకమునకు క్రొత్త. క్రీస్తు మతము లోకము కేలాగు క్రొత్తో, ఆలాగే శిష్యుల పాదములు గురువులు కడుగుట కూడా క్రొత్త.

దేవుడు మనిషియై లోకములో పుట్టుటేలాగు క్రొత్తో, ఈ సంగతియు క్రొత్తే, ఇందులో మొదటి యంశము పైబట్ట యవతల పెట్టుట. అందులో పరిచర్య యేమున్నది. అందులో నేమి కనబడుటలేదు గాని, బట్టనవతల పెట్టుటలో పరిచర్యకు పూనుకొనినట్లు కనబడుచున్నది. పై బట్ట నవతల పెట్టుట శిష్యులు చూచి, ప్రభువు యేదోపని చేయబోవు చున్నాడనుకొనిరి. ఆ యనుకొనుటలో ఆయన పూనుకొన్నాడు. అనగా మనలను రక్షించుటకు అనగా శరీరాత్మలను రక్షించుటకు పూనుకొన్నాడు. మనమధ్య కొంతకాలము నివసించిన పిదప తనప్రేమను చూపించుటకును, మనయందాయన కెంత శ్రద్ధ యున్నదో యది చూపించుటకును, పూనుకొన్నాడు. చాలా మంది పైన కోటు వేస్తారుగాని, పై బట్టవేయరు. యూదులెన్ని వేసికొన్నను పై బట్టవేసికొనుట అలవాటు ప్రభువు యూదుడు. గనుక యెంత అంగీవేసికొన్నా పై బట్ట వేసుకొనుట యున్నది. పై బట్ట వేసికొని పండుకొన్న బర్తిమయి యను గ్రుడ్డివాడు పై బట్ట పడవేసి ప్రభువును వెంబడించెను. యూదుల యాచారములలో పై బట్ట వేసికొనుట గొప్ప యలవాటు. పాస్టరు గారు పైబట్ట వేసికొన్నారని కొందరందురు.

యేసు ప్రభువునకు పై బట్టఎందుకలవాటనగా ఆయన పరలోకములో ఆయన సింహాసనము పై కూర్చున్నపుడు, గౌరవార్థమైన మహిమ వస్త్రమాయనకున్నది. ఆ మహిమను విడిచిపెట్టి రావడము, పై వస్త్రము అవతలపెట్టడానికి గుర్తు. బైబిలులో ముందు, గుర్తులున్నవి. ఆ తర్వాత నెరవేర్పున్నది. ముందొక గుర్తున్నది, దానికి నెరవేర్పు యింకొకటి యుండును. బలి పాతనిబంధనలో నున్నది. ఆ బలి క్రొత్తనిబంధనలో బలియైన (నెరవేర్పు) యేసుక్రీస్తు ప్రభువునకు ముంగుర్తు. ఆయన బలియైనాడు. ఇది అలాగు ముంగుర్తు కాదు. యేసుప్రభువు మహిమనంతా నక్కడ విడిచిపెట్టి వచ్చి పైబట్టలేకుండ మసలినాడంటే మహిమ బట్టను విడిచిపెట్టివచ్చినాడు. ఇదంతా జరిగిన పిదప, పై వస్త్రము మరల వేసికొన్నట్లు ఆరోహణమైన పిదప దేవుని కుడిపార్శ్వమునందు కూర్చున్నాడు. తరువాత ఆ మహిమ వస్త్రము వచ్చినది. యోహాను 17అ॥లో నున్నట్లు 'ఆదిలో నాకే మహిమవుండెనో యా మహిమను తిరిగి నాకు ఇచ్చావని ఆయన ప్రార్థించెను. యేసుప్రభువు భూలోకములో నడిచినపుడాయనకు ***1.*** శరీర జీవితము. ***2.*** ఆత్మీయ జీవితమనునవి రెండున్నవి.

ఈ శరీర జీవితములో పై బట్ట యున్నది. ఆత్మీయ జీవితములోఉన్న పైబట్టను పరలోకమునందు విడిచి వచ్చెను. నడుముకు తువాలు... ఇది దేనికి గుర్తు. అనగా మొదట పైబట్ట నవతల పెట్టుట అనేది పరిచర్య చేయుటకు, పూనుకొనుటకు గుర్తు. తువాలు కట్టుకొనుట పనిచేయుటకు మొదలు పెట్టుట. సిపాయిలు కష్టపడి పనిచేయుటకు నడుము గట్టిగా కట్టుకొందురు. స్త్రీ వివాహమప్పుడు వడ్డాణము నడుమునకు అందానికి, బలమునకు పెట్టుకొనును. ఈ పరిచర్య యేసుప్రభువు చేయుటకు పూనుకొనుట చాల కష్టమైన పని గనుక ఆయన తువాలు కట్టుకొని బలపడ్డాడు. పనిసాగించాలి, శిష్యులు చూస్తున్నారు. ఏమి యడుగలేదు. నాపై బట్టతీసి అవతలపెట్టండియని వారినడుగలేదు. **పెద్దయ్యగార్లు అలా చాలాసార్లంటారు.** కానీ ప్రభువెవరిని అడుగక తానే చేసుకొన్నారు. అందరు దగ్గరకు వచ్చిరి. శిష్యులపుడు గ్రహించలేదు, తరువాత గ్రహించిరి, అదెందుకు ? ఇదెందుకు? యని యడుగలేదు. ప్రభువే మీరు గ్రహించలేరన్నారు. రెండు వేల సంవత్సరాలైన పిదప మనము గ్రహించు చున్నాము. అపుడు సమీపస్తులుగా నున్న గొప్పవారైన శిష్యులు గ్రహించలేదుగాని దూరస్తులమైన, శిష్యులమైన మనము గ్రహించుచున్నాము. ఇపుడు గ్రహించలేరుగాని ఆత్మ వచ్చినపిదప గ్రహిస్తారనేది ఇపుడు నెరవేరుతుంది. మన గొప్ప పరిచారకుడు సిద్ధముగా వున్నానని పూనుకొన్నానని నడుముకు తువాలు కట్టుకొన్న పరిచారకుడన్నాడు. మనలో పనిచేయు వారును నడుమును గట్టిగా కట్టుకొని పని ప్రారంభిస్తారు. ఇవన్ని సులువేకాని వారు గ్రహించలేదు.

**3. ఆయనే పళ్లెములో నీరు పోసినారు.** కాని నేను అంటాను ప్రభువు దగ్గర పన్నెండుమంది యున్నారు గదా! నాదగ్గరయితే నౌక్కరే, అదయినా నేను చేయక అతని చేత చేయిస్తాను. ప్రభువు వారిచేత చేయించుకొనుటకు రాలేదు. ఆయనే వారికి చేయుటకు వచ్చెను. యేసుప్రభువు చేసే ఈ పరిచర్య (చాకిరి; సేవ) వారి కవసరము. ప్రభువెళ్ళిన తరువాత వారు గ్రామములలో, సంఘములలో యిండ్లలో మనుష్యులందరికి చేయుటకు మాదిరిగా, వారికి నేర్పించినానని ప్రభువన్నారు. నేనెందు కీ యైదు పనులు చేసినానంటే 'మీరును అట్లు చేయుటకు నేర్పించుటకు చేసినాను'. మాదిరికి చేసేవారు వారే చేస్తారుగాన ప్రభువట్లు చేసెను. నీళ్ళు శుద్ధికి గుర్తు. ప్రభువు శుద్ధిచేయుటకే వచ్చెను. 1. పైబట్ట నవతల పెట్టుట, 2. నడుముకు తువాలు చుట్టు కొనుట, 3. పళ్లెములో నీళ్లుపోయుట, 4. శిష్యుల కాళ్ళుకడుగుట. అప్పుడాయిన పై నాలుగు విషయములను గూర్చి యడుగవలసినది గాని అడగలేదు. అది యెవరికి అభ్యంతరము కాదు. నే నప్పుడపుడు చేస్తాను. ప్రభువు నీళ్ళు పోసిరి. ఒకరి పాదములొకరికి తగులుట

అభ్యంతరము. 1.గురువు 2. దేవుడు 3. దేవుని కుమారుడు 4. మనుష్యకుమారుడు 5. అసలయిన మనిషి 6. గొప్ప బోధకుడు 7. పంతులుగారు 8. బోధకుడు పంతులుగారు కాకుండ మనకాలములోను సంస్కార సమయములలో మనపాదుర్లు కాళ్లు కడిగెదరు. ఇంకొక మిషను నున్నది. పాదములు కడిగే మిషను.

**4. శుద్ధి కార్యక్రమము:-** ప్రభువు ప్రారంభించిన పనియావత్తును పూర్తి చేసి ముగించినారు. నీళ్లు పోయుట ముగింపైనది. ప్రభువు సిద్ధపడుటలో ఈ మూడును కలవు. (1.పై వస్త్రము 2. తువాలు 3. నీళ్ళుపోయుట) ఈ మూడును బాగున్నవి కాని పాదములు కడుగుట కష్టతరమైన పని ఉదా:- పెద్దాపురమునకు పదునాలుగుమైళ్ళ దూరము నుండి ఒక జమీందారుగారి అల్లుడు వచ్చి (అయ్యగారి) కాళ్ళు పట్టుకొనిరి. అప్పుడు అయ్యగారికి గుండె జల్లుమన్నది. 'ప్రార్థనకని వచ్చి పాదములను పట్టుకొని నరభక్తి చేయుచున్నావు.' అని అయ్యగారన్నారు. అది ఆయనకు అయ్యగారిపై నున్న ప్రేమ, గౌరవముబట్టి అలాగు చేసినారు. పరిశుద్ధుల పాదములపై అపరిశుద్ధుల చేతులు పడితే ఫరవాలేదు. గాని పరిశుద్ధుని చేతులు పాపాత్ముల పాదములపై బడుట చాలా కష్టము.

**5. నీళ్ళతో శుద్ధి :-** నీళ్లుతో శుద్ది చేసిన తరువాత తువాలుతో పాదములను తుడిచిరి, ఈ యైదు యేసుప్రభువు యొక్క జన్మనుండి సమాధి లోనికి వెళ్లు పర్యంతము యేసుప్రభువుచేసిన పనులన్నిటికి ముంగుర్తులై యున్నవి. 1. వెనుక గుర్తులు 2. ముంగుర్తులు 3. గుర్తులు నిజమై యున్నవి. బెత్లేహేములో ప్రభువు జన్మ మప్పుడే పై బట్ట తీసివేసిరి. సేవలో ప్రవేశించగానే నడుమునకు బట్టకట్టుకొని పిశాచిని జయించిరి.

**6. నీళ్లు పోయుట:-** (నీళ్ళు అనగా వాక్యము) కొండ ప్రసంగములో, యెరూషలేము దేవాలయములో, సునగోగులలో ఉపదేశించినపుడు వారిని వాక్యముతో శుద్ది చేయుటకు మొదలుపెట్టెను. నీళ్లు లేనిదే శుద్ధిలేదు. వాక్యమును యెక్కువగా నేర్చు కొంటే అది (వాక్యము) వారి హృదయములను శుద్ధిచేయుటకు సాధనముగా నుండును. అపుడు సేవ చేయవచ్చును.

**7. తుడుచుట :-** నేను మీకు చెప్పవలసిన విషయములన్నియు చెప్పియున్నాను. నేను పరలోకమునకు వెళ్ళుచున్నానని ముగింపు చేసెను. వారు కొన్ని గ్రహించినను మరికొన్ని గ్రహించలేదు. వారి హృదయములలో నున్న అనుమానములను సందేహములన్నింటిని ఆయన తుడిచిరి. ముఖ్యమయిన అనుమానమేదనగా ఆదివారము పునరుత్థానమగుదునని ప్రభువు చెప్పినా, యెందరు ప్రవక్తలు చెప్పినను వారు నమ్మలేదు.

వాటన్నిటిని నొక మాటతో తుడిచినాడు 'నేను వెళ్ళి ఆత్మను పంపించెదను.' ఆయన నా వాటిలోనివే తీసుకొని మీకు బోధిస్తారు. అపుడు మీరు యెక్కువ గ్రహించెదరని' చెప్పిరి. ఇక్కడ కాదు, పరలోకములో నెక్కువనేర్చుకొనెదరని చెప్పెను. అదే తుడిచివేయుట. పొడి కాళ్ళతో నడిచి వెళ్ళవచ్చును. ప్రభువు జన్మమొదలు పునరుత్థానము వరకు యోహాను 17వ అధ్యాయములోనున్నది. దీనిలో క్రైస్తవుల కథమాత్రమే కాదు. సంఘము యొక్క కథకూడ యున్నది. గనుక అందరికిని సువార్త ప్రకటించవలెను.

అట్టి ధన్యత, పరిచర్యచేయు వీలు వరుడు మీకు దయచేయును గాక. ఆమేన్.

ప్రార్థన :- యేసుప్రభువా నీవు నడచిన సమస్తమైన పరిచర్యలలోను గొప్ప గొప్ప కార్య క్రమములలో మమ్మును శుద్ధిచేయుచు, సిద్ధపరచుచు, నిన్ను మహిమపరచే శక్తి ననుగ్రహింపుమ. కృపతో సెలవిమ్మని యేసుప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

**కీర్తన :** *"నా యేసు నాథా నీకు-నే నచ్చియున్న దెల్ల-నా లేమితో బ్రేమ గదా!=*
*నియమంబు గల ప్రభువా నీకెట్లు చెల్లించెదను-నన్ను నేనే నీకు-*
*నర్పించుకొనుట గాక"* *॥ఓ వింత॥*

# లెంటులోని ముప్పది తొమ్మిదవ దినము - మంచి శుక్రవారము

## మహాశుక్రవారము - మూడు సిలువలు



ప్రార్థన:- తండ్రీ! ఇన్ని దినములు మా నిమిత్తమై శ్రమ పడిన నీవు, నేటి దినముతో నీ శ్రమను ముగించనైయున్నావు. జీవమైయున్న నీవు మరణించినావు. మేమేమి గ్రహించగలము? గ్రహించినను ఏమని స్తుతించగలము! నేటి దినముతో నీ సిలువ వేతను సమాప్తము చేసినావు. మా మీదనున్న సిలువలను తొలగించుకొనుటకు, ఈలాగు నీ సిలువను మాకు ఆధారముగా చేసినావు. నేటి దిన సిలువ ధ్యానము ద్వారా నీ అంతరంగములోని వర్తమానము నీ సిలువలోనుండి మాకు దయచేయుమని సిలువపై మరణించిన యేసు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

మనకు సిలువను ధ్యానించుట మామూలు అయిపోయినది. మామూలు అనే దానివల్ల జయింపబడక, నూతనమైన ఉద్రేకముతో నేడు సిలువను ధ్యానించుకొందము. కల్వరి కొండమీద 3 సిలువలున్నవి.

1) రక్షింపబడిన వానియొక్క సిలువ.

2) రక్షింపబడకుండ మారుమనస్సు లేకుండా, చనిపోయిన వానియొక్క సిలువ.

3) సర్వలోక పాపభారమును మోసి, పరిహరించి, రక్షింపవచ్చిన, రక్షణకర్త యొక్క సిలువ.

ప్రభువు సిలువ రక్షింపబడిన వాని సిలువకునూ, రక్షింపబడని వాని సిలువకునూ, వెలుపలనుండక మధ్యనున్నది. 'నీవు రక్షింపబడినావు' అని కుడి ప్రక్కనున్న వానితో చెప్పుటకు, 'నీకు కూడ సిలువ చూపించినాను' అని ఎడమ ప్రక్కనున్న వానితో అనేటందుకు రెండు సిలువల మధ్యను ఆయన సిలువ ఉన్నది. ప్రభువు సిలువలో నుంచి రెండు వర్తమానములు ఇచ్చినారు. 1. నీవు బ్రతికిపోయినావు, 2. అయ్యో! నీవు చచ్చిపోయినావు. మధ్య సిలువలో నుంచి బైలుదేరిన వర్తమానము ఇదే. నేడు సంఘచరిత్ర, ప్రపంచ చరిత్ర ఆలాగే యున్నవి. కొందరు రక్షింపబడుచున్నారు, కొందరు లెక్కచేయనందున రక్షింపబడుట లేదు. పొరపాటు నరునిదే. ఈ దినము భూమిమీద నున్న సంఘము ధ్యానము చేయుచున్నది. మధ్య సిలువను గూర్చి మనము ధ్యానించవలెనని బోధకులు కంఠమెత్తి బోధిస్తారు 'అది తప్పు కాదు'.

నేడు ఆయన సిలువ మనకు కనబడుచున్నది. కుడి, ఎడమ ప్రక్కలనుండు సిలువలు మానవులమైన మనము మోయవలసిన సిలువలు. మధ్య సిలువ, మన సిలువను పరిహరించు నిమిత్తము క్రీస్తు (వ్రేలాడిన) సిలువ. మన సిలువలు

Bible Mission HQ Guntur

పరిహరించవలెనంటే, ఆయన సిలువ అనుభవించవలసినదే. మూడు సిలువలు ఒకచోట పెట్టండి. వేరుగా ఉంచండి. మరి మూడు సిలువలు జ్ఞాపకము చేస్తున్నాను. ఇవి మన జీవిత కాలములో కనిపిస్తున్న సిలువలు, ఇప్పుడు చెప్పనైయున్న సిలువలు. ఇవి క్రీస్తు నామధారియొక్క, లేక విశ్వాసియొక్క మూడు సిలువలు. ఈ మూడు సిలువలు పరిహారం కావలెను అనగా ముగింపు కావలెను. సంఘమునకు కూడ ఈ మూడు సిలువలున్నవి. ఈ మూడు సిలువలు సంఘము ఎత్తుకొనవలెను. ఒక కాలము వచ్చుచున్నది. అప్పుడు సిలువ ఎత్తి వేయబడును, అప్పుడు సంఘము మహిమలోనికి వెళ్లును. ఆ సంఘము, ఆ సమయము వచ్చువరకు ఈ సిలువలు సంఘములో ఉంటున్నవి. అవి;

***1) వంశాధార సిలువ; 2) పాపఫలిత సిలువ; 3) సువార్త సిలువ.***

ఇవి సంఘ చరిత్రలో ఉన్నవి. అలాగే ఇప్పుడు ఉన్న సంఘచరిత్రలోను ఉన్నవి. 1. వంశమునుబట్టి కల్గిన సిలువ. 2. తాను చేసికొన్న పాపముయొక్క ఫలితముగా వచ్చిన సిలువ. 3. సువార్తప్రకటన అనే జ్యోతి పట్టుకొని ఇతరులకు ప్రకటించేటప్పుడు వచ్చే హింస సిలువ.

**1. వంశధార సిలువ:-**

సంఘములో విశ్వాసులున్నారు. అవిశ్వాసులు, నామక క్రైస్తవులు ఉన్నారు. ఎన్నిమార్లు దేవుని వర్తమానము వినబడినను మనస్సు మారని వారును ఉన్నారు. ఈ పందిరి క్రింద ఉన్న వారెవరు? ఈ నిమిషమందు నిలువబడి నాకు తెలిసినంత వరకు మారుమనస్సు పొందియున్నానని చెప్పగలిగినవారే. నా హృదయము పవిత్రముగా నున్నది. దేవుని దృష్టిలో పవిత్రముగా ఉన్నదని ఎవరు చెప్పగలరో, వారే సిలువను సరియైన రీతిగా ధ్యానించగలరు. ప్రభువు సిలువను గూర్చి, తమ సిలువను గూర్చి ధ్యానించగలరు. అందరూ ఆలాగు ధ్యానించగలరా? లేదు. అందరూ ధ్యానించలేరు. నామక క్రైస్తవులు, విశ్వాసులు, అవిశ్వాసులు, అందరు దేవునికిష్టమైన రీతిగా అంగీకారముగా ఉండే రీతిగా ధ్యానించలేరు. 'నాకు తెలిసినంతవరకు ఏ కళంకములేదు, అన్నిటినీ పరిహారం చేసుకొన్నాను' అని ఎవరు చెప్పగలరో, వారే ధ్యానము చేయగలరు. వాక్యమును బాగా పరిశీలన చేసేటప్పుడు, పరీక్షించుకొనేటప్పుడు మహాగొప్ప చిక్కు కనిపిస్తున్నది. అదేదనగా చూస్తేనే, తలస్తేనే, అనుకొంటేనే, చేస్తేనే పాపము. ఇలాగు ఈ మూడు పరీక్షలకు ఎవరు నిలువబడగలరో వారే సిలువ ధ్యానములో నిలువబడగలరు. భూలోకములో ఎంత గొప్ప విశ్వాసియైనను, భక్తుడైనను కష్టము అనుభవింపక తప్పదు. ఎవరైనా వారికి కలిగిన మంచి అనుభవము చెప్పగలరు

గాని, కష్టాలు కూడ చెప్పగలరా! ఫలాని విషయములో కష్టము, నష్టము, చింత, బాధ కలిగినదని చెప్పగలరు. అయితే, ప్రభువు వారి కష్టములు తొలగింపడా! అని అందురు. ఆ కష్టములనే సిలువని చెప్పుచున్నారు. ***లోక మానవులందరు మోస్తున్న సిలువలు ప్రభువు సిలువకు సమానమైన సిలువలుకాదు.*** విశ్వాసులతో సంభాషించండి. అయ్యా ఈ కష్టము ఎందుకు వచ్చిందంటే, 'మా వంశములో ఈ కష్టమున్నది. ఆ వంశములో ఉన్న దానిని బట్టినాకు వచ్చింది. అది ప్రభువు తీసివేస్తే పోవును, గాని లేకపోతే అది పోదు' అనును. అది ఒక ముల్లు. అది వంశపారంపర్యముగా వచ్చిన సిలువ గనుక దానిని అతడు మోయవలెను. మోస్తూ, మోస్తూ ప్రభువును మహిమ పరచవలెను. ప్రభువు తీసివేసినా తీసివేయకపోయినా మోయవలెను.

**2. స్వకీయ పాపఫలిత సిలువ:**

విశ్వాసికాకముందే, అనగా ప్రభువును ఎరుగకముందు, పిదప విశ్వాసిగా మారిన తర్వాత తాను చేసిన పాపమువల్ల కష్టము కలుగును. ఆ కష్టము విశ్వాసిని విడిచిపెట్టలేదు. మారుమనస్సు పొందినారు గాని పాపము వలన తన జీవితములో వచ్చిన కీడు పోలేదు. అది ఎప్పుడు కనబడుచున్నది. పాపము పోయినది గాని పాపఫలితము పోలేదు. అది ఎప్పుడో పోవును గాని నిత్యముండదు. ఏది గొప్ప సిలువ. వంశాధార సిలువా? పాప ఫలిత సిలువా? అప్పుడప్పుడూ శోధన పాపముకూడ నిజమే. క్షమాపణ నిజముగాని పాప ఫలితమెందుకు ఉండవలెను? అప్పుడు ప్రభువు యెడల అతనికి విసుగుదల కలుగును. ***మీకే సిలువ ఉన్నదో పరీక్షించుకొని ప్రభువు సిలువను బట్టి పరిహారం చేసుకొనండి.*** మీ విశ్వాసమును బట్టి స్తుతివల్ల, కృతజ్ఞతవల్ల, సహింపువల్ల పరిహారం చేసికొనండి. రక్షింపబడిన విశ్వాసి ఎల్లప్పుడు సిలువమీద ఉండడు. కొంత సమయము మాత్రమే సిలువమీద ఉండును.

**3. సువార్త సిలువ (సంఘస్తులమీద ఉన్న సిలువ):**

ఒక విశ్వాసి ఉన్నాడు. గ్రామసంచారము చేసి, సువార్త ప్రకటించాడు. అజ్ఞానులు పట్టుకొన్నారు, కొట్టారు. చాల దినములు, మంచము మీద నున్నాడు, చనిపోయాడు పాపము చేసినావా? అని అడిగతే నాకు తెలియదన్నాడు. ఇది ఏ సిలువ అని అడిగితే తెలియదన్నాడు. అతనికి తెలియక పోవచ్చును గాని మనకు తెలుసు. ***సువార్త ప్రకటించినందున అతనికి సిలువ వచ్చినది.*** ఈ మూడు సిలువలలో ఏ ఒక్క సిలువ, ఏ రెండు సిలువలు, ఏ మూడు సిలువలు, ఏ సిలువ మీరు మోస్తున్నారో! అను ప్రశ్నకు జవాబు మీరే చెప్పుకొండి. మీరు, మీ ఇష్టం పనికిరాదు. పై సిలువలు ప్రభువు మనమీద పెట్టలేదు. ఒకటి మాత్రమే పెట్టినారు. అది సువార్త ప్రకటించే భారం. ఈ

సిలువమీద పెట్టబడియున్నది. అది మన మందరము ఎత్తుకొనవలసి యున్నది. అది ఎత్తుకొన్నప్పుడు శ్రమలు, సిలువలు అనేకము మనకు రావచ్చును. గానీ ఈ సిలువను దించివేయకూడదు. సువార్త సిలువకు మరియొక ఉద్యోగమున్నది. వంశాధార సిలువకుకూడ మరియొక ఉద్యోగమున్నది. అయితే ఈ సువార్త సిలువ ఉద్యోగమే. ఒక గొప్ప పాఠము, బహు గొప్ప పాఠము. అయితే ఏదో ఒక పాఠము నేర్పించుట వంశాధార సిలువయొక్క ఉద్యోగ ధర్మము. ఒక్కొక్కరికి ఒక్కొక్క పాఠము నేర్పును. నాకు నేర్పిన పాఠము మీకు నేర్పదు, మీకు నేర్పినది నాకు నేర్పదు. సిలువ లేకపోతే గొప్ప పాఠము బోధపడదు. పాపము పాపముగానే ఉండును. 'శ్రమ కాదు, సువార్త సిలువలేక పోతే, పాప ఫలిత సిలువలేకపోతే ఆ పాఠము బోధపడదు. ప్రభువు పాప ఫలితమును తీసివేయలేదు, వాటిద్వారా మనకు కావల్సిన బోధ అనుభవము నేర్పుటకు వాటిని తీసివేయలేదు. పాత పాఠము నుండి క్రొత్త సంగతి నేర్పును, జ్ఞానోదయం కలిగించును. అనుభవపూర్వకముగా ఎరిగించును. ఈ మూడు చేసేపని సిలువయొక్క గొప్ప సాధనమై యున్నది. కష్టం, శ్రమ, హింస ఉన్నది గాని హాని ఏమి లేదు. జ్ఞానపాఠం, అనుభవ పాఠము ఉన్నది. ప్రతీ సిలువ మూలమున మేలు కలుగుతుంది. ప్రతి విశ్వాసియొక్క జీవితకాలము పొడుగున ఈ మూడు సిలువలు ఉన్నవి. ఈ మూడు సిలువలను అందరు సంతోషముతో భరించవలెను. బైబిలులో కథ ఉన్నది. (అపో.కార్య. 5:33-42) ఇక్కడ ప్రభువుయొక్క శిష్యుల కేసు విచారణ జరుగుచున్నది. అందువలన ప్రభువుయొక్క శిష్యులు కోర్టుకు వెళ్లినారు. విచారణ అయింది. అధికార దండన జరిగినది. దెబ్బలు పడ్డారు. అయితే, బైటికి వచ్చి నవ్వుకొన్నారు, మురిసినారు. ఎందుకు? 'ప్రభువు నామ ఘనత కొరకు ఎంత భాగ్యము దొరికినది! ఎంతగొప్ప ధన్యత లభించినది!' అన్నారు. ఆలాగు ఎవరంటారు. పేతురు, యోహాను గనుక అలా అన్నారు.

మనలో ఆలాగు ఎవరంటారు? నాలో ఏమి పొరబాటు లేదు గాని శ్రమ వచ్చిందంటారు. అంతేగాని భాగ్యము కలిగినదంటారా! ధన్యత అంటారా! ఎవరైతే అలా అంటారో వారు మహా ధన్యులు. భూమిమీదే ఆ మహాభాగ్యము వారికి (ఆ శిష్యులకు) ఎందువల్ల కలిగినది? ***కల్వరిగిరి సిలువ ఎరుగుదురు గనుక వారికి గొప్ప అనుభవము కలిగినది. మనలో ఎవరైనా సేవకు సమర్పణ అయిపోయిన వారు, పూర్తిగా సమర్పణ అయిపోయిన వారు ఉంటే, వారు పూర్తిగా సమర్పణ అయితే మాత్రం సిలువ రాకమానదు. అంతా సిలువగనే కన్పించును.*** విశ్వాసియొక్క జీవిత కాలము (ఎప్పుడు మారినదో), ఆ సమయము మొదలు జీవాంత పర్యంతము సిలువ

ఉండక మానదు. సిలువను జయించుట ఎట్లు? పరిహరించుట ఎట్లు? విసుకుకొనేవారు ఎప్పుడు సిలువ వలన మేలు పొందలేరు. పైకి మాత్రమేకాక అంతరంగములో విసుకుకొనువారికి కూడ సిలువవల్ల మేలురాదు. **కీడు మిక్కిలి చౌకగా వస్తుంది.** సంతోషముతో అనుభవిస్తే సిలువవల్ల తప్పక మేలు కలుగుతుంది. నాకు నా మనో దృష్టిలో మూడు జెండాలు కనబడుచున్నవి.

1) సిలువ మోసిన, 2) సిలువ సహించిన, 3) సిలువయందు సంతోషించిన వారికి ఆ 3 జండాలు ఉండును. సిలువలు సహించేవారు ఎందుకు సహించగలరంటే, వారు ప్రభువు సిలువ నెరిగినవారు గనుక సహించుకొందురు గానీ ఎందుకు విసుకుంటారు? ప్రభువు సిలువ ఎరుగుదురు గనుక ఎందుకు స్తుతిచేయరు! ప్రభువు సిలువ నెరుగుదురు గనుక ఎందుకు కృతజ్ఞత కనపర్చరు! వారు ప్రభువు సిలువను ఎరుగుదురు గనుక ఈ మూడు సిలువలు సహించేవారికి మూడు జండాలు రావలెను. సహించుకోవడంవల్ల ప్రభువు పునరుత్థానము పొందినారు. ఆయన తన మరణము వరకు చివరకు భూస్థాపనలోకూడ సహించినారు గనుక జెండావలె పైకి ఎత్తబడ్డారు. పునరుత్థాన దినోదయం ఆయన కలిగిన జెండా, ఆ జెండాని బట్టే మనకును నేడు జెండా, ఆ జయమును బట్టే మన జయమును ఉన్నవి. సిలువ సహింప జయము కలుగును గనుక మనకు సిలువ సహింపును బట్టి జయము కలిగినది. ఈ మూడు జెండాలు ప్రతి విశ్వాసి యొక్క జీవిత చరిత్రలో అనగా పై మూడు పనులు చేసిన వారికి మూడు జెండాలు ప్రభువు జెండాను బట్టియే ఈ మూడు జెండాలు మనకు కలిగినవి. 1. జెండా ఒక విశ్వాసి కుడి ప్రక్కన, 2. మరొక జెండా విశ్వాసి ఎడమ ప్రక్కన 3. మూడవ జెండా విశ్వాసియొక్క శిరస్సు తిన్నగా ఉండును.

ఈ మూడును మహిమగల జెండాలే. జయమును చూపించే ఈ జెండాలు ప్రభువు జయమును, మన జయమును సూచించును.

**1. అనన్యపాపి:-** వంశాధార సిలువ సహించుటలో ఏమి గొప్ప తనమున్నది? తల్లిదండ్రులు చేసేదేమో మీరు సహించుచున్నారు గనుక అందులో ఏమి గొప్ప! విసుకుకొనడం లేదు సహిస్తున్నాము. అందులో ఏమిగొప్ప! మరిఎందులో గొప్ప ఉన్నది. **సువార్త ప్రకటించేటప్పుడు నీకు కలిగిన కష్టములన్నీ సంతోషముతో అంగీకరించేటప్పుడే గొప్ప ఉన్నది.** ఓ విశ్వాసీ! నీ చెవిలో ఒక మాట చెప్పుచున్నాను, వినగలిగితే విను. చెవిగలవాడు వినవలెనని ఉన్నది. 'నేను చాలా శ్రమ పడుతున్నాను, సహిస్తున్నాను, విసుకుకొనుట లేదని' అంటున్నావు. అందులో ఏమి గొప్ప తనమున్నది. ఆ గొప్ప తనములేనప్పుధు ఈ గొప్ప తనమెందుకు? నేను సువార్త నిమిత్తము బాధ, హింస,

ఇరుకు, నింద, ప్రతి కష్టము సంతోషముతో అనుభవిస్తున్నానని చెప్పగల విశ్వాసి ఉన్నాడా? ఈ రెండు గొప్ప తనములకు (శ్రమపడుట, సహించుట) ఆ ధ్యానములు (సిలువయందు సంతోషించుట) లేకపోతే వీటికి విలువలేదు. సువార్త శ్రమానుభవము వల్ల కలిగిన ఆనందము నీకు లేకపోతే, ఈ రెండు గొప్పతనములవల్ల ప్రయోజనము లేదు. ప్రభువుయొక్క సిలువధ్యానములవల్ల మేలు కలుగకపోతే ఈ మూడు సిలువలవల్ల ప్రయోజనము లేదు. సువార్తికులు శ్రమ పడేటప్పుడు ప్రభువు- నేనుకూడ నీతో శ్రమపడుతున్నాను అని చెప్పును. అప్పుడు గొప్ప విలువ, మేలు కలుగును. సిలువ చరిత్ర ముందుగా నీకు ప్రకటింపబడకపోతే, మహిమగల సిలువ చరిత్ర బోధపడేటట్లు నీవు వీధిలోకి వెళ్లి ప్రకటించితే ఏమిలాభములేదు. ఒక ఇవాంజిలిస్టు అయ్యా! ఒక గంటసేపు నేను కష్టపడి బోధించితే ఎవరికి వాక్యము తెలియలేదు. నచ్చలేదు అన్నారు. అప్పుడు అయ్యగారు "*అడుగుకోవడమునకు వచ్చినాడు గాని సిలువ బోధించడానికి రాలేదు అన్నారు*". నీకు మొదట సిలువ ధ్యానములేదు. అనగా నీ జ్ఞానమునకు సిలువ ధ్యానమున్నది గాని నీ హృదయమునకు సిలువ ధ్యానమనేది అందలేదన్నారు. ***అటువంటి సువార్తికులందరు ప్రకటించుట మానివేయవలెను.*** అనుభవము గలవారు సిలువ చరిత్ర, ఒకదాని తరువాత మరొకటి వరుసగా చెప్పగలరు. అయితే, అనుభవములేని వారు ఆలాగు చెప్పలేరు. ప్రభువు శాపఫలితము బహు చక్కగా బోధించినా, అంగీకరించని వారున్నారు. కొందరు మంచి బోధకులున్నారు, అయితే వారిని ఇతరులు గ్రహించలేక పోవచ్చు. ఈ దినము సిలువ ధ్యానము బాగుగాచేయగలిగితే, దానికి కారణము ఏమైయుండునో అది తలస్తే, అనుకుంటే, చూస్తేకాదు గానీ చేస్తేనే సరేసరి అని తలంచిన వారే బాగా సిలువధ్యానము చేయగలరు. ఎవరు సిలువధ్యానము బాగా చేయగలరో వారు సువార్త ప్రకటించగలరు. ఎవరు సువార్త బాగా ప్రకటించగలరో, ఆ మూడు సిలువలు వారే మోయగలరు. ఎవరు మోయగలరో వారికే జెండాలు. ఎన్ని పాపములు చేసినా, చివరకు నాదే జెండా అని ఎందరు తలస్తే, చూస్తే, చేస్తే, అనుకొంటే; దానినిబట్టి వారు ధ్యానముచేసిన స్థితినిబట్టి వారికి జెండా రాగలదు. మూడు జెండాలన్నారు. అవి ఏమి జెండాలు? జయ జెండాలు. "విజయగీతములు........... పాడరే".

కుడివైపున ఒక గుట్ట ఉన్నది. ఏమిటి గుట్ట? అది చెత్త గుట్టకాదు, రాళ్ళగుట్ట కాదు. వజ్రాల గుట్ట. అది దేవుని వాక్య గ్రంథములో ఉన్నటువంటి వాగ్దానములగుట్ట. విశ్వాసి ఆ గుట్టమీద జెండా. విశ్వాసియైన తారీఖు మొదలు, తాను ఈ లోకములో విశ్వాస యాత్రచేయుచున్నప్పుడు సిలువలు కూడ అతని వెంబడి వెళ్లును. అలాగే

ఈ గుట్టకూడ వెళ్లును, ఈ గుట్ట లేకపోతే విశ్వాసికి జయములేదు. ఈ గుట్టపై ఏ వాగ్ధానము ఉన్నది? నీ రక్షకుడు సహించినారుగదా! అనే వాగ్ధానమున్నది. "ఎందుకు భయపడవలెను? ప్రభువు సహించినారు గదా! ఫర్వాలేదని ధైర్యము చెప్పును". అటువంటి వాగ్ధానములు, బైబిలులో 30వేల వాగ్ధానములున్నవి, గనుక అన్ని వాగ్ధానములుంటే విశ్వాసికి ఏమి భయము. ఏ సమయమునకైనా, పనికి వచ్చిన వాగ్ధానమున్నది. అదేదనగా **"నేనున్నాను",** అని ప్రభువు అంటారు. అది తళుకు తళుకుమని మెరయుచుండును. విశ్వాసులు వాగ్ధానములను నమ్మినారు, వాటిమీద ఆనుకున్నారు గనుక జయము కలిగినది. గనుక జండా వచ్చును అది గొప్ప జండా; అబ్రాహామును గురించి వ్రాయబడినదేమనగా: 'అబ్రాహాము దేవుని నమ్మినారు గనుక ఆయన నమ్మిక నీతిగా ఎంచబడెను'. అబ్రాహాము విశ్వాస వాగ్ధానముమీద ఉన్నాడు గనుక ఫర్వాలేదు.

వాగ్ధానముల గుట్ట, కల్వరి గుట్ట, నెరవేర్పుల మెట్ట. మనిషిని బ్రతికించుటకు ఒక వాగ్ధానము చాలును. అయితే మనకు 30 వేల వాగ్ధానములు ఉన్నవి. వాగ్ధానముల జెండా నమ్మనందువలన కలిగిన జెండా ఒకటి ఉన్నది. అది నిరాశ జెండా. ఈ ప్రక్కన ఒక జెండా ఉన్నది. అది ఏమి జెండా? అది సంతోషించే జెండా. ఈ వాగ్ధానములు చూచినప్పుడు, బైబిలు తెరచినప్పుడు, ఎక్కడో ఒక వాక్యము కనబడగా 'ఇది నాకే' అని సంతోషించుచూ, ధైర్యము కలిగి సంతోషించుచుండవలెను. అయతే మనిషి స్వభావము నిరాశ. గానీ ఈ వాగ్ధాన జెండా చూచినప్పుడు సహింపు కలుగును. ఒక ప్రక్కన సహింపు ఉన్నది, రెండవ ప్రక్కన సహింపు లేదు. ఎందుకనగా వాగ్ధానములవలన బలము పొందదములేదు గనుక సహింపులేదు. ఆకలిగా ఉన్నప్పటికిని కొందరు సహించుకొంటారు, దానిపేరు సహింపు. ఆకలి ఉన్ననూ, ఓపిక పట్టుట జరుగును. ఎందుకనగా, సహింపు ఉన్నది గనుక. ఐదు నిమిషములు ఓపికపట్టి భుజించువారికి బలమువచ్చును. అట్లే వాగ్ధానమువల్ల బలము కలుగును. స్వంతగా కష్టపడినందున సహింపును కలుగును. ఒక జండా వాగ్ధానముల కొరకైన జెండా. ఇంకొక జెండా సహింపు కొరకైన జెండా. పది గొప్ప వాగ్ధానములకంటే సహింపు జండా గొప్పది. సహింపున్నది గనుక వాగ్ధానము చూడగానే, బలము వచ్చినది. ధైర్యము వచ్చినది. "సిలువ మోసే వారికి చిరసౌఖ్యోన్నతి రా...." అను పాటలోని వచనము (మా యేసు) శ్రమ సహించుకున్నందుకు జెండా, వాగ్ధానము నమ్మినందుకు జెండా.

విశ్వాసి శిరస్సుమీద నున్న సిలువ. అది ఏమి? విశ్వాసి దైవ వాగ్ధానములమీద ఆనుకొని, బలము ధైర్యము పొందుచూ శ్రమలు సహిస్తూ, స్వంత శక్తిమీద

ఆనుకొనలేదు. వాగ్ధానములవల్ల కలిగిన విశ్వాసమునైననూ, బలమునైననూ, ధైర్యమునైననూ, అది పరలోకపు తండ్రిదే అని తనకు తాను వట్టి వానిగా నెంచుకొని నిరీక్షించితే, మనో దృష్టి అంతా పైతట్టు ఉంటే అది గొప్పది. వారి నిరీక్షణకర్త పరలోకములో తండ్రి కుడి పార్శ్వమున ఉన్నాడు. గనుక ఈ నిరీక్షణ, ఈ పౌరస్థితి అక్కడ ఉన్న వాగ్ధాన కర్తవల్ల బలము పొందును. పైకి చూచినందుకు పైన ఒక జెండా. స్వశక్తి, వంశము, బలము, విద్య, పలుకుబడి, సామర్ధ్యంమీద ఆనుకొనలేదు గాని దేవునిమీద ఆనుకొన్నారు. 'కొండలతట్టు నా కన్నులెత్తుచున్నాను. యెరూషలేము పైనున్నది గనుక విశ్వాసికి నిరీక్షణ ఉన్నది గనుక **1. నిరీక్షణ జెండా, 2. వాగ్ధాన జెండా, 3. సహన జెండా.** ఒక విశ్వాసి వాగ్ధానముచూచి ఫర్వాలేదన్నాడు. శ్రమ కలిగినది అయితే నిరీక్షణలేనందున వాగ్ధానము పోయింది గనుక నిరీక్షణ గొప్పది. ఆ గొప్ప విశ్వాసి, ఆ వేళ అవిశ్వాసి అయిపోయినాడు గాని తర్వాత విశ్వాసి అయినాడు. మనపద్దు ఇంతే. ఈ వేళ విశ్వాసము రేపు అవిశ్వాసము. ఈ పద్దే మనము బ్రతికినంతకాలము ఉండును. ఈ పద్దుకు ఏమైనా హద్దున్నదా. అద్దులేదు, పద్దూ లేదు. అయితే నిరీక్షణ స్థిరముగా ఉండవలెను. ఏది గొప్పది? నిరీక్షణ జెండా గొప్పది. మోక్షలోకము ఎవరికొరకు కనిపెట్టుచున్నది? విశ్వాసికొరకు. ఎందుకు? ఎప్పుడు జీవయాత్ర ముగిస్తారో, ఎప్పుడు వస్తారో, రాగానే చేర్చుకొని నిరీక్షణ జెండాలివ్వడానికి ఎదురుచూస్తున్నది. కొడుకు ఎప్పుడువస్తాడో అప్పుడు లోపలికి తీసికొని వెళ్ళి, స్నానం, విందు, ఆచరింపజేసి, అందరికి చెప్పుతాను అని తండ్రి ఆశిస్తున్నాడు. ఆలాగే పరలోకపు తండ్రికూడ ఆశిస్తున్నాడు. ప్రభువు మనకేది చూపిస్తారో అది పరలోకము వెళ్లిన తరువాత తండ్రి ఏమి ధరింపచేస్తారో, కిరీటం ఎప్పుడు వేస్తారో! నా విశ్వాసికి తగిన కిరీటం ఎప్పుడు ధరింపచేస్తానా అని పరలోకపు తండ్రి కనిపెట్టుచున్నాడు. ఎంత మందికి కావలెనో ఆ కిరీటము ధరించుకొనండి. ఇక్కడ శ్రమల ముండ్ల కిరీటము ధరించకపోతే అక్కడి మహిమ కిరీటం దొరుకదు. సిలువ సహించడానికి; జెండా జయించడానికి; కిరీటము ధరించడానికి, మాకు తగిన సహాయము దయచేయుము.


ఆలాగు క్రీస్తు ప్రభువు శ్రమలలో పాలుపొంది, మహిమ కిరీటము సంపాదించు గొప్ప భాగ్యము ప్రభువు మీకు దయచేయును గాక! ఆమేన్.

**కీర్తన:** "మహిని యేసే – మహాశ్రమ పొంది – మహిమకు వెళ్ళెను *గాదే!* =
మహిమ కోరని మనుజుడెవ్వడు – మర్యాదగ నెవడిచ్చు – శ్రమలు
లేక స్వర్గము లేదు ॥మానవుడు॥

# లెంటులోని నలుబదియవ దినము - శనివారము

## మౌన దినము

**లూకా. 23:50-56;**



ప్రార్థన:- తండ్రీ! నేటి దినమున నీవు లేవు. నీ సంవత్సరములకు మితిలేదని వ్రాయించిన అనంత స్వరూపుడవైన నీవు 'లేవు'. ఇది మేము ఏలాగు గ్రహించగలము! సకల యుగములలో అక్షయుడవైన నీవు నేడు సమాధిలో ఏలాగు ఉన్నావో మేము అర్థము చేసికొనలేముగాని కేవలము నమ్మి నమస్కరించగలము. నీవు చేసిన ప్రతి పనీ, పొందిన ప్రతి అనుభవము నా నిమిత్తమే గనుక నేటి దిన నీ మౌన రూపములో నుండియు మాకు కావల్సిన వర్తమానమిమ్మని అడుగుచున్నాము. ఆమేన్.

ఈ రోజు ఎవరు హాజరుకాలేదు? ప్రభువే. ఈ ఒక్కరోజు ఆయన భూమిమీద లేడు. ఆయన పలికిన మొదటిమాట రికార్డులోనున్నది. నా తండ్రి పనిమీద నేనుండవలెనని మీకు తెలియదా! ఈ దినము ఆయన మాటలు ఏమియు లేవు. ఆయన భూమిమీద లేరు గనుక క్రైస్తవులు ఈ దినమున ఆరాధన పెట్టుకోరు. ఎందుకనగా ప్రభువు హాజరుకాలేదు. నాగా పడెను గాని సెవెంత్‌డే (శనివారపు మిషను) వారు ఆరాధన చేస్తారు. క్రీస్తు లేనందున శిష్యులు దిగులుగా నున్నారు. దిగులుగా నున్నందున ఏలాగు ఆరాధన చేయుదురు? గనుక క్రీస్తులేచిన దినమున ఆరాధన చేస్తారు. అది మన సంతోష దినము. మీరెందుకు ఆరాధన చేయలేదు? అని ఒకవేళ ప్రభువు అడిగిన యెడల విశ్వాసులు, 1) నీవులేనిదే మేమెలాగు ఆరాధన చేయుదుము. చేయగలము? అని అందురు. 2) అందరు విచారముగా ఉంటే ఏలాగు ఆరాధన? అందురు. మేము సంతోషముగా నుండి పరిపూర్ణముగా ఉండునట్లు, నీవు లేచిన దినముననే ఆరాధన చేయుదుము అందురు. ఇది ఆదిసంఘము వారు ఆలాగే చేసిరి. ఈరోజంతా శిష్యుల మనస్సులలో ఏమున్నది? సిలువమీద ప్రభువున్నప్పుడు వారి దృష్టి సిలువమీద నున్నది. అనగా మ్రానుమీద నున్న ప్రభువు పైగలదు.

శనివారమునాడు అనగా ఈ దినము సమాధిలోనున్న శవముమీద వారి దృష్టి ఉన్నది. వారి జ్ఞానము అంతకన్న పైకిపోలేదు. క్రీస్తు మూడవనాడు లేస్తానని చెప్పెను గాని అది వారికి జ్ఞాపకము లేదు. ప్రభువుయొక్క శవముమీదవారికి దృష్టి ఉన్నది

గనుక సుగంధ ద్రవ్యములు సిద్ధపర్చిరి. వారి మనస్సులో శవమున్నది గాని పునరుత్థానము లేదు. **"శనివారము-శవము" రెండు 'శ' లున్నవి.** సమాధిలో నున్న అయన లేవడని వారికి ఉన్నది. మనకు సమాధిలో ఉన్న ఆయన లేచినాడు అని ఉన్నది. ఉదా:- మన వారు పెట్టె చేయించి అందులో శవమునుంచి సమాధిలో నుంతురు. 'పెట్టె శవమునకేగాని, మనిషికి కాదని' మనిషి వెళ్లే పోయాడు. సమాధి శవమునకే. **పైవన్నియు మనిషికి కాదు, శవమునకే. భక్తులందరు, శవానికే పెట్టె, సమాధి కట్టుట చేస్తున్నారు.** ఈ శరీరము పునరుత్థానమప్పుడు రాదు, గాని చేస్తున్నారు. ఈ వాడుక అంత్య దినము వరకు జరుగును. గౌరవము కొరకు, జ్ఞాపకము కొరకు పైవన్ని చేయుచున్నారు.మన ఉద్దేశము మనిషియొక్క గౌరవమునకే గాని అది శవమునకు చేస్తున్నాము. గాడిదమీద కూర్చున్న ప్రభువునిబట్టి గాడిదెకు గౌరవము వచ్చెను. *గాని శరీరమునకు చేయుట ఆచారము గనుక కొట్టివేయరాదు.*

**ధ్యానము:-** మన మనోదృష్టిలో ప్రభువు సమాధి ఆయనశవము తలంచు కొనవలెను, ఆయన సమాధిలో నుండుట ఎందుకు తలంచవలెను? క్రీస్తు ప్రభువు ఒకప్పుడు సమాధిలోకి వెళ్లినాడు. గనుక రేపు మనకు సమాధి క్రొత్తకాదు. పాతది అయిపోయెను. గనుక భయములేదు. ఎవరు వెళ్లనిదైతే భయము. ఉదా:- వర్షమువచ్చి వెలిసిన తరువాత ఒక చోటికి వెళ్లవలెనంటే బురదలో అడ్డబడి వెళ్ళము. ఇదివరకు నడిచిన వారి అడుగులలో అడుగువేసి వెళ్ళుదుము. అలాగే రేపు మనము మన ప్రభువు వెళ్లినదే అని ధైర్యముగా వెళ్లుదుము. సమాధిలో ఉన్న ఆయనకు లేచే ధన్యత, నిరీక్షణ గలదు. మనకు కూడ అదే నిరీక్షణ గలదు. ఆయన సమాధిలోనున్నట్లు తలంచుట ఎందుకనగా ఆయన లేచినట్లు మనము లేతుము. ఇదే ఈస్టరు వర్తమానము. **మన శరీరము రేపు మట్టిలో కలిసి పోవును. అదిమనది కాదు.** ప్రభువు శరీరము రాలేదు. మన శరీరము రాదు. గాని మహిమ శరీరము వచ్చును. బైబిలులో శరీరము నిష్ప్రయోజనము అని ఉన్నది. మహిమ శరీరము ప్రయోజనకరము. ***ఇది మావారి సమాధి అంటే వారిదికాదు. ఎవ్వరిదికాదు.***

ఈ దినము విశ్రాంతి దినము. ప్రభువు వచ్చే వరకు. రాకడలో వచ్చేవరకు చనిపోయిన వారందరకు కనిపెట్టే విశ్రాంతి ప్రభువునందు నిద్రించిన వారికి అందుము గాని చనిపోయినవారని వాడము. బైబిలులో ఎక్కడలేదు. సమాధి మంచమాయెను. పరుపాయెను. విశ్రాంతిచోట ఆయెను. చనిపోయేటటువంటి విశ్వాసి భయపడరాదు. ప్రభువుకూడ వెళ్లియున్నాడు అని మృతులు కావలసియున్న సజీవులకు నిరీక్షణ రేప్పురులో వెళ్లేవారు కారు. సమాధులు సజీవుల గుంపుకు తయారుకాని భక్తులకు తయారై

Bible Mission HQ Guntur

సజీవుల గుంపుకు వెళ్లలేనివారికి సమాధి భయము ఉండకూడదు. ఎందుకనగా ప్రభువు ఒకప్పుడు వెళ్లినాడు గనుక సజీవుల గుంపు ఎవరికో చెప్పలేము. సమాధి తప్పదని మరణము ఉండుననేది లోకమంతటికి తెలుసును. ***గాని సజీవుల గుంపు అనేది ఎవరైతే సిద్ధపడి చావకుండ ఉగ్గపట్టుకొని ఉంటే వారే సజీవుల గుంపు. ఇది లోకమునకు క్రొత్త.*** ప్రభువుయొక్క శవమును తలంచుకొనవలెను. భక్తులు ఈ ద్వారముగుండా రావలెను. గనుక ఇది తలంచుకొనవలెను. చనిపోయిన లేతును అనేది విశ్వాసులకుండ వలెను. ఉదా:- ఎవరైనా పండుకునేటప్పుడు నేను రేపు చస్తాను, లేవను అని అనుకొందురా? ఎవరు అనుకొనరు. అలాగే విశ్వాసులు లేతుము అను నిరీక్షణతో సమాధికి పోవలెను.

ప్రభువా! ఎవరు మృతులు కావలసిన భక్తులై సిద్ధపడుచున్నారో వారికి నిర్విచారము దయచేయుము. రాత్రి పండుకొనునప్పుడు ఏలాగు తిరిగిలేతుము అని అనుకొందురో అలాగే మృతులగు భక్తులకుకూడా రేపు రేప్చరులో సజీవులతో రేపు లేస్తాము అను నిరీక్షణ సంఘమంతటికి దయచేయుము. 1) మా నిమిత్తము చనిపోయినావు. 2) మా నిమిత్తము సమాధిలోనున్నావు 3) మా నిమిత్తము సిలువవేయించుకున్నావు. భక్తులకు మరణ భయములేకుండా చేయుటకు ఆయన మరణమైనాడు. భక్తులకు సమాధి భయములేకుండా చేయుటకు ఆయన సమాధిలోనికి వెళ్ళినాడు. రేపు భక్తులు మేము కూడా లేస్తాము అనే నిరీక్షణ కలిగియుండుటకు ఆయన లేచినాడు. మరణ భయము, సమాధి భయము లేకుండుటకై నీవు వాటిని పొంది, సమాధిలోనికి పోయిన తండ్రీ! నీకు స్తోత్రము. మేముకూడా లేతుము అనే నిరీక్షణ సహించుటకే సమాధినుండి లేచిన తండ్రీ! నీకు స్తోత్రము. 1) విశ్వాసులమై చనిపోతే మరణ భయము. సమాధి భయము లేదు. 2) సజీవుల గుంపు అయితే ఆ తలంపే లేదు. ప్రభువా! మమ్మును సజీవుల గుంపుకు తయారు చేయుము. **గాని పాపము విడిచిపెట్టకపోతే పై ప్రార్థన చేస్తే ప్రభువును వేళాకోళము చేసినట్టుండును.** పాపములు ఉంటే ఆ ప్రార్ధన చేయరాదు. పాపము చేయుట శాపము తెచ్చుకొనుటే, చిన్న పాపము కూడా చేయరాదు. అలాగు చేస్తే 'ఈత ముల్లుతో గుచ్చుకొనుచూ, ప్రభువా! గ్రుచ్చుకొనకుండ చేయి' అన్నట్టుండును. ఒక వేళ ఆ సమయానికి పాపము మానివేయుదును అంటే అది ఇంకా శాపము.

1) నా బదులు సమాధిలోనికి వెళ్లినాడు గనుక నాకు సమాధిలేదు అని సజీవుల గుంపువారందురు. 2) ప్రభువు సమాధిలో నున్నాడు గనుక నేను సమాధికి పోవుటకు భయపడను. ఇది మృతులగుంపు ప్రార్థన.

(1) నీకును, నీ సంఘమునకు – నిత్యమును జయము, జయము.

(2) నీకును నీ సంఘమునకు – నిత్యమును జయము, జయము.

3) జనక సుతాత్మలకు నేడు – శాశ్వతంబు జయము జయము.

**ప్రార్ధన:–** ప్రభువా! మాలో ప్రతి వారిని భూమిమీద నున్న విశ్వాసులందరిని ఈ రెండు గుంపులలోనికి తయారు చేయుము. ఎవరు మరణము ద్వారా రావలెనో నీకు తెలుసును. వారికి మరణ భయము, శరీర భయము లేకుండా చేయుము. ఎవరు సజీవుల గుంపులో రావలెనో వారికి మరణము సమాధి అంతకుపూర్వమునందే శ్రమలు తలంపే లేకుండ చేయుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

1) యేసుప్రభువు పరలోకములో ఉండే దేవుడు. 2) నరలోకములో యుండే మనుష్యుడు. 3) ***ఆయనను ఎక్కడ ప్రార్థిస్తే ఆయన అక్కడ యుంటాడు.*** ఈ దినము ఆయన సమాధిలో యున్నాడు. ఇది విశ్వాసులకు మంచి పాటమైయున్నది. మన ప్రభువు సమాధిలో యున్నాడు గనుక నేను చనిపోయినను, సమాధిలోనికి వెళ్ళుదునని విశ్వాసి అనుకొనును గనుక విశ్వాసికి సమాధి భయంకరముకాదుగాని విశ్రాంతి స్థలము. యేసుక్రీస్తు నా కోసమే పరలోకమునుండి వచ్చెను, నా కోసమే పశువుల తొట్టిలో పరుండెను, నాకోసమే కొండ ప్రసంగము చేసెను, నా కోసమే శ్రమలు పొందెను, నా కోసమే మరణము పొందెను, నా కోసమే సమాధిలో నుండెను, నా కోసమే తిరిగి లేచెను, నా కోసమే పరలోకమునకు వెళ్ళెను, నా కోసమే తిరిగివస్తాడు, నన్ను తీసుకు వెళ్ళును అని నమ్మవలెను. ***మనిషి ఎక్కడెక్కడకు వెళ్ళెనో అక్కడకు ప్రభువు వెళ్ళెను*** గనుక ఆయనే రక్షకుడు. ఆయన వెళ్ళిన చోట్లనెల్లను శుద్ధిచేసెను. సమాధి అవిశ్వాసులకు భయంకరము. విశ్వాసి ఎంతకాలము సమాధిలోయున్నను, తిరిగిలేచుట మూడవ దినముననే. అనగా వారు లేచిన వారితో సమానులు. విశ్వాసిపై కథలో చాకలి వాని వంటివారు. ఈ కాలములో కొందరిని ఎత్తబడే వారినిగాను, కొంతమందిని సమాధులలో విశ్రాంతి పొందువారినిగాను ప్రభువు చేసినాడు. ఈ రెండు విషయములకు వందనములు.

శుక్ర, శని, ఆది ఈ 3 రోజులు 3 కాలములు. మనము పుట్టినది మొదలుకొని చనిపోయేవరకు ఒక కాలము. సమాధిలో ఉన్నంతకాలము, రెండవ కాలము. యేసు క్రీస్తు ప్రభువు మనలను సమాధిలోనుండి లేపుకాలము, మూడవ కాలము. యేసుక్రీస్తు శ్రమపడి చనిపోయినారు, భక్తులుకూడా శ్రమపడి చనిపోవుదురు. యేసుక్రీస్తు ప్రభువు సమాధిలో ఉన్నట్లు భక్తులుకూడా సమాధిలో ఉందురు. ప్రభువు లేచినట్లు భక్తులు

Bible Mission HQ Guntur

కూడా లేస్తారు. చనిపోయిన భక్తులకు శుక్రవారము అయిపోయినది అనగా శ్రమలు ముగిసెను. శనివారము అనగా సమాధిలో ఉన్నారు. యేసుప్రభువు మూడవ దినము లేచినట్లు ప్రభువునందు చనిపోయినవారు, మూడవకాలమందు లేస్తారు. బ్రతికినవారు ఎత్తబడతారు. శుక్రవారము ఎన్ని శ్రమలున్నను ప్రభువు లెక్కచేయలేదు. సమాధిని లెక్కచేయలేదు. మూడవ దినము లేస్తానని చెప్పినట్లు లేచెను. సంసోనును గొలుసులతో కట్టినను, జడలకు మేకులు వేసిననూ లెక్కలేదు, అన్నీ తెంపివేసినాడు. అలాగే క్రైస్తవ భక్తులకు శ్రమలన్నను, మరణమన్నను లెక్కలేదు. **"యేసుప్రభువు లేచినారు, మేమును లేస్తాము"** అను లెక్కలేని తనము భక్తులు కలిగియుందురు. ప్రభువు శ్రమలన్ని జయించెను గనుక మహిమ శరీరము వచ్చెను. ఇవన్నీ మనకేయని మనము నమ్మిన పునరుత్థాన బలము వచ్చును. యేసుప్రభువు ఈస్టరును బట్టి మన ఈస్టరు. ఓ యేసుప్రభువా! ***ఈ వేళ నీ పునరుత్థాన బలము నాకు దయచేయుము అని ప్రతి దినము ప్రార్థించవలెను.*** ఆయన గాయములు మానిపోయెను, ఎవ్వరును ఆయనకు కట్టుకట్టలేదు. ఈ సంగతులు నమ్మిన వింత, నమ్మకపోయిన సంత. వింత అనగా అద్భుతము, సంత అనగా గందరగోళము. మనము చనిపోయినను, సమాధైనను, ప్రభువు పునరుత్థాన బలమును బట్టి లేస్తాము. యేసుప్రభువు మనలను సజీవుల గుంపుగా తయారుచేయును. పాపమును విడిచిపెట్టకుండా చేసిన యెడల ప్రభువుని హేళన చేసినట్టు, శాపము తెచ్చుకొన్నట్టు. యేసుప్రభువు సమాధిలోనికి వెళ్లినాడు, లేచినాడు గనుక నాకు సమాధి లేదు. 'యేసుప్రభువు సజీవుల గుంపులో ఉన్నాడు, గనుక నాకు సమాధి లేదు' అని విశ్వసించవలెను. అప్పుడు ఎవ్వరు మృతుల గుంపో, ఎవ్వరు సజీవుల గుంపో నీకు తెలియును.

**ఇగ్నేషియస్ చెప్పిన సంగతి:** సింహమువస్తే నాకు భయములేదు. ఆ సింహము నోటిలో, దాని దంతములు అనే తిరుగటిలో విసరబడి గోధుమ గింజవలె పిండి చేయబడి, రొట్టె చేయబడి, ఆ రొట్టె పరలోకములో భోజనపుబల్లపై పెట్టబడునని ఎంతో ధైర్యముతో చెప్పెను. నేడు ఎవరికేది దయచేయవలెనో, అది వారికి దయచేయుటకు నీ గొప్ప కటాక్షము దయచేయుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఈ రాకడ విశ్వాసముతో సమాధిని జయించు స్థితి పెండ్లికుమారుడు మీకు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన:*** "అక్షయదేహము దాల్చితివీవు – ఆనంద మొందుమీ= లక్షల కొలది శ్రమలు వచ్చినా – లక్ష్యము పెట్టకుమీ, నీవు – లక్ష్యము పెట్టకుమీ సాద్వీలాన్"

*//జయము//*

# లెంటులోని ఏడవ ఆదివారము

## సిలువలోని పునరుత్థానము

దావీదు కీర్తనలు 100; యోహాను 20:1-18; 1కొరింథీ 15:53.



**ప్రార్థన:- తండ్రీ! నా నిమిత్తమై నీకు వచ్చిన శ్రమలనన్నిటిని సహించి, భరించి, జయించి లేచిన ప్రభువా! నీకు వందనములు. నీ పునరుత్థానము, అన్నిటిపైన నీవు పొందిన విజయమైయున్నది గనుక అన్ని జయములకంటె అది గొప్ప జయమైయున్నది. మా నిమిత్తమై నీవు చేసిన పనికి ఎదురు ఏదీ నిలువనేరదని ఋజువు చేసిన తండ్రీ! అట్టి నీ అనంత జయము మాకును అందించుటకు నీ వాక్య వర్తమానము ఇమ్మని సమస్తమును జయించిన యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

ఇప్పుడు పునరుత్థాన చరిత్రలోనికి వచ్చినాము. 40 దినములు శ్రమలో ఇటు అటు తిరిగినాము. ఇప్పుడు పునరుత్థాన చరిత్రలోనికి వచ్చినాము. గనుక పునరుత్థాన చరిత్ర వినవలసియున్నాము. ఆ తరువాతి చరిత్రను సంచార చరిత్రగా భావించుకొనవచ్చును.

***సంచార చరిత్ర 2 భాగములు:***

*1వ భాగము: బహిరంగముగా కనిపిస్తున్న భాగము.*

*2వ భాగము: అంతరంగమునకు కనబడు భాగము.*

*1) పైకి కనబడునది. 2) పైకి కనబడనిది.*

ఈ రెండునూ పునరుత్థాన చరిత్రలో ఉన్నవి. సర్వ భూలోకమున నేటివరకు జరిగినటువంటి కథలన్నిటిలో, అద్భుతమైన విచిత్రకథ నేడు జరిగినది. భూమి పుట్టినది మొదలు ప్రభువు సమాధిలోనుంచి లేచినంతవరకు వ్రాయబడిన చరిత్రలు చదువగా, ఇటువంటి అద్భుతకరమైన చరిత్ర ఎక్కడలేదని వేదాంతులు కనిపెట్టిరి. ప్రభువు సమాధిలో నుంచి లేచినారు. ఆదియందు దేవుడు ఆకాశమును సూర్యచంద్ర నక్షత్రములు అను దీపములతో వెలిగించెను. ఆ ఆదియందే ఇప్పుడు మనము నివసించే భూగోళమునుకూడ సృజించెను. పచ్చని గడ్డితోను, విచ్చలవిడిగా సంచరించే మృగములతోను, గాలిలో గానము చేసే పక్షులతోను, హాయిగా ఉండే గాలితోను, మానవుల ధనసంపాదనార్థము వెండి, బంగారములతోను ఈ భూమిని సృజించెను. ఖగోళము ఎవరికొరకు, మన కొరకే. ఆయన వీటిని కలుగచేసినపుడు మనలో ఎవరైనా

Bible Mission HQ Guntur

ఉంటే, చూస్తే, మహా ఆశ్చర్యపడుదుము. వేసవికాలమున సాయంకాలమున పడమటి దిక్కుగా వెళ్లిచూస్తే గుండ్రని ఎర్రని బంతివంటి గోళమును చూచి, ఎంత కన్నులపండుగగా ఉన్నదని ఆనందిస్తాము. ఆ విధముగానే ప్రాతఃకాలమున మనము కండ్లు ఎత్తి, ఆకాశమువైపు చూచి ఎంతో కాంతిగా ఉన్నదనియు, భూగోళమువైపు చూచి ఎంతో శృంగారముగా ఉన్నదనియు సృష్టికర్తకు నమస్కరించుదుము. ఈ రెండు గోళములెంతో పరిశుభ్రముగా యున్నవి.

భూమిమీద ఆయన ఆదాము, హవ్వ అను దంపతులను కలుగచేసినారు. వారే మొదటి తల్లిదండ్రులు. వారిలోనుండి మనమందరము వచ్చినాము. ఇప్పటికి ఆరు వేల సం॥లు గడిచిపోయినవి. అప్పుడువారు పరిశుద్ధులుగా ఉండుటను బట్టి, భూగోళము, ఖగోళము అలాగే పరిశుభ్రముగా యుండెను. ఎక్కడా, ఏమియు కళంకములేదు. గాని మిగుల విచారకరమైన సంగతి ఏమనగా ఆది తల్లిదండ్రులు పాపములో పడిపోయి, అపవిత్రులైరి. వారిలోనుండి వచ్చిన వారే తరువాత పాపులై పోయినారు, పాపాత్ములుగా మారిరి. అక్కడనుండి మనవరకు గీతగీయుచూ రాగా మనమును పాపాత్ములై పోయినాము. ***నది పుట్టుచోట కలుగు కళంకము ఆ నది సముద్రములో పడేవరకు కొట్టుకొని పోవునుగదా!*** అలాగే ఆదాము, హవ్వలలోని పాపము మనవరకు కొట్టుకొని వచ్చినది. అయితే దేవుడు వారిని క్షమించి రక్షణ వాగ్ధానము చేసినాడు: 'మిమ్మును రక్షించేటందుకు రక్షకుని పంపిస్తాను'. వెంటనే రక్షకుడు రాలేదు గానీ వాగ్ధానమున్నది. అది వారి సంతానమునకు తెలిసినది గాని రక్షకుడు ఇంకా రాలేదు. 1,2,3,4 వేల సంవత్సరములు గడిచినవి. అప్పుడు ఆ రక్షకుడు బెత్లేహేములో జన్మించెను. ఆయన ఎవరని ఆలోచిస్తే దేవుడే. ఆయనే రక్షకుడుగా వచ్చెనని తేలింది. ఆయన పాలస్తీనాలో 3 1/2 సం॥లు జీవించారు. 3 1/2సంవత్సరములు మత ప్రచారము చేసెను. ఆయన బోధయొక్క సారాంశమేమనగా, "నేనే లోకమును రక్షించుటకు వచ్చిన రక్షకుడను". దుర్జనులు ఆయనను చూడగా, ఆయన కేవలము మనిషి అని గ్రహించిరి. విశ్వాసులైతే, ఆయన మానవుడేకాదు, దేవుడుకూడ అయియున్నాడని గ్రహించిరి. దుర్జనులు దానిని గ్రహించక నిష్కారణముగా ఆయనను హతము చేసినారు. సిలువమ్రానుమీద చంపివేసినారు. ఆయన చనిపోయి, మూడవ దినమున తెల్లవారేటప్పటికి సమాధిలో నుండి జయశీలుడై బయటకు వచ్చిరి. అప్పుడు సమాధి దగ్గర చూడగా బండ పొర్లించి ఉన్నది. తువాలుచుట్టి పెట్టి ఉన్నది. అందులోని రాతిమీద దేవదూత కూర్చున్నాడు. ఆయన "ప్రభువును మీరు చూడవచ్చినారా? ఇక్కడ ఏలాగు ఆయనను చూడగలరు? ప్రభువు బ్రతికిన వారితో, వారిలో ఉంటారు అని ధైర్యము గల మాటలు కొన్ని

చెప్పిరి. గాని వారు వాటిని గ్రహించలేదు. ఏలాగైనా ఆశ్చర్యముతో, సంతోషముతో వెళ్లిపోయిరి. తుదకు ఒకటి తీర్మానమై పోయినది. ***ప్రభువు చనిపోయినది ఎంత నిశ్చయమో, ఆయన బ్రతికినది అంత నిశ్చయము.*** ఇది పునరుత్థాన చరిత్ర. మరణ చరిత్ర ఏమిటి? మేకులతో ఆయనను సిలువకు అంటగొట్టి చంపిరి. శిష్యులు వచ్చి ఆయనను సమాధిలో పెట్టగా, గొప్పరాయి పొర్లించిరి. ఎవరూ తీయకుండా ముద్రవేసిరి.

1) సమాధి, 2) రాయి, 3) ముద్ర, 4) కావలిగా బంట్రౌతులను ఏర్పాటు చేసి, శవమును ఎవరైనా తీసికొని వెళ్లుదురేమో అని దుర్జనులు కావలి యుంచిరి. పరలోకమునుండి వచ్చిన దేవదూత రాయితీసెను. అంతకు మునుపే, ప్రభువు లేచి బైటకు వెళ్లిపోయిరి. సమాధి ఆయనను గట్టిగా పట్టుకోలేదు, రాయి ఆప లేదు, ముద్ర ఆటంకపరచలేదు. ప్రభువు నెమ్మదిగానే వెళ్లిరి. ఆరంభమందు శిష్యులు ఈ సంఘటనను నమ్మలేదు. ప్రభువు ముందుగానే వారికి చెప్పిరిగాని వారు గ్రహించలేదు. వారికి జ్ఞాపకము లేదు. ఉన్ననూ, ఉపయోగములేదు. అయితే క్రమముగా గ్రహించి ఆనందించినారు. అదివరకు జరిగిపోయిన 4వేల సం॥లలో ఎక్కడా ఇట్టిది లేదు. దైవభక్తులు బ్రతికించినది ఉన్నది గాని, స్వయముగా బ్రతికి బైటికి వచ్చినది ఈ ఒకటే. దుర్జనులు ఏమనుకున్నారు? మేము చంపివేసినాము, హతము చేసినామనుకొనిరి. అది సగము నిజము.

***ఆయన చనిపోయినాడు. ఆయన చనిపోకపోతే వారు ఆయనను చంపలేరు.*** వారే నిజముగా చంపితే ఆయనను బ్రతకకుండా కూడా చేయగలరు. గనుక వారు ఆయనను చంపలేదు గనుక వారు పట్టుకోలేదు. వారంతట వారే స్వయముగా చంపితే బ్రతుకడు. ఆయనే చంపనిచ్చినాడు గనుక ఆయన బ్రతికినాడు. ఇట్టి చరిత్ర లోకములో ఎన్నడునూ జరుగలేదు. ***ఇటువంటి చరిత్ర జరుగదుగాని ఇటువంటి చరిత్రకు సంబంధించిన చరిత్ర జరుగుతుంది. గనుకనే ఇది మహా అద్భుతకరమైన చరిత్ర.*** ఇంతవరకు చెప్పినకథ నిజముగా జరిగిన బహిరంగ వృత్తాంతము. పైకి కనబడినకథ, అప్పుడున్నవారి నేత్రములకు కనబడినకథ.


**2వ భాగము (అంతరంగ చరిత్ర):-** ఇది పైకి కనబడనిది, దీనినే ఇంకొక రీతిగా చెప్పవలసియున్నది. మొదటి భాగములోని ప్రభువు పునరుత్థానకథ క్రొత్త వారికినీ, ఈ రెండవ భాగము విని బాగా నేర్చుకొన్నవారికిని చెప్పవలసినవి. ప్రభువు సిలువ వేయబడిన రాత్రి భూగర్భములోనికి వెళ్ళినారు. ప్రభువు సిలువవేయబడుటవల్ల పాతాళ లోకమునకును ఉపకారము చేసినారు. ఆయన కేవలము భూలోకములో వారి నిమిత్తమైన రక్షకుడా? పాతాళమునకు రక్షకుడుకాడా! ప్రభువు భూలోకములో 33 1/2 సం॥లు నివసించి అద్భుతకరమైన రక్షణ ఏర్పాటుచేసినారు. అట్లయితే ఆయన

పాతాళములోని వారిని విడిచిపెట్టినారు అని అనకూడదు. అక్కడివారు రక్షించబడినను, రక్షింపబడక పోయినను రక్షణయొక్క ఏర్పాటు చేయవలెను. భూలోకములో సమాప్తము అన్నను, పాతాళములోని వారికి ఆయన తన మాటలను బోధించినారు. అక్కడే, ఆదాము మొదలు నోవహు కాలములో ఉన్నవారి రక్షణ కొరకు ప్రకటించినారు. 'నమ్మి బాప్తిస్మము పొందుడి' అనునది ఏర్పాటు. సిలువమీద దొంగ బాప్తిస్మము పొందలేదు. అయినను రక్షణ లేదా? ఉన్నది. నమ్ముట, బాప్తిస్మము, రక్షణ పొందుట ఇది క్రమము, ఏర్పాటు. దొంగ నమ్మినంత మాత్రమున రక్షణ పొందెను.

**రెండవ కథ:–** నేను గాలిలో ఒక పటము వేస్తున్నాను. ఊహా పటము. ఆ పటముమీద గీతగీస్తున్నాను. క్రిందనుండి పైకి ఒక గీత గీస్తున్నాను. ప్రభువు బెత్లేహేములో జన్మించిన జన్మకాలము మొదలు, చనిపోయిన సిలువకాలము వరకు ఒక నిలువగీత వేయుచున్నాను.

జన్మము, ఆరంభకాలము
మరణము అంత్యకాలము } 2 కాలములు.
జన్మకాలము, మరణకాలము

అక్కడ ఏమి కనబడుచున్నది? ఆయన బోధించినట్లు, శ్రమపడినట్లు, సిలువ ఎక్కినట్లు, మరణమొందినట్లు, ఇంకా అనేక కథలున్నవి. మూడు కథలతో వివరించినారు. ఇవన్నియు బోధకథ, శ్రమకథ, మరణకథ. ఈ గీతకు మూడు జానలు దిగువగా అడ్డగీత గీయవలెను. దానిపేరు.




1. మరణము. 2. భూస్థాపన 3. రాయి 4. ముద్ర 5. కావలి 6. నరకము: ఇవి ఆ గీతపై వ్రాయవలెను. ఆ గీతకు సమానముగా 1) సైతాను (అపవాది), 2) అపవాది, అతని సైన్యములు (పిశాచములు), 3) అతని రాజ్యము (అంధకార రాజ్యము) ఇది అంతరంగ చరిత్ర.

ప్రభువు జన్మము మొదలు యౌవనకాలము నుండి మరణకాలము వరకు ఆయనను పీడించేవి కొన్ని ఉన్నవి. ***మానవులందరిని 4 వేల సం॥లలో*** ఏమి

**పీడించుచున్నవో, అవన్నియు ప్రభువు జీవిత చరిత్రలోకూడ ఆయనకు పీడగాయున్నవి.**
1. రకరకములైన పాపములు. పది ఆజ్ఞల ప్రకారముగా చూస్తే ఎన్ని పాపములున్నవో అన్ని పాపములు ఆయనమీద పడెను. మానవుల పాప జాబితా తయారుచేస్తే చాలా పొడుగుగా యున్నది. దేవుని ఎరుగకుండుట. కోపించుట, పెద్దలను మర్యాద చేయకపోవుట, తిట్టుట, వ్యభిచార దోషము, దేవుడు దయ్యము, దూత ఎవరూలేరు అని నాస్తికత్వ బోధ ప్రకటించుట; ఇవి ప్రభువును కూడ పీడించుటకు వెంటబడినవి. ఎందుచేత? ఆయన మానవులను రక్షించుటకు బైలుదేరినాడు గనుక. కాబట్టి ముందు ఆయనను పడగొట్టితే మానవులను ఏలాగు రక్షించగలడని ఇవన్నియు ఆయనను పడగొట్ట ప్రయత్నించెను. కాదు, కాదు, అన్ని పాపములు ఆయనను వెంబడించినవి. **కాగడా దీపము చుట్టూ పురుగులు ఆవరించునట్లు ఆయనను ఆవరించినవి.**

హెబ్రీలో పౌలు తేటగా వ్రాస్తున్నారు. 'మనవలె ఆయన అన్ని విషయములలో శోధింపబడెను. అన్ని పాపములలో ఆయన పడిపోవుటకు కావలసినంత వీలు, సందు దొరికినది, ఏర్పడినది. కాని ఆయన పడలేదు. పడితే రక్షించలేడు. ఆయన పడిపోతే మనకు ఇక ఏమి గతియున్నది? ప్రభువునకు బాల్యవస్థ మొదలు యౌవనకాలవస్థ వరకు పాపశోధనలు కలిగినవి. ఎప్పుడుబడితే అప్పుడే పడిపోవచ్చు గాని పడలేదు. ఆఖరుమెట్టులో వధ్య స్తంభమెక్కి మరణమాయెను. అప్పుడు దుర్జనులు సంతోషించిరి. ఆయన పని అయిపోయింది అనుకొన్నారు. ఆయన ఇతరులను రక్షించినాడు గానీ తన్ను రక్షించుకొనలేదని దుర్జనులు సంతోషించిరి. ఈ ప్రక్కన ఉన్నవారు కూడ అదే తలంపుతో ఉన్నారు. సైతాను తలంపుకూడ అదే. అంధకారరాజ్యములోనివారికి అదే తలంపు. మానవుని చరిత్ర అయిపోయింది. అదే మానవునికి, దయ్యానికి తెలుసు. భూస్థాపన చరిత్ర, రాయివేసిన చరిత్ర, ముద్రవేసిన చరిత్ర, కావలి చరిత్ర తెలుసును గాని ఆ తరువాత చరిత్ర వారికి తెలియదు. ఇక ఆయన ఏమి చేయలేడని తలంచిరి.. గాని ఆయన లేచినాడు. జన్మకాలము మొదలు మరణ నిమిషము వరకు జయము, జయము. పాపమాకర్షించినా ఆయన పడలేదు. జయించినాడు. **ఒక్కొక్కటి జయించినాడు గాని పడలేదు. అన్ని విధముల ప్రయత్నించినను పడలేదు** గనుక జన్మకాలము మొదలు మరణకాలము వరకు ఆయనకే జయము. పునరుత్థానము, ఇది ఒక ఋతువు. **ఆయన జయము పొందినాడు, పడలేదు, నిలిచే ఉన్నాడు, బ్రతికే ఉన్నాడు, మాట్లాడుతున్నాడు, నడుస్తూయున్నాడు, పునరుత్థానమైయున్నాడు. గనుక అంతా జయమే.**

రాబోయే కాలమందు క్రీస్తు నామమున ఒక సంఘములేవనై యున్నది. అది భక్తుల సంఘము, విశ్వాసుల యొక్క సంఘము. సంఘము తన జన్మకాలము మొదలు, మరణకాలము వరకు జయించవలెను. పాపశోధనలను తమ రక్షకుడు జయించినపుడు, ఆ శత్రువులను కూడా సంఘము జయించవలసినదే. విశ్వాసులు పాపములో పడుతున్నారు, లేస్తున్నారు గాని ప్రభువు ఎప్పుడూ లేచే భాగ్యము కలిగిస్తున్నారు. భక్తులు పడిపోయినా వారికి లేచే భాగ్యము కలిగినది. ప్రభువు సంపాదించిన భాగ్యము అనగా లేచే భాగ్యము క్రైస్తవ సంఘమునకు, శిష్యులకు భక్తులకు, రావలెను. అది ఇప్పుడు ఈవేళ దొరికినది. అయితే, పడకుండా ఉండే భాగ్యము ఇంకా దొరకలేదన్నారు. అదికూడ దొరుకుతుంది. ఇకమీదట ఎన్నటికిని పాపముచేయని సంఘముగా తయారగు కృప ప్రభువు సంఘమునకు అనుగ్రహించును. **దేవుని మూలముగా పుట్టియున్న వాడెవడును పాపముచేయడు. పాపము చేయని స్థితి, ప్రభావము దేవుడు సంఘమునకు ఇవ్వబోవుచున్నాడు.**

*1) పడినా లేచుట; 2) అసలు పడకుండా ఉండే భాగ్యము.*

ఆ మహా గొప్పవరము పొందేటందుకు సంఘము ఇంకా సిద్ధపడలేదు. అది తప్పక వస్తుంది. ఆయన జన్మకాలము మొదలు మరణకాలము వరకు నిలువు గీతతో ముగించిరి.

| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
|---|---|---|---|---|---|
| **మ** | **స** | **రా** | **ము** | **కా** | **నర (హేడెస్సు,చిన్న నరకము)** |

ఆయన బ్రతికియున్నప్పుడు వీటిని జయించినారు.

**పాపశోధనలు:–** ఆయన తన జీవిత కాలములో పాపములను జయించినాడు. ఇప్పుడు వేటిని జయించవలెను? ఈ ఆరింటిని జయించవలెను. వీటన్నిటిని జయించుట కష్టమే. ప్రభువు పని అయిపోయినట్టే ఉన్నది. 'జన్మము మొదలు మరణము వరకు పడని ఈ మహానుభావుడు' ఇపుడు పడిపోయినాడని వారు అనుకొన్నారు. ఆయన పడ్డారా? పడలేదు. ఇంకొకటి వచ్చింది. అయిననూ పడలేదు. ఆయనలో ప్రాణమున్నది గనుక పైవన్నియు జయించగలిగినాడు. ఇప్పుడు ప్రాణములేదు గనుక ఏలాగు జయించగలడు? అని వారు అనుకొన్నారు. అయితే తుదకు వారికే చావు వచ్చింది. ఈ పునరుత్థాన కథలో ఆయన లేచినారు గనుక

1. మరణమును జయించినాడు గనుక ఆయన జీవమైయున్నాడు.

2. సమాధికూడ ఓడిపోయినది; 3. రాయి; 4. ముద్ర; 5. కావలి; 6. నరకము.

ఆయన ఎక్కడ ఉన్నప్పటికినీ వెలుపలికి ఎందుకు రాగలిగినాడు? జీవమై యున్నాడు. గనుక మరణమును మొదలైన వాటిని జయించెను. స్టీమరుమీద ఉన్న మనిషిని నీటిలో పడవేస్తే చనిపోయాడనుకుంటారు గాని బుడుంగున ఒడ్డు దగ్గర పైకి లేచి కనబడ్డాడు. అతడు జీవము కలిగియున్నాడు గనుక లేచినాడు. అలాగే, ప్రభువు వారి దృష్టికి మరణమైయున్నాడు. గాని ఆయన జీవమైయున్నాడు. సంఘమునకును భూస్థాపన అను అవస్థ వస్తున్నది, రాయి అడ్డము వస్తున్నది. సంఘము వెలుపలికి రాకుండా ముద్ర వస్తున్నది. కావలివారు కూడ వస్తున్నారు. సువార్త ప్రకటించకుండాయున్ననూ, కట్టు దిట్టాలున్ననూ, సంఘము తుర్రున ఎగిరిపోతుంది. ***వేటగాడు పక్షిని కొట్టగా, తుర్రున ఎగిరి గూటిలో పడ్డది. అక్కడకు వెళ్లి పట్టుకొనబోతే తుర్రున ఎగిరిపోయింది.*** అట్లే సంఘము కథకూడ ఉండును. ఇంకొక క్రొత్త సంఘము, అనగా ఇప్పుడున్న సంఘమునకు కాదుగాని రేపు రాబోయే సంఘమునకు రాయి ముద్ర కావలి ఏమి లేదు. ఎవరినిబట్టి? ప్రభువుని బట్టి! అట్టి స్థితి ఆయనే ఇచ్చినాడు. అది పడకుండా ఉండే వరము. మరణము, సంఘము వరకు రాకుండా ఉండే వరము. ఏదిగొప్పది? జన్మకాలమునుండి మరణకాలము వరకు పాపము చేయలేని గొప్పవరము, మరణము రాకుండా ఉండే గొప్ప వరము, పాపములో పడినా లేచే వరము. ఏది గొప్పదో, అది సంపాదించుకొనండి.

**3వగీత:-** మూడవ గీత ఇపుడు వివరించవలెను. మనసానందము పొందుటకన్నను అను కీర్తనలోని వచనము, "సాధుజనోత్తమ" అను వచనము. శోధనలన్నిటిలో పడకుండా ఉండి అన్నిటినీ జయించే స్థిరమైన స్థితి. మనకందరికి ఆ మహా గొప్ప భాగ్యము దొరుకు-తుంది. ఎవరైనా విశ్వాసులు మరణము పొందిన యెడల పరిశుద్ధులతో కలసి యుందురు. మరణమును దాటి సజీవుల గుంపులో వెళ్లినవారు అక్కడ పరిశుద్ధులతో కలిసియుందురు.

ప్రభువును నాశనము చేయవలెనని పూనుకొన్న వారెవరు? పాపములు అపవాది, అతని సైన్యము, అతని రాజ్యము ప్రభువును నాశనము చేయపూనుకొన్నవి. ఈ రెండు గీతలకు కారణముగల గీతలు: ఒకటి ఎడమప్రక్క గీత. ఎడమ ప్రక్కన గీతలోని అపవాది, దయ్యము, అంధకారము లేకపోతే, ప్రభువుకు ఈ అవస్థలు లేకపోవును. ఈ అవస్థలు సంఘమునకుకూడ ఉన్నవి. సంఘమున్నంతవరకు పాపశోధనలే. సంఘము మృతియైన పిమ్మట అనగా లోకమును జయించిన పిదప రెండవ గీతలోనివి వచ్చును. సంఘము నాశనమునకు పూనుకొన్నవారైన అపవాది, పాపములు ఓడిపోయినవి. మరణావస్థలు ఓడిపోయినవి. ఎడమ ప్రక్కనున్న అపవాది ఓడిపోయింది. 3 గీతల వారు ఓడిపోయిరి. సైతాను ఇక లాభము లేదనుకున్నాడు.

ఆయన లేచిన తరువాత ఇక ఆయనను శోధించలేదు. జన్మకాలవస్థలు, మరణావస్థలు, సైతానవస్థలనేవి ఇక ఆయనను శోధించవు. వాటికి ఆ వీలులేదు. ఏమి చేయ తగవు. పౌర్ణమినాడు, మతాభి వెలుగువలె వెన్నెల కాస్తున్నప్పుడు, (కాళ్లలో) ఎన్ని ముళ్ళు గుచ్చుకొన్ననూ వేటకాడు వెళ్లి పులికి మాటొగ్గినపుడు, వెన్నెలకు ఎన్ని దెబ్బలు తగిలినవి? వెన్నెలకేమియు కాదుకదా! అట్లే అపవాది ఇక ప్రభువును శోదించనే శోధించడు. ఎందుచేత? ఆయన మహిమలోకి వెళ్లిపోయినాడు. గనుక ఇక ఎవరూ శోధించరు, వాడివన్నీ ఓడిపోయినవి. **రేపు సైతాను దయ్యము, అంధకారము మనలను ఏమియు చేయలేవు,** దగ్గరకు వచ్చినా ఏమిచేయలేవు. 3 గీతల పొడుగున నడిచి వెళ్లిపోతాము. ఏవియు ఏమిచేయలేవు. ***తుదకు ఏ వరుస వచ్చింది. సిలువ వరుస వచ్చింది. ఆ నిలువగీత, అడ్డగీత కలసి సిలువ అయినది..*** ప్రభువు సిలువను జయించిరి. శుక్రవారము సిలువమీద ఉన్నారు. ఆదివారము సిలువను జయించారు. సిలువ ఆయనను జయించగలదా! లేదు. సంఘము సిలువను జయించగలదా! జయించగలదు. గనుక ఆదివారము సిలువ గొప్పదా! సంఘము (ఆయన) పొందిన జయము గొప్పదా? ఇంకొక సిలువ ఉన్నది. కల్వరికొండ మీదనున్న సిలువకంటే ఇంకొక సిలువ ఉన్నది. అదేదనగా, ఇప్పుడు అందరికీ బోధనానందము కలిగినది. ఆలాగే ధ్యానానందము కలుగవలెను. అందరికి ఈస్టరు సలాం.

కల్వరికొండమీద కన్నీరు కార్చిన మనము, ఆదివారమందు ఆనందించెదము. ఆనంద భాష్పములు రాల్చెదము. అదే గొప్ప ఈస్టరు. ఎప్పుడు? ప్రభువు రెండవమారు వచ్చినప్పుడు జరుగును. పునరుత్థానములు రెండు రకములైన పునరుత్థానములు. అవి ఒకటి ప్రభువు పునరుత్థానము, మరియొకటి సంఘ పునరుత్థానము. జయించినవాడు వ్రాస్తే, తాను పొందిన జయమును గూర్చియే వ్రాస్తాడు. జయించనివాడు ఏమీ వ్రాయలేడు.

అట్టి జయ జీవితము పునరుత్థానుడైన ప్రభువు మీకు దయచేయును గాక! ఆమేన్.

***కీర్తన:*** *"మరణంబులో నాకు చిరజీవమెవ్వరు - మరణంబునకై గొప్ప*
*మరణమెవ్వరు= విరివిలేని మహిమ సేనలు - దరిని నుండగ నన్ను*
*చెంతను - స్థిరముగాస్థాపించునెవరు సిల్వబద్ధ యేసుక్రీస్తే"* ॥నాకింత॥

Bible Mission HQ Guntur

| | | | |
|---|---|---|---|
| మొదటి ముద్రణ | 2005 | ప్రతులు | 5000 |
| రెండవ ముద్రణ | 2007 | ప్రతులు | 5000 |
| మూడవ ముద్రణ | 2011 | ప్రతులు | 5000 |
| నాల్గవ ముద్రణ | 2013 | ప్రతులు | 5000 |
| ఐదవ ముద్రణ | 2015 | ప్రతులు | 3000 |


ఇది దేవుడు యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.
ఫోన్ : 9949121777.

Bible Mission HQ Guntur